

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

మంగళవారం | 23-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 278 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి సా. 4.40 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 8.08 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 8.21-9.59; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.51, రా. 10.15-11.05; అమృతఘడియలు: తె. 6.08 మొదలు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai





3

అప్పు చేస్తే ప్రాణం తీసుకోవాలా?

మళ్లీ సంపాదించి తీర్చొచ్చు!

భార్యాబిడ్డలను అనాథలను చేయొద్దు

వ్యవసాయం పవిత్రమైంది

రైతుల రక్షణకు చట్టాలున్నాయ్

మంత్రి సోమిరెడ్డి వ్యాఖ్యలు



5

నరసింహన్ ఓ బఫూన్

సీఎంలకు భజన చేస్తున్నారు

దావూద్‌కు, మోదీకి తేడా లేదు

రాష్ట్రపతిది కొంగ జపం

మాజీ సీఈసీ జ్యోతి ప్రధాని మోదీకి పాలేరు

సీపీఐ నేత నారాయణ ధ్వజం



14

లోకేశ్‌కు మా సీట్లిస్తాం

ఇద్దరు మంత్రుల ఆఫర్

అమరనాథ్‌రెడ్డి, గంటా రెడీ



14

ఎమ్మెల్యే రోజా ఇంట్లో చోరీ

2 కిలోల వెండి, 14 తులాల బంగారం మాయం

ఊరెళ్లి వచ్చేసరికి సంఘటన

కో.. అంటే కోటీశ్వర్రావా!

దేశంలో కొత్తగా 17 మంది బిలియనీర్లు-మొత్తం బిలియనీర్ల సంపద 20.7 లక్షల కోట్లు

73 శాతం సంపద 1 శాతం మంది పెద్దలకు సొంతం

67 కోట్ల మంది పేదలే.. వారి ఆదాయం పెరిగింది 1 శాతమే

భారత్‌లో భారీగా ఆదాయ అసమానతలు- ఆక్స్‌ఫామ్ సర్వే

సమ్మిళిత వృద్ధిలో మనం పాక్, బంగ్లా, చైనా కంటే అధ్వానం

పోటీ తత్వంలో 81వ స్థానం.. నేటి నుంచే అర్థిక సదస్సు

దావోస్‌లో భారత జపం!.. ఎక్కడ చూసినా మనోళ్ల బోర్డులే

దావోస్, జనవరి 22: భారత్‌లో పేదాగొప్పా అంతరం నానాటికీ పెరిగి పోతోంది. సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారు. పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. ఆదాయ అసమానతలు భారీగా పెరుగుతున్న వైనాన్ని 'ఆక్స్‌ఫామ్ సర్వే సవివరంగా తేల్చింది. 2017లో దేశంలో జరిగిన సంపద సృష్టిలో ఏకంగా 73 శాతం కేవలం ఒక శాతం మంది కుబేరులకే దక్కిందని తెలిపింది. అంతకు ముందు సంవత్సరం 58 శాతం సంపదను సొంతం చేసుకున్న వీరు... ఈసారి మరింతగా సొమ్ములు పోగేసుకున్నారని వెల్లడించింది. భారత్‌లో కేవలం ఒక్క శాతం ఉన్న అత్యంత సంపన్నుల సంపద 2017లో 20.9 లక్షల కోట్ల రూపాయల మేర పెరిగింది. ఇది దేశ వార్షిక బడ్జెట్‌కు సమానం కావడం గమనార్హం. 2017 లో కొత్తగా 17 మంది బిలియనీర్లు

మిగతా 16వ పేజీలో...



జ్యూరిచ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

ఏపీ పయనీర్

భారీ పెట్టుబడులు పెట్టేందుకు సై.. 5 వేల కోట్లతో భారత్‌లోకి

- వాటిలో అధికశాతం నవ్యాంధ్రలోనే
- వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టి
- పయనీర్ చైర్మన్ రియాన్ పాల్ హామీ
- రియాన్‌తో భేటీ అయిన సీఎం బృందం
- 4 రోజుల దావోస్ పర్యటనకు శ్రీకారం
- తొలి రోజే జ్యూరిచ్‌లో శుభారంభం
- జ్యూరిచ్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం



పయనీర్ సంస్థ చైర్మన్ రియాన్ పాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన ప్రారంభమైంది. స్విట్జర్లాండ్‌లో అడుగు పెట్టీ పెట్టగానే పెట్టుబడుల వేట మొదలైంది. స్విట్జర్లాండ్‌కు చెందిన 'పయనీర్' సంస్థతో ఒప్పందం కుదిరింది. వ్యవసాయ రంగంలో ఈ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టనుంది. అలాగే... పర్యావరణ సాంకేతికత, జీవ శాస్త్రాలు, పట్టణ ప్రాంత అభివృద్ధిలో జ్యూరిచ్ ఏపీకి సహకరించనుంది. దీనిపై ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది.

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు పయనీర్ వెంచర్స్ సుముఖత వ్యక్తం చేసింది. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ కేంద్రంగా పనిచేసే పయనీర్ సంస్థ.. వ్యవసాయ, వ్యవసాయాధారిత సప్లై చైన్ బిజినెస్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏపీలోని కుప్పం, మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఇప్పటికే ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నాలుగు రోజుల దావోస్ పర్యటనలో భాగంగా సోమవారం జ్యూరిచ్ చేరుకుంది. జ్యూరిచ్‌లో పయనీర్ వెంచర్స్ చైర్మన్ రియాన్ పాల్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సందీప్‌రాజ్‌తో సీఎం బృందం భేటీ అయింది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రియాన్ బృందాన్ని ఆహ్వానించారు. పూర్తి ప్రణాళికలతో వస్తే అన్ని విధాలా సహకరిస్తామని, సింగిల్ విండో విధానంలో మూడు వారాల్లోనే అన్ని అనుమతులు ఇస్తామని తెలిపారు. ఏపీలో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. దీనికి రియాన్ స్పందిస్తూ.. రానున్న ఐదేళ్లలో భారతదేశంలో రూ.5వేల కోట్ల పెట్టుబడి పెట్టాలన్న యోచనలో ఉన్నామని తెలిపారు. తమ పెట్టుబడుల్లో అధికశాతం గ్రామీణ భారతంలో

మిగతా 14వ పేజీలో...



ఢిల్లీలో కదలిక!

14

- సీఎం విజ్ఞప్తులపై సమాచారం కోరిన పీఎంవో
- 13 అంశాలపై ప్రధానికి విన్నవించిన చంద్రబాబు
- 4 ప్రాధాన్యాంశాలను ఎంపిక చేసిన అధికారులు
- ముందుగా వాటిపైనే ఒత్తిడి తేవాలని నిర్ణయం
- 26 తర్వాత ఏపీపై దృష్టి సారించనున్న మోదీ



జిల్లాల యాత్రకు బయలుదేరే ముందు హైదరాబాద్‌లో పవన్‌కు తిలకం దిద్దుతున్న భార్య అన్నాలెజినోవా

రెండు రాష్ట్రాల్లో పోటీకి సై

బలమున్న అన్ని స్థానాల్లో బరిలోకి

రాజకీయంగా ఎవ్వరి మద్దతు తీసుకోను

నన్ను ఏ పార్టీ వాడుకోవడం లేదు

27న 'అనంత' నుంచి కరువు యాత్ర

సినిమాల్లో కొనసాగాలని లేదు

కేసీఆర్.. హార్డ్ అండ్ స్మార్ట్ సీఎం

తెలంగాణ యాత్రలో పవన్‌కల్యాణ్

కరీంనగర్/జగిత్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తుందని, ఎన్ని స్థానాల్లో బలం ఉంటే అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను నిలబెడుతుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. 'చలోరే చలోరే చల్' యాత్రకి సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి పవన్ శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయన తొలుత జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్న విషయమై ఎన్నికలకు రెండు నెలల ముందు స్పష్టత ఇస్తామని పవన్ చెప్పారు. 'జనసేన చిన్న పార్టీ, పాతిక

మిగతా 2వ పేజీలో...

డిగ్రీతో రిజిస్ట్రార్!

ఉత్తుత్తి శిక్షణకు రూ.60 లక్షలు

ఇష్టానుసారం నియామకాలు

ఆర్జీయూకేటీలో ఇష్టా రాజ్యం

ఐఐఐటీల్లో దారి తప్పిన పాలన

గవర్నర్‌కు అందిన ఫిర్యాదు

నూజివీడు/అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): "సార్ ఈ బంగారు పతకం మా సార్ల వల్ల రాలేదు. సీనియర్ల సలహాలు, నా స్వయం కృషితోనే వచ్చింది"... అంటూ స్వయంగా మంత్రికి విద్యార్థి ఫిర్యాదు చేసినప్పుడే ఐఐఐటీలో 'బోధనా ప్రమాణాల' సంగతి బయటపడింది! ఆత్మహత్యలు, ఆత్మహత్యా యత్నాలతో అక్కడి గందరగోళ పరిస్థితులు వెలుగు చూస్తేనే ఉన్నాయి. ఇక.. పరిపాలనా, ఇతర విధానాల్లోనూ చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఐఐఐటీలను నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్‌జీయూకేటీ)లో నియామకాలు ఇష్టానుసారం జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ వర్సిటీకి రిజిస్ట్రార్ పోస్టులేదు. ఇది అవసరమని భావిస్తే.. ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. అయితే.. ఇలాంటి చర్యలేవీ లేకుండా.. వర్సిటీకి రిజిస్ట్రార్‌ను నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఇతర వర్సిటీల్లో రిజిస్ట్రార్‌గా వ్యవహరించే వ్యక్తికి యూజీసీ నిబంధనల

మిగతా 14వ పేజీలో...

టెట్‌కు 4.37 లక్షల మంది

దరఖాస్తుకు ముగిసిన గడువు

రేపటి నుంచి హాల్‌టికెట్లు

2







తల్లీ.. నిను తలంచి



విశాఖపట్నం చంద్రంపాలెం పాఠశాలలో మాతృమూర్తులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

2

వందే మాతరం!

'అమ్మకు వందనం'తో స్కూళ్లలో వేడుక

తమ తల్లుల కాళ్లు కడిగిన విద్యార్థులు

భావోద్వేగానికి గురైన మాతృమూర్తులు

అమ్మకి మొక్కి బడికొచ్చిన మంత్రి సునీత

చంద్రంపాలెం జడ్పీహెచ్‌లో రాష్ట్ర పండుగ

పిల్లల ఎదుగుదలకు తల్లే కీలకం : గంటా

ఈ ఏడాది చివర్లో జమిలీ?



అసెంబ్లీ ఎన్నికలతో కలిపి జరుపుదాం.. బీజేపీ యోచన

మేం ఒప్పుకోం.. కాంగ్రెస్, లెఫ్ట్, తృణమూల్ స్పష్టీకరణ

అసాధ్యం, రాజ్యాంగ సవరణ అవసరం: మాజీ సీఈసీ

న్యూఢిల్లీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివర్లో లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపితే మేలని బీజేపీలో జోరుగా అంతర్మథనం సాగుతోంది. నిజానికి సార్వత్రిక ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్-మేల్లో జరగాల్సి ఉంది. వాటితో పాటు- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా రాష్ట్రాలకూ అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. మరో మూడు పెద్ద రాష్ట్రాలు- రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీల కాలపరిమితి 2019 జనవరిలో ముగుస్తుంది. ఇక సిక్కిం అసెంబ్లీ పదవీ కాలం 2019 మే లోను, అరుణాచల్ ప్రదేశ్‌ది జూన్ 1న పూర్తవుతుంది. ఈ రీత్యా లోక్‌సభ ఎన్నికలను, ఏపీ, తెలంగాణ, ఒడిసా, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలనూ ఓ నాలుగైదు నెలలు ముందుకు జరిపి.. మొత్తం ఎనిమిది రాష్ట్రాలకూ ఒకేసారి ఎన్నికలు జరిపిస్తే తమకు రాజకీయంగా బాగుంటుందన్న విషయంపై బీజేపీలో చర్చలు సాగుతున్నాయి. జమిలీ ఎన్నికలు వీలవ్వకపోతే నవంబరులో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. ఇవి మూడూ బీజేపీ పాలిత రాష్ట్రాలు.. రాజకీయంగా ఆ పార్టీకి అత్యంత కీలకం. ఒకవేళ నవంబరులో ఈ మూడింటికే అసెంబ్లీ ఎన్నికలు జరిగి ప్రతికూల పరిస్థితులు ఎదురైతే, ఆ దెబ్బ లోక్‌సభ ఎన్నికలపై కచ్చితంగా పడుతుంది. అసలే ప్రభుత్వ వ్యతిరేకతను తీవ్రంగా ఎదుర్కొంటున్న ఈ మూడు రాష్ట్రాల సర్కార్లు విజయం కోసం గట్టి ప్రయత్నమే చేయాలి. ప్రతిపక్షాలు

మిగతా 16వ పేజీలో...



మేంవద్దన్నా.. కోడి పందేలా?

29న కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

ఏపీ సీఎస్, డీజీపీలపై హైకోర్టు ఆగ్రహం

ఉత్తర్వులను హేళన చేశారని వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలంటూ తామిచ్చిన ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయని, వాటిని హేళన చేశారని ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడి పందేలు భారీగా జరిగాయని, ప్రజాప్రతినిధులే పాల్గొన్న దృశ్యాలను ప్రసార మాధ్యమాల్లో ప్రపంచమంతా చూసిందని వ్యాఖ్యానించింది. తమ ఆదేశాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), డీజీపీలు హేళన చేశారని అసహనం వ్యక్తం చేసింది. పందేలను ఆపడం చేతగాకపోతే తామే చూసుకుంటామని స్పష్టం చేసింది. కోడిపందేలను నిర్వహించకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో

మిగతా 2వ పేజీలో...



శ్వేత కాళి - చంద్రకాళి



సామాన్యంగా కాళీదేవి రూపాన్ని, ప్రత్యేకించి ప్రకాశించే దేవతగా చెపుతారు. కొంతమంది ఆ తల్లి నల్లని దేవత కనుక కాళి అని అన్నారు. అయితే అమ్మవారి రూపాలలో ఆమె శ్వేత వర్ణంతో ప్రకాశించే రూపాలు కూడా కనిపిస్తున్నాయి. తెల్లని వర్ణంతో, ధవళ ఛాయతో "శ్వేత కాళి"గా అమ్మవారి గురించి చెప్పబడింది. అత్యంత సాత్విక, సుందర స్వరూపంతో శ్వేత కాళిగా, ఆనందమూర్తిగా భక్తులను అనుగ్రహించే కాళీదేవిని పూజిస్తే సమస్తమైన దుఃఖాలను, క్లేశాలను తొలగించి ఆనందాన్ని ప్రసాదిస్తుంది. విశేషించి క్రోధం వంటి తామస లక్షణాలను తొలగించుకోవాలి అనుకున్నా, సాత్విక లక్షణాలను పెంపొందించుకోవాలన్నా సత్వగుణ కాళీస్వరూపమైన "శ్వేతకాళి"ని ఆరాధించి, ఆమె అనుగ్రహంతో సాధించవచ్చు. శ్వేతకాళి యొక్క మరొక రూపాంతరం "చంద్రకాళి" స్వరూపం. చంద్ర స్వరూపిణిగా కాళీదేవిని వర్ణిస్తాం. ఆ కాళీదేవి చంద్రునిగా ప్రకాశిస్తూ అనుగ్రహిస్తుందట విశేషించి కాళీ తంత్రంలో మనశ్శాంతి లేక అనేక చికాకులతో, సమస్యలతో ఉన్నా, కుంగుబాటు, మరే ఇతరమైన మానసిక సమస్యలున్నా చంద్రకాళిని ఆరాధిస్తే తొలగిపోతాయి. చంద్రవర్ణంతో ప్రకాశిస్తూ, నవరత్నాలలో చంద్రుని రత్నంగా చెప్పబడిన ముత్యాల ఆభరణాలను ధరించి, తెల్లని వస్త్రములను ధరించి ప్రకాశిస్తూ ఉంటుంది. అమ్మవారిని ఆరాధించే ప్రత్యేక విధానం కూడా చెప్పబడింది. వెన్నెలలో కూర్చొని చంద్ర స్వరూపిణిగా ఆమెను భావిస్తూ మంత్ర జపం చేసి, పాలు లేదా పాలతో పరమాన్నం కానీ చంద్రకాళికి నైవేద్యంగా సమర్పిస్తే మరింత త్వరగా అనుగ్రహిస్తుంది. వెన్నెల ద్వారా చంద్రకిరణాలలో శాంతి తరంగాలను ఆహ్లాదినీ శక్తిని ప్రసరించి మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. మనశ్శాంతిని, ఆరోగ్యాన్ని ఇచ్చేటువంటి దేవతగా చంద్రకాళి గురించి చెప్పారు. ముత్యాల మాలతో వెన్నెలలో మంత్ర జపం చేస్తే అమ్మవారు మనస్సుకు చైతన్యాన్ని కలిగించి, ఎటువంటి మానసిక క్లేశాన్నైనా సరే పోగొడుతుంది.

- మాతా రమ్యానంద భారతి

Paramjyothi పరంజ్యోతి

వందే..'మాత'రం!



'అమ్మకు వందనం'తో స్కూళ్లలో వేడుక.. తల్లుల కాళ్లు కడిగిన విద్యార్థులు



అనంతపురం జిల్లాలో అమ్మకు వందనం కార్యక్రమంలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు



అనంతపురం జిల్లాలోని వెంకటాపురం, ననసకోట పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన 'అమ్మకు వందనం' కార్యక్రమంలో మంత్రి పరిటాల సునీత పాల్గొన్నారు. తొలుత తన తల్లికి పాదాభివందనం చేసి మంత్రి కార్యక్రమానికి వెళ్లారు. ప్రతి విద్యార్థీ.. తన తల్లి కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

- ధర్మవరం

- భావోద్వేగానికి గురైన మాతృమూర్తులు
- అమ్మకి మొక్కి బడికొచ్చిన మంత్రి సునీత
- చంద్రంపాలెం జడ్పీహెచ్‌లో రాష్ట్ర పండగ
- పిల్లల ఎదుగుదలకు తల్లే కీలకం : గంటా

అమరావతి, మధురవాడ (విశాఖ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బడిలో పిల్లలకు నేర్పే తొలి మాట మాతృదేవోభవ! అక్షరాల్లో తొలి పలుకు అమ్మ! అలాంటి అమ్మను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బడులు గౌరవించాయి. ఆమెకు మొక్కి, కాళ్లు కడిగి అమ్మ రుణం కొంతైనా తీర్చుకొన్నాయి. నవ్యాంధ్రలోని పాఠశాలల్లో తొలిసారిగా మన సంస్కృతిని ప్రతిబింబించేలా అమ్మల పండుగ జరిగింది. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ తదితర పాఠశాలలన్నింటా సోమవారం 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. తమ తల్లులకు విద్యార్థిలోకం కాళ్లు కడిగి తమ గౌరవాన్ని చాటుకుంది. అనంతపురం జిల్లాలో మంత్రి పరిటాల సునీత తన మాతృమూర్తి కాళ్లకు నమస్కరించి.. ననసకోట జడ్పీ హైస్కూలులో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ఏడాది అమరావతిలో నిర్వహించిన జాతీయ మహిళా పార్లమెంట్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు , 'అమ్మకు వందనం' కార్యక్రమం గురించి తొలిసారి ప్రస్తావించారు. ఆయన ఆకాంక్షించినట్టుగానే ఈ కార్యక్రమం విజయవంతం కావడం, అదీ వసంత పంచమి నాడు ఈ వేడుకని జరుపుకోవడం అధికార వర్గాలను ఉత్సాహపరిచింది.

'అమ్మకు వందనం'లో భాగంగా ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, స్కూలు కమిటీ సభ్యులు వెంట రాగా.. విద్యార్థులు తమ తల్లులను బడికి తోడ్కొనివచ్చారు. తమ తల్లుల కాళ్లు కడిగారు. పూలు, అక్షింతలతో పాదపూజ చేశారు. 'అమ్మా! నాకు జన్మనిచ్చినందుకు కృతజ్ఞతలు' అంటూ వారి ఆశీర్వాదాన్ని పొందారు. తమ పిల్లలు తమకు మొక్కుతున్నప్పుడు.. మాతృమూర్తులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆనంద బాష్పాలే అక్షింతలుగా తమ బిడ్డలను మనసారా ఆశీర్వదించారు. రాష్ట్రంలోని మొత్తం 61,528 పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా చంద్రంపాలెం జడ్పీహైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. "సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. భగవంతుడు అన్నిచోట్ల తాను ఉండలేక, తనకు ప్రతిరూపంగా తల్లిని ఉంచాడు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో తల్లి పాత్రే ముఖ్యమైనది" అని ఈ సందర్భంగా మంత్రి గంటా అన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేసి వారి దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. దాదాపు రెండువేల మంది పిల్లలు పాల్గొన్నారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు, కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ జీశ్రీనివాస్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, పాఠశాల విద్య జేడీ (సర్వీసెస్) కృష్ణారెడ్డిలు విద్యార్థులను ఉత్సాహపరిచారు. కాగా, జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు... విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. కర్నూలులోని ఇందిరా గాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



నాన్నకంటే అమ్మే గొప్ప!

రక్తాన్ని ధారపోసి, నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చి, పునర్జన్మ పొందిన అమ్మ... నాన్న కంటే గొప్పది. తల్లి మాత్రమే బిడ్డ ఆకలి చూస్తుంది. ఆకాశమంత హృదయం, భూమాత అంత ఓర్పు ఆమెకే ఉంటాయి. ప్రేమ, అభిమానంతో ప్రతి ఒక్కరు అమ్మను ప్రేమించాలి. ఆడపిల్లలు అమ్మా, నాన్నను ఎలా చూసుకుంటారో అత్తమామలను కూడా అదేవిధంగా గౌరవించాలి.

- అమ్మకు వందనం కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

రెండు రాష్ట్రాల్లో పోటీకి సై!

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాల పోరాటం కోసం దీనిని ప్రారంభించాం. బలమైన సంస్థాగత నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. తొలుత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సమస్యలపై దృష్టి సారిస్తాం. ఏపీలో త్వరలో కార్యాలయం ప్రారంభిస్తాం.' అని పవన్ తెలిపారు. అనంతపురం నుంచి ఈ నెల 27న కరువు యాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. తూర్పుగోదావరి ఏజెన్సీ సమస్యలపై వైజాగ్‌లో సమావేశమై చర్చిస్తామన్నారు. సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, తెలంగాణ సమస్యలపై అధ్యయనం చేసిన తర్వాత బాధ్యతాయుతంగా స్పందిస్తానని అన్నారు. జనసేన నిర్మాణాత్మక రాజకీయాలను మాత్రమే చేస్తుందన్నారు. ఓటుకు నోటు వ్యవహారం తప్పని తెలిసినా, రాజకీయ పరమైన గొడవలు ఎందుకనే ఉద్దేశంతోనే తాను ఆ విషయంలో మాట్లడలేదన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్.. హార్డ్ అండ్ స్మార్ట్ ముఖ్యమంత్రి అని కొనియాడారు. బీజేపీ అధినేత అమిత్‌షా తనను పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించినా, నిరాకరించానని అన్నారు. తనను ఏ రాజకీయ పార్టీ కూడా వాడుకోవడం లేదని తెలిపారు. ఇకపై సినిమాల్లో కొనసాగే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. రాజకీయంగా.. చిరంజీవి సహా తాను ఎవరి మద్దతు తీసుకోనని అన్నారు. కొండగట్టు అంజన్న దయ వల్లే జనసేన స్థాపించానని పవన్ పేర్కొన్నారు. 2009లో కరీంనగర్ జిల్లా పర్యటనలో ఉన్నపుడు హైటెన్షన్ వైర్లు కారణంగా ప్రమాదానికి గురయ్యానని, అంజన్న దయ వల్ల ప్రమాదం నుంచి బయటపడ్డానని నాటి ఘటనను గుర్తు చేసుకున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.10 లక్షల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. సంఖ్యాపరంగా 10 సరికాదని పండితులు పేర్కొనడంతో రూ.11 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. పవన్ రాకతో ఆలయం వద్దకు వేలాదిగా ఆయన అభిమానులు తరలివచ్చారు. ఆలయం వెలుపలికి వచ్చిన తర్వాత జనసేన గుర్తుతో ఉన్న బ్యానర్‌ను పవన్ ప్రదర్శించగా.. జై జై పవన్ కల్యాణ్.. కాబోయే సీఎం పవన్ అంటూ అభిమానులు నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం ఇది రెండోసారి. 2009 జనవరి 20న మొదటిసారి ప్రజారాజ్యం పార్టీ అనుబంధమైన యువరాజ్యం అధినేత హోదాలో కొండగట్టుకు వచ్చారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ జనవరిలోనే పవన్.. కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు.



కొండగట్టు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పవన్

వీరతిలకం దిద్దిన సతీమణి

'చలోరే చలోరే చల్' యాత్రలో భాగంగా కొండగట్టుకి బయల్దేరేందుకు సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆయన హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లోని జనసేన కార్యాలయానికి చేరుకున్నారు. పవన్‌కు ఆయన భార్య అన్నాలిజ్‌నేవా వీరతిలకం దిద్ది, హారతిచ్చారు. అనంతరం అభిమానుల కోలాహలం, నినాదాల మధ్య భారీ కాన్వాయ్‌తో పవన్ కొండగట్టుకి బయల్దేరారు. అంతకు ముందు జనసేన సోషల్ మీడియాకు సంబంధించి 'వీరమహిళ' పేరుతో ఏర్పాటైన విభాగాన్ని పవన్ ప్రారంభించారు.

ఐదు షోలకు అనుమతి కోసమే

- కేసీఆర్‌ను పవన్ కలిసింది అందుకే: కర్నె

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తో రహస్య ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం టీఆర్ఎస్‌కు లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. ఒక వ్యక్తి వల్ల లబ్ధి పొందేంత తక్కువ స్థాయిలో టీఆర్ఎస్ లేదన్నారు. ఇటీవల విడుదలైన తన సినిమాను ఐదు ఆటలు ప్రదర్శించేందుకు అనుమతివ్వాల్సిందిగా మాత్రమే సీఎం కేసీఆర్‌ను పవన్‌కల్యాణ్ కోరారని, అయితే ఆ శాఖ తన వద్ద లేదని, సంబంధిత శాఖ మంత్రిని కలవాల్సిందిగా సీఎం సూచించారని తెలిపారు. సోమవారం టీఆర్ఎస్ఎల్పీలో ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ... పవన్‌కల్యాణ్ రాజకీయాల్లో అప్పుడప్పుడూ కనిపిస్తుంటారని, తర్వాత తెరమరుగైపోతుంటారని వ్యాఖ్యానించారు. ఆయనను ఒక సీజనల్ పొలిటీషియన్‌గా మాత్రమే టీఆర్ఎస్ భావిస్తుందన్నారు. కొండగట్టు నుంచి యాత్ర చేపట్టిన పవన్‌కల్యాణ్ నిజంగానే పూర్తిస్థాయి రాజకీయాలు చేస్తే ఆల్ ది బెస్ట్ చెబుతామన్నారు. అయితే ఒక పౌరుడిగా తన దృష్టికి వచ్చే సమస్యల్ని పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వానికి సలహాలిస్తే మాత్రం పరిశీలిస్తామన్నారు.

'స్వచ్ఛ'లో మచ్చ లేదు!

- ఓడీఎఫ్‌లో అవినీతి జరగలేదు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వివరణ

నెల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆర్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో 'ఇలాగైతే చెంబు చల్లగానే..'- ఓడీఎఫ్ అమలులో మొదటికే మోసం - పేరిట వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. "నెల్లూరు జిల్లాలో 2014 అక్టోబరు నుంచి గ్రామీణ స్వచ్ఛభారత్ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణం మొదలుపెట్టాం. 2016 మార్చి 8న 'ఆత్మగౌరవం' పేరుతో గత కలెక్టర్ జానకి ప్రజల్లో చైతన్యం కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అప్పటికే ఈ జిల్లాలో 2.50 లక్షల మరుగుదొడ్లు మంజూరై, వాటిలో 58వేల వరకు పూర్తయ్యాయి. 'ఆత్మగౌరవం' కార్యక్రమం అమలయిన తొలి ఏడు నెలలలో 2.10 లక్షల మరుగుదొడ్లను ఒక ఉద్యమంలా నిర్మించాం. ఇలా జిల్లా యంత్రాంగం శ్రమించి.. ఓడీఎఫ్ జిల్లాగా నెల్లూరును నిలిపింది. ఓడీఎఫ్ వెరిఫికేషన్ టీం రీడ్స్ ఎన్జీవో సంస్థ 1,253 గ్రామాల్లో పరిశీలన జరిపి సంతృప్తి వ్యక్తం చేసింది. 2017 అక్టోబరు 2 నాటికి ఎక్కువ స్కోర్ సాధించినందుకు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, కేంద్ర స్థాయిలో 16వ స్థానాన్ని నెల్లూరుకు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ 'ఐఎంఐఎస్' ఇచ్చింది. స్వచ్ఛ నవ్యాంధ్ర ప్రచారంలో భాగంగా జిల్లా అధికారులు రచించిన 'మల్లిగాడు మరుగుదొడ్డి' అనే పుస్తకాన్ని సీఎం ప్రశంసించారు" అని కృష్ణారెడ్డి వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వాస్తవమని తేలిన కేసుల్లో కఠిన చర్యలు తీసుకొన్నారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణాలపై ఎలాంటి విజిలెన్స్ విచారణ జరగలేదన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- మరొకరి ఆత్మహత్యాయత్నం
- చావే పరిష్కారం కాదంటూ కలెక్టర్ కౌన్సెలింగ్

విడపనకల్లు, గుంటూరు, జనవరి 22: అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా హావళిగి గ్రామానికి చెందిన నరసింహులు(38) అనే రైతు సోమవారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడికి నాలుగు ఎకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నాడు. నాలుగేళ్లుగా పంట సరిగా రాక నష్టపోయాడు. ఆదివారం పత్తిని బళ్లారి మార్కెట్‌కు తీసుకుని వెళ్లి విక్రయించాడు. 12 క్వింటాళ్ల పత్తికి రూ.50 వేలు రాగా అప్పు కట్టాడు. అయినా ఇంకా రూ.5 లక్షల అప్పు ఉంది. వీటిని తీర్చే మార్గం కనిపించడం లేదంటూ... గ్రామం పక్కనే ఉన్న కొండ పైకి వెళ్లి పురుగుల మందు తాగి ప్రాణాలు విడిచాడు. ఇదిలావుండగా, తన సమస్యను వివరించినా ప్రభుత్వపరంగా సాయం అందించడానికి అధికారులు స్పందించడం లేదంటూనాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన యువరైతు మాడా శివప్రసన్నబాబు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోనే ఆత్మహత్యకు యత్నించారు. దీంతో, కలెక్టర్ కోన శశిధర్ ఆ యువకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యకు చావే పరిష్కారం కాదని హితవు పలికారు. నాబార్డు ద్వారా గేదెల పెంపకానికి సబ్సిడీ రుణం మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



శివప్రసన్నబాబుతో మాట్లాడుతున్న కలెక్టర్ శశిధర్

మేం వద్దన్నా.. కోడి పందేలా?

(మొదటి పేజీ తరువాయి)

వివరణ ఇస్తూ నివేదిక సమర్పించాలని ఈ నెల 4న సీఎస్, డీజీపీలకు ఆదేశాలు జారీచేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడింది. ఈ నెల 29న ఇరువురు అధికారులూ హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ గంగారావులతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీచేసింది. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలతోపాటు అసాంఘిక కార్యకలాపాలను పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం వెంప, శ్రీరాంపురంలలో ఆపాలంటూ ఆ ప్రాంతానికి చెందిన కె. రామచంద్రరాజు దాఖలు చేసిన పిల్‌ను ధర్మాసనం ఈ నెల 4న విచారించింది. కాగా, కోడి పందేలను నిలువరించడానికి అధికారులు అన్ని చర్యలూ తీసుకున్నారని, నివేదిక సమర్పించేందుకు కొంత గడువుకావాలని ప్రభుత్వ న్యాయవాదులు విద్యావతి, జయంతి కోరినా, సీఎస్, డీజీపీలు స్వయంగా కోర్టుకు హాజరు కావాల్సిందేనని ధర్మాసనం ఆదేశించింది.

టెట్‌కు 4.37 లక్షల దరఖాస్తులు

- రేపటి నుంచి హాల్‌టికెట్లు.. ఫిబ్రవరి 5 నుంచి పరీక్షలు..

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు దాదాపు 4.37 లక్షల దరఖాస్తులు అందాయి. పేపర్-1 కు 1,71,141, పేపర్-2కు 2,20,047, పేపర్-3కి 50,866 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-1 మరియు పేపర్-2లకు 10,449, పేపర్-1 మరియు పేపర్-3లకు 1620 దరఖాస్తులు అందాయి. సోమవారం రాత్రి 8 గంటల వరకు అన్ని పేపర్లకు కలిపి మొత్తం 4,36,131 దరఖాస్తులు అందాయి. అయితే రాత్రి 12 గంటల వరకు దరఖాస్తు స్వీకరణ గడువు ఉంది. సోమవారంతో గడువు ముగియడంతో ఈ నెల 24 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష ఫిబ్రవరి 5న ప్రారంభం కానుంది. రోజుకు రెండు సెషన్లలో ఆ నెల 15వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాథమిక కీ ఫిబ్రవరి 16న విడుదల చేస్తారు. అభ్యంతరాలు 21 వరకు స్వీకరిస్తారు. తుది కీ 24న, ఫలితాలు 26న విడుదల చేస్తారు.

'దైవసన్నిధానం' చైర్మన్‌గా మోహన్‌బాబు

ఫిలింనగర్ దైవసన్నిధానం ధర్మకర్తల మండలి చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా సినీ నటుడు మోహన్‌బాబు నియమితులయ్యారు. ఫిలింనగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, ఆదిశేషగిరిరావును సన్మానిస్తున్న మోహన్‌బాబు

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అనంతపురం	13.2	30.0
హైదరాబాద్	14.0	29.5
విశాఖపట్నం	14.0	28.4
చిత్తూరు	15.4	30.7
విజయవాడ	17.0	29.7



మోదీకి సామాన్యులు కనిపించరు!

తనను తాను 'సామాన్యుడినని' చెప్పుకునే మోదీ... 'ప్రత్యేక వ్యక్తులను' తప్పిస్తే సామాన్యులను ఆలింగనం చేసుకోరు. మోదీజీ.. ప్రత్యేక వ్యక్తులనే కౌగలించుకుంటారు. రైతులు, కార్మికులు, యువకులు ఆయనకు కనిపించరు. తాను సామాన్యుడిని కాబట్టి తనకు ప్రొటోకాల్స్ అంటే ఏమిటో తెలియవంటారు. అందుకే ప్రపంచ నాయకులు ఆయన ను ఇష్టపడుతున్నారట.

- రాహుల్ ఎద్దేవా



హిందూ మూలాలున్నా.. పాక్, బంగ్లాలు హిందుత్వను అంగీకరించవు

'భారత్ హిందుత్వ దేశం. వైవిధ్యాలను అనుమతించే దేశం. ఎన్నో భాషలు, మతాలు, జీవనశైలి, ఆచార వ్యవహారాలను తనలో ఇముడ్చుకున్న దేశం. మనం భిన్నత్వాల్లో ఏకత్వానికి కట్టుబడి ఉంటాం. కానీ.. సింధు నాగరికతకు మూలాలైన మొహెంజోదారో, హరప్పా ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉన్నా.. ఆ దేశం హిందుత్వను అంగీకరించదు. బంగ్లాదేశీయులంతా బెంగాలీ మాట్లాడతారు. అయినా.. ఆ దేశం హిందుత్వతో కలవడానికి ఒప్పుకోదు


- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



ఆర్థికవేత్త అలాంటి సలహాలివ్వడు

"పకోడీ బండి పెట్టుకుని బతకమని నిరుద్యోగ యువతకు చాయ్ అమ్ముకునే వాడు మాత్రమే సలహా ఇస్తాడు. ఆర్థికవేత్త అలాంటి సలహా ఇవ్వడు."

- మోదీ వ్యాఖ్యలపై పాటీదార్ ఆందోళన నేత హార్దిక్ పటేల్



మెదడు పరిమాణం, మందంతో మూర్ఛ రోగం అంచనా

లండన్, జనవరి 22: మెదడులోని బూడిదరంగు ప్రాంతాల(గ్రే మ్యాటర్) పరిమాణం, మందం తేడాను బట్టి మూర్ఛ రోగం వచ్చే ప్రమాదం ఉందా? లేదా? అన్నది గుర్తించవచ్చని యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే, ఈ తేడాల వల్ల మెదడు పనితీరుకు ఆటంకం కలిగే అవకాశాలపై, ఎదురయ్యే సమస్యలపై అధ్యయనం చేయాల్సి ఉందని పరిశోధకుల బృందంలోని భారత సంతతి శాస్త్రవేత్త సంజయ్ సిసోడియా తెలిపారు. ఐరోపా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో 2,149 మంది మూర్ఛ రోగుల మెదళ్లను పరీక్షించగా వారి గ్రే మ్యాటర్ పరిమాణం, మందంలో తేడాలున్నాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 06-1.5 శాతం మంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారని వెల్లడించారు.

మంత్రి దేవినేనితో ప్రాణహాని

▸▸ రక్షణ కల్పించాలంటూ డీజీపీకి ప్రవీజ అనే మహిళ వినతి

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు, ఆయన అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని డీజీపీ మాలకొండయ్యను అట్లూరి ప్రవీజ అనే మహిళ వేడుకున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన తనకు, తన సోదరికి పొలం విషయమై కొన్నేళ్లుగా వివాదం ఉందని, ఈ వ్యవహారంలో మంత్రి జోక్యం చేసుకుని తనను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

అప్పు చేస్తే

ప్రాణం తీసుకోవాలా?

మళ్లీ సంపాదించి బాకీలు కట్టొచ్చు.. భార్యాబిడ్డలను అనాథలను చేయొద్దు

▸▸ నకిలీ ఉత్పత్తులు అంటగడితే అమ్మినోళ్లను చొక్కాపట్టుకొని నిలదీయండి

▸▸ వ్యవసాయం పవిత్రమైంది

▸▸ రైతుల రక్షణకు చట్టాలున్నాయి

▸▸ కిసాన్ మేళాలో మంత్రి సోమిరెడ్డి భరోసా



వరినాటు యంత్రాన్ని నడుపుతున్న సోమిరెడ్డి

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'పది లక్షలు అప్పు అయితే ప్రాణం తీసుకోవాలా? మళ్లీ సంపాదించి బాకీలు కట్టొచ్చు. అంతేగానీ.. మీ భార్యాబిడ్డలను ఆనాథలను చేయొద్దు" అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... రైతులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా లాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం కిసాన్‌మేళా జరిగింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల్లో ధైర్యం నింపారు. "ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సైనికులు అహర్నిశలు సరిహద్దుల్లో దేశానికి కాపలా కాస్తున్నారు. మరి... దేశానికి అన్నంపెట్టే రైతు ఆత్మహత్యలు ఎందుకు చేసుకోవాలి? రైతుల్ని విజ్ఞానవంతులను చేస్తూ ప్రభుత్వం ఆదుకుంటుంది. రైతుల రక్షణకు చట్టాలున్నాయి. నకిలీ విత్తనాలు, ఉత్పత్తులను ఎవరైనా అంటగడితే చొక్కా పట్టుకుని నిలదీయండి. నకిలీలపై ప్రభుత్వం కూడా పీడీ చట్టం కింద కేసులు పెడుతుంది. కావేరీ సీడ్స్ నుంచి రూ.60కోట్లు రికవరీ చేశాం. విత్తన సమస్యను పరిష్కరించేందుకే ఐయోవా విశ్వవిద్యాలయ సాంకేతిక సహకారంతో కర్నూలు జిల్లాలో రూ.650 కోట్లతో మెగా సీడ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు. పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు పెరిగేలా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంకా ఏం చేయాలో ప్రతిపక్ష పార్టీలు చెప్పకుండా... రైతుల ఆత్మస్థయిర్యం దెబ్బతినేలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ జిల్లా యూనిట్‌గా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. వెబ్ ల్యాండ్‌లో రైతు పేరు లేకపోయినా, ఎల్‌పీసీ, సీవోసీ కార్డు లేకపోయినా ధాన్యం అమ్ముకోవచ్చని చెప్పారు. కిసాన్ మేళా ప్రారంభానికి ముందు.. హైబ్రిడ్ వంగడాలు, నాణ్యమైన దిగుబడులు, ఆధునిక వ్యవసాయ యంత్రాల ఎగ్జిబిషన్‌ను సోమిరెడ్డి ప్రారంభించారు. జైకిసాన్ కేలండర్, పత్తిలో గులాబీ పురుగు నివారణ బ్రోచర్‌ను మంత్రులు ఆవిష్కరించారు.

ఖాళీ స్థలాల్లో వ్యాపార సంస్థలు

▸▸ తొలి దశలో తిరుపతి, నెల్లూరులో నిర్మాణం

▸▸ దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ వెల్లడి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న వినోద్ కుమార్

నెల్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ప్రధాన రైల్వేస్టేషన్ల వద్ద అందుబాటులో ఉన్న స్థలాలను కమర్షియల్‌గా ఉపయోగించే ఆలోచన చేస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. మొదటి దశలో తిరుపతి, నెల్లూరు రైల్వేస్టేషన్ల పరిధిలో హోటళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఆయన నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌ను పరిశీలించి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రైల్వేస్టేషన్‌లోనూ కాలినడక వంతెనలను నిర్మిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే అవసరమైన ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల

పరిష్కారానికి కృషి

▸▸ మంత్రి కిమిడి కళావెంకటరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖపట్నం), జనవరి 22: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్టు రాష్ట్ర మంత్రి కిమిడి కళావెంకటరావు చెప్పారు. సోమవారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరంలో జరిగిన ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 12వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు ఆనందంగా ఉందని, విద్యుత్ లోటు 22.5 మిలియన్లు ఉండేదని దానిని అధిగమించి మిగులు విద్యుత్ సాధించామని మంత్రి అన్నారు. ఇళ్లలో ఉపయోగించే ఇన్వర్టర్ల మాదిరిగా విజయనగరం, నెల్లూరు జిల్లాల్లోని రెండు మండలాల్లో ప్రయోగాత్మకంగా విద్యుత్ నిల్వ చేస్తున్నామన్నారు.



డీడీని జేఈవోకు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తిరుమలలో మూడో రీట్రాక్టబుల్ రూఫ్

▸▸ ఖర్చుకు ముందుకొచ్చిన దాత

తిరుమల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడో రీట్రాక్టబుల్ రూఫ్ (ముడుచుకునే పైకప్పు) ఏర్పాటు చేయనున్నారు. దీనికయ్యే ఖర్చు రూ.1.09 కోట్లు ఇవ్వడానికి నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వీపీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ వి.ప్రభాకర్‌రెడ్డి ముందుకొచ్చారు. సోమవారం తిరుపతి బంగ్లాలో టీటీడీ జేఈవో శ్రీనివాసరాజుకు తొలి విడతగా రూ.55 లక్షల డీడీని అందజేశారు. ఇప్పటికే ఒక రీట్రాక్టబుల్ రూఫ్ కల్యాణోత్సవ మండపం వద్ద వాడుకలో ఉంది. పడికావలి వద్ద మరొక దానికి సంబంధించిన పనులు చివరిదశలో ఉన్నాయి.

ఫిబ్రవరి 15 నుంచి

గోదావరి మళ్లింపు: దేవినేని

పోలవరం, అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల బాధ్యతలను చేపట్టేందుకు 'నవయుగ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ' ముందుకొచ్చినందున నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, ఫిబ్రవరి 15 నుంచి గోదావరి జలాలను మళ్లించే కార్యక్రమాన్ని చేపట్టాలని పోలవరం ప్రాజెక్టు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనలో ఉన్నందున... సోమవారం నిర్వహించే పోలవరం ప్రాజెక్టు పనుల సమీక్షను నిర్మాణ ప్రాంతంలో స్వయంగా దేవినేని పర్యవేక్షించారు. పనుల బాధ్యతలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి స్వీకరిస్తామని నవయుగ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ క్రాంతి ఈ సందర్భంగా దేవినేనికి చెప్పారు. మొదట్లో రోజుకు 5,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులతో మొదలుపెట్టి క్రమంగా వేగం పెంచుతామని వివరించగా... 14వేల క్యూబిక్ మీటర్ల వేగంతో పనిచేయాలని మంత్రి నిర్దేశించారు.

కొల్లేరు సమస్య పరిష్కారానికి కేంద్రం సుముఖం: కామినేని

న్యూఢిల్లీ, జనవరి22(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజల సమస్య పరిష్కారానికి కేంద్రం సుముఖంగా ఉందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో ఆయన నివాసంలో కామినేని భేటీ అయి కొల్లేరుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజల సమస్యల పరిష్కారానికి మెమొరాండం సమర్పించి, వివరించారు. ఈ సందర్భంగా కామినేని మీడియాతో మాట్లాడుతూ... సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు లోబడి సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలు జీవనోపాధి కోల్పోకుండా తగు సహాయం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

'పడవ' మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

▸▸ పీఎం సహాయనిధి నుంచి 2 లక్షలు అందజేసిన కలెక్టర్

ఒంగోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ప్రకాశం జిల్లా ఒంగోలు వాకర్స్ క్లబ్ సభ్యుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందింది. మృతుల కుటుంబ సభ్యులకు ఆ మొత్తాలను సోమవారం కలెక్టర్ వి.వినయ్‌చంద్ అందజేశారు. కార్తీకమాసం సందర్భంగా గత ఏడాది నవంబరు 12న విహారయాత్రకు వెళ్లి కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాద ఘటనలో 18 మంది ఒంగోలు వాకర్స్ క్లబ్ సభ్యులు మృతి చెందిన విషయం విదితమే. ఆ ప్రమాదంలో మృతి చెందిన వారికి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.8 లక్షల వంతున పరిహారం అందించింది. అందులో ఒకరు చంద్రన్న బీమా పథకంలో ఉండగా అతనికి రూ.10 లక్షలు, మిగిలిన వారికి రూ.8 లక్షల వంతున మొత్తం రూ.కోటి 46 లక్షలను వారి కుటుంబ సభ్యులకు అధికారులు అందించారు. కాగా ఆ ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.2లక్షలు వంతున ప్రధాన మంత్రి సహాయ నిధి మంజూరు కాగా.. చెక్‌లను కలెక్టర్ సోమవారం ఒంగోలులో మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రధాని వద్దకు అఖిలపక్షం

బాబుకు కేవీపీ లేఖ

న్యూఢిల్లీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల సాధనకు సీఎం చంద్రబాబు అఖిలపక్షాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకువెళ్లాలని రాజ్యసభ సభ్యుడు కేవీపీ.రామచంద్రరావు డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ఉమ్మడి పోరాటం చేయాలన్నారు. ఈ మేరకు చంద్రబాబుకు లేఖ రాసినట్లు సోమవారం విలేకరులకు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
మంగళవారం 23 జనవరి 2018
4 | తమసోమా జ్యోతిర్గమయ

స్తంభించిన అమెరికా!

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడై శనివారం నాటికి ఏడాది. ఆ వార్షికోత్సవం నాటినుంచే కీలకమైన ద్రవ్యవినిమయ బిల్లుకు సెనేట్ ఆమోదం లభించకపోవడంతో అమెరికాలో పాలన స్తంభించిపోయింది. తొలి రెండు రోజులు సెలవుదినాలు కావడంతో తెలియలేదు కానీ, సోమవారం నుంచి ప్రభావం కనిపించడం ఆరంభమైంది. పార్కులు మూతపడటం నుంచి స్పేస్ ఎక్స్ రాకెట్ ప్రయోగాలు నిలిచిపోవడం వరకూ సమస్త కష్టాలు ఆరంభమైనాయి. ఫిబ్రవరి 16వరకు నిధుల వినియోగానికి ప్రభుత్వానికి అవకాశమిచ్చే ఈ అత్యంత కీలకమైన బిల్లు నిలిచిపోవడానికి మీరే కారకులంటూ డెమోక్రాట్లు, రిపబ్లికన్లు విమర్శించుకుంటున్నారు. ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీకి చెందిన ఐదుగురు సెనెటర్లు బిల్లుకు వ్యతిరేకంగా, డెమోక్రాట్లనుంచి ఐదుగురు అనుకూలంగా ఓటువేయడం గమనించాల్సిన విషయం. ప్రతినిధుల సభలో గురువారం ఆమోదం పొందిన బిల్లు, సెనేట్‌లో అవసరమైన 60 ఓట్లు పడక నిలిచిపోయి, రాజీ ప్రయత్నాలు కూడా నెరవేరక చివరకు ఈ సంక్షోభ స్థితి ఉత్పన్నమైంది.

అమెరికా చరిత్రలో ఇలా జరగడం పద్దెనిమిదవసారనీ, పాతికేళ్ళకాలంలో నాల్గవదనీ, పదిహేనేళ్ళ తరువాత ఇప్పుడు జరిగిందనీ అందరూ లెక్కలు చెప్పుకుంటున్నారు. వీటన్నింటికన్నా ప్రధానం ట్రంప్ ఏడాదిలోగానే ఈ సమస్య తెచ్చిపెట్టడం. ఒక విధానంపైనో, కార్యక్రమంపైనో అధికార విపక్షాల మధ్య వివాదం రేగి ఇలా ద్రవ్యబిల్లును అడ్డుకొని కక్ష తీర్చుకోవడం గతంలోనూ ఉన్నదే. ఒబామా ఉన్నప్పుడు ఒబామా కేర్ విషయంలో ఇరుపక్షాల మధ్యా సమస్య వచ్చి పక్షంరోజులు ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయి, ఎనిమిది లక్షలమంది ఫెడరల్ ఉద్యోగులు ఇంటిపట్టున ఉండవలసి వచ్చింది. ఇప్పుడు కూడా ఈ స్తంభన మరికొన్ని వారాలు సాగేంత మొండితనం ఉభయుల్లోనూ కనిపిస్తున్నదని కొందరు అంటున్నారు. వివాదం ఇంతలోగానే పరిష్కారం కావచ్చును కానీ, గత పాలకుల వ్యవహారశైలికీ, ట్రంప్‌కు ఉన్న విస్పష్టమైన తేడా ఈ సమస్యను మరింత రాజేసిందనడంలో సందేహం అక్కరలేదు. గత ప్రభుత్వాల నిర్ణయాలను తిరగదోడటంలోనూ, వారిపై నోరుపారేసుకోవడంలోనూ, వాటిస్థానంలో అర్థంలేని నిర్ణయాలను చేయడంలోనూ, కొత్త సమస్యలు సృష్టించడంలోనూ ట్రంప్ నిష్ణాతుడు. ఆరోగ్యం, వాణిజ్యం, వాతావరణం ఇత్యాది విషయాల్లో ట్రంప్ అర్థంలేని నిర్ణయాలు, ప్రదర్శిస్తున్న మొండి వైఖరిపైన విపక్షాల్లోనే కాదు, స్వపక్షంలోనూ అసంతృప్తి ఉన్నది. ఆయన తీరుపైన రిపబ్లికన్లలో ఉన్న ఆగ్రహం కూడా ఈ సందర్భంగా మరోమారు తెలియవచ్చింది. ఉభయసభల్లోనూ బలం ఉన్నప్పటికీ ట్రంప్ గింగిరాలు తిరుగుతున్నారు. అధ్యక్షపదవి, కాంగ్రెస్‌లో ఆధిక్యం ఉండి కూడా ఉన్న ఒక పార్టీ ఈ కీలకమైన బిల్లుకు ఆమోదం సాధించలేకపోవడం అమెరికా చరిత్రలో ఇదే ప్రథమం. సెనేట్‌లో నెగ్గడానికి ఆయన డెమోక్రాట్లపై ఆధారపడవలసిన అవసరం ఉన్నది కానీ, స్వపక్షీయులను కూడా ఆయన తనదారికి తెచ్చుకోలేకపోతున్నారు. అత్యంత కీలకమైన సందర్భంలో కూడా వారు ఆయన పక్షాన నిలవకపోవడాన్ని బట్టి, సహాయ నిరాకరణను ఆయన ఏడాది కాలంలో పార్టీలకు అతీతంగా విస్తరించినట్టు అర్థం చేసుకోవచ్చు.

రెండుపార్టీల మధ్యా రాజీకోసం వివిధ ప్రయత్నాలు జరిగినప్పటికీ, ట్రంప్ మొండితనం కారణంగానే సంక్షోభం బలపడిందని డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. దేశభద్రత కంటే డెమోక్రాట్లకు రాజకీయాలు ప్రధానమైపోయాయని ట్రంప్ అంటున్నారు. సరిహద్దులో గోడ నిర్మాణం సహా పలుభద్రతాచర్యలకు నిధులు సమకూర్చడం, సైన్యానికి కేటాయింపులు పెంచడం, దిగువ ఆదాయ కుటుంబాల పిల్లలకు ఆరోగ్యబీమా ఇత్యాది విషయాలకంటే, ఒకప్పుడు బాలలుగా అమెరికాలో ప్రవేశించిన ఏడులక్షలమంది అక్రమవలసదారులకు సంబంధించిన అంశమే ఉభయపక్షాల మధ్యా ప్రధాన వివాదమన్నది తెలిసిందే. వారి విషయంలో ట్రంప్‌ను ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ లొంగదీయలేమన్నది డెమోక్రాట్ల వాదన. వీరందరినీ దేశంనుంచి పంపించివేసే పని మార్చిలో ఆరంభం కాబోతున్న తరుణంలో, ఏదో ఒక రాజీ మార్గాన్ని ఈ లోగానే సాధిస్తామని రిపబ్లికన్లు హామీ ఇస్తున్నప్పటికీ డెమోక్రాట్లు విశ్వసించకపోవడానికి ప్రధాన కారకుడు ట్రంప్ అని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. డీఏసీఏ సమస్య సహా ఏయే అంశాలపై విపక్షాలు పట్టుదలగా ఉన్నాయో, ఏ అంశాలపై పట్టువిడవడానికి సిద్ధంగా ఉన్నాయో అధికారపక్షానికి తెలియకపోదు. కీలకమైన డీఏసీఏ విషయంలో విపక్షం ఆలోచనలను, ప్రతిపాదనలు కాదంటూ అధికారపక్షం విపక్షాన్ని మరింత ఆగ్రహానికి గురిచేసింది. ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో ప్రభుత్వాన్ని నడపాలనే ధర్మాన్ని వదిలేసి, కీలకమైన విషయాన్ని చివరివరకూ సాగదీసి అధికారపక్షమే సంక్షోభానికి కారణమైంది. ఏడువేలమంది భారతీయులు కూడా ఉన్నట్టుగా చెబుతున్న ఏడులక్షలమంది అక్రమవలసదారుల విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న మొండి వైఖరి అంతిమంగా తమకే లబ్ధిచేకూరుస్తుందని రిపబ్లికన్ల అంచనా. 'స్వాప్నికులు' అన్న నామకరణంతో వారి కోసం ఏకంగా పరిపాలననే స్తంభింపచేసిన డెమోక్రాట్లు అప్రదిష్టపాలవుతారని వారి ఆశ. హక్కులు, అర్హతలు, విలువలు, న్యాయాన్యాయాలు ఇత్యాది వన్నీ పక్కకు పోయి ఈ రాజకీయ యుద్ధం సమాజంలో ఉద్రిక్తతలను మరింత ఎగదోయడానికి ఉపకరించడమే విషాదం.

వృత్తిపర నియోజకవర్గాలు

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

ప్రజాప్రతినిధులందరూ తమను ఎన్నుకున్న ఓటర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు చిత్తశుద్ధితో బాధ్యత వహించేలా వృత్తుల ప్రాతిపదికన ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయవలసిన సమయం ఆసన్నమయింది. అన్ని సామాజిక వర్గాలవారూ దళిత అభ్యర్థులను తమ ప్రతినిధులుగా ఎన్నుకొనే ప్రస్తుత విధానాన్ని పరిత్యజించితీరాలి.

ఎన్నికలు ప్రజాస్వామ్య చోదక ప్రక్రియలు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం మనం అనుసరిస్తోన్న విధానంలో కొన్ని నియోజక వర్గాలను షెడ్యూల్డు కులాల/ తెగల అభ్యర్థులకు మాత్రమే కేటాయిస్తున్నారు. ఎస్సీలకు రిజర్వ్ అయిన ఈ నియోజక వర్గాలలో ఓటర్లు–ఎస్సీ లేదా ఎస్టీ లేదా బీసీ లేదా అగ్ర కులాలకు చెందినవారు ఎవరైనా సరే తమ ప్రతినిధిని ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థుల నుంచి మాత్రమే ఎన్నుకోవల్సి వున్నది. ఈ విధానంలో ఒక లోపమున్నదని డాక్టర్ అంబేడ్కర్ భావించారు. అగ్రకులాల నాయకులకు అనుకూలంగావుండే లేదా వారి ప్రయోజనాలను పరిరక్షించే దళిత అభ్యర్థులు మాత్రమే ఎన్నికవుతారని అంబేడ్కర్ భయపడ్డారు. 'అస్పృశ్యుల విమోచన' అన్న తన వ్యాసంలో ఆయన ఇలా రాశారు: "ప్రజాప్రతినిధులు తన సామాజిక వర్గం లేదా తన ఓటర్లకు ప్రాధాన్యమివ్వడం పరిపాటి. ఎన్నికైన ఏ ప్రజాప్రతినిధి అయినా మరోలా ఎందుకు వ్యవహరించాలి? లోకంలో ఒక నానుడి ఉన్నది. ఒక మనిషి చర్మం అతను ధరించిన చొక్కా కంటే అతనికి సన్నిహితంగా ఉంటుందనేది ఆ లోకోక్తి. ప్రజాప్రాతినిధ్యం వృత్తి లేదా నిర్వాహక ప్రాతినిధ్యంగా ఉండాలనే ప్రతిపాదనలు ప్రాదేశిక నియోజక వర్గాల విధానానికి వ్యతిరేకంగా బలమైన ప్రజాభిప్రాయమున్నదనే విషయాన్ని ధ్రువపరుస్తుంది." అయితే గాంధీజీ ఒత్తిడి ఫలితంగా సంయుక్త నియోజకవర్గాల్లో రిజర్వేషన్ల విధానానికి అంబేడ్కర్ అంగీకరించారు.

డాక్టర్ అంబేడ్కర్ ఆకాంక్షించిన విధంగా దళితులకు ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటు ప్రతిపాదనను పునఃపరిశీలించాల్సిన సమయమాసన్నమయింది. పైన చెప్పిన విధంగా ప్రస్తుత విధానంలో ఒక రిజర్వడ్ నియోజక వర్గం లోని ఓటర్లందరూ ఆ స్థానానికి పోటీచేస్తున్న ఎస్సీ లేదా ఎస్టీ అభ్యర్థుల నుంచే తమ ప్రతినిధిని ఎన్నుకోవల్సివున్నది. అలా ఎన్నికైన ప్రజా ప్రతినిధికి తాను అభిమానించే వర్గం ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే స్వేచ్ఛ ఉంటుంది. అతను ఓటర్లందరిచేత ఎన్నుకోబడుతాడుగనుక ఓటర్లందరికీ జవాబుదారీగా ఉండాలి.

కనుక సదరు ప్రజాప్రతినిధి కేవలం దళితుల ప్రయోజనాలు గాకుండా విధిగా ఓటర్లందరి ప్రయోజనాలను కాపాడవలసివుంటుంది. ఇదెలా సాధ్యం? వృత్తుల ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇది సాధ్యమవగలదు. ఉదాహరణకు ఒక ఎంపీ వ్యవసాయకూలీల నియోజకవర్గం నుంచి ఎన్నికవుతాడనుకోండి. అతను అనివార్యంగా వ్యవసాయకూలీల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉండవల్సివుంటుంది. లేనిపక్షంలో తదుపరి ఎన్నికలలో ఆ ఓటర్లు ఆయనకు ఓటు వేసే అవకాశం ఏమాత్రం ఉండదు. దేశ జనాభాలో అత్యధికులు చిల్లర వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, చిన్న రైతులుగా ఉన్నారు. 90శాతం మంది ఓటర్లు ఈ మూడు సామాజిక వర్గాలలోనే ఉంటారు. కనుక ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ వర్గాల వారి సంక్షేమాన్ని, ప్రస్తుతం మాదిరిగా నిర్లక్ష్యం చేయడం సాధ్యం కాదు.


పుట్టిన కుల ప్రాతిపదికన లేదా వయోజనుడుగా ఆచరిస్తున్న వృత్తి ఆధారంగా ప్రత్యేకనియోజక వర్గాలను ఏర్పాటు చేయాలా అనే విషయమై ఒక సందిగ్ధ పరిస్థితి ఉన్నది. పుట్టిన కుల ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని డాక్టర్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. సమస్యేమిటంటే దీని వల్ల ఒక వ్యక్తి శాశ్వతంగా ఏ కులంలో పుట్టాడో ఆ కుల పరిధిలోనే ఉండిపోతాడు. మరో సమస్య క్రీమీ లేయర్ (వెనుకబడిన కులాలలో సంపన్నవర్గాలు). ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నత స్థాయిలో ఉన్న బడుగు సామాజిక వర్గాలకు చెందిన అధికారులు అగ్రకులాల శ్రేణుల్లో చేరడానికి, వారి గౌరవాదరాలు పొందడానికి ఆరాటపడుతుండడం కన్పిస్తుంది. తమ సహచర కులస్థులను చిన్న చూపు చూడడం కూడా కద్దు. తమ సహచర కులస్థులు వెనుకబాటుతనంలో మిగిలిపోతేనే తమ ప్రయోజనాలకు రక్షణ ఉంటుందనేది ఈ అధికారుల ఉద్దేశంగా కన్పిస్తుంది. రిజర్వేషన్ల మూలంగా సమకూరే సదుపాయాలు చిరకాలం తమ కుటుంబాలకు, కొత్త అభ్యర్థుల నుంచి ఎటువంటి పోటీ లేకుండా, అందగలవని వారు భావిస్తున్నారు. కనుక పుట్టిన కుల ప్రాతిపదికన కాకుండా వయోజనుడుగా ఆచరిస్తున్న వృత్తి ఆధారంగా ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి. ఒక వ్యక్తి చర్మకారుల కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రభుత్వోద్యోగిగా జీవనోపాధి పొందుతుంటాడు. ఇటువంటి వ్యక్తిని అతని పూర్వపు నియోజకవర్గం అంటే పుట్టిన కులం ప్రాతిపదికగా ఉన్న నియోజకవర్గం నుంచి తొలగించి కొత్త అంటే వృత్తిపర నియోజకవర్గంలో చేర్చాలి. ఇలా జరిగినప్పుడు ఏ వ్యక్తీ తరాలపాటు పుట్టిన కులం లోనే ఉండిపోడు. క్రీమీ లేయర్ సమస్య కూడా పరిష్కారమవుతుంది. చర్మకారుల కుటుబంలో పుట్టిన ఒక ఐఏఎస్ అధికారి సంతానం, వారసత్వ సంతానం... తరతరాల పాటు ఆ వర్గానికి లభిస్తున్న రిజర్వేషన్ల సదుపాయాలను పొందగలుగుతారు. వృత్తి మారినా పుట్టిన సామాజిక వర్గానికి చెందినవాడుగా మాత్రమే వర్గీకరింపబడడం వల్ల ఇది సాధ్యమవుతోంది.

వృత్తుల ప్రాతిపదిక నియోజకవర్గాలలో ఈ సమస్య తలెత్తదు. ఒక చర్మకార వ్యక్తి ఐ ఏ ఎస్ అధికారి అయితే అతని కుటుంబాన్ని ప్రభుత్వోద్యోగుల నియోజకవర్గంలో చేర్చుతారు. చర్మకారులకు లభించే ప్రయోజనాలను పొందే అర్హత అతని సంతానానికి ఉండదు. కాగా వృత్తుల ప్రాతిపదిక నియోజకవర్గాలతో సమస్యేమిటంటే అగ్రకులాలకు చెందినవారూ చర్మకారులు మొదలైన వృత్తుల ప్రాతిపదిక నియోజకవర్గాల సభ్యులవుతారు. ఒక రాజ్‌పుట్ వ్యక్తి చర్మకారులకు ప్రతినిధి అయ్యే అవకాశమున్నది. ఇలా అన్ని వృత్తిపర నియోజకవర్గాలలో

కొత్త క్రీమీలేయర్ వర్గం ఆవిర్భవిస్తుంది. ఇది కొట్టివేయలేని సమస్య. అయితే అగ్రకులాలకు చెందిన ప్రజాప్రతినిధి విధిగా తనను ఎన్నుకొన్న చర్మకారుల ప్రయోజనాలను పరిరక్షించాలి. వృత్తిపర నియోజక వర్గాలు విజయవంతమవ్వాలంటే ఆర్థిక విధానాలను మార్చి వేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అత్యధిక ఓటర్లు తమ శ్రమశక్తితో జీవనాధారాలను పొందేందుకు వీలుగా ఆర్థిక విధానాలను విధిగా రూపొందించాలి. ప్రజాప్రతినిధులందరూ తమను ఎన్నుకున్న ఓటర్లందరి ప్రయోజనాలను పరిరక్షణకు చిత్తశుద్ధితో బాధ్యత వహించేలా వృత్తుల ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయవలసిన సమయం ఆసన్నమయింది. అన్ని సామాజిక వర్గాలవారూ దళిత అభ్యర్థులను తమ ప్రతినిధులుగా ఎన్నుకొనే ప్రస్తుత విధానాన్ని పరిత్యజించితీరాలి

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

జాతీయోద్యమ పాత్రికేయుడు
ఖాసా సుబ్బారావు



నీతి నియమాలతో బతికిన ప్రముఖ పత్రికా సంపాదకుడు ఖాసా సుబ్బారావు. ఆయన గాంధేయవాదానికి నిలువెత్తు దర్పణం. 1896 జనవరి 23న జన్మించిన ఖాసా మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఫిలాసఫీ చదివారు. కొంత కాలం టీచరుగా, హెడ్మాస్టరుగా పనిచేశారు. అనంతరం టంగుటూరి ప్రకాశం పంతులు సంపాదకత్వంలో వెలువడుతున్న స్వరాజ్య పత్రిక సంపాదకునిగా తన పత్రికారంగ ప్రస్థానం ప్రారంభించారు. జాతీయ భావాలు అధికంగా ఉన్న ఖాసాను ప్రకాశం పంతులు ఏరికోరి తన పత్రిక సంపాదకునిగా నియమించుకున్నారు. అప్పటినుండి ఖాసాకు పత్రికారంగంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. నిర్భీతి, స్పష్టతతో ఆయన రాసే కథనాలు విశేషంగా ప్రజల మన్ననలు పొందాయి. రాజాజీతోపాటు పలువురు రాజకీయ ఉద్దండులు ఆయన కలంపోటుకు గురయ్యారు. అయినప్పటికీ అందరూ ఆయన్ను ఎంతో గౌరవించేవారు. అభిమానించేవారు. 1924 నుండి 1936 వరకు స్వరాజ్యలో పనిచేసిన ఖాసా అనంతరం కోల్‌కతా నుండి వెలువడే ఇండియన్ ఫైనాన్స్, ముంబాయి నుండి వెలువడే ఫ్రీ ప్రెస్ జర్నల్‌లో పనిచేశారు. ఆ తరువాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాయింట్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రభకు తొలి సంపాదకులు ఆయనే. 1946లో స్వతంత్ర వారపత్రికను తిరిగి ప్రారంభించి, ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి మూడు సంవత్సరాల పాటు పడిపారు. ఆలోచనాత్మకంగా ఆయన రాసిన 'సైడ్‌లైట్స్' కాలమ్ ఆయనకు ఎంతో ఖ్యాతి తెచ్చిపెట్టింది. పాత్రికేయ వృత్తిని వదిలిపెట్టిన అనంతరం నెల్లూరు జిల్లా పల్లెపాడులోని గాంధీ ఆశ్రమంలో ఉంటూ గాంధీవాదాన్ని చివరి శ్వాస వరకూ ప్రచారం చేశారు. స్వరాజ్య పోరాటంలో అనేకసార్లు జైలు జీవితం అనుభవించిన దేశ భక్తుడు ఖాసా. శాసనోల్లంఘన ఉద్యమంలో పోలీసులు దెబ్బలకు తీవ్ర గాయాల పాలయ్యారు. అప్పట్లో ఈ విషయం బ్రిటిష్ పార్లమెంట్‌లో కూడా చర్చకు రాగా, విచారణ కమిటీని నియమించారు. కమిటీ ముందుకు ఖాసా చేసిన వాదన కారణంగా ప్రభుత్వం పోలీసుల లాఠీల చివర ఉండే లోహపు పిడిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీవితాంతం ప్రజాపక్షపాతిగా జీవించిన ఖాసా 1961 జూన్ 16న మరణించారు.

■ ఎస్. బాబురావు

(నేడు ఖాసా సుబ్బారావు జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

అవినీతిని పెంచే ఎన్నికల బాండ్లు

పాలన పారదర్శకంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం అర్థవంతమవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకతకు బహువిధ ప్రమాణాలు ఉండవు. ఉండకూడదు. అయితే మన దేశంలో పారదర్శకతకు ఒక ప్రామాణిక ప్రాతిపదిక లేకుండా పోయింది. ఈ విశిష్ట ప్రజాస్వామిక ధర్మాన్ని పలువురు పలు విధాలుగా భావిస్తున్నారు. తాము విశ్వసించిన దాన్నే ఆచరిస్తున్నారు. పెద్ద విలువ గల కరెన్సీ నోట్లను రద్దు చేసిన సమయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకొనేందుకు కోట్లాది భారతీయుల్ని ఎటిఎమ్‌ల ఎదుట గంటలతరబడి నిలబడేలా చేసిన ప్రభుత్వం– దేశ ప్రజల పట్ల అత్యంత బాధ్యత గల వర్గం తమ వ్యవహారాలలో పారదర్శకంగా వ్యవహరించేలా చేయడంపై మాత్రం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు.

అటు కార్పొరేట్ సంస్థల, ఇటు సామాన్యుల సకల ఆర్థిక కార్యకలాపాలను పర్యవేక్షించడంపై ప్రభుత్వం కృతనిశ్చయంతో వ్యవహరిస్తున్న దేశం మనది. అయితే అత్యంత అపారదర్శకంగా, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బాగా రోత పుట్టించే విధంగా జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు ఏవయ్యా అంటే అవి రాజకీయ విరాళాలే.

పదివేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయల విలువైన ఈ బాండ్లను కొనుగోలు చేసిన వివరాలు గోప్యంగా ఉంటాయి. అంటే ఈ బాండ్ల రూపేణా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే దాతల పేర్లు వెల్లడికావు. తద్వారా పూర్తిగా రహస్య, చట్ట విరుద్ధ లావాదేవీలు సజావుగా జరగడానికి చట్ట బద్ధ బ్యాంకింగ్ వ్యవస్థను రాజ మార్గంగా ఉపయోగించుకోనున్నారు.

కొత్త కరెన్సీ లేదా ఎన్నికల బాండ్లను సృష్టించడాన్ని ఆవశ్యకం చేసిందేమిటి? ఈ ప్రశ్నకు సమాధానంగా రాజకీయ విరాళాలకు అనుకూలంగా ప్రభుత్వాలు సమకూర్చిన అసాధారణ ప్రోత్సాహకాల వివరాలను తెలుసుకోవల్సివున్నది. ఆ ప్రోత్సాహకాల విషయంలో రాజకీయ పక్షాలూ అమిత సంతృప్తితో ఉన్నాయని మరి చెప్పనవసరం లేదు. మన దేశంలో రాజకీయ విరాళాలకు ఒక 'విఐపి' హోదాను ప్రపథమంగా సమకూర్చింది వాజపేయి ప్రభుత్వం. ఆదాయపు పన్ను చట్టం కింద రాజకీయ విరాళాలకు ఈ సదుపాయం లభించింది. రాజకీయ పక్షాలకు ఇస్తున్న విరాళాలను కంపెనీలు తమ వ్యయాలలో భాగంగా చూపించి, ఆ వ్యయాలపై పన్ను రాయితీని పొందవచ్చు. అలాగే రాజకీయ పార్టీలకు అలా

మూడేళ్ళ నికర లాభాలలో సగటున 7.5 శాతం మేరకు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం అనుమతినిచ్చింది. రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలను కార్పొరేట్ కంపెనీలు తమ లాభనష్టాల ఖాతాలో వెల్లడించాల్సివున్నది. ఆ విరాళాలను ఏ ఏ రాజకీయ పార్టీలకు ఇచ్చారో వాటి పేర్లను కూడా వెల్లడించి తీరాలి. అయితే ఆ తరువాత 2017 ఆర్థిక బిల్లుకు చేసిన సవరణల ద్వారా క్రింది నిబంధనలను తొలగించారు. ఈ సవరణల ఫలితంగా (1) కార్పొరేట్ కంపెనీలు తమ మూడేళ్ళ నికర లాభాల నుంచి రాజకీయపక్షాలకు విరాళంగా ఇచ్చే మొత్తంపై 7.5 శాతం పరిమితికి కట్టుబడి వుండనవసరం లేదు; (2) తమ విరాళాలను పొందుతున్న రాజకీయ పక్షాల వివరాలను విధిగా వెల్లడించాల్సిన అవసరమూ కంపెనీలకు ఉండదు. ఈ మార్పులతో ఎటువంటి బాధ్యత, పారదర్శకత లేకుండా రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు ఇచ్చే వెసులుబాటు కార్పొరేట్ కంపెనీలకు, ఆ అపరిమిత విరాళాలను పొందే సదుపాయం రాజకీయ పక్షాలకు లభించింది.

రాజకీయ పార్టీలు తమకు అవసరమైన నిధులు సమకూర్చుకోవడానికి ఈ ప్రోత్సాహకాలు, సదుపాయాలు



భారత్‌లో అవినీతికి ప్రధాన కారణం రాజకీయ విరాళాలు. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ఈ రాజకీయ విరాళాలు ఒక నిరంతర భారీ కుంభకోణానికి కారణమవుతున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్లు ఈ పరిస్థితిని మార్చలేవనేది స్పష్టం.

అయినా ప్రభుత్వం వీటిని ఉపేక్షిస్తూనే ఉన్నది. ఎట్టకేలకు ఈ పరిస్థితిని సరిదిద్దడానికై ప్రధాని మోదీ ప్రభుత్వం ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టింది. నిజానికి ఈ చర్య మన దేశంలో రాజకీయ విరాళాల అవినీతిని కాపాడేది మాత్రమే! కాపాడి కొనసాగించేందుకు మాత్రమే వాటిని ప్రవేశపెట్టారని చెప్పినా తప్పులేదేమో. రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేసేందుకే ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టినట్టు చెప్పుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వం వాస్తవంగా వాటి నిమిత్తం ఒక ప్రత్యేక కరెన్సీని సృష్టించింది.

రాజకీయ పార్టీల నిధులు వివాదాస్పదమైనవి కావు. ఎందుకంటే ఆ నిధులు నగదు రూపంలోనే రాజకీయ పార్టీలకు సమకూరుతాయి. పెద్ద నోట్లను రద్దు చేసిన సందర్భంలో కూడా రూ.2000 వరకు నగదు రూపంలో విరాళాలను స్వీకరించేందుకు రాజకీయ పార్టీలకు అనుమతినిచ్చారు. ఈ నిబంధన ఇప్పటికీ కొనసాగుతోంది. రాజకీయ విరాళాలు ఎందుకు అవినీతితో ముడివడుతున్నాయంటే వాటి దాతల వివరాలను తెలుసుకొనే అవకాశం మనకు, అంటే ప్రజలకు, ఏమాత్రం లేదు. అవి ఎప్పటికీ గుప్తంగానే ఉండిపోతున్నాయి.

ఎన్నికల బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన నిర్దిష్ట శాఖల నుంచి ఎవరైనా కొనుగోలు చేయవచ్చు. అయితే ఎస్‌బిఐలో లభ్యమయ్యే వెయ్యి, లభించిన ఆదాయంపై పూర్తిగా పన్ను మినహాయింపు ఉంటుంది. 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్' సేకరించిన సమాచారం ప్రకారం 2012–16 సంవత్సరాల మధ్య ఐదు ప్రధాన రాజకీయ పక్షాల మొత్తం ఆదాయంలో 85 శాతం (రూ. 956.77కోట్లు) కార్పొరేట్ కంపెనీల విరాళాల ద్వారా సమకూరింది. ఈ లావాదేవీలు, అటు కార్పొరేట్ సంస్థలుగానీ, ఇటు రాజకీయపక్షాలుగానీ ఎటువంటి పన్ను చెల్లించనివేనని మరి చెప్పనవసరం లేదు.

రాజకీయ విరాళాల ద్వారా ఎలక్టోరల్ ట్రస్ట్‌లను నెలకొల్పేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం అనుమతినిచ్చింది. రాజకీయ పార్టీలు తమ ఆర్థిక వనరులను మరింత పుష్కలంగా సమకూర్చుకొనేందుకు ఇది విశేషంగా తోడ్పడుతోంది. పెద్ద విలువ గల కరెన్సీ నోట్ల రద్దు సందర్భంలో నగదు నిల్వలపై తీవ్ర చర్యలు తీసుకున్నప్పటికీ రాజకీయ పార్టీలు చిన్న మొత్తాల(రూ.2000)లో విరాళాలు స్వీకరించేందుకు మోదీ ప్రభుత్వం అనుమతినిచ్చింది.

గత ఏడాది మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల సౌకర్యార్థం రాజకీయ విరాళాల ప్రక్రియను మరింతగా సులభతరం చేసింది. 2017 సంవత్సరంలో చివరి ఆర్థిక బిల్లును ఆమోదించే ముందు కార్పొరేట్ కంపెనీలకు కొన్ని సదుపాయాలను కల్పించింది. ఒక కంపెనీ గత

సరిపోతాయని స్పష్టంగా చెప్పవచ్చు. మరి ఎన్నికల బాండ్లను జారీ చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది? రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేసేందుకై ఎన్నికల బాండ్లను ప్రవేశ పెట్టేందుకు మోదీ ప్రభుత్వాన్ని పురిగొల్పిందేమిటి? వాస్తవమేమిటంటే రాజకీయ విరాళాల విషయంలో పలు రాయితీలు కల్పించినప్పటికీ నగదు రూపేణా విరాళాలనివ్వడం అంత సులభతరంగా లేదు. ఎన్నికల బాండ్ల సహాయంతో భారీమొత్తాల్లో కార్పొరేట్ కంపెనీల విరాళాలు చట్టబద్ధ బ్యాంకింగ్ మార్గాల ద్వారా రాజకీయ పార్టీల ఖాతాల్లోకి చేరే అవకాశం కల్గింది. పైగా దాతల వివరాలు రాజకీయ పార్టీలకు మాత్రమే తెలుస్తాయి. అవి ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదు. మరి తప్పుడు వివరాలతో కొనుగోలుచేసే ఎన్నికల కూపన్ల ద్వారా నల్లధనం రాజకీయ పార్టీల ఖాతాలలోకి ప్రవహించడంలో ఆశ్చర్యమేముంది? అసలు ఈ ప్రయోజనం కోసమే ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టారని ప్రజలు భావిస్తే వారు పొరపడనట్టే.

సరే, రాజకీయ విరాళాల విషయమై ప్రభుత్వాన్ని సూటిగా కొన్ని ప్రశ్నలు వేయవల్సిన సమయమాసన్నమయింది. (1) రాజకీయ విరాళాలు పన్ను చెల్లింపు నుంచి ఎందుకు మినహాయింపు పొందుతున్నాయి? భారీ మొత్తంలో విరాళాలు ఇస్తున్న కార్పొరేట్ కంపెనీలు గానీ, ఆ విరాళాలను స్వీకరిస్తున్న రాజకీయపక్షాలు గానీ పన్ను రూపేణా పైసాగూడా చెల్లించవలసిన అవసరం లేకుండా వాటికి ఎందుకు తోడ్పడుతున్నారు? ఈ నిధులు ఎటువంటి దాతృత్వ కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నాయి? (2) రాజకీయ విరాళంగా ఏ కంపెనీ ఎంత చెల్లిస్తుందీ, ఏ రాజకీయ పక్షం ఎంత పొందుతున్నదీ ఇత్యాది వివరాలను వెల్లడిస్తే జరిగే హాని ఏమిటి?

భారత్‌లో అవినీతి ఎంతగా పెచ్చరిల్లి పోయివున్నదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భారతీయ సమాజ జీవితంలో అణువణువునా అవినీతి తాండవ మాడడానికి ప్రధాన కారణం రాజకీయ విరాళాలనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. కేంద్రంలో గానీ , రాష్ట్రాలలో గానీ అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ఈ రాజకీయ విరాళాలు ఒక నిరంతర భారీ కుంభకోణానికి కారణమవుతున్నాయి. వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అనుక్షణం జాగరూకతతో ఉండాలి. రాజకీయవేత్తలతో నిష్కర్షగా, నిక్కచ్చిగా వ్యవహరించాలి. లేనిపక్షంలో అవినీతి చీకట్లు ఎప్పటికీ తొలగిపోవు.

■ అంజుమన్ తివారీ

(డైలీ ఓ)

సారస్వత సాలోచనలో 'అనంత' పథం

శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ అనగానే యువ సాహిత్య విద్యార్థులకు చటుక్కున 'రాయల నాటి రసికత', 'నిగమ శర్మ అక్క' 'వేమన హాస్యము–నీతి' వీటిలో ఏ ఒక్కటైనా స్ఫురించక మానదు. ఇక 'నాచన సోముని నవీన గుణములు', 'ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథునికి కేయదగిన స్థానము' 'తిక్కన తీర్చిన సీతమ్మ', 'త్యాగయ్యగారి నాదసుధారసం', 'రంగనాథ రామాయణము' వీటిలో ఏ ఒకటీ, రెండైనా తట్టక మానవు. సునిశిత విమర్శకులకు 'నాగార్జున సాగరం', 'పెన్నేటి పాట', 'వదరుబోతు', 'వేమన పద్యములు' మొదలైనవాటికి రాళ్లపల్లివారు రాసిన పీఠికలు పదేపదే చదవాలనిపించక పోదు. మరి కవితా ప్రియుల్లో శర్మ అనువదించిన 'శాలివాహన గాథాసప్తశతీ సారము' లోని గాథలు జ్ఞప్తికి రాకపోవు. అనంతకృష్ణులవారి మేరుకృతి 'వేమన'(1929)లోని వారి సూచీముఖ పరిశీలనా దృష్టికీ, చుంబక శైలీ విన్యాసానికీ, సుకుమార హాస్యానికీ, హృదయ ఛేదక వ్యంగ్యానికీ లోనుగాని వారెవరు! రాళ్లపల్లి కవితా రమణీయానికి ముగ్ధులైన విశ్వనాథ సత్యనారాయణ 'పెనుగొండ కొండ,' 'శమీపూజ' కవితలు తెలుగులో కలకాలం నిలుస్తాయని అన్నమాట తెలిసిన వాళ్లెందరు? శర్మగారి 'సంధ్యావందనము', 'ప్రబంధ కవి', 'ముసలి వీణ' కవితల్లోని జాతీయతా స్ఫూర్తినీ, కావ్య సంగీతాల రాసిక్యాన్నీ పసికట్టిన వారున్నారో లేదో?

రాళ్లపల్లి అనంతకష్ణ శర్మ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తాలూకా (నేటి కంబదూరు మండలం)లోని రాళ్లపల్లిలో 1893 జనవరి 23న జన్మించారు. తల్లి అలమేలు మంగమ్మ వద్ద సంగీతం, తండ్రి కృష్ణమాచార్యుల వద్ద సంస్కృతాంధ్ర కావ్యాలు నేర్చారు. ఆ కుగ్రామంలో చదువుసంధ్యలకు ఎలాంటి అకాశాలూ లేనందువల్ల మైసూరు వెళ్లారు. పరకాల మఠయతీంద్రులైన శ్రీకృష్ణ బ్రహ్మతంతుల వారి వద్దనూ, చామరాజనగరం రామశాస్త్రి వద్దనూ, సంస్కృత కావ్య నాటకాదుల్నీ, అలంకార గ్రంథాలనూ లోనారసిలో అభ్యసించారు. తర్వాత మైసూరు మహారాజా కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న కట్టమంచి రామలింగారెడ్డి స్నేహసాహచర్యాలు లభించాయి. సుమారు ఎనిమిదేళ్ల నిత్యసాహిత్య సంబంధాల వల్ల రెడ్డి గారి 'నెల పల్కుపదును', 'తెలివిలోతు', నిండుతెలుగు మనసు, శర్మకు చాలా వరకు దక్కగలిగాయి. కట్టమంచి 'కావ్యదీప్తికి కరుగు మనసు'ను కూడా పుణికి పుచ్చుకోగలిగారు. కట్టమంచి ప్రతిభా దీధితులు ప్రసరించకుండా, పాశ్చాత్య సాహిత్య ప్రభావం పడకుండా వుంటే రాళ్లపల్లి ఏ సంస్కృత పండితులుగా వుండిపోయేవారేమో? లేకపోతే, అచ్చ తెలుగు రామాయణము, నీలాసందరీ పరిణయము, ఆంధ్ర నామ సంగ్రహాలకే పరిమితమైన శర్మ తెలుగు చదువు, ఎలాంటి డిగ్రీలూ లేని పాండిత్యం ఆయనకు మైసూరు మహారాజా కాలేజీలో తెలుగు పండిత పదవిని అలంకరింపచేశాయంటే కట్టమంచి చలవే కదా. అందుకనే శర్మ తన 'శాలివాహన గాథా సప్తశతీ సారము'ను అంకితమిస్తూ (1964) కట్టమంచి 'సరసమిత్రుడ నగ గరుడన జేపట్టి పయికి నెత్తినట్టి ప్రభు'వని మనసారా స్మరించుకున్నారు. మైసూరు మహారాజా కాలేజీలో (1912–49) పనిచేసిన కాలంలో శర్మ జీవితంలో కొద్ది ఆటుపోట్లు వాటిల్లినా, దాదాపు ప్రశాంతంగా గడిచిందనే చెప్పొచ్చు. సంస్కృత, తెలుగు, కన్నడ సాహిత్యాల్లో శిఖర ప్రాయులైన విద్వాంసుల స్నేహ సౌహార్ద్రాలు, కర్ణాటక సంగీత కోవిదులైన వీణ శేషణ్ణ, బిడారం కృష్ణప్ప, మైసూరు వాసుదేవాచార్యుల్లాంటి మహనీయుల ప్రేమాదరాల మధ్య, కావ్యమర్మజ్ఞత, సంగీతాస్వాదనా రసికతలు ముప్పిరికొన్నాయి.

తెలుగు కాల్పనికోద్యమ కవితోద్యమం ప్రారంభమైన తొలిదశలో రాజస్థానీ వనిత తారాదేవిని ధైర్యసాహసాలకు ప్రతీకగా, బుద్ధి కుశలతకు తార్కాణంగా, నాయికగాచేసి 'తారాదేవి' కావ్యాన్ని రచించారు (1911). రాయప్రోలు, గురజాడల ఖండకావ్యాలు వెలువడే సమయంలో ఓ స్త్రీని వీరవనితగా, తెలుగు పలుకుబడుల కాణాచిగా సృష్టించి తమ వైలక్షణ్యాన్ని నిరూపించుకున్నారు. మధుర భక్తికి మారుపేరైన 'మీరాబాయి'ని నాయికగా ఖండ కావ్యాన్ని



తెలుగు సాహిత్య విమర్శకు లోతునూ, వైశాల్యాన్నీ ఇచ్చిన రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారి మార్గాన్ని మనం సరిగ్గా అవగాహన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది.

రచించారు (1913). కథాకథనాలలో, పాత్ర చిత్రణలో, సంభాషణల నిర్వహణలో, తెలుగు నుడికారపు ఇంపుసొంపుల్లో ఈ కావ్యం కూడా మేలుబంతే. ఈ ఖండకావ్యాల ప్రచురణలు రెండు, మూడు నూర్ల ప్రతులకే పరిమితమైనందువల్లా, కవి ఆంధ్రదేశానికి సుదూరంగా వుండడంవల్లా పేరు ప్రఖ్యాతులకు నోచుకోలేకపోయాయి. రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ రాసిన సుమారు 10 ముక్త కవితల్లో పేర్కొన దగ్గవి– పెనుగొండకొండ, శమీపూజ, సంధ్యావందనము, విస్మృతవేణుగీతి మొదలైనవి. ఈ కవితలు మొత్తం ఆరు 1922లో ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వెలువడ్డాయి. వీటిలో మొదటి మూడూ భారతస్వాతంత్రోద్యమ స్ఫూర్తినిచ్చే కవితలు. రాళ్లపల్లివారి వ్యాస సంపుటి 'సారస్వతాలోకమ్'లోని ఎనిమిది వ్యాసాలూ అష్ట సిద్ధులే. హితమితమైన వస్తువు, స్పష్టమైన, సులభగ్రాహ్యమైన వివేచన, అందమైన పదాల కూర్పు, ఆదిమధ్యాంతాలు లలితంగా, చిత్తాకర్షకంగా సాగే నడకలు పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. శర్మ వ్యాసాలు ప్రారంభంలోనే పఠితల్ని సూదంటురాయిలా ఆకర్షించి తలపొలందాకా లాక్కొని వెళ్తాయి. కొందరు విమర్శకులు అనంత కృష్ణుల వ్యాసాల్లోని పదాల పొందికలోని రమణీయతను మాత్రమే గమనించి, ఆయన సామాజిక స్పృహనూ, నైతిక విలువల సమర్థతనూ సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం విచారకరం.

శర్మ సాహిత్య వ్యాసాల్లో ప్రతి వ్యాసంలోనూ ఏదో ఒక కొత్త విషయాన్ని ప్రతిపాదించిన వైనం కనపడుతుంది. 'నిగమశర్మ అక్క' వ్యాసం తెనాలి రామకృష్ణుని ప్రౌఢప్రబంధకావ్యం 'పాండురంగ మహత్యం'లోని పేరు లేని నిగమ శర్మ అక్క దారి తప్పిన తమ్ముణ్ణి దారిలోకి తెచ్చేందుకు పడ్డ ఆరాటపోరాటాలు పుట్టింటి మమకారానికి ప్రతీకలైన మన అక్కల్ని జ్ఞప్తికి తెస్తాయి. ప్రతి సాహిత్య వ్యాసం చాలా లోతైనదిగా, నూతన పథ నిర్దేశంగా తోస్తుంది. శర్మ గారి విశ్లేషణలు ఆలోచనామృతాలు. వ్యక్తీకరణలు పరమానంద వర్షిణులు. తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో రాళ్లపల్లివారి సేవను బేరీజు వేయడానికి ప్రతిభావంతంగా ప్రయత్నించిన వాళ్లలో ప్రముఖులు– సాళ్వ కృష్ణమూర్తి, కోవెల సంపత్కుమారాచార్యులు. కేవలం వైయక్తిక అభిరుచి ప్రకారం ఎలాంటి సామాజిక శ్రేయస్సును పట్టించుకోకుండా కావ్యలక్ష్య, లక్షణాల్ని పాటించకుండా చేసే అభిరుచి విమర్శకు శర్మ ఆమడదూరం. ఆయన భాతీయ కావ్య సాంప్రదాయాల్ని, పాశ్చాత్య కావ్య శాస్త్రాన్నీ లోతుగా, గురుముఖంగా అభ్యసించిన విలక్షణ విద్వాంసులు. ప్రాచీన సంస్కృత కావ్యమీమాంసను క్షుణ్ణంగా చదివి, పాశ్చాత్య విమర్శనా విధానాన్ని తులనాత్మకంగా పరిశీలించి, తన ఆలోచనలతో బేరీజు వేసి మరీ విమర్శన చేశారు. ఆయన సారస్వత వ్యాసాల్లో 'ఆర్జవం' అనే మాట పదేపదే తారసపడుతూ ఉంటుంది. 'ఆర్జవం' అంటే తాను అనుభవించిన భావాలనే వెలువరించే అకృతిమ స్వభావం. ఇతరుల మెప్పులకో, సంప్రదాయ సంరక్షణకో ఆశపడి, తన మనస్సులో నిజంగా లేని భావాలను ఆరోపించుకుని, రచనా వ్యాపారం సాగించే సంత సరుకు కాదు. ఈ ఆర్జవ గుణమే ఆయన వ్యవహారంలోను, కవితల లోనూ భావాలకు తీవ్రతను, భాషకు పదునైన తీర్పును ఈయగలిగింది. ఆధునిక, అత్యాధునిక విమ్శకుల నిబద్ధత, నిమగ్నత, నిబిడత లాంటి మాటలకంటే బలమైనదీ, అర్థవంతమైనదీనూ ఈ 'ఆర్జవం' అనే పదం. దీన్ని శర్మ తమ విమర్శనా వ్యాసంగంలో ఆద్యంతమూ పాటించారు. అనంతకృష్ణులు పాటించిన విమర్శనా విధానం– భావము, వస్తువు, రచనలను వారి పేరు చెప్పకుండా అనుసరించిన విమర్శకులు ఎంతోమంది ఉన్నారు రాళ్లపల్లి విమర్శ వ్యాసాల్ని లోతుగా పరిశీలిస్తే, వారి సమకాలీన విమర్శకుల కంటే ఎంతో ముందుచూపూ, సూక్ష్మతర పరిశీలనా దృష్టీ కలవారని తెలుస్తుంది. తెలుగు సాహిత్య విమర్శకు లోతునూ, వైశాల్యాన్నీ ఇచ్చిన రాళ్లపల్లి వారి పథాన్ని మనం సరిగ్గా అవగాహన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది.

■ శివప్రియ

(నేడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 125వ జయంతి)



లాహిరి... లాహిరి... లాహిరిలో..

ఓ వైపు గండికోట ఉత్సవాలు.. మరోవైపు మైలవరం జలాశయంలో బోటు షికారు. పర్యాటకులకు సందడే సందడి. జలాశయంలో బోటు షికారు చేస్తూ ప్రకృతి రమణీయ దృశ్యాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. జలాశయంలో నీరు నిండుగా ఉండటంతో రెండు రోజుల కిందటే ఏపీ టూరిజం శాఖ బోటు షికారు ఏర్పాటు చేసింది. మైలవరం జలాశయం అందాలు చూసేందుకు జనం భారీగా తరలివస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో చుట్టూ ఒక కిలోమీటరు మేర బోటును తిప్పుతున్నారు. ఒక స్పీడు బోటు, మరో డీలక్స్ బోటులో పర్యాటకులను తీసుకువెళుతున్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో దక్షిణ కాలువ వరకు బోట్లు తిరుగుతుండగా.. త్వరలోనే గండికోట రిజర్వాయరు వరకూ వీటిని నడిపే అవకాశం ఉంది. గండికోట వరకూ బోటులో షికారు చేసే అవకాశం వస్తే.. అలనాటి రాజఠీవికి నిదర్శనంగా చరిత్రలో గీటురాయిగా వెలిసిన గండికోటను వీక్షించవచ్చు. కొండ కోనలు.. పచ్చిక బయళ్లు.. చిన్న చిన్న జలపాతాలు, గుహలను చూడొచ్చు. గుర్రాల, బాదర కొండల మధ్య ఈ బోటు ప్రయాణం సాగుతుంది. ఇందుకోసం పర్యాటకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

– మైలవరం

ముంబాయి మారథాన్‌లో రెచల్ చటర్జీకి గోల్డ్ మెడల్



అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టాటా ముంబాయి మారథాన్‌లో మాజీ ఐఏఎస్ అధికారి రెచల్ చటర్జీ గోల్డ్ మెడల్ సాధించారు. 65-69 ఏళ్ల కేటగిరికి నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్న ఆమె 4.44 గంటల్లో 42.105 కిలోమీటర్ల పరుగు పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచారు. ఈ మారథాన్‌లో 45 వేల మంది పాల్గొన్నారు.

26 నుంచి దళిత తేజం-తెలుగుదేశం

- దళితులంటే జగన్‌కు చిన్నచూపు
- ఆ పార్టీ పదవుల్లో ఒక్క దళితుడూ లేడు: జవహర్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత వాడల్లో ఈ నెల 26 తేదీ నుంచి 'దళిత తేజం-తెలుగుదేశం' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్ చెప్పారు. దళిత వాడల్లో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తామని తెలిపారు. తద్వారా దళితులకు పార్టీని మరింత చేరువ చేస్తామన్నారు. ఏప్రిల్ 20వ తేదీన విజయవాడలోని పవిత్ర సంగమం వద్ద రాష్ట్ర మహాసభతో దళిత తేజం కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. దళిత యువతకు వేల కోట్ల రూపాయలతో తమ ప్రభుత్వం ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖరీదయిన ఇన్నోవా కార్లు ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డి కుల అహంకారంతో ఉన్నారని, దళితులను చిన్నచూపు చూస్తున్నారని మంత్రి ఆరోపించారు. దళితులకు మేలు చేస్తున్నందునే జగన్.. టీడీపీపై విషం కక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

5% బెల్టు షాపులున్నాయి : మంత్రి జవహర్

రాష్ట్రంలో ఎన్ని దాడులు చేసినా ఇంకా ఐదు శాతం బెల్టు మద్యం దుకాణాలు నడుస్తున్నాయని ఎక్సైజ్‌శాఖ మంత్రి కె.ఎస్. జవహర్ అన్నారు. ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో 1.29కోట్ల గంజాయి మొక్కలు ధ్వంసం చేశామని, 'నవోదయం' ద్వారా జిల్లాలన్నింటినీ నాటుసారా రహితంగా మారుస్తున్నామని తెలిపారు.

జిల్లాల్లో సొంత భవనాలు: కమిషనర్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, స్టేషన్లకు సొంత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసినట్లు కమిషనర్ లక్ష్మీనరసింహం తెలిపారు. రూ.200కోట్లు ఇవ్వాలని ఇటీవల ఆర్థిక మంత్రిని కోరామని, ఫిబ్రవరిలో ఇస్తామని చెప్పారని తెలిపారు. ఎక్సైజ్‌లో ఆదాయం రూ.1200కోట్లు పెరిగిందన్నారు.

కొనసాగుతున్న 'వాకాటి' విచారణ

నెల్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని రెండో రోజు కూడా సీబీఐ అధికారులు విచారించారు. వీఎన్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరిట కేంద్ర పారిశ్రామిక ఆర్థిక సంస్థ(ఐఎఫ్‌సీఐ) నుంచి రుణాలు పొంది సకాలంలో చెల్లించలేదని సీబీఐ గత ఏడాది మే 5న వాకాటి, ఐఎఫ్‌సీఐ డీజీఎం వీసీ రామ్మోహన్‌తోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసింది. దీనిపై అదే నెల 12న వాకాటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించి కొన్ని రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీబీఐ అధికారులు పలుమార్లు వాకాటిని పిలిపించి విచారించారు. కాగా, ఆదివారం బెంగుళూరులోని సీబీఐ కార్యాలయంలో జరిగే విచారణకు మరో సారి హాజరు కావాలని వాకాటిని కోరారు. దీంతో ఆయన సీబీఐ కార్యాలయానికి వెళ్లి అధికారుల ఎదుట హాజరయ్యారు. ఇదే కేసులో కీలకంగా వ్యవహరించిన డీజీఎం రామ్మోహన్‌ను కూడా విచారిస్తున్నట్లు సమాచారం.

ఎక్సైజ్‌లోనే మామూళ్లు అధికం: ముద్దుకృష్ణమ

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలోనే మామూళ్ల మత్తు అధికంగా కొనసాగుతోందని శాసనమండలి హామీల కమిటీ చైర్మన్ గాలి ముద్దుకృష్ణమనాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఎక్సైజ్ శాఖ అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తుకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కొవ్వాడ పవర్‌ప్లాంట్ శరవేగంగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఎక్కడైనా ఉచితం మాటున ఇసుకకు డబ్బులు వసూలు చేస్తే అలాంటివారిపై 'పీడీ యాక్ట్' ప్రయోగించాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

ఎక్సైజ్ ఉద్యోగ జేఏసీ ఏర్పాటు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలోని ఉద్యోగ సంఘాలన్నీ కలిసి సోమవారం విజయవాడలో జేఏసీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. గౌరవ చైర్మన్‌గా ఏపీఎన్జీవో అధ్యక్షుడు పి.అశోక్‌బాబును ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ కమిషనర్ వై.బి. భాస్కరరావు, కో-చైర్మన్‌గా ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి.నర్సింహులు, కన్వీనర్‌గా ఎం.కోటయ్య, వైస్ చైర్మన్‌గా కె.వి. నాగప్రభు కుమార్, కో-కన్వీనర్‌గా ఎస్.వి.వి. బాబ్జీరావు, జాయింట్ కన్వీనర్‌గా ఎ.శీనయ్య మరికొందరు నియమితులయ్యారు.

కేంద్ర జోక్యం సహించం!

- 'వెనుకబడిన జిల్లాల అభివృద్ధి'పై మూడు రాష్ట్రాల విముఖత

న్యూఢిల్లీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కార్యక్రమం అమలుకు మూడు రాష్ట్రాలు విముఖంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా 115 జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని గుర్తించిన కేంద్రం.. వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని సంకల్పించింది. అయితే బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశాలు మాత్రం ఈ విషయంలో కేంద్రం జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆయా జిల్లాల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణకు అధికారులను నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కాగా, రాజకీయపరమైన అసూయతో కూడిన ఇటువంటి ఆలోచనా ధోరణి అభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతుందని కేంద్రమంత్రి రాంకృపాల్ అన్నారు.

భారత్‌కు త్వరలో 'హెక్సావాలెంట్'

గుంటూరు(మెడికల్), జనవరి 22(ఆంధ్రజ్యోతి): హెక్సావాలెంట్ వ్యాక్సిన్‌ను దేశంలో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి, గుంటూరు జోన్ పోలియో సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈనెల 28న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించేందుకు గుంటూరు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఇప్పటి వరకు రొటీన్ ఇమ్యునైజేషన్‌లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఇస్తున్నామని, దీనిస్థానంలో హెక్సావాలెంట్‌ను ప్రవేశపెట్టాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు వివరించారు. పిల్లలకు 6, 14 వారాల్లో రెండు పర్యాయాలు ఈ ఐపీవీ ఇస్తే పోలియో నుంచి వారికి పూర్తి రక్షణ లభిస్తుందని శ్రీధర్ తెలిపారు.

ప్రతి రైతుకూ మద్దతు ధర: సీఎస్ దినేశ్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణపై సీఎం చంద్రబాబు దావోస్ వెళ్తూ కూడా మార్గదర్శకాలు ఇచ్చారని, ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయం, నీరు-ప్రగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లు, శాఖాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ కేంద్రాలపై కలెక్టర్లు నిశితంగా దృష్టిపెట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కేంద్రాలకు రీ-సైక్లింగ్ బియ్యం తెచ్చినా, రేషన్ బియ్యాన్ని రైస్‌మిల్లుల్లో రీ-సైక్లింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి పనులకు కలెక్టర్లే నేతృత్వం వహించాలని, వ్యక్తిగతంగా పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. జన్మభూమిలో అంతకుముందు ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ఆర్థికేతరమైన వినతులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని సీఎస్ ఆదేశించారు.

ప్రజారోగ్యానికి గడ్డుకాలం

- పీహెచ్‌సీల్లో సీనియర్ వైద్యుల కొరత
- పడకేస్తున్న ఆరోగ్య పథకాల అమలు
- రిటైర్మెంట్ వయసు పెంచాలని డిమాండ్
- అందుబాటులో ఉండని కాంట్రాక్ట్ డాక్టర్లు
- పెద్దాస్పత్రులకు పరుగులు తీస్తున్న రోగులు



అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి గడ్డుకాలం దాపురించింది. ఇప్పటికే పడకేసిన పథకాలతో సతమతమవుతున్న ఆరోగ్య శాఖ... గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పీహెచ్‌సీల్లో సీనియర్ వైద్యులు లేకపోవడం, సర్వీసు పూర్తయిన వారంతా ఒక్కొక్కరుగా రిటైరవుతుండటంతో చాలావరకూ పీహెచ్‌సీలు ఖాళీ అవుతున్నాయి. గత రెండు నెలల్లో సుమారు 30మంది పదవీ విరమణ చేసినట్లు సమాచారం. దీంతో ప్రజలకు అందాల్సిన వైద్యసేవలు మందగిస్తున్నాయి. సాధారణంగా పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే వైద్యులే ప్రజారోగ్యంపై ఎక్కువగా దృష్టి సారిస్తారు. గ్రామాల్లో పర్యటనల నుంచి జాతీయ, రాష్ట్ర ఆరోగ్య పథకాలన్నీ వీరి ద్వారానే ప్రజల్లోకి వెళ్తాయి. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 32 ఆరోగ్య పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాలు ప్రస్తుతం ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం, వైద్యుల కొరత కారణంగా పడకేస్తున్నాయి. వైద్యుల భర్తీ ప్రక్రియ చేపట్టడంతో పాటు ఉన్నవారికి సర్వీసును పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. డీఎంఈ ఆస్పత్రుల్లో సీనియర్ వైద్యుల రిటైర్మెంట్ వయసును 63ఏళ్లకు పెంచిన విషయాన్ని పేర్కొంటున్నారు. దీనికోసం ఎంబీబీఎస్ వైద్యులు కూడా గత 6నెలల నుంచి పోరాటం చేస్తున్నారు. ఎమ్మెల్యేల నుంచి సీఎం వరకూ అందరికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.

అన్నిటికీ పెద్దాస్పత్రే దిక్కు...

పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో అందుబాటులో లేని వైద్య సేవల కోసం మాత్రమే గతంలో రోగులు పెద్దాస్పత్రులకు వెళ్లేవారు. చిన్న సమస్యలకు పీహెచ్‌సీ స్థాయిలోనే వైద్యం పొందేవారు. అయితే ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత, మందుల కొరతతో రోగులు నేరుగా పెద్దాస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జ్వరం, తలనొప్పి వంటి చిన్నపాటి సమస్యలకూ పెద్దాస్పత్రే దిక్కవుతోంది. దీంతో గత రెండేళ్లలో డీఎంఈ ఆస్పత్రులకు ఓపీ భారీగా పెరిగిపోయింది. పడకలు, పరికరాలు పెరగలేదు కానీ, రోగుల సంఖ్య మాత్రం మూడింతలైంది. ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు విస్మరిస్తున్నారు. ఇదంతా తాము ప్రవేశపెట్టిన పథకాల ప్రభావమే అంటూ ప్రభుత్వానికి, సీఎంకు నివేదిస్తున్నారు. పీహెచ్‌సీల్లో సరిపడా వైద్యులు, సీనియర్ వైద్యులు అందుబాటులో ఉంటే రోగులు పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. ప్రజారోగ్యానికి పీహెచ్‌సీలే పట్టుగొమ్మలు అని ఉన్నతాధికారులు గుర్తిస్తే తప్ప ఇబ్బందులు తొలగవు.

కాంట్రాక్ట్ వైద్యులతో నింపేస్తున్నారు

సీనియర్ వైద్యులు రిటైరైతే కాంట్రాక్ట్ వైద్యులే దిక్కు అన్న చందంగా ఆరోగ్యశాఖ వ్యవహరిస్తోంది. ప్రస్తుతం పీహెచ్‌సీలను కాంట్రాక్ట్ వైద్యులతో నింపే పనిలో తలమునకలుగా ఉంది. అయితే విధి నిర్వహణలో వీరి బాధ్యతా రాహిత్యంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి వీరు అందుబాటులో లేకపోవడం ఏజెన్సీల్లో ఉన్న పీహెచ్‌సీల్లో పెద్ద సమస్యగా మారింది. సీనియర్, రెగ్యులర్ వైద్యులు ఉంటే తప్ప పీహెచ్‌సీల పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్యుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని, సీనియర్ వైద్యుల పదవీ విరమణ వయసును పెంచాలని పలువురు కోరుతున్నారు.

'గాలి' యంత్రాలు సీజ్

- వాటి విలువ రూ.189 కోట్లు: డీఆర్ఐ
- 44 కోట్ల కస్టమ్స్ డ్యూటీ ఎగవేసిన ఓఎంసీ
- బ్యాంకు గ్యారెంటీ వాపస్ తీసుకున్న వైనం
- కేంద్రం ఆదేశాలతో రంగంలోకి డీఆర్ఐ

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి యంత్రాలను దిగుమతి చేసుకుని వ్యూహాత్మకంగా కస్టమ్స్ డ్యూటీ ఎగ్గొట్టిన గాలి జనార్దన్‌రెడ్డి కంపెనీ యంత్రాలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సీజ్ చేసింది. కడప జిల్లా జమ్మలమడుగులోని బ్రాహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్ కోసం 2009లో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రూ.189 కోట్ల యంత్ర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ప్రకటించింది. వైఎస్ ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అధినేత గాలి జనార్దనరెడ్డి.. జమ్మలమడుగు ప్రాంతంలో బ్రాహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేరుతో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్నారు. అందులో అమర్చేందుకు విదేశాల నుంచి ఖరీదైన యంత్రాలను దిగుమతి చేసుకుని చెన్నై పోర్టు నుంచి జమ్మలమడుగుకు తరలించారు. దిగుమతి చేసుకున్న యంత్రాలను ఆరు నెలల్లోపు ఫ్యాక్టరీలో అమర్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ.. ఉత్పత్తి ప్రారంభించాలి. ఆ ఉత్పత్తిపై ప్రభుత్వానికి పన్నులు వస్తాయి గనుక కస్టమ్స్ పన్ను మినహాయింపు లభిస్తుంది. బ్రాహ్మణి ఇండస్ట్రీస్ దిగుమతి చేసుకున్న యంత్రాలకు సంబంధించి ఓఎంసీ రూ.44 కోట్లు కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి ఉండగా అందుకు తగినట్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలి. అయితే ఓఎంసీ ఆ గ్యారెంటీని వెనక్కి తీసుకుంది. దీంతో విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం డీఆర్ఐని ఆదేశించింది. రంగంలోకి దిగిన హైదరాబాద్ డీఆర్ఐ అధికారులు.. జమ్మలమడుగులో బ్రాహ్మణి పరిశ్రమ స్థలంలో ఉన్న రూ.189 కోట్ల విలువ చేసే యంత్రాలను సీజ్ చేసినట్లు డీఆర్ఐ అదనపు డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'గాలి'కి సుప్రీంలో చుక్కెదురు

బెంగళూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక అసెంబ్లీకి మరో మూడు నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సొంత ప్రాంతం బళ్లారికి వెళ్లి రాజకీయాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించాలనుకున్న మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అక్కడకు వెళ్లేందుకు తనకు అనుమతి ఇవ్వాలని, బెయిల్ నిబంధనలు సడలించాలని కోరుతూ ఆయన దాఖలు చేసుకున్న దరఖాస్తును సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. బెయిల్‌పై బయటకు వచ్చినా.. బళ్లారి, కడప జిల్లాలకు వెళ్ళకుండా సుప్రీంకోర్టు ఆంక్షలు విధించింది. వాటిని సడలించేందుకు ఇప్పుడు నిరాకరించింది.

ఎస్సీల భూముల్ని బాబు లాక్కుంటున్నారు

- నేనొస్తే ఆ భూముల పరిరక్షణకు చట్టం
- నిరుపేదలందరికీ రెండెకరాల భూమి
- పాదయాత్రలో జగన్ వెల్లడి



పల్లమాలలో ఎస్సీల ఆత్మీయ సదస్సులో కొమ్ము బూర ఊదుతున్న జగన్

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 22: తాను అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చట్టం తెస్తానని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తెలిపారు. 68వ రోజు పాదయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాలలో సోమవారం నిర్వహించిన ఎస్సీల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపన పేరుతో ఎస్సీ, ఎస్టీల భూములను ముఖ్యమంత్రి చంద్రబాబు బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. తాను గద్దెనెక్కితే ఎస్సీ, ఎస్టీల భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తెస్తానని, ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో భూములు తీసుకోవాల్సి వస్తే ఇతరుల భూముల కంటే ఎక్కువ ధర చెల్లించి తీసుకుంటానన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసించే పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తామన్నారు. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇచ్చేటట్లు ప్రత్యేక చట్టం తెస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఒక్కో పేద కుటుంబానికి రెండు ఎకరాల వంతున 13 లక్షల ఎకరాలను పంపిణీ చేస్తానని తెలిపారు. ఈ భూముల్లో వ్యవసాయానికి ఉచితంగా బోర్లు వేయిస్తానని, ఇల్లు లేని నిరుపేదలందరికీ పక్కాగృహాలు నిర్మించి ఇస్తానని చెప్పారు. టీడీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు పాదయాత్ర పూర్తయ్యాక ఎస్సీ గర్జన సభ ఏర్పాటు చేస్తానన్నారు. కాగా.. జగన్ సోమవారం 14 కిలోమీటర్లు నడిచారు. చిత్తూరు జిల్లాలో పాదయాత్ర పూర్తిచేసిన ఆయన మంగళవారం నెల్లూరు జిల్లాలో ప్రవేశిస్తారు. రెండు జిల్లాల సరిహద్దు గ్రామమైన రెడ్డిగుంట బాడవలో రాత్రిబస చేశారు. ఆయన వెంట ఎంపీలు వరప్రసాద్, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సునీల్ కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహన్ ఓ బఫూన్

- సీఎంలకు భజన : సీపీఐ నారాయణ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ కేంద్రానికి బ్రోకర్‌లా పని చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. రెండు రాష్ట్రాల సీఎంలకు భజన చేస్తున్నారని అన్నారు. ఆయన్నో బఫూన్‌గా అభివర్ణించారు. అందుకే గణతంత్ర వేడుకల సందర్భంగా 'ఎట్ హోమ్' విందుకు ఆయన ఆహ్వానించినా తాను హాజరుకాబోనని ప్రకటించారు. గవర్నర్ వ్యవస్థ చెంచాగిరీకి తప్ప ఎందుకూ పనికి రాదన్నారు. సోమవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో, నందిగామలో నారాయణ విలేకరులతో మాట్లాడారు. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంకు, ప్రధాని మోదీకి ఏ మాత్రం తేడాలేదని ఆరోపించారు. రాష్ట్రపతి కోవింద్ రాజ్యాంగానికి భిన్నంగా వ్యవహరించి 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారని వ్యాఖ్యానించారు. అత్యున్నత పదవిలో ఉన్న కోవింద్ కొంగ జపం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ (సీఈసీ) ఏకే జ్యోతి... ప్రధానికి పాలేరుగా వ్యవహరించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణల్లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు మంత్రులుగా అధికార దర్పం అనుభవిస్తున్నా పట్టించుకోని ఈసీ, రాష్ట్రపతి.. ఆప్ ఎమ్మెల్యేలపై వెంటనే ఎలా నిర్ణయం తీసుకున్నాయని ప్రశ్నించారు. కాగా.. రాజధాని నిర్మాణం కోసం రైతులు ఇచ్చిన భూములను సీఎం ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు.



మాకు సీఎం చాలా డోస్ ఇచ్చారు!

- జీతాలు తీసుకుని నిద్రపోతారా? పనిచేయాలని లేదా..
- అధికారులపై విజయనగరం కలెక్టర్ తీవ్ర ఆగ్రహం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 22: "శరీరానికి పని చెప్పకూడదని లక్ష్యంగా పెట్టుకున్నారా? జీతాలు తీసుకుని నిద్రపోవాలని నిర్ణయించుకున్నారా? ఏంపని చేస్తున్నారు? సమయానికి సమావేశానికి రారు. వచ్చినా నివేదికలు ఇవ్వరు? ఏమిటీ పరిస్థితి? అమరావతిలో జరిగిన 2 రోజుల సమావేశాల్లో సీఎం చాలా డోసు ఇచ్చారు. నేను శ్రమిస్తున్నాను. మీలాంటి వారిని ఎక్కడా చూడలేదు. నరకం చూపిస్తున్నారు" అంటూ జిల్లా అధికారులపై విజయనగరం కలెక్టర్ వివేక్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. శాఖల వారీ సమీక్ష నిర్వహించారు. దాదాపు అన్ని శాఖల అధికారుల తీరుపైనా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సమావేశానికి ఎందుకు రాలేదని సూపరింటెండెంట్ శంభు ప్రసాద్‌ను ప్రశ్నించారు. డీసీ విజయవాడ సమావేశానికి వెళ్లారని ఆయన వివరించారు. జిల్లాలో ఎవరి అనుమతి తీసుకుని వెళ్లారని అడిగారు. సమాధానం రాకపోవడంతో డీసీ విజయవాడలో హాయిగా ఉండవచ్చుకదా? ఇక్కడ ఎందుకు జాయిన్ అయ్యారు? అంటూ వెంటనే డీసీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఆర్‌వోను ఆదేశించారు. సమయానికి హాజరుకాని పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ ఈఈ శ్రీనివాస్‌పై మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తున్నారా? అని మండిపడ్డారు.

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు పదోన్నతులు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. సీనియర్ ఐఏఎస్ లు అనిల్‌కుమార్ సింఘాల్, గోపాల్‌కృష్ణ ద్వివేది, వైవీ అనూరాధ, బి.ఉదయలక్ష్మి, కె.దమయంతి, బి.కిషోర్‌కు కార్యదర్శి నుంచి ముఖ్య కార్యదర్శి హోదా కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ముదావతు ఎం.నాయక్, పి.భాస్కర, ఎం.జానకి, ఎన్. యువరాజ్‌కు సంయుక్త కార్యదర్శి నుంచి అదనపు కార్యదర్శి హోదా ఇచ్చింది. 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి జి.రవిబాబుకు కార్యదర్శి హోదా, సీనియర్ ఐపీఎస్‌లు మనీష్‌కుమార్ సిన్హా, కేవీవీ గోపాలరావు, బీ రమణకుమార్, పి.హరికుమార్‌కు ఐజీలుగా, నవీన్ గులాటి, క్రాంతి రాణా టాటాకు డీఐజీలుగా, ఎస్.శ్యామ్‌సుందర్, సి.ఎం.త్రివిక్రమవర్మ, కె.కోటేశ్వరరావు, ఎల్‌వీకే రంగారావు, పి.వెంకట్రామిరెడ్డి, జి.పాలరాజుకు సీనియర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. కాగా, నైపుణ్యాభివృద్ధి శాఖ పూర్తిస్థాయి బాధ్యతలను సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్ రావత్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కలెక్టర్ ఆమ్రపాలి పెళ్లికూతురాయెనే!

- వచ్చే నెల 18న వివాహం
- వరుడు ఐపీఎస్ సమీర్‌శర్మ
- ఆమెది విశాఖ... ఆయనది కశ్మీర్



కలెక్టరేట్(వరంగల్ అర్బన్), జనవరి 22: వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి పెళ్లి కూతురు కాబోతున్నారు. ఫిబ్రవరి 18న ఆమె వివాహం 2011 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్ సమీర్ శర్మతో జరగనుంది. జమ్మూ కశ్మీరుకు చెందిన సమీర్ ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో ఎస్పీగా పనిచేస్తున్నారు. విశాఖపట్నానికి చెందిన ఆమ్రపాలి 2010 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్. ఇద్దరిదీ ప్రేమ వివాహం అంటున్నారు. నాలుగేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారని, పెద్దల అంగీకారంతో ఇటీవలే వారిద్దరికీ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. పెళ్లి పనుల కోసం ఈ నెల 28 నుంచి ఆమ్రపాలి సెలవులో వెళుతున్నట్లు చెబుతున్నారు. పెళ్లి వేడుక జమ్మూ కశ్మీరులో జరుగుతుందని అంటున్నా ఇంకా ధ్రువీకరణ కాలేదు. ఫిబ్రవరి 23న వరంగల్ కలెక్టరేట్ బంగళాలో రిసెప్షన్ నిర్వహిస్తారని అంటున్నారు. 25న హైదరాబాద్‌లో మరో గెట్ టు గెదర్ ఏర్పాటు చేస్తారు.

యువతకు ప్రతీక

ఆమ్రపాలి తండ్రి వెంకటరెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. ఆమె ఐఐటీ మద్రాస్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, ఐఐఎం బెంగుళూరు నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. సివిల్స్‌లో ఆమె జాతీయ స్థాయిలో 39వ ర్యాంకు సాధించారు. సొంత రాష్ట్రమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎంపికయ్యారు. 2014లో వికారాబాద్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లాల విభజన తర్వాత 2016 అక్టోబర్ 11న వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 35 ఏళ్ల ఆమ్రపాలి ట్రెకింగ్ తదితర సాహస క్రీడలతో తనదైన శైలితో యువతలో అత్యంత ఆదరణ సంపాదించారు.

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అంటే కేవలం అబ్బాయిలకు సంబంధించిన కెరీర్‌గా సమాజంలో ముద్రపడింది. ఎంతో కీలకమైన సాయుధ దళాల్లో మహిళల ప్రవేశం గురించి చర్చ జరుగుతూనే ఉంది. అన్ని రంగాల్లో ఆకాశమే హద్దుగా పురుషులతో సమానంగా మహిళా లోకం దూసుకుపోతోంది. రక్షణ రంగంలో మాత్రం మహిళా శక్తి నామమాత్రంగానే ఉంటోంది. ముఖ్యంగా శత్రువుకి ఎదురొడ్డి పోరాడే సాయుధ బలగాల్లో మహిళల ప్రవేశానికి చాలా దశాబ్దాలు పట్టింది. మొదట్లో డాక్టర్లు, నర్సు ఉద్యోగాలకే పరిమితమైనా, ఇప్పుడు కదన రంగంలో బాధ్యతలకూ సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ రక్షణ రంగంలో మహిళలకు అందుబాటులో ఉన్న ఉద్యోగాల గురించి తెలుసుకుందాం...



కదన రంగంలోనూ...

అమ్మాయిలకు ఆహ్వానం

గతంలో సాయుధ దళాల్లో మహిళా ఉద్యోగులు పరిమితంగానే ఉండేవారు. కేవలం మెడికల్, నర్సింగ్ విభాగాల్లో మాత్రమే విధులు నిర్వహించేవారు. 1992లో మొదటి సారిగా రక్షణ రంగంలోని వివిధ విభాగాల్లో మహిళలకు ఆఫీసర్స్‌గా అవకాశం కల్పించారు. ఏవియేషన్, లాజిస్టిక్స్, లా, ఇంజనీరింగ్, ఎగ్జిక్యూటివ్ వంటి విభాగాల్లో మహిళలను నియమించుకోవడం ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఇండియన్ ఆర్మీలో 1200 మంది మహిళలు ఆఫీసర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

పోరాట విభాగాల్లో...

ఇటీవలి కాలంలో సాయుధ దళాల్లో మహిళల సంఖ్యను పెంచే దిశగా ప్రభుత్వం పలు చర్యలను తీసుకుంటుంది. సబ్‌మెరైన్, ట్యాంక్ యూనిట్స్, కంబాట్ (పోరాట) విభాగాల్లో కూడా మహిళలకు ప్రవేశం కల్పించడానికి అవకాశాలను పరిశీలిస్తుంది. ఆర్మీలో మహిళలకు అనువైన ఉద్యోగాలపై సూచనలు చేయాల్సిందిగా దేశంలోని అన్ని ఆర్మీ వింగ్స్‌ను కొన్ని నెలల క్రితం భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. గతేడాది జూన్ నుంచి కంబాట్ (పోరాట), విమానాలు, యుద్ధ విమానాల్లో పైలెట్లుగా మహిళలకు అవకాశం కల్పించడం ప్రారంభించారు. అయితే ప్రయోగాత్మకంగా మాత్రమే ఈ విధానానికి అనుమతిచ్చారు.

పురుషుల మాదిరిగానే..

భారత రక్షణ రంగంలో ప్రధానంగా నాలుగు విభాగాలు కనిపిస్తాయి. అవి.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్. వీటిలో మ్యాన్‌పవర్‌ను ర్యాంకులు, అర్హతలు, సీనియార్టీ ఆధారంగా కమిషన్డ్ ఆఫీసర్స్, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్స్ (జేసీఓ) తదితర హోదాలుగా విభజిస్తారు. మహిళా ఆఫీసర్ల ఎంపిక పురుషుల మాదిరిగానే ఉంటుంది. సీడీఎస్ వంటి రాత పరీక్షలు లేదా సంబంధిత అర్హతల్లో సాధించిన మెరిట్ లేదా ఎన్‌సీసీ ఎంట్రీ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత వీరికి దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ నిర్వహి స్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి చివరగా మెడికల్ టెస్ట్ ఉంటుంది. రాత పరీక్ష / మెరిట్ లిస్ట్, ఎస్ఎస్‌బీ దశల్లో ప్రతిభ చూపిన వారికి పోస్టింగ్‌ను ఖరారు చేస్తారు.

షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదాలో..

ప్రస్తుతం సాయుధ దళాల్లో నాన్ మెడికల్ విభాగంలో మహిళలను షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్స్ కేడర్‌లో రిక్రూట్ చేసుకుంటున్నారు. ఈ విధానంలో మహిళలు 5-14 ఏళ్లు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అటుపై విధుల నుంచి తప్పుకోవాల్సి (పదవీ విరమణ) ఉంటుంది. ఈ సమయంలో గ్రాట్యుటీని చెల్లిస్తారు. పెన్షన్ సౌకర్యం ఉండదు. తరవాత బ్యాంక్స్ లేదా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్‌ను ప్రారంభించవచ్చు. ఆయా నియామక పరీక్షల్లో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో రిజర్వేషన్లు కూడా కల్పిస్తారు. మెడికల్ బ్రాంచ్‌లో డాక్టర్ లేదా నర్సులుగా విధులు నిర్వహించే వారికి పర్మినెంట్ కమిషన్డ్ హోదా ఉంటుంది. వీరికి పదవీ విరమణ తరవాత పెన్షన్ కూడా ఇస్తారు. వీరికి షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదాను ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా డాక్టర్లను, మిలటరీ నర్సింగ్ సర్వీస్ ద్వారా నర్సులను నియమించుకుంటారు.

సవాలు.. శిక్షణ

త్రివిధ దళాల్లో పని చేయడం ఒక సవాలుతో కూడిన వ్యవహారం. కఠినమైన పరిస్థితుల్లో పని చేయాల్సి ఉంటుంది. తదనుగుణంగా వివిధ అకాడమీల్లో శిక్షణ ఇస్తారు. కాబట్టి ఎలాంటి పరిస్థితుల్లోనైనా విధులు నిర్వహించే మనో ధైర్యం లభిస్తుంది. బదిలీలు అనివార్యం. కాబట్టి వేర్వేరు ప్రదేశాల్లో విధులు నిర్వహించాలి. అయితే అదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించే అవకాశం లభిస్తుంది.

ఇండియన్ కోస్ట్‌గార్డ్

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో ఆఫీసర్స్ ఎంట్రీ, సెయిలర్స్ ఎంట్రీ అనే విభాగాలు ఉంటాయి. ఇందులో మహిళలకు ఆఫీసర్స్ కేడర్‌లో మాత్రమే అవకాశం కల్పిస్తారు. జనరల్ డ్యూటీ పైలట్/ నేవిగేషన్ విభాగాల్లో మహిళలను రిక్రూట్ చేసుకుంటారు.

- **అసిస్టెంట్ కమాండెంట్:** ఈ విధానం ద్వారా జనరల్ డ్యూటీ కేటగిరీలో షార్ట్ సర్వీస్ అపాయింట్‌మెంట్ ఇస్తారు. దీని ప్రకారం ఎనిమిదేళ్ల పాటు సర్వీస్ చేయాలి. తరవాత 10 నుంచి 14 ఏళ్లకు పొడిగించే వెసులుబాటు ఉంటుంది.
  అర్హత: డిగ్రీ (12వ తరగతి వరకు మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి). **వయసు:** 21-25 ఏళ్లు.
- **పైలట్ సీపీఎల్:** అర్హత - 60 శాతం మార్కులతో 12వ తరగతి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జారీ చేసిన కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉండాలి. **వయసు:** 19 - 25 ఏళ్లు.
- **అసిస్టెంట్ కమాండెంట్ (లా):** అర్హత: లా డిగ్రీ. ఇంటర్నేషనల్ లా/ మారిటైమ్ లా పరిజ్ఞానం/ అనుభవం.
  వయసు: 21 - 30 ఏళ్లు (ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఇస్తారు).
- **వెబ్‌సైట్:** http://joinindiancoastguard.gov.in/



మహిళలకు అవకాశాలు, అర్హతలు..



ఇండియన్ నేవీ

నేవీలో (www.joinindiannavy.gov.in) 1992 జూలై నుంచి మహిళలను షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదాలో రిక్రూట్ చేసుకోవడం ప్రారంభమైంది. ఏటీసీ, అబ్జర్వర్, లా, లాజిస్టిక్స్, ఎడ్యుకేషన్, నేవల్ ఆర్కిటెక్చర్ విభాగాల్లో మహిళలకు నేవీ అవకాశం కల్పిస్తుంది. అయితే ఇటీవల ఎడ్యుకేషన్, లా, నేవల్ ఆర్కిటెక్చర్ విభాగాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదాను పూర్తి చేసుకున్న మహిళా అధికారుల సర్వీస్‌ను ప్రతిభ, ఖాళీల ఆధారంగా పర్మినెంట్ కమిషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. నేవీలో మహిళల నియామకం కోసం అనుసరిస్తున్న విధానాలు..

- **యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (యూఈఎస్):** ఈ విధానం ద్వారా నియమితులైన వారికి షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్ హోదా ఇస్తారు. అర్హత: 60 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (నేవల్ ఆర్కిటెక్చర్/ మెకానికల్/ సివిల్/ ఏరోనాటికల్/ మెటలర్జికల్/ ఏరోస్పేస్). **వయసు:** 19 - 25 ఏళ్లు
- **నేవల్ ఆర్కిటెక్చర్:** ఈ విధానం ద్వారా నియమితులైన వారికి నేవల్ ఆర్కిటెక్చర్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదా ఇస్తారు.
  అర్హత: 50 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్) లేదా ఎంఎస్సీ (ఫిజిక్స్/ మ్యాథ్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్). **వయసు:** 21 - 25 ఏళ్లు.
- **ఏటీసీ:** ఈ విధానం ద్వారా నియమితులైన వారికి నేవల్ ఆర్కిటెక్చర్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదా ఇస్తారు.
  అర్హత: 60 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (ఏదైనా బ్రాంచ్), 12వ తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. **వయసు:** 19 - 25 ఏళ్లు.
- **అబ్జర్వర్:** ఈ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదా ఇస్తారు. అర్హత: 55 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ (ఏదైనా బ్రాంచ్), 12వ తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి. **వయసు:** 19-24 ఏళ్లు.
- **లాజిస్టిక్స్:** అర్హత: బీఈ/ బీటెక్ (ఏదైనా బ్రాంచ్) లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏ/ బీఎస్సీ/ బీకామ్ / బీఎస్సీ (ఐటీ)తో పాటు పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా (మెటీరియల్ మేనేజ్‌మెంట్/ ఫైనాన్స్ / లాజిస్టిక్స్/ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్).
  వయసు: 19 - 25 ఏళ్లు.
- **ఎడ్యుకేషన్:** షార్ట్ ఈ విభాగంలో సర్వీస్ కమిషన్డ్ హోదా ఇస్తారు.
- **అర్హత:** బీఈ/ బీటెక్/ ఎంటెక్ (ఐటీ/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ టెలి కమ్యూనికేషన్) లేదా ఎంఎస్సీ (మ్యాథ్స్, బీఎస్సీలో ఫిజిక్స్ చదివి ఉండాలి) ఎంఎస్సీ (ఫిజిక్స్, బీఎస్సీలో మ్యాథ్స్ చదివి ఉండాలి)/ ఎంఎస్సీ (ఆపరేషనల్ రీసెర్చ్)/ ఎంఎస్సీ (అనాలిసిస్) లేదా ఎంసీఏ (గ్రాడ్యుయేషన్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి) లేదా ఎంఏ (ఇంగ్లీష్/ హిస్టరీ). **వయసు:** 21 - 25 ఏళ్లు.
- **పైలట్ జనరల్:** అర్హత: బీఈ/ బీటెక్ (ఏదైనా బ్రాంచ్), 12వ తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. **వయసు:** 19 - 24 ఏళ్లు.
- **పైలట్ సీపీఎల్:** అర్హత - డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జారీ చేసిన కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉండాలి. **వయసు:** 19 - 25 ఏళ్లు.
- **కేటరింగ్:** ఈ విభాగంలో ఎంఎస్సీ (హోటల్ మేనేజ్‌మెంట్)/ ఎంబీఏ (హోటల్ మేనేజ్‌మెంట్)/ బీఎస్సీ/ బీఏ/ పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా (హోటల్ మేనేజ్‌మెంట్) అభ్యర్థులకు అవకాశం ఉంటుంది.

సీడీఎస్ఈ: యూపీఎస్సీ ఏటా రెండు సార్లు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. ఈ పరీక్ష ద్వారా ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలలో ఖాళీలను భర్తీ చేస్తారు. వీటిల్లో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్) విభాగంలో మహిళలకు ప్రవేశం కల్పిస్తారు. సీడీఎస్ఈ పరీక్షకు కేటాయించిన మార్కులు 200. ఇందులో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి.. ఇంగ్లీష్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), జనరల్ నాలెడ్జ్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు). నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రతి తప్పునకు 0.33 మార్కు కోత విధిస్తారు.

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌సీఏటీ): ఈ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా మహిళలు ఎయిర్ ఫోర్స్‌లో ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. ఏఎఫ్‌సీఏటీ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉంటుంది.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

అర్హత: గ్రాడ్యుయేషన్ (12వ తరగతిలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి)

- **గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) బ్రాంచ్:** ఏదైనా డిగ్రీ / పీజీ. **వయసు:** 20 - 26 ఏళ్లు.
- **అడ్మినిస్ట్రేషన్ బ్రాంచ్:** అర్హత - 60 శాతం మార్కులతో ఏదైనా గ్రాడ్యుయేషన్.
- **అకౌంట్స్ బ్రాంచ్:** అర్హత - 60 శాతం మార్కులతో బీకామ్.
- **లాజిస్టిక్స్ బ్రాంచ్:** అర్హత - 60 శాతం మార్కులతో ఏదైనా గ్రాడ్యుయేషన్.
- **ఎడ్యుకేషన్ బ్రాంచ్: అర్హత-** 50 శాతం మార్కులతో ఎంఏ/ ఎంస్సీ (ఇంగ్లీష్/ ఫిజిక్స్/ మ్యాథ్స్/ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్/ ఇంటర్నేషనల్ రిలేషన్/ ఇంటర్నేషనల్ స్టడీస్/ డిఫెన్స్ స్టడీస్/ సైకాలజీ/ కంప్యూటర్ సైన్స్/ ఐటీ/ మేనేజ్‌మెంట్)/ ఎంబీఏ/ ఎంసీఏ/ మాస్ కమ్యూనికేషన్/ జర్నలిజం/ పబ్లిక్ రిలేషన్స్‌తోపాటు డిగ్రీలో 60 శాతం మార్కులు.
- **మెటియరాలజీ:** 50 శాతం మార్కులతో పీజీ (సైన్స్ / మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జాగ్రఫీ/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ అప్లయిడ్ ఫిజిక్స్/ ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్/ జియో ఫిజిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ బయాలజీతోపాటు 55 శాతం మార్కులతో డిగ్రీలో (మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి).
- **వెబ్‌సైట్:** http://careerairforce.nic.in/



ఇండియన్ ఆర్మీ

- **శిక్షణ:** ఎంపికైన వారికి చెన్నైలోని ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీలో 49 వారాలపాటు శిక్షణనిస్తారు. శిక్షణ సమయంలో వీరిని లేడీ క్యాడెట్లుగా వ్యవహరిస్తారు. శిక్షణ తర్వాత లెఫ్టినెంట్ (షార్ట్ సర్వీస్ కమిషన్) ర్యాంక్ ఇస్తారు. ప్రీ కమిషనింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ 'పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' డిగ్రీని ప్రదానం చేస్తుంది.
  కెరీర్: షార్ట్ సర్వీస్ కమిషన్డ్ హోదాలో 14 ఏళ్లపాటు విధులు నిర్వహించాలి. లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతంది. తరవాత కెప్టెన్ (రెండేళ్ల సర్వీస్ పూర్తి), మేజర్ (ఆరేళ్ల సర్వీస్ పూర్తి), లెఫ్టినెంట్ కల్నల్ (13 ఏళ్ల సర్వీస్ పూర్తి) వరకు ప్రమోషన్లు పొందవచ్చు.
  అర్హత: అవివాహితులు / విడాకులు / వైధవ్యం పొంది తిరిగి పెళ్లి చేసుకోని మహిళలు, డిగ్రీ/ తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
  వయసు: 18 - 24 ఏళ్లు.
- **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆర్మీలో ప్రవేశం కల్పిస్తారు. పాఠశాల/ కాలేజీల్లో ఎన్‌సీసీలో ఎన్‌రోల్ అయి ఉండాలి.
  అర్హత: 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్.
  వయసు: 19 - 25 ఏళ్లు.
- **జాగ్ ఎంట్రీ:** లా గ్రాడ్యుయేట్లకు మాత్రమే ఈ విధానంలో ప్రవేశం కల్పిస్తారు.
  అర్హత: ఎల్ఎల్‌బీ. **వయసు:** 21 - 27 ఏళ్లు
- **వెబ్‌సైట్:** http://joinindianarmy.nic.in/



జాబ్ కార్నర్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) ఆధ్వర్యంలోని రిఫైనరీస్ డివిజన్ - జూనియర్ ఇంజనీర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- ఖాళీలు: **29**
- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రొడక్షన్-20, ఎలక్ట్రికల్-1, మెకానికల్-7, ఇన్‌స్ట్రుమెంటేషన్-1
- అర్హత: సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసి ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10, 2018.
- వెబ్‌సైట్: www.iocl.com

ప్రొఫెసర్లు

భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటిటిటిఆర్)- పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **25**
- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రొఫెసర్స్ (ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 1, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ 2, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్స్ 1, మెకానికల్ 1), అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 2, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ 4, కంప్యూటర్ ఇంజనీరింగ్ 2, మెకానికల్ 2), రీసెర్చ్ ఫెలోస్ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 2, సివిల్ అండ్ ఎన్విరా న్‌మెంటల్ 4, కంప్యూటర్ ఇంజనీరింగ్ 2, మెకానికల్ 2)
- **వయసు:** ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏళ్లు మించరాదు. మిగిలిన పోస్టులకు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.nitttrbpl.ac.in

అసమానతల నివారణ దిశగా...

పోటీ పరీక్షల ప్రత్యేకం ఎకానమీ

ప్రాంతీయ అసమానతల గురించి మొదటి పంచవర్ష ప్రణాళికలో చర్చించలేదు. కానీ రెండో పంచవర్ష ప్రణాళిక నుంచి కొన్ని పటిష్ఠ చర్యలు తీసుకోవడం ప్రారంభమైంది. తరవాతి ప్రణాళికల్లో కూడా ఈ అంశానికి ప్రాధాన్యం లభించింది.

ఆరో పంచవర్ష ప్రణాళిక (1980 - 85)

వనరుల పునఃపంపిణీ, ప్రత్యేక పథకాలు, నిరోధకాల అమలుతో వెనుకబడినతనం, ఆర్థిక అసమానతలు తగ్గవని, అభివృద్ధి నిరోధకాలను ఒక క్రమ పద్ధతిలో తొలగించడానికి కృషి చేయాలని, వనరులను అభిలషణీయంగా ఉపయోగించాలని పేర్కొంది.

ఏడో పంచవర్ష ప్రణాళిక (1985 - 90)

మానవ వనరులు, వ్యవసాయ ఉత్పాదకత అనేవి ఒక ప్రాంతం ఆర్థిక స్థాయిని నిర్ణయిస్తాయని, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం ఈ రెండింటి మీద ఆధార పడి ఉంటుందని ఏడో ప్రణాళిక పేర్కొంది. వీటికి అనుబంధంగా కరవు (Drought), ఎడారి, పర్వత, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలతో తగిన వ్యవసాయ వ్యూహాన్ని రూపొందించి ఉత్పాదకత, తలసరి ఆదాయాలను పెంచవచ్చని పేర్కొంది. విద్య, ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు, నిరక్షరాస్యతను రూపుమాపడం, రోడ్లు, గ్రామీణ విద్యుదీకరణ వంటి అంశాలపై ప్రత్యేక కృషి చేయడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తగ్గించడం సాధ్యమవుతుందని ఈ ప్రణాళిక పేర్కొంది.



ఎనిమిదో ప్రణాళిక (1992 - 97)

భారత రాష్ట్రాలన్నింటిలో ప్రాంతీయ అసమానతలు ఉన్నాయని, 1980 దశాబ్దంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ప్రాంతీయ అసమానతలు తగ్గుముఖం పట్టినట్లు కనిపించినప్పటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయని ఈ ప్రణాళిక పేర్కొంది. వెనకబడిన ప్రాంతాల్లో పథకాల అమలును పటిష్ఠం చేయడం ద్వారా అభివృద్ధి సమస్యను సమర్థవంతంగా పరిష్కరించి పునః పంపిణీ న్యాయాన్ని సాధించవచ్చని పేర్కొంది.

తొమ్మిదో ప్రణాళిక (1997 - 2002)

దేశ సమైక్యతకు సంతులన ప్రాంతీయాభివృద్ధి అత్యంత అవసరమని, ఆర్థికాభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా అందించేందుకు, ప్రాంతీయ అసమానతల నివారణకు కృషి తప్పనిసరని ఈ ప్రణాళిక పేర్కొంది.

ప్రాంతీయ అసమానతలు తగ్గుదల

- 2009 - 12 మధ్యలో దేశీయాభివృద్ధి రేటు 7.7 శాతంగా ఉంది.
- ఉత్తరాఖండ్, బీహార్ రాష్ట్రాలు 12.5 శాతం, మధ్యప్రదేశ్ 9.9 శాతం, జార్ఖండ్ 7.3 శాతం, ఉత్తరప్రదేశ్ 6.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకున్నాయి.
- ఉత్తరాఖండ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల వృద్ధి రేటు మహారాష్ట్ర (9.7 శాతం), హర్యానా (9.6 శాతం) కంటే ఎక్కువగా నమోదైంది.
- పేదరిక నిర్మూలన రేటు 0.7 శాతం నుంచి 2007 - 09 మధ్యలో 1.5 శాతానికి పెరిగి పేదల సంఖ్య 52 మిలియన్లు తగ్గింది. సగటు అక్షరాస్యత 9.7 శాతం పెరిగితే బీహార్‌లో 16.8 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 11.5 శాతం, ఒరిస్సాలో 10.4 శాతం పెరిగింది. మహిళల్లో అక్షరాస్యత 14 నుంచి 20 శాతానికి పెరిగింది.

పదో ప్రణాళిక (2002- 07)

వెనకబడిన ప్రాంతాలతోపాటు, అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాల అభివృద్ధికి కొన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. మూలధన పెట్టుబడులను గరిష్ఠం చేయడం, కేంద్ర రాష్ట్ర వనరుల్లో ఎక్కువ భాగాన్ని తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలకు కేటాయించి అవస్థాపనా లోటును పూరించాలని తెలిపింది.

పదకొండో ప్రణాళిక

ప్రాంతీయ అసమానతలను తగ్గించడం ఒక లక్ష్యం మాత్రమే కాదు... దేశ ఆర్థిక, సాంఘిక సంక్షేమానికి అత్యవసరమని ఈ ప్రణాళిక పేర్కొంది. ఈ ప్రణాళికలో పేదరికపు రేఖ దిగువ కుటుంబాలకు, బడుగు వర్గాల ప్రజల కోసం ప్రధానమంత్రి గ్రామ స్వరాజ్ యోజన పథకాన్ని ప్రారంభించారు. ఇందిరా ఆవాజ్ యోజన పథకాల నిధుల్లో 7.5 శాతం గృహ వసతికి, 25 శాతం పేదరికం నిర్మూలనకు కేటాయిం చారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను అల్పస్థాయి ఆరోగ్య కొలమానాల అవస్థాపన గల 18 రాష్ట్రాల్లో అమలు చేశారు. సర్వశిక్షా అభియాన్ నిధుల్లో 50 శాతం వెనుకబడిన రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఒరిస్సాలకు కేటాయించారు. 2003-04లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ సమ వికాస్ యోజన పథకాన్ని అల్ప వ్యవసాయ ఉత్పాదకత, అవస్థాపన ఉద్యోగిత గల 137 వెనుకబడిన జిల్లాలకు వర్తింపజేయడానికి మొత్తం రూ.4,765 కోట్లు (జిల్లాకు రూ.45 కోట్లు) బదిలీ చేశారు.

- లక్ష్మీజ్యోతి ఆర్. అల్లె

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
7
మంగళవారం • 23 జనవరి 2018

సెలబ్రిటిప్స్




స్టయిలిష్ లుక్‌తో పోజు ఇచ్చిన ఈవిడని గుర్తు పట్టారా! ఈమె బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్ భార్య గౌరీ ఖాన్. కొంతకాలం క్రితం వరకు ఆమెకు స్టార్ వైఫ్‌గానే గుర్తింపు ఉండేది. కానీ ఇప్పుడు ప్రముఖ డిజైనర్‌గా పేరు తెచ్చుకున్నారామె. "సృజనాత్మకంగా చేసే పని ఏదైనా నాకెంతో ఇష్టం. ఒక్క మాటలో చెప్పాలంటే డిజైన్ అనేది నా డిఎన్ఎలోనే ఉంది. నేను మన్నత్‌ను రీడిజైన్ చేశాక చూసేందుకు సుసాన్నె(ఖాన్) ఒకసారి మన్నత్‌కు వచ్చింది. అప్పుడే ఆమె తన సొంతంగా డిజైన్ వర్క్ చేయడం ప్రారంభించింది. తను చేసే కొన్ని ప్రాజెక్టుల్లో నన్ను భాగస్వామిని కమ్మని అప్పుడు అడిగింది. అలా అప్పట్నించీ డిజైనర్‌గా నా జర్నీ మొదలైంది" అంటున్న ఆమె పర్ఫెక్ట్ పార్టీ ఇవ్వాలంటే ముఖ్యంగా దృష్టిలో పెట్టుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి అని చెప్తున్నారు. అవేంటంటే...

* పెద్ద పార్టీ ఏర్పాటు చేయాలంటే కనీసం మూడు వారాల ముందు నుంచి ప్లాన్ చేసుకోవాలి.
* అతిథులను ఎవరెవరిని పిలవాలనే జాబితా తయారుచేయాలి. వాళ్లకి ఆహ్వానాలు పంపించాలి. అంతేకానీ సరైన జాబితా తయారుచేసుకోకుండా పిలిచి గందరగోళానికి గురి కావద్దు.
* ఒక థీంను అనుకుని... దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలి.
* సరిపడా ఆహారం, పానీయాలు ఏర్పాటుచేయాలి. అతిథులు ఎటువంటి పదార్థాలను, పానీయాలను ఇష్టపడతారో గమనించాలి... వారి అభిరుచులకు తగ్గ ఏర్పాట్లుచేయాలి.
* అందమైన పువ్వులు అమర్చాలి. మంద్రమైన మ్యూజిక్ ఏర్పాటుచేయాలి. కళ్లు మిరుమిట్లు కొట్టేలా కాకుండా కంటిని డిస్టర్బ్ చేయకుండా ఉండే లైట్లు అమర్చాలి.
* ఈ ఏర్పాట్లన్నింటితో పాటు మీరూ ఉత్సాహంగా, ఆహ్లాదంగా ఎటువంటి ఒత్తిడులు లేకుండా ఉండాలి. ఎందుకంటే మీ మూడ్‌ను బట్టే పార్టీ ముందుకు వెళ్తుంది కాబట్టి.

కృషి

ప్రవహించే నది ఆమె...



యాక్టివిస్టుల కేటగిరీలో బహూకరించే ప్రతిష్ఠాత్మకమైన 'వసుంధర' అవార్డు ఈ ఏడాది పరిణీతా దండేకర్‌కు వచ్చింది. నదుల నిర్వహణ, పునరుద్ధరణ, నదుల పరిరక్షణ రంగాల్లో ఆమె చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. చిన్నతనం నుంచీ నదులంటే పరిణీతకు ఎంతో ఇష్టం. ఆ ఇష్టం తండ్రి నుంచి సంక్రమించిన 'అపురూపమైన ఆస్తి' అంటారామె. ఈ నదుల పరిరక్షణ ఉద్యమకారిణి గురించి కొన్ని విశేషాలు...

కొందరి గురించి చెప్పాలంటే నదీ ప్రవాహంలా వారు చేస్తున్న పనుల గురించి చెప్పాల్సి వస్తుంది. ఆ కోవలోకి వస్తారు పరిణీతా దండేకర్. ఆమె ప్రస్తుతం 'సౌత్ 'ఏసియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్ అండ్ పీపుల్' స్వచ్ఛంద సంస్థకు అసోసియేట్ కో-ఆర్డినేటర్. పరిణీత విద్యార్హతల జాబితా చాలా పెద్దదే. 'ఇంటిగ్రేటెడ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్'లో డిప్లొమా చేశారు. 'ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్'లో పట్టా తీసుకోవడమేగాక పలు ఫెలోషిప్‌లు చేశారు. వాటిల్లో ప్రతిష్ఠాత్మకమైన 'జోక్ వాలర్ హంటర్ ఎన్విరాన్‌మెంటల్ లీడర్‌షిప్ ఫెలోషిప్' ఒకటి. 'ఏసియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్ అండ్ పీపుల్' స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్‌గా నదులు, నీటివనరులు, జీవావరణం, పర్యావరణం వంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనాలు చేపట్టారు. నదుల ఉనికి, నదీతీరాల్లో నివసించే కమ్యూనిటీ ప్రజల కోసం, పర్యావరణం పరిరక్షణ కోసం ఉద్యమస్ఫూర్తితో పనిచేస్తున్నారు. కమ్యూనిటీల నాయకత్వంలో నీటి నిర్వహణ వల్ల ఒనగూడే లాభాలు ఎన్నో ఉన్నాయని పెద్ద ఎత్తున ప్రజల్లో ప్రచారం చేశారామె. రాష్ట్రంలోను, జాతీయస్థాయిలోను జలవనరుల నిర్వహణ, నదుల నిర్వహణ, పునరుద్ధరణ ప్రయోజనాలపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.

పిన్నవయసులోనే నదులన్నా, పర్యావరణం, జీవావరణలన్నా పరిణీతకు విపరీతమైన ఇష్టం. అదెలా సాధ్యమైంది అని అడిగితే ' మా నాన్నకు నదులంటే చాలా ఇష్టం.. మరెంతో ప్రేమ కూడా! ఆ లక్షణాలు ఆయన నుంచే నాకు అలవడ్డాయి. వయసు పెరిగే కొద్దీ నదులపై వల్లమాలిన ప్రేమ పెరుగుతూ వచ్చిందే కానీ తరగలేదు. అందుకే అంటుంటాను మా నాన్న నాకిచ్చిన అపురూపమైన ఆస్తి ఇదని! అలా చిన్నతనంలోనే నదుల పరిరక్షణపై పనిచేయాలనుకున్నాను' అని అంటారామె. పరిణీతకు పర్యావరణం, నీరు, జీవావరణం, కమ్యూనిటీ అంశాలతో పాటు సమాన నీటి నిర్వహణ రంగమంటే కూడా ఎంతో ఇష్టం. విస్తృత అధ్యయనాల ద్వారా నదులు, జలవనరుల నిర్వహణపై ఎన్నో సృజనాత్మకమైన ఆలోచనలను, ప్రణాళికలను పరిణీత సూచించారు. ' నా దృష్టిలో ప్రతి నదీ ఆ ప్రాంత జీవ రేఖ' అంటారామె. జెడబ్ల్యు హెచ్ గ్రాంటుతో పరిణీత 'శాస్త్రి' నదిపై, స్థానిక కమ్యూనిటీల గురించి లోతైన పరిశోధన చేశారు. ముఖ్యంగా గలగల పారే 'శాస్త్రి' నదిని ఆవరించి ఉన్న జీవావరణం, నీటి శక్తి గురించిన మూలాలపై సునిశితమైన అధ్యయనం



చేశారు. ఈ పరిశోధన 'పర్యావరణ మంత్రిత్వ శాఖ'కుసైతం ఎంతో ఉపయోగపడుతోంది. దాంతో దీర్ఘకాలిక జీవావరణ క్రమంపై పరిశోధన చేపట్టాల్సిందిగా ప్రభుత్వం నుంచి పరిణీతకు పిలుపు వచ్చింది. నదులు, ఆ ప్రాంత కమ్యూనిటీల పరిరక్షణే ధ్యేయంగా భవిష్యత్తులో తన కృషి కొనసాగుతుందని పరిణీత వెల్లడించారు.

పరిణీత ఏమంటున్నారంటే...

❖ ప్రపంచంలో ఆనకట్టలు నిర్మిస్తున్న దేశాల్లో భారత్ మూడవ అతిపెద్ద దేశం. మనదేశంలో ఎక్కువ డ్యాములు మహారాష్ట్రలోనే ఉన్నాయి. పుణేలో వీటి సంఖ్య చాలా ఎక్కువే. కానీ ఆశ్చర్యం ఏమిటంటే అక్కడ నీటి కొరత ఎక్కువ! ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే మహారాష్ట్రలో డ్యామ్ కింద సాగులో ఉన్న భూమి చాలా తక్కువ! ఈ పరిస్థితికి కారణం డ్యాముల నిర్మాణంపై సరైన అంచనా లోపించడమే.

❖ మనదేశంలో భూగర్భ జలాల నిర్వహణ సక్రమంగా లేదు. ఇది ఆందోళన కలిగించే విషయం. మహారాష్ట్ర ప్రభుత్వం భూగర్భజలాల చట్టం తీసుకువచ్చింది కానీ దాని అమలు శూన్యం. ఫలితంగా ఇంకిపోతున్న భూగర్భజలాలపై అవగాహన ఉండడం లేదు. దీంతో సమస్య మరింత తీవ్రతరం అవుతోంది. భూగర్భజలాలను సూచించే మ్యాపులు కూడా లేవు. భూగర్భ జలాల వినియోగం ఎలా జరుగుతోందన్న దానిపై నిర్దిష్టమైన వ్యవస్థ కూడా లేదు. భూగర్భజలాలు సక్రమంగా వినియోగం కావాలంటే ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలి.

❖ నది మౌలిక గుణం ప్రవహించడం. అందుకే నదులు ప్రవహించడం కోసం ఇజ్రాయిల్, అమెరికా వంటి దేశాలు ఎంతో కృషి చేస్తున్నాయి. నదులకు సంబంధించి చాలా దేశాలు 'ఫ్రీ ఫ్లోయింగ్ రివర్ పాలసీ'ని అనుసరిస్తున్నాయి. మనదేశంలో కూడా నదులు అన్నింటినీ పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

❖ భారతదేశంలో నదుల పునరుద్ధరణకు సంబంధించి ప్రత్యేక శాఖ అంటూ ఏమీ లేదు. నాలుగేళ్లలో గంగా నదిపై 16 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చుపెట్టింది. కాని సాధించింది శూన్యమనే చెప్పాలి. ప్రభుత్వాలు పారదర్శకతతో వ్యవహరించకపోవడం వల్ల నదుల పునరుద్ధరణ వ్యవస్థ అమలు అసాధ్యమవుతోంది.



ఇరవైల్లో ఉన్నప్పుడు థైరాయిడ్ వల్ల తలెత్తిన ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవడానికి ఆమె 'నడక'ను ఆశ్రయించారు. ఆరోగ్యం చక్కబడింది... కానీ నడక మాత్రం నేటికీ కొనసాగుతోంది. కొత్త లక్ష్యాల దిశగా పురోగమిస్తోంది. ఒకవైపు కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూ... మరోవైపు తన సంకల్ప బలంతో వయసును జయించారు వరంగల్ మహిళ గండ్ర జ్యోతి. 45 ఏళ్ళ వయసులో 'మారథాన్'లో అడుగుపెట్టి, జాతీయ స్థాయిలో ఆమె రాణిస్తున్నారు. ఆ ప్రస్థానం గురించి ఆమె మాటల్లోనే ...

మారథాన్ జ్యోతి

స్ఫూర్తి

హఠాత్తుగా పెరిగిపోతున్న బరువు... కుదురుగా లేని ఆరోగ్యం. ఏం చెయ్యాలో దిక్కుతోచని పరిస్థితి. అప్పుడు నా వయసు సుమారు ఇరవై రెండేళ్ళు. తల్లిని అయ్యాక వైద్య పరీక్షల్లో నాకు థైరాయిడ్ సమస్య ఉందని తేలింది. 'కేవలం మందులు వాడితే సరిపోదు. వ్యాయామం చెయ్యాలి. అది చాలా ముఖ్యం' అని డాక్టర్లు చెప్పారు.

ఇది దాదాపు పాతికేళ్ళ కిందటి మాట... వరంగల్ లాంటి ప్రాంతంలో ఒక మహిళ బయటికి వచ్చి వ్యాయామం చెయ్యడం ఆ రోజుల్లో సాహసమేనని చెప్పాలి. కానీ నా ఆరోగ్య సమస్యను ఎలాగైనా అధిగమించాలన్న పట్టుదల, సాధిస్తానన్న ఆత్మవిశ్వాసం ముందుకు వెళ్ళేలా చేశాయి.

'పీటీ ఉష' అని కామెంట్స్ చేసేవాళ్ళు!

ప్రతిరోజూ హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో వాకింగ్ వెళ్ళడం మొదలుపెట్టాను. అప్పట్లో పార్కుకు వచ్చే మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. మొదట కొన్ని రోజులు ఇబ్బంది పడ్డాను. ఆ తర్వాత అలవాటయింది. వేగంగా నడవడం మొదలు పెడితే .. వెనక నుంచి 'అబ్బో..... పీటీ ఉష!' అంటూ కామెంట్ చేసేవారు. అలాంటి వాటిని ఎప్పుడూ పట్టించుకోలేదు. నా పని నేను చేసుకుంటూ పోయాను. నా కృషికి ఫలితం లభించింది. క్రమంగా చాలా బరువు తగ్గాను. చురుకుదనం పెరిగింది. ఆ నడక ఇప్పటికీ కొనసాగుతోంది.

'ఎందుకొచ్చిన తిప్పలు!' అంటూ ఉంటారు!

నా భర్త గండ్ర వెంకటరమణారెడ్డి రాజకీయంగా చాలా బిజీ. ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ఎక్కువ సమయం ఆయనకు ప్రజలతో గడిచేది. నేను మొదటి నుంచి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్న అవగాహన ఉన్నదాన్ని. రోజు ఉదయం వాకింగ్ చేసేదాన్ని. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరయ్యేదాన్ని. ప్రతి రోజూ ఉదయం చాలా సేపు ప్రాక్టీస్ చేసి ఇంటికెళ్ళేసరికి చాలా అలసిపోయేదాన్ని.

ఆరోగ్యం కోసం... కొన్ని వదిలేయాలి!

సాధన చేస్తున్నప్పుడు మనకు తెలియకుండా మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదల పెరుగుతుంది. నాకు ఇష్టమైన మాంసాహారాన్ని 1997 నుంచి తీసుకోవడం లేదు. పెళ్ళిళ్ళకూ, ఇతర శుభకార్యాలకూ వెళ్ళినప్పుడు తినాలంటూ ఇబ్బంది పెడుతూ ఉంటారు. అయిదేళ్ళ నుంచీ అన్నం తినడం మానేశాను. చపాతీలు, కొర్రలు, రాగులు, కూరగాయల భోజనమే తీసుకుంటున్నా.

నా పరిస్థితి చూసి "ఎందుకీ కష్టం... ఇప్పుడు ఇదంతా అవసరమా?" అని నా భర్తతో సహా అందరూ అనేవారు. మరికొందరయితే "మోకాళ్ళ చిప్పలు అరుగుతాయి... కీళ్ళ నొప్పులు పెరుగుతాయి" అని భయపెట్టేవారు. "ఇంటి పట్టున ఉండక ఉదయం నాలుగు గంటలకు లేచి- ఎందుకు ఈ తలనొప్పులు" అని నా పిల్లలు, బంధువులు, స్నేహితులు ఇప్పటికీ అంటారు. "నేను ఈ పనిని ఎంతో ఇష్టంగా చేస్తున్నాను. ఇందులో నాకు ఎలాంటి కష్టం లేదు" అని వాళ్ళకు చెబుతూ ఉంటాను.

ఆ ఆలోచన 'కేబీఆర్'లో పుట్టింది...

హైదరాబాద్‌లో ఎక్కువ కాలం ఉండాల్సి రావడంతో ఇంటికి దగ్గరలోని కేబీఆర్ పార్కులో వాకింగ్ చేసేదాన్ని. అక్కడ చాలా మంది మారథాన్ రన్ కోసం శిక్షణ తీసుకునేవారు. నడకలో నా వేగం చూసి నా మిత్రులు నన్ను ప్రోత్సహించారు. కోచ్‌ల సహాయంతో మారథాన్‌లో ప్రవేశించాను. మంచి కోచ్‌లు లభించారు. ట్రెక్కింగ్, గుట్టలు ఎక్కడం, దిగడం లాంటి ఎంతో కఠినమైన శిక్షణ ఇచ్చారు. అప్పటి నుంచి మారథాన్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్తున్నాను.. హైదరాబాద్ పరిసరాలే కాదు. విశాఖపట్నం, బెంగళూరు, ఢిల్లీల్లో జరిగిన ఆఫ్ మారథాన్, ఫుల్ మారథాన్‌లలో పాల్గొన్నాను.

హైదరాబాద్‌లో జరిగే ప్రతి మారథాన్‌లో పాల్గొంటున్నాను. మొదట ఎందుకింత కష్టం అన్న వాళ్ళే నా పట్టుదల చూసి ప్రోత్సహించారు. అంతేకాదు... నా కొడుకు, కోడలు, అల్లుడు కూడా నాతో జత కలిశారు. అన్నిటికీ మించి భర్త ప్రోత్సాహం ఉండడం వల్లే మారథాన్‌లో రాణించ గలుగుతున్నాను. నెక్లెస్ రోడ్‌లో జరిగిన మారథాన్‌లో క్యాష్ ప్రైజ్ అందుకున్నా. 42 ప్లస్ (42 ఏళ్ళ వయసు పైబడినవారి) గ్రూప్‌లో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అల్ట్రా మారథాన్‌లో రెండవ స్థానం వచ్చింది. బెంగళూర్ కబ్బన్ పార్కులో జరిగిన 21 కే మారథాన్‌లో మెరుగైన స్థానం సాధించాను. ఇంకా అంతర్జాతీయ స్థాయిలో జరిగే ప్రతిష్ఠాత్మక మారథాన్‌లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నాను. అమెరికాలోని బోస్టన్‌లో జరిగే మారథాన్‌లో పాల్గొనాలన్నది మారథాన్ రన్నర్లందరికీ ఓ కల. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ముఖ్యమైన మారథాన్ ఈవెంట్లు న్యూయార్క్, బెర్లిన్, లండన్, టోక్యోలలో జరుగుతాయి. వీటన్నిటిని మించిన పేరు బోస్టన్ మారథాన్‌కు ఉంది. అందులో పాల్గొనడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నాను.

వరంగల్‌లో 'కాకతీయ మారథాన్'

ఇప్పటికీ మహిళలకు తమ ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలన్న అవగాహన లేదు. హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో కొంతమంది మహిళలే వ్యాయామం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. సౌకర్యాలు లేకపోవడం, ఒక విధమైన అనాసక్తి కారణంగా మహిళలు ముందుకు రావడం లేదు. మనం వ్యాయామాలు చేసి అంతర్జాతీయ పోటీలకు వెళ్ళాల్సిన అవసరం లేదు. ఆరోగ్య రక్షణ కోసం తప్పనిసరిగా వ్యాయామం అవసరం అని నా అభిప్రాయం. వరంగల్‌లాంటి నగరంలో కాకతీయ మారథాన్ పేరుతో ఈవెంట్ నిర్వహించాలని ఉంది. అన్ని అనుకూలిస్తే త్వరలోనే జరిపిస్తాం.

● **చిలుముల్ల సుధాకర్,** వరంగల్,
ఫోటోలు: వీరగోని హరీష్, దాసరి శ్రీనివాసులు



వింటర్ కేర్



● వెన్న, ఆలివ్ నూనె, కొబ్బరి నూనె, పాలు, తేనె వంటివి సహజ మాయిశ్చరైజర్లుగా పనిచేస్తాయి. రసాయనాలతో కూడిన మాయిశ్చరైజర్‌లకు బదులుగా వీటిని వాడితే చలికాలంలో చర్మం సహజత్వాన్ని కోల్పోదు.


● ముఖం మీద జిడ్డు పోవడానికి స్క్రబ్బింగ్ చేస్తారు. కానీ చలికాలంలో మాత్రం బయట దొరికే స్క్రబ్బర్స్‌ను వాడటం మంచిది కాదు. అరటిపండు గుజ్జులో రెండు టేబుల్‌స్పూన్ల తేనె, ఓట్స్ కలిపి ముఖానికి రాసుకోవాలి. లేదా అయిదు చుక్కల ఆలివ్ నూనెలో రెండు టేబుల్‌స్పూన్ల పంచదార కలిపి వాడటం మంచిది.

పేరెంటచ్

పోటీతో పిల్లల పరేషానీ

పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు పోటీ నైజాన్ని ప్రదర్శిస్తుంటారు. ఇది మంచిది కాదు. పిల్లల ఆసక్తులను తెలుసుకుని దానికి అనుగుణంగా వారిని చదివిస్తే చదువును పిల్లలు ఎంజాయ్ చేయగలరు. 'బాగా మార్కులు తెచ్చుకోవాలి....' 'ఫలానా వాళ్ల అమ్మాయి కన్నా ఎక్కువ మార్కులు నీకే రావాలి' వంటి పోలికలు పిల్లల మీద తల్లిదండ్రులు రుద్దకూడదు. దీనివల్ల చిన్నారులలో మానసిక ఒత్తిడి పెరుగుతుంది. పక్కింటి వాళ్ల అబ్బాయి డాక్టరు అవుతుంటే తమ అబ్బాయి కూడా డాక్టరే అవ్వాలని పిల్లాడి మీద ఒత్తిడి పెడితే ఆ అబ్బాయికి చదువుపైనే ఆసక్తే పోయే ప్రమాదం ఉంటుంది.తల్లిదండ్రుల ధ్యాస ఎప్పుడూ తమ పిల్లలు బెస్ట్ ర్యాకింగ్ స్టూడెంట్స్‌గా నిలబడాలి.... నలుగురిలో పేరు తెచ్చుకోవాలని ఉంటోంది తప్ప తమ చిన్నారుల మనసుల్లోని ఇష్టాయిష్టాలను తెలుసుకోవాలనే ధ్యాస వారిలో ఉండటం లేదు.

పోటీపడాలి...తొలిస్థానంలో నిలవాలి... బాగా చదవాలి ఈ మూడింటి గూర్చి తప్ప పిల్లలతో అమ్మానాన్నలు మాట్లాడుతున్న విషయాలు ఏమీ ఉండడం లేదు. వారికి ఆటలు ఆడే సమయం కూడా ఇవ్వకుండా పొద్దున్న నుంచి చదువు...చదువు అంటూ క్లాసు పుస్తకాలను బడిలో, ఇంట్లో, ట్యూషన్లలో బట్టీ కొట్టిస్తున్నారు. ఈ రకమైన చదువులు పిల్లల్లోని సృజనాత్మకతను చంపేస్తాయని తల్లిదండ్రులు గ్రహించాలి. 'మార్కులు పిల్లల ప్రతిభకు నిదర్శనం అనుకోవడం పెద్ద తప్పు' అని విద్యా కౌన్సిలర్లు కూడా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. సమస్యలు, సవాళ్లు వచ్చినపుడు పిల్లలు ఎలా ఎదుర్కొంటున్నారన్న దానిపైనే పిల్లల అసలు శక్తిసామర్థ్యాలు వెల్లడవుతాయి. ఇటీవల ఒక టీవి షోలో చిన్నపిల్లాడు అడిగిన ప్రశ్న ఎంతోమంది అమ్మానాన్నలను ఆలోచింపచేసేదిగా ఉంది. 'ఎందుకు అమ్మలు పిల్లల చదువు విషయంలో అంత పోటీగా ఉంటారు' అని ఆ బాలుడు ప్రశ్నించాడు.



ఆ బాలుడి మాటలు చదువుల విషయంలో నేటి తల్లిదండ్రుల ఆలోచనా తీరును వెల్లడిస్తోంది. ఆరోగ్యకరమైన పోటీ ఉన్న ఇళ్లల్లో పిల్లల పెరుగుదల ఎంతో బ్రైట్‌గా ఉంటోంది. అలాంటప్పుడే పిల్లల్లోని సృజనాత్మక ఆలోచనా ధోరణి, వారిలో దాగున్న బలాబలాలు కూడా సహజంగా బయటపడతాయి.

చదివే వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటే కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సుకత కూడా పిల్లల్లో బాగా వృద్ధిచెందుతుంది. కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస చిన్నారుల్లో పెరుగుతుంది. తల్లిదండ్రులు ఆరోగ్యకరమైన పేరెంటింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి. పిల్లల ఎమోషనల్ హెల్త్ మీద కూడా దృష్టిసారించాలి. లెర్నింగ్ ప్రాసెస్‌ను పిల్లలు ఆస్వాదించేలా తయారుచేయాలి.

నవ్య డాక్టర్ · ఆంధ్రజ్యోతి
8 మంగళవారం ★ 23 జనవరి 2018 9

ఉమెన్స్ హెల్త్

ఎగసిపడే హార్మోన్లు



కడలి అలలు ఎగసి పడుతూనే ఉంటాయి! అలాగే, ఒంట్లోని హార్మోన్లు కూడా! అవి ఎక్కువైనా, తక్కువైనా... ఆరోగ్యం గల్లంతే! మరీ ముఖ్యంగా హార్మోన్లతో ముడిపడి ఉన్న మహిళల మానసిక ఆరోగ్యం మరీ క్లిష్టతరం! అసలెందుకీ ఒడుదొడుకులు? మానసిక అల్లకల్లోలాలు?

పురుషులతో పోలిస్తే మహిళల్లోనే హార్మోన్ల అవకతవకలు ఎక్కువ. నెలసరి మొదలుకుని గర్భం దాల్చటం, ప్రసవం, మెనోపాజ్...ఇలా మహిళల జీవితంలోని పలు దశల్లో హార్మోన్లు తరుగుతూ పెరుగుతూ ఉంటాయి. ఆ ప్రభావం ఫలితం వారి మనసు మీద పడుతుంది. మరీ ముఖ్యంగా థైరాయిడ్, ఈస్ట్రోజెన్ హార్మోన్ల స్రావాల్లో హెచ్చుతగ్గులు మహిళల శరీరం, మనసు రెండింటి మీద విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తాయి.

థైరాయిడ్

హైపో, హైపర్ థైరాయిడిజం

గొంతు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఉండే థైరాయిడ్ గ్రంథి ఎంతో కీలకం. ఈ గ్రంథి నుంచి విడుదలయ్యే హార్మోనే శరీరంలోని మిగతా గ్రంథులన్నీ సక్రమంగా పనిచేసేందుకు సహాయపడుతుంది. ఇంత కీలకమైన థైరాయిడ్ గ్రంథి తగినంత స్రావాన్ని విడుదల చేయకపోయినా, అవసరానికి మించి స్రవించినా ఆరోగ్య సమస్యలు తప్పవు. థైరాయిడ్ స్రావం తగ్గితే హైపో థైరాయిడ్! పెరిగితే హైపర్ థైరాయిడ్! ఈ రెండు సమస్యల లక్షణాలూ భిన్నంగా ఉంటాయి. అవేంటంటే...

హైపో థైరాయిడ్: అలసట, బద్ధకం, శరీర బరువు పెరగటం, మెటబాలిజం తగ్గటం (క్యాలరీలను ఖర్చు చేసే వేగం మందగించటం), చర్మం పొడిబారటం, చిరాకు, అసహనం, అతి నిద్ర.

హైపర్ థైరాయిడ్: ఆందోళన, కంగారు, ప్యానిక్ ఎటాక్స్, శరీర బరువు తగ్గటం, మెటబాలిజం పెరగటం, ఆకలి పెరగటం, నిద్ర లేమి.

సమస్య మనసులో లేదు!

ఈ రెండు సమస్యలు మహిళల మనసు మీద పరోక్షంగా ప్రభావం చూపిస్తాయి. హైపో థైరాయిడ్‌లో ఉండే బద్ధకం, అలసటల వల్ల మొదలుపెట్టిన ఏ పనీ పూర్తి చేయలేకపోవటం, ఏ పనికీ పూనుకోకపోవటం, ఎక్కువగా నిద్రపోవటం చేస్తూ ఉంటారు. ఓ పక్క హైపో థైరాయిడ్ వల్ల వచ్చిన బద్ధకం, మరోపక్క తగ్గిన మెటబాలిజం...ఈ రెండు కారణాల వల్ల శరీర బరువు పెరిగిపోయి రూపంలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. దీనికితోడు, 'ఏంటిలా తయారయ్యావు? ఏ ఒక్క పనీ సక్రమంగా పూర్తి చేయలేవా?' అంటూ ఎదుటివాళ్లు చేసే కామెంట్లతో వీళ్ల ఆత్మవిశ్వాసమూ దెబ్బతింటుంది. ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ మొదలవుతుంది. వాటి ప్రభావం మనసు మీద పడి డిప్రెషన్‌కు లోనవుతారు. ఒంటరితనాన్ని కోరుకుంటూ తమ సమస్యను భూతద్దంలో నుంచి చూస్తూ మరింతగా నిరాశలో కూరుకుపోతారు. హైపర్ థైరాయిడ్ ఉన్న మహిళలదీ ఇదే పరిస్థితి. ప్రతి పనినీ త్వరత్వరగా ముగించేయటం, ఆత్రుత, కంగారు పడిపోవటం, ఆ కంగారులో ఎంత తేలికైన పనినైనా పాడు చేసేయటం, పని పాడైందని మరింతగా కంగారు పడిపోవటం...ఈ లక్షణాల వల్ల ఇతరుల విమర్శలను ఎదుర్కొంటారు.

హైపర్ థైరాయిడ్ వల్ల.....మెటబాలిజం పెరిగి బరువు తగ్గటంతో రూపంలో ఆకర్షణ లోపిస్తుంది. దాంతో తమ రూపం గురించిన బెంగ వీళ్లలో మొదలవుతుంది. వీటన్నిటి ప్రభావం మనసు మీద పడుతుంది. ఫలితంగా ప్యానిక్ అటాక్స్ (అకారణంగా భయానికి లోనవటం), డిప్రెషన్ మొదలైన సమస్యలు వీళ్లని వేధిస్తాయి.

చిటికెలో చికిత్స

హైపో, హైపర్...ఈ రెండు సమస్యలనూ లక్షణాల ఆధారంగా గుర్తించిన వెంటనే వైద్యుల్ని కలిస్తే చికిత్స సులువవుతుంది. హైపో థైరాయిడ్‌లో తగ్గిన థైరాయిడ్ స్రావాన్ని నోటి మాత్రల ద్వారా భర్తీ చేయొచ్చు. హైపర్ థైరాయిడ్‌లో ఆ సమస్య తలెత్తటానికి కారణాన్ని కనిపెట్టి, దాని ఆధారంగా చికిత్స తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుంది.

ఈస్ట్రోజెన్

నెలసరి నలత


నెలసరి ముందు, మధ్యలో, తర్వాత....మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్రావం హెచ్చుతగ్గులకు లోనవుతుంది. ఆ ప్రభావం మనసు మీద పడుతుంది. దాంతో చిరాకు, విసుగు, కోపం లాంటి లక్షణాలు కనిపించటం సహజం. కొందరిలో 'ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్' ఉండొచ్చు. ఈ సమస్య 20 నుంచి 30 ఏళ్ల మహిళల్లో ప్రతి నలుగురిలో ముగ్గురికి ఉంటుంది. ఈ సమస్యకు క్రమం తప్పకుండా వ్యాయామం లేదా ధ్యానం చేయటం, మాత్రల రూపంలోని ఎసెన్షియల్ ఆయిల్స్ వాడటం మంచి పరిష్కారం.

గర్భం దాల్చినప్పుడు....

గర్భం దాల్చకపోయినా, దాల్చినా డిప్రెషన్ అంతే సమానంగా కనిపిస్తుంది. ఇందుకు ఎన్నో కారణాలుం టాయి. అవేంటంటే...

- అతి చిన్న వయసులోనే గర్భం దాల్చటం
- ఒంటరిగా ఉండవలసి రావటం
- కుటుంబం అండ లేకపోవటం
- కుటుంబ కలహాలు
- గర్భం దాల్చటం వల్ల కలిగే ఒత్తిడి

ఇలా డిప్రెషన్‌కు గురయిన గర్భిణులు వైద్యులు సూచించిన వైద్య సలహాలు పాటించకుండా, పోషణను అశ్రద్ధ చేస్తూ ఉంటారు. నిద్రకూ దూరమవుతూ ఉంటారు. గర్భం దాల్చటంతో కలిగే ఒత్తిడి డిప్రెషన్‌ను మరింత పెంచుతుంది. ఇదే స్థితి కొనసాగితే ప్రసవం తర్వాత డిప్రెషన్ మరింత తీవ్ర రూపం దాలుస్తుంది. కాబట్టి నిరాశకు లోనయినప్పుడు కుంగిపోకుండా కుటుంబ సభ్యుల తోడ్పాటు తీసుకోవాలి. ఆందోళన తగ్గించుకుని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి. అన్ని పనులు చేసేసుకోవాలనే ఆత్రుత తగ్గించుకుని ఒకదాని తర్వాత ఒకటిగా పనులను నెమ్మదిగా చేసుకోవాలి. వీలైతే పనులను తగ్గించుకోవాలి. సాంత్వన కలిగించే పనులను ఎంచుకోవాలి. అప్పటికీ డిప్రెషన్ అదుపులోకి రాకపోతే అనుభవం ఉన్న వైద్యులను సంప్రదించాలి. తల్లిగా మారిన తర్వాత కొందరిని 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్' వేధిస్తుంది. ఈ సమస్యకు యాంటీ డిప్రెసెంట్స్‌తో చికిత్స చేయొచ్చు.



మెనోపాజ్ దశలో కూడా!

ప్రతి మహిళలో ఈస్ట్రోజెన్, టెస్టోస్టిరాన్ అనే స్త్రీ పురుష హార్మోన్లు రెండూ ఉంటాయి. ఈ రెండింటి నిష్పత్తిలో మార్పులు చోటు చేసుకుంటే ఆ ప్రభావం వారి శరీరాలు, మనసుల మీద పడుతుంది. దాంతో భావోద్వేగాలకు లోనవటం, డిప్రెషన్‌కు గురవటం జరుగుతుంది.

ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గితే?


ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గటం వల్ల యోని పొడిబారటం, లైంగిక వాంఛలు తగ్గటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. దాంతో భాగస్వామితో పూర్వంలా లైంగిక క్రీడల్లో పాల్గొనలేకపోవచ్చు. అసౌకర్యంతో ఇబ్బందికి గురై సెక్స్‌కు పూర్తిగా దూరం కావొచ్చు. ఫలితంగా దంపతులిద్దరి మధ్యా పొరపొచ్చాలు, మనస్పర్థలు తలెత్తి, వాటి ఫలితంగా డిప్రెషన్‌కు లోను కావొచ్చు. ఇలాంటప్పుడు మెనోపాజ్ వల్ల తలెత్తిన శారీరక ఇబ్బందులను చికిత్సతో సరి చేసుకోవాలి. యోని పొడిబారడాన్ని తగ్గించడం కోసం ఈస్ట్రోజెన్ క్రీమ్‌లు, నోటి మాత్రలు వాడాలి. లైంగిక వాంఛలు పెంచే మందులను వైద్యుల సూచన మేరకు వాడొచ్చు.

టెస్టోస్టిరాన్ పెరిగితే?

మెనోపాజ్ దశకు చేరుకున్న కొందరు మహిళల్లో టెస్టోస్టిరాన్ స్థాయిలు స్వల్పంగా పెరుగుతాయి. దాంతో గడ్డం మీద వెంట్రుకలు పెరగటం, లైంగిక వాంఛలు పెరగటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. పెరిగిన లైంగిక వాంఛలు తీరితే పర్వాలేదు. ఒకవేళ భాగస్వామి లేకపోయినా, సహకరించకపోయినా ఆ ప్రభావం మనసు మీద పడుతుంది. విపరీతమైన కోపం, చిరాకు, అసహనం మొదలవుతాయి. ఇలాంటప్పుడు అనుభవజ్ఞులైన వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. రక్తపరీక్ష ద్వారా పెరిగిన టెస్టోస్టిరాన్ స్థాయిని కనిపెట్టి ఈస్ట్రోజెన్, టెస్టోస్టిరాన్‌ల నిష్పత్తి సరిచేస్తే సమస్యలు సద్దుమణుగుతాయి.

అంతా మీ చేతుల్లోనే!

"డిప్రెషన్ మీ శక్తినీ, ఆత్మవిశ్వాసాన్నీ తరిమికొట్టి, నిస్సహాయుల్ని చేసి, నిరాశలో కూరుకుపోయేలా చేస్తుంది. డిప్రెషన్ కలిగించే అంశాలు, దశలు మహిళల్లో ఎన్నో ఉంటాయి. పునరుత్పత్తి హార్మోన్లు మొదలుకుని, సామాజిక ఒత్తిడి, స్త్రీగా పూర్తి చేయవలసిన బాధ్యతల వరకూ మహిళలను డిప్రెషన్‌లోకి తోసేసే అంశాలెన్నో ఉంటాయి. అయితే పరిస్థితులు ఎంత ప్రతికూలంగా కనిపించినా, వాటిని చూసే దృక్కోణాన్ని మార్చుకునే వీలు, వాటి గురించి ఆలోచించే తీరులను అనుకూలంగా మలచుకునే శక్తి మహిళల చేతుల్లోనే ఉంటుందని గ్రహించాలి. చిటికేసినంత తేలికగా డిప్రెషన్‌లో నుంచి బయటకొచ్చేయటం సాధ్యం కాకపోయినా, దాన్ని అదుపు చేసుకోగలిగే శక్తి తమలోనే ఉంటుందని ప్రతి మహిళా గ్రహించాలి. చిన్న చిన్న పనులతో మొదలుపెట్టి డిప్రెషన్‌ను పారదోలుతూ పూర్వపు ఆత్మవిశ్వాసాన్ని నెమ్మదినెమ్మదిగా కూడదీసుకోవాలి. జీవితం మీద ఆశను పెంచుకుని, జీవితానందాన్ని ఆస్వాదించాలి. డిప్రెషన్ మహిళల శరీరం, సామాజిక జీవితం, అనుబంధాలు, వృత్తి...ఇలా ఎన్నో అంశాల మీద ప్రభావం చూపిస్తుంది. కాబట్టి సమస్య ఉందని గ్రహించిన వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి."



డాక్టర్ రాహుల్ రెడ్డి,
యాండ్రాలజిస్ట్, యాండ్రోకేర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

ఫిట్‌నెస్

కొవ్వు కరగాలంటే..

పిరుదుల్లోని కొవ్వు కరిగి, బిగుతుగా మారాలంటే హిప్ ఎక్స్‌టెన్షన్ వ్యాయామం చేయాలి. ఇందుకోసం...

- చేతులు, మోకాళ్లు నేల మీద ఉంచి బొమ్మలో చూపించిన భంగిమలో ఉండాలి.
- ఒక కాలును వెనకగా సాధ్యమైనంత పైకి లేపి, తిరిగి యథాస్థానానికి తేవాలి.
- ఇలా ఆపకుండా 20 సార్లు చేయాలి.
- తర్వాత రెండో కాలుతో కూడా 20 సార్లు చేయాలి.
- ఇలాంటివి 3 సెట్లు చేస్తే నడుము, పిరుదులు చక్కటి ఆకృతిని సంతరించుకుంటాయి.

హెల్తీ రెసిపి



వెల్లుల్లి టీ

'ఆహారమే ఔషధం, ఔషధమే ఆహారం' అన్నాడు పురాతన గ్రీకు వైద్యుడు హిపొక్రటీస్. వైద్యపిత అనే పేరున్న హిపొక్రటీస్ ఎన్నో రుగ్మతలను వెల్లుల్లి చికిత్సతో నయం చేసేవాడు. దీన్నిబట్టి వెల్లుల్లి ఔషధ గుణాల భాండాగారం అని అర్థం చేసుకోవచ్చు. వెల్లుల్లి ఔషధ గుణాలు అందుకోవాలంటే టీ రూపంలో కూడా తాగొచ్చు. అదెలాగంటే?

కావలసిన పదార్థాలు:

వెల్లుల్లి రెబ్బలు - 4 (సన్నగా తరగాలి)
నీళ్లు - 3 కప్పులు
తేనె - 2 టేబుల్ స్పూన్లు
నిమ్మరసం - అర కప్పు

తయారీ విధానం:

- నీళ్లలో వెల్లుల్లి తరుగు వేసి మరిగించాలి.
- మంట తీసేసి నిమ్మరసం, తేనె కలపాలి.
- వేడిగా కప్పులో పోసుకుని తాగాలి.

పెరటి వైద్యం

క్యాబేజీ కట్టు



ఆధునిక వైద్య విధానం అందుబాటులోకి రాకముందు క్యాబేజీ ఆకులతో పట్టు వేసి వైద్యం చేసేవారు. క్యాబేజీ ఆకులు వాపులు తగ్గిస్తాయి, గాయాలను మాన్పుతాయి, కొత్త చర్మం తయారయ్యేలా చేస్తాయి. క్యాబేజీ ఆకులతో ఏ రుగ్మతకు ఎలా పట్టు వేయాలంటే?

✦ గాయాలు, వాపులు, కాలిన గాయాలు: గాయం తగిలిన చోట తాజా క్యాబేజీ ఆకులను ఉంచి, బ్యాండేజీతో పట్టు వేయాలి. ఇలా రాత్రంతా వదిలేస్తే ఉదయానికల్లా వాపు, నొప్పి తగ్గుతాయి.

✦ **తలనొప్పి:** క్యాబేజీ ఆకులు తలనొప్పి, జ్వరాలను తగ్గిస్తాయి. ఇందుకోసం క్యాబేజీ ఆకులను రెండు కణతల దగ్గర ఉంచి, తలను టవల్‌తో చుట్టేయాలి. ఇలా గంటపాటు ఉంచితే తలనొప్పి తగ్గుతుంది. మైగ్రెయిన్ నొప్పులు కూడా తగ్గుతాయి.

✦ **రొమ్ముల సలపరం:** పిల్లలకు పాలిచ్చేటప్పుడు, తల్లులు రొమ్ముల్లో సలపరంతో బాధ పడుతూ ఉంటారు. ఇలాంటప్పుడు క్యాబేజీ ఆకుల ఈనెల తొలగించి, చేతులతో ఆకులను చింపి రొమ్ముల మీద ఉంచుకోవాలి. ఇలా చేస్తే సలపరం తగ్గుతుంది. రుతుక్రమం సమయంలో కలిగే రొమ్ము నొప్పులు కూడా ఈ చిట్కాతో తగ్గుతాయి.

ఫుడ్ ఫ్యాక్ట్

మాంసం లేని ప్రొటీన్

మాంసంలో మాత్రమే అధిక ప్రొటీన్లు ఉంటాయనేది నిజం కాదు. శాకాహారాల్లోనూ మాంసకృత్తులు సమృద్ధిగా ఉంటాయి. అయితే ఆ శాకాహారం ఏదనేది తెలుసుకుంటే ప్రొటీన్లను తేలికగా పొందవచ్చు. ఏ శాకాహారంలో ఎన్ని ప్రొటీన్లు ఉంటాయో తెలుసుకుంటే రోజువారీ ప్రొటీన్ల కొరత ఏర్పడకుండా కూడా జాగ్రత్త పడొచ్చు.



పదార్థం	ప్రొటీన్లు
నట్ బటర్స్ - 2 టేబుల్ స్పూన్లు	(8గ్రా)
ఓట్‌మీల్ - 1 కప్పు	(6గ్రా)
బ్రొకోలి - ఒక సర్వింగ్	(5గ్రా)
కాలీఫ్లవర్ - ఒక సర్వింగ్	(5 గ్రా)
నట్స్ - గుప్పెడు	(6 గ్రా)
బచ్చలికూర - ఒక సర్వింగ్	(5 గ్రా)
పెరుగు - 100గ్రా	(10గ్రా)

అపోహ - వాస్తవం



తడి తలతో జలుబు చేస్తుందా?

అపోహ: తలస్నానం చేసి, జుట్టు ఆరకుండా అలాగే తిరిగేస్తే జలుబు చేస్తుంది!

వాస్తవం: ఇది అపోహ మాత్రమే! జలుబు వైరస్‌తో వస్తుంది. శరీరంలో రోగనిరోధకశక్తి సన్నగిల్లితే తలస్నానం చేయకపోయినా జలుబు తేలికగా సోకుతుంది. మన ఒంట్లో ఇమ్యూనిటీ సమర్థంగా ఉంటే తలస్నానం చేసి తడి తలతో తిరిగినా జలుబు చేయదు.

సెక్సువల్ హెల్త్

ఊబకాయంతో అడ్డంకి?

ప్రశ్న: మా వారు పెళ్లయ్యాక బాగా లావయ్యారు. బరువు పెరిగిన తర్వాత లైంగిక వాంఛలు కూడా క్రమంగా తగ్గిపోయాయి. ఎందుకని అడిగితే...తన రూపం తనకే నచ్చట్లేదనీ, అధిక బరువు కారణంగానే తనకు ఆసక్తి సన్నగిల్లిందని అంటున్నారు. ఎప్పుడూ నిరాశగా, నిరాసక్తంగా కనిపిస్తున్నారు. ఆయన సమస్యకు పరిష్కారం సూచించగలరా?

- రమ్య, బోధన్

జవాబు: మీవారు ఓ చిత్రమైన చట్రంలో చిక్కుకున్నారు. తన రూపం మీద ఏర్పడిన అనిష్టాన్ని పోగొట్టుకుని, కంఫర్ట్‌గా ఫీలవటం కోసం ఆహారాన్ని ఎంచుకుంటున్నారు. డిప్రెషన్‌లో ఇదొక కోణం. దీని వల్లే ఆయన బరువు పెరగటం, లైంగికాసక్తి కోల్పోవటం జరిగింది. అయితే ఈ చట్రాన్ని ఛేదించే వీలుంది. ఇందుకోసం రూపం మీద ఆయనకు ఏర్పడిన అనిష్టాన్ని పోగొట్టాలి. దీన్లో మీ వంతు సహాయం అందించాలి. ఇద్దరూ కలిసి వాకింగ్‌కి వెళ్లాలి. లేదా ఈత, జాగింగ్, ఆటలు లాంటి శారీరక శ్రమతో కూడుకున్న వ్యాయామాల్లో పాల్గొనాలి. చక్కెర, నూనెలు ఉండే పదార్థాలు కొనటం మానేయాలి. ఆరోగ్యకరమైన ఆహారంతో ఫ్రిజ్ నింపేయాలి. ఎప్పుడు నిరాశగా అనిపించినా ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా మీతో మాటలు కలపమని ఆయన్ని అడగండి. ఇలా చేయకపోతే ఆయన మళ్లీ తన ఆనందాన్ని ఆహారంలో వెతుక్కుంటారు. ఇక సెక్స్ విషయానికొస్తే పెనట్రేటివ్ సెక్స్‌కు బదులుగా ఫోర్‌ప్లేతో కూడా మీరు సంతోషంగా ఉండగలరని చెప్పి, ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచండి. దంపతులు ఒకర్నొకరు అర్థం చేసుకుని, ఇచ్చిపుచ్చుకునే ధోరణి కలిగి ఉండటం లైంగిక జీవితంలో అత్యవసరం. ఇలా కొంతకాలంపాటు జీవనశైలిని మార్చుకోగలిగితే క్రమంగా మీవారిలో మార్పొస్తుంది. చలాకీగా, సంతోషంగా ఉంటే కచ్చితంగా తిరిగి ఆయనలో లైంగిక వాంఛలు పెరుగుతాయి. ఒకవేళ అంత చేసినా ఆయన అప్పటికీ డిప్రెషన్‌తో బాధపడుతూ ఉంటే సెక్సాలజిస్ట్‌ను సంప్రదించండి.



● డా॥ షర్మిలా మజుందార్
చీఫ్ సెక్సాలజిస్ట్
అండ్ సైకో అనలిస్ట్
Email:mili77@gmail.com

చైల్డ్ హెల్త్

పసి పిల్లల తల పెరుగుతుందా?

డాక్టర్! స్నానం చేయించేటప్పుడు చేతులతో ఒత్తకపోతే, పసి పిల్లల తల పెరుగుతుందని అంటారు. పడుకోబెట్టేటప్పుడు కూడా తల పెరగకుండా తల ఒత్తుకునేలా దిండ్లు పెడుతూ ఉంటారు. ఇలా ఇరుగుపొరుగు చెప్పే మాటలు విని నేనూ మా బాబుకు ఇలాగే చేస్తున్నాను. ఈ అలవాటు మానేయాలా? కొనసాగించాలా? అసలిదెంతవరకూ నిజం?

- ప్రసన్న, నల్గొండ.

పసికందుల తల ఎముకల అతుకులతో కూడుకుని ఉంటుంది. అవన్నీ అతుక్కుని పుర్రెగా మారటానికి 18 నుంచి 3 సంవత్సరాల సమయం పడుతుంది. బిడ్డ మెదడు 18 నుంచి 3 ఏళ్ల వయసు వరకూ పెరుగుతూ ఉంటుంది కాబట్టి, మెదడు ఎలాంటి అడ్డంకీ లేకుండా పెరగటం కోసమే ఈ ఏర్పాటు. అయితే ఈ వయసులో, మరీ ముఖ్యంగా సంవత్సరంలోపు పసికందుల తలను వేళ్లతో నొక్కటం చేయకూడదు. స్నానం చేయించేటప్పుడు చాలామంది తల్లులు బిడ్డ తలను నొక్కుతూ ఉంటారు. ఇలా నొక్కకపోతే తల పెరుగుందని అనుకుంటూ ఉంటారు. ఇంకొంతమంది ఆవాలు నింపిన దిండును బిడ్డ తల అడుగున ఉంచుతూ ఉంటారు. ఇవన్నీ చేయకపోతే బిడ్డ తల పెరిగిపోతుందని వాళ్ల భయం. కానీ అది ఒట్టి అపోహే! తల నొక్కకపోయినా, ఆవాల దిండు ఉంచకపోయినా పిల్లల తల పెరగదు. ఇంకా చెప్పాలంటే వేళ్లతో బిడ్డ తలను బలంగా నొక్కటం ప్రమాదం. కొందరు పసికందుల తల వెనక భాగం చదునుగా మారుతూ ఉంటుంది. వాళ్లని ఎప్పుడూ ఒకేవైపు తల తిప్పి, లేదా వెల్లకిలా పడుకోబెడితే లేత ఎముకలు నొక్కుకుపోయి తల పడుకోబెట్టినవైపు చదునుగా తయారవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ఒకే వైపు తల తిప్పి పడుకోబెట్టకుండా, తరచుగా రెండో వైపుకూ మారుస్తూ ఉండాలి. ఈ ఒక్క జాగ్రత్త పాటిస్తే సరిపోతుంది.



డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియోనాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
బంజారాహిల్స్, హైదరాబాద్.

మానసికం

పిల్లలను అర్థం చేసుకుందాం!

పిల్లలు విసిగిస్తున్నారని వాళ్ల మీద కేకలేస్తాం! చిరాకు పడతాం, చీదరించుకుంటాం! కానీ వాళ్ల ప్రవర్తనను కొంత లోతుగా విశ్లేషిస్తే, వాటి వేర్లు మన ప్రవర్తనలోనే నాటుకుని కనిపిస్తాయి. పిల్లల ప్రవర్తన, వాటి అర్థాలను తెలుసుకుందాం!



- మీ బాబు కావాలనే మిమ్మల్ని పదే పదే డిస్టర్బ్ చేస్తున్నాడా? అయితే అతన్ని మీరు ప్రేమగా దగ్గరికి తీసుకోవట్లేదని అర్థం.
- శారీరక స్పర్శతో చూపించే ప్రేమ పిల్లల్లో సురక్షిత భావనను కలిగిస్తుంది. రోజులో ఒక్కసారైనా పిల్లలను ఒళ్లో కూర్చోబెట్టుకోవటం, హత్తుకోవటం, చేతులు పట్టుకుని మాట్లాడటం చేయాలి. ప్రేమను ఇలా వ్యక్తపరచటం వల్ల తల్లీబిడ్డల అనుబంధం బలపడుతుంది.
- పిల్లలు అబద్ధాలాడుతున్నారా? అయితే పూర్వం వాళ్లు చేసిన తప్పులకు మీరు అతిగా స్పందించి ఉంటారు. చిన్న తప్పుకే విపరీతంగా స్పందించి పరుష పదజాలంతో దూషించటం, అవమానించటం చేస్తే పిల్లలు ఆ తరహా ధోరణిని భరించలేరు. అలాంటి పరిస్థితిని మళ్లీ ఎదుర్కొనే శక్తి లేక అబద్ధాలాడటానికి అలవాటు పడతారు. కాబట్టి పిల్లలు తప్పు చేస్తే అనునయంగా అడగాలి. కారణాన్ని వాళ్ల నుంచే రాబట్టాలి. మరోసారి అలా జరగకుండా చూసుకోమని సున్నితంగా చెప్పాలి. తిట్టడం, కొట్టడం వల్ల ప్రయోజనం శూన్యం.
- మీ పిల్లల్లో ఆత్మవిశ్వాసం లోపించిందా? అయితే మీరు మీ పిల్లల్ని ఎక్కువ సలహాలిస్తూ, తక్కువగా ప్రోత్సహిస్తూ ఉండి ఉంటారు. ప్రతి చిన్న పనినీ పిల్లలకు నేర్పాల్సిన అవసరం లేదు. స్వయంగా ప్రయత్నం చేయనివ్వాలి. వాళ్లకి చేయబోయే పని గురించి, పదే పదే సలహాలిస్తే ఆసక్తి కోల్పోయే అవకాశమూ ఉంటుంది. ఆత్మవిశ్వాసమూ సన్నగిల్లుతుంది.

ఇదీ లెక్క!



ప్రకృతి వేదం

కీళ్లనొప్పులకు బ్రేక్

శ్రమ ఆదాయపు వనరు మాత్రమే కాదు, ఆరోగ్యానికి గొప్ప ఔషధం కూడా. శ్రమ లేకుండా ఉండడమే సుఖపడిపోవడం అనుకుంటే, శరీరంలోని వివిధ అవయవాలు రోగగ్రస్థం కావడం ఖాయం. కాకపోతే, శరీర శ్రమలో ఎక్కువ భారం పడేది కీళ్ల పైనే కాబట్టి, శ్రమ ఒక పరిమితికి లోబడే ఉండాలి. కండరాలను, కీళ్లను, ఎముకలను ఎక్కువగా వాడినా, వాడాల్సిన దానికన్నా తక్కువగా వాడినా, అసలు వాడకపోయినా కీళ్లు నష్టపోతాయి. శరీరానికి అధిక శ్రమకు లోను చేసే వారు తక్కువే గానీ, తక్కువ శ్రమ చేసేవారు, అసలే శ్రమ చేయని వారే ఈ రోజుల్లో ఎక్కువ. వంద గజాల దూరం వెళ్లాలన్నా వాహనాన్నే ఆశ్రయించే స్థితి ఇప్పుడుంది. దీనివల్ల ముందు కండరాలు, ఆ తర్వాత కీళ్లు బలహీనమవుతాయి. కీళ్లు బలంగా ఉండాలంటే, కండరాలు, లిగమెంట్లు, టెండాన్లు బలంగా ఉండాలి. వాటికి మాధ్యమికం (మోడరేట్)గా శ్రమ కావాలి. ప్రకృతి ధర్మాన్నీ, శరీర ధర్మాన్నీ అనుసరించి ఆ శ్రమనూ, లేదా వ్యాయామాల్ని కొనసాగించడం ఎంతో శ్రేయస్కరం.

కారణాలేమిటి?

శరీర అవయవాలు ఆరోగ్యంగా ఉండాలంటే రక్తం ఆరోగ్యంగా ఉండాలి. రక్తం ఆరోగ్యంగా ఉండడం అంటే, అందులో యాసిడ్ (ఆమ్లం), బేస్ (క్షారం) సమతుల్యంగా ఉండాలి. క్షారతత్వంలో ఉన్నంత కాలం శరీర అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉంటాయి. రక్తంలో ఆమ్లతత్వం పెరిగితే ఎముకలు, కీళ్లు అరుగుతాయి. కండరాలు బలహీనపడతాయి. మూత్రపిండాల్లో, పిత్తాశయం (గాల్ బ్లాడర్)లో రాళ్లు తయారవుతాయి.

- నేడు మనం తీసుకుంటున్న ఆహార పదార్థాల్లో ఆమ్లాన్ని అధికంగా ఉత్పత్తి చేసేవే ఉంటున్నాయి. పాలు, పంచదార, తెల్లగా పాలిష్ పట్టిన బియ్యం, పాలతో చేసిన స్వీట్లు, ఐస్ క్రీంలు, తెల్లటి మైదాపిండి, తెల్లటి ఉప్పు వంటి తెల్లటి ఆహార పదార్థాలన్నీ ఆమ్లాన్ని పెంచేవే. వీటితో పాటు నిలువ ఉంచే పచ్చళ్లు, గసగసాలు, పట్టా, సాజీర, లవంగాలు, నూనె, మాంసాహారం, మసాలాలు - ఇవన్నీ ఆమ్లాన్ని పెంచేవే. మాంసాహారం జీర్ణమయ్యాక కొన్ని రకాల అమినో యాసిడ్స్‌గా విడగొట్టబడుతుంది. అందులోంచి యూరియా, యూరిక్ యాసిడ్ విడుదల అవుతుంది. యూరిక్ యాసిడ్ పెరిగితే 'గౌట్' అనే కీళ్ల వ్యాధి వస్తుంది. పిల్లలు అతిగా తింటున్న చాక్లెట్లు, బిస్కట్లు, ఐస్‌క్రీంలు, పిజ్జాలు, కూల్‌డ్రింక్స్, జాం, సాస్ ఇవి కూడా యాసిడ్స్‌ను పెంచేవే.

ఉప్పు ఎక్కువైతే ముప్పే

- మన శరీరానికి రోజుకు 2-3 గ్రాముల ఉప్పు అవసరం. రోజూ మనం తినే ఆకుకూరల్లోనూ, కాయకూరల్లోనూ మన శరీరానికి కావలసినంత ఉప్పు సహజంగానే ఉంటుంది. అది చాలదన్నట్లు అదనంగా సగటున 15 నుంచి 20 గ్రాముల ఉప్పు తింటున్నారు. ఈ అదనపు ఉప్పులో కొంత కీళ్లల్లో పేరుకుపోతుంది. ఈ ఉప్పు కీళ్లలోని ద్రవాన్ని లాక్కుంటుంది. ఫలితంగా నీరు తగ్గిపోయి, కీళ్లు పెళుసుబారిపోతాయి. నీరు తగ్గినప్పుడు సహజంగానే కీళ్లు ఒకదానితో ఒకటి రాసుకుని కార్టిలేజ్ అరిగిపోయి, కీళ్ల వాపు, నొప్పి వస్తాయి. అధిక బరువు కూడా పరోక్షంగా కీళ్లు తొందరగా అరిగిపోవడానికి కారణమవుతుంది.



నివారణ మార్గాలు

కీళ్ల గట్టితనం వాటిని అంటిపెట్టుకుని ఉన్న కండరాల పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. అందుకే కండరాల పటుత్వం కోసం రోజూ ఒక గంట పాటు వ్యాయామం చేయడం అవసరం. కీళ్ల నొప్పులు ఉన్న వారికి ఇతర వ్యాయామాల కన్నా 'యోగాసనాలు' ఎక్కువ మేలు చేస్తాయి. ప్రత్యేకించి అర్ధ మత్స్యేంద్రియాసనం వల్ల కీళ్లు, కండరాలతో పాటు శరీరంలోని ఇతర అవయవాలు కూడా శక్తిమంతంగా మారతాయి. ఆసనాలతో పాటు,

- కాలి మడమను గుండ్రంగా తిప్పడం,
- మోకాలును గుండ్రంగా తిప్పడం
- మణికట్టును గుండ్రంగా తిప్పడం
- భుజాలను గుండ్రంగా తిప్పడం
- నడుమును గుండ్రంగా తిప్పడం వంటివి కండరాల పటుత్వాన్ని పెంచడానికీ కీళ్ల వ్యవస్థను బలోపేతం చేయడానికీ బాగా ఉపయోగపడతాయి.

ప్రకృతి వైద్య చికిత్సలు

కీళ్ల నొప్పులు మొదలైన తొలిదశలోనే ప్రకృతి చికిత్సా విధానాలను అనుసరిస్తే ఆ సమస్యలు అక్కడితోనే సమసిపోతాయి. అవేమీ లేకుండా కేవలం మందులకే పరిమితమైతే సమస్య నానాటికీ విషమించిపోతుంది. మౌలికంగా, కీళ్లు దెబ్బ తినడానికి అస్తవ్యస్తమైన మన జీవనశైలే అసలు కారణం. అందువల్ల జీవన శైలిని మార్చుకోకుండా, ఎన్ని మందులు వాడినా ఏ ప్రయోజనమూ ఉండదు. ఏ కారణంగా ఈ సమస్య తలెత్తిందో అర్థంచేసుకుని ఆ కారణభూతమైన వాటికి దూరంగా ఉండాలి. ఆ తర్వాత చికిత్సలు తీసుకోవాలి. అయితే, ప్రకృతిలోంచి వచ్చిన మనిషికి ప్రకృతి చికిత్సలు అపారమైన మేలు చేస్తాయి. ప్రకృతి వైద్యంలో గాలి ద్వారా, నీటి ద్వారా, తైల మర్దన ద్వారా, మలినాలను బయటికి పంపే మరెన్నో చికిత్సల ద్వారా రోగిని ఆరోగ్యవంతమైన పూర్వస్థితికి తీసుకు వచ్చే ప్రయత్నం జరుగుతుంది. ముఖ్యంగా శరీర కణజాలంలోని మలినాలను బయటికి పంపించే ప్రక్రియ ప్రధానంగా ఉంటుంది. అందులో భాగంగా మూడు దశల్లో చికిత్సలు ఉంటాయి

- కణంలో పేరుకున్న మలినాలను బయటికి పంపే (ఎలిమినేటివ్ ప్రాసెస్) చికిత్సా విధానం.
- కణాన్ని ఆరోగ్యవంతంగా తయారు చేసే (సూథింగ్) విధానం.
- కణానికి తిరిగి శక్తిని అందించే (కన్‌స్ట్రక్టివ్ ప్రాసెస్) విధానం

ఈ చికిత్సా విధానాల ద్వారా కీళ్లనొప్పుల నుంచి విముక్తిని పొంది, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపే అవకాశాలు మెండుగా ఉంటాయి.

● డాక్టర్ టి కృష్ణమూర్తి, సూపరింటెండెంట్,
యోగా, నేచర్ క్యూర్ హాస్పిటల్ (రెడ్‌క్రాస్), హైదరాబాద్

బ్యూటీ కేర్

చమక్కుమనే చర్మం కోసం!

అందంగా కనిపించాలంటే చర్మం ఆరోగ్యంగా ఉండాలి. నునుపుగా, తేమతో, కాంతులీనుతూ ఉండే చర్మం కోసం సౌందర్య చికిత్సలకు బదులుగా పోషకభరిత ఆహారం మీద ఆధారపడాలి. అలాంటి స్కిన్ ఫుడ్ ఇదే!

బాదం: విటమిన్ ఇ తో నిండి ఉండే బాదం పప్పులోని యాంటీఆక్సిడెంట్లు అతినీలలోహిత కిరణాల నుంచి చర్మ కణాలకు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి ప్రతిరోజూ గుప్పెడు బాదం పప్పు తినాలి.

క్యారెట్లు: ఈ ఆరెంజ్ రంగు అద్భుతాలు చర్మపు బాహ్య పొరలో అవసరానికి మించి కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. ఫలితంగా చర్మం నునుపుగా ఉంటుంది.

గ్రీన్ టీ: గ్రీన్ టీ ఆకులు మరిగేటప్పుడు విడుదలయ్యే కోటాచిన్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు చర్మపు క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించటంతోపాటు చర్మానికి పోషకాలను అందిస్తాయి.

టమేటాలు: వీటిలోని లైకోపిన్, ఫొటోకెమికల్స్ చర్మానికి వృద్ధాప్య లక్షణాలను తెచ్చిపెట్టే అతినీలలోహిత కిరణాల్లోని ఫ్రీ ర్యాడికల్స్ నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి.



చిట్కా

చుండ్రుకు చెక్!



చుండ్రు దురద పెడుతూ, పొట్టులా రాలుతుంటే పదే పదే తలస్నానం చేస్తుంటాం. కానీ ఇదొక్కటే చుండ్రుకు పరిష్కారం కాదు. ఈ సమస్య సమూలంగా వదలాలంటే ఇదిగో ఈ చిట్కా పాటించాలి.

✷ రెండు టీస్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనె, రెండు టేబుల్‌స్పూన్ల నీళ్లు ఓ గిన్నెలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వెంట్రుకల కుదుళ్లకు పట్టించి, సున్నితంగా మసాజ్ చేయాలి. 20 నిమిషాల తర్వాత తలస్నానం చేసేయాలి. ఇలా వారానికొకసారి చేస్తే చుండ్రు పూర్తిగా వదులుతుంది.

మీకు తెలుసా?



జలుబు తగ్గిన వెంటనే టూత్ బ్రష్ మార్చేయాలి. లేదంటే బ్రష్‌లో ఇరుక్కున్న బ్యాక్టీరియా తిరిగి ఇన్‌ఫెక్షన్‌ను కలిగించి జలుబు తెప్పిస్తుంది.

పరిశోధన

క్రంచెస్‌తో వెన్ను వంకర

పొత్తి కడుపులో పేరుకొన్న కొవ్వు తగ్గాలంటే క్రంచెస్‌ని మించిన వ్యాయామం లేదని అనుకుంటాం. కానీ క్వీన్స్ కాలేజ్ ప్రొఫెసర్ వెయిన్ వెస్ట్‌కాస్ట్ క్రంచెస్ చేయటం వల్ల పొత్తికడుపులోని కండరాల పటుత్వం పెరుగుతుంది తప్ప కొవ్వు కరగదని అంటున్నారు. పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీలో చేసిన పరిశోధన ఆధారంగా భుజాలు, పిరుదులు, నడుము కింది భాగం మీద ఒత్తిడి పడినా కొవ్వు కరిగించేంత ప్రభావం మాత్రం ఉండదట! క్రంచెస్ కంటే ప్లాంక్స్, బ్రిడ్జెస్ చేయటం వల్ల ఫలితం ఉంటుందని పరిశోధనలో తేలింది. కోర్ ఎక్సర్‌సైజ్‌గా క్రంచెస్‌ని ఉపయోగించాలనుకుంటే సరైన భంగిమను అనుసరించాలనీ, లేదంటే వెన్ను వంకర తిరిగి నొప్పి మొదలయ్యే ప్రమాదం ఉంటుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



డైలీ సుడోకు - 85

7							9	8
		8		5				
3			9		6			
	6			3				4
4			2		7			9
5				1			7	
			3		4			6
				7		2		
6	3							5

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 84 సమాధానం

[illegible]

నవ్య ఆంధ్రజ్యోతి చిత్రజ్యోతి
మంగళవారం • 23 జనవరి 2018 10

‘బీ’ వచ్చి ‘టీ’ పై వాలే..!

వేర్వేరు ప్రాంతాల నుంచీ వచ్చిన భామలు బాలీవుడ్ సినిమాలతోనే కథానాయికలుగా పరిచయమవుతున్నారు. ఇది చరిత్ర చెప్పే సత్యం! హిందీ సినిమాల్లో నటిస్తే కెరీర్ ఓ రేంజ్‌లో ఉంటుంది కనుక దక్షిణాది సినిమాల్లో నటించే కొంతమంది హీరోయిన్లు ఉత్తరాది అవకాశాల కోసం ఎదురుచూస్తుంటారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే సౌత్‌లో పారితోషికాలు ఎక్కువ ఉంటాయి కనుక బాలీవుడ్ హీరోయిన్లు ఇటు వైపు ఓ లుక్ వేస్తుంటారు. ముఖ్యంగా ‘బాహుబలి’ చిత్రం తర్వాత టాలీవుడ్‌లో ఈక్వేషన్లు మారిపోయాయి. హిందీలో కూడా మార్కెట్ పెంచుకోవడానికి హీరోలు ఆసక్తి చూపిస్తుండటంతో కొంచెం ఖర్చు ఎక్కువైనా బాలీవుడ్ భామల్ని బుక్ చేయడానికి నిర్మాతలు వెనుకాడటం లేదు. ఒకప్పుడు తమిళ, మలయాళ హీరోయిన్లకు అవకాశం ఇచ్చే నిర్మాతలు ఇప్పుడు బీటౌన్ నాయికలను ఏరికోరి ఎన్నుకొంటున్నారు. అలా ప్రస్తుతం బాలీవుడ్ నుంచి తెలుగులోకి అడుగుపెడుతున్న నాయికలపై ఓ లుక్కేద్దాం.


మైరా సరీన్

హాట్ బ్యూటీ


నాగార్జున

కొత్త కథానాయికలకు అవకాశం ఇవ్వడంలో రామ్‌గోపాల్ వర్మ, నాగార్జున ఎప్పుడూ ముందుంటారు. ‘శివ’ చిత్రం వచ్చిన 28 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుంది. కాప్ స్టోరీతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా హాట్ బ్యూటీ మైరా సరీన్‌ను ఎంపిక చేశారు వర్మ. ఆమెకు ఇదే తొలి సినిమా. మొదటి సినిమాకే నాగార్జునలాంటి సీనియర్ హీరో, వర్మలాంటి దర్శకుడితో తొలి సినిమా అవకాశం రావడం తన అదృష్టమని సరీన్ చెబుతోంది. హాట్ ఫొటో షూట్‌తో యువతను అలరించిన ఈ సుందరి నటనతో ఎంతవరకూ ఆకట్టుకుంటుందో చూడాలి. ప్రస్తుతం ముంబైలో పోరాట సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు వర్మ.

ఆ కోరిక తీరింది!


శ్రద్ధాకపూర్


ప్రభాస్

అంతకు మునుపు రెండు చిత్రాల్లో నటించినప్పటికీ తన మూడో చిత్రం ‘ఆషికీ 2’తో బాలీవుడ్‌లోపాపులర్ అయింది శ్రద్ధాకపూర్. ఆ తర్వాత పలు గ్లామర్ పాత్రలు సహా ‘హసీనా పార్కర్’ వంటి కథానాయిక ప్రాధాన్యం ఉన్న పాత్రతోనూ మెప్పించింది. సరైన కథ, కథానాయకుడు కుదిరితే తెలుగు సినిమాలో నటించడానికి అభ్యంతరం లేదని ఎప్పుడో చెప్పేసింది. ఇప్పుడు ‘సాహో’ సినిమాతో ఆమె కోరిక తీరుతోంది. ‘బాహుబలి’తో ప్రపంచవ్యాప్తంగా పేరు గడించిన ప్రభాస్ సరసన ‘సాహో’లో నటించే అవకాశం దక్కించుకుంది. “తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న చిత్రంలో నటించడం ఆమెకు ఇదే తొలిసారి. ‘పభాస్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియెన్స్‌గా భావిస్తున్నా” అని ఇటీవల శ్రద్ధాకపూర్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోందీ సినిమా.

అటు మహేశ్, ఇటు చరణ్


కైరా అద్వాణీ


మహేశ్


రామ్‌చరణ్

‘ఫగ్లీ’(2014) చిత్రంతో కథానాయికగా పరిచయమైన ముంబై బ్యూటీ కైరా అడ్వాణీ. రెండో సినిమా ‘ఎం.ఎస్ ధోనీ’ చిత్రంతో ఉత్తరాదిన గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా మహేశ్ సరసన ‘భరత్ అనే నేను’ చిత్రంలో నటిస్తూ దక్షిణాదిన తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఆ సినిమా సెట్స్ మీద ఉండగానే మరో అవకాశాన్ని అంది పుచ్చుకుంది. రామ్‌చరణ్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో ఇటీవల ప్రారంభమైన చిత్రంలోనూ కైరా కథానాయికగా మెరవనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ జరుగుతోంది.

నిధి ‘సవ్యసాచి’...


నిధి అగర్వాల్


నాగచైతన్య

టైగర్ ష్రాఫ్ సరసన ‘మున్నా మైఖేల్’ చిత్రంతో బీటౌన్‌లోకి అడుగుపెట్టిన కర్ణాటక సుందరి నిధి అగర్వాల్. కపిల్‌శర్మ షోతో గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు తొలి సినిమా ఏ మాత్రం గుర్తింపు తీసుకురాలేదు. రూట్ మార్చి ఏడాది కాలంలోనే తెలుగు సినిమాలో అవకాశం అందుకుంది. ప్రస్తుతం ‘సవ్యసాచి’లో నాగచైతన్య సరసన నిధి అగర్వాల్ నటిస్తోంది.

తొలిప్రేమలో...


వరుణ్‌తేజ్


సప్న పబ్బి

‘24’ టెలివిజన్ సీజన్‌పాటు ‘గర్ ఆజా పరదేశీ’, ‘ద ట్రిప్’ సీరియళ్లలో బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకున్న లండన్ బ్యూటీ సప్నపబ్బి. 2015లో ‘కామోషీయన్’ చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ‘తొలిప్రేమ’ చిత్రంతో ఇప్పుడు తెలుగుతెరకు పరిచయం కానుంది. అందులో కీలక సన్నివేశాలతోపాటు ‘సునోనా సునైనా’ పాటతో అలరించేందుకు సప్నపబ్బి సిద్ధమవుతోంది.

చివరిగా తీసిన నాన్న ఫొటో ఇదే

- నాగార్జున



ఎన్నో సందర్భాల్లో ఆయన అన్నట్లుగానే చివరి శ్వాసవరకూ నటుడిగా కొనసాగారు అక్కినేని నాగేశ్వరరావు. ‘మనం’ ఆయన నటించిన చివరి చిత్రం. సోమవారానికి ఏయన్నార్ మరణించి నాలుగేళ్లు. ఈ సందర్భంగా ఆయన తనయుడు నాగార్జున తాను ఆఖరిగా తీసిన తండ్రి ఫొటోను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. “మీరు మమ్మల్ని వదిలి నాలుగేళ్లు కావొస్తుంది. ఇప్పుడు మేం చేయగలిగేది మిమ్మల్ని గుర్తు చేసుకుని నవ్వుకోవడమే. నా ఫోన్‌లో ఆఖరిగా తీసిన నాన్న ఫొటో ఇదే” అని నాగ్ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. ‘మనం’ షూటింగ్‌లో తీసిన ఆ ఫొటో నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

అవసరమైతే సొంత డబ్బులు ఖర్చుపెడతా!

- మోహన్‌బాబు



“మోహన్‌బాబు మాటలు గర్వంగా, అహంకారంగా ఉంటాయి కానీ... హృదయం చూస్తే వెన్నపూస. ఆయన గొప్ప భక్తుడు. దేవస్థానం ఛైర్మన్‌గా ఆయనకు ఈ రోజుతో కొత్త జీవితం ప్రారంభమవుతుంది” అన్నారు విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామి. సోమవారం ఆయన ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానం ఛైర్మన్‌గా మోహన్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ “మనసా వాచా చెబుతున్నా... నేను ఛైర్మన్‌గా చేయాలనుకోలేదు. 6 నెలలుగా కాజ సూర్యనారాయణ, ఆదిశేషగిరి రావు వెంటపడినా... కుదరదని చెప్పా. చివరకు, మా ఈశ్వరుడు (టి. సుబ్బరామిరెడ్డి) ప్రత్యక్షమయ్యారు. ఇక, సరేనన్నాను. దైవ సన్నిధానం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా. ఇంతకు ముందు ఏం చేశారన్నది కాదు. ఇకపై, సినిమా నటులను చూడాలని ప్రజలు ఏవిధంగా ఎగబడతారో... ఆ విధంగా దేవాలయాలకు వచ్చేలా చేయడం కష్టమైనా కృషి చేస్తా. నాతో పాటు కమిటీలో సభ్యులుగా ఎన్నికైన ఆడపడుచులకు అభినందనలు. 18 దేవాధిదేవతల ఆశీసులతో మంచి కార్యక్రమాలు చేపడతాం. దేవుడి డబ్బులు ముట్టుకోకుండా నా సొంత డబ్బులు ఖర్చుపెట్టైనా అభివృద్ధి పనులు చేపట్టాలని సంకల్పిస్తున్నా. మనలో కమ్మ, కాపు, రెడ్డి కులాలు ఉన్నట్లే... బ్రాహ్మణుల్లో శాఖలున్నాయి. వాళ్లందర్నీ ఒక్కటే కోరుతున్నా... నన్ను ప్రేమించండి. నేనూ మిమ్మల్ని ప్రేమిస్తా. అందరం కలసి భగవంతుడికి సేవ చేసుకుందాం. నా అల్లుడు కూడా బ్రాహ్మణోత్తముడే” అన్నారు. నటుడు గిరిబాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, వ్యాపారవేత్త రఘురామరాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి సురేఖ, నిర్మాత సురేశ్‌బాబు సతీమణి లక్ష్మీ, బీవీ రాజేంద్రప్రసాద్ తనయుడు ప్రసాద్, చాముండేశ్వరీనాథ్, కొమటిరెడ్డి వెంకటలక్ష్మీ, జి. వెంకటలక్ష్మీ తదితరులు ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానం కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఈ కార్యక్రమంలో టి.సుబ్బరామిరెడ్డి, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఈ విజయంతో పరిశ్రమ ఆనందిస్తోంది

- బాలకృష్ణ


కల్యాణ్, బాలకృష్ణ, రామ్, లక్ష్మణ్, రవికుమార్, సి.వి. రావు, రత్నం

“నాకెంతో గర్వంగా ఉంది. ఈరోజు నిర్మాతల పరిస్థితి మనకు తెలుసు. పంపిణీదారులను పక్కన పెడితే... ఇండస్ట్రీలో నిర్మాతకు గతి లేదు. నాలుగు గోడల మధ్య నటుడు-దర్శకుడు ఏం మాట్లాడుకుంటున్నారో తెలీదు. ఏం పేరుతో బయటకొస్తారో... ఎవర్ని పెట్టమంటారో (సినిమాలో) తెలీదు. నేను మాత్రం నిర్మాతలకు విలువిస్తా. ప్రతి విషయంలో వాళ్లను భాగస్వాములను చేస్తా” అన్నారు బాలకృష్ణ. ఆయన హీరోగా కేయస్ రవికుమార్ దర్శకత్వంలో సి. కల్యాణ్ నిర్మించిన ‘జై సింహ’ 50కోట్ల క్లబ్‌లో చేరిన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విజయోత్సవ వేడుక నిర్వహించారు. డిస్ట్రిబ్యూటర్లతో కలసి సంతోషాన్ని పంచుకున్నారు. వారికి బాలకృష్ణ షీల్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ “ఇవాళ ‘జై సింహ’ కనకవర్షం కురిపిస్తూ... డిస్ట్రిబ్యూటర్లకు ఆనందాన్ని కలిగించింది. ఈ సినిమా హిట్టయినందుకు చిత్రపరిశ్రమ అంతా ఆనందపడుతోంది. నా సినిమాలన్నీ రికార్డులే. నాకు లెక్కలు గుర్తుండవు. అయితే... నాకు రికార్డులు కాదు, ఇండస్ట్రీ బాగోవడం కావాలి. అదే ముఖ్యం” అన్నారు. నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ “ఇప్పుడు చిత్రపరిశ్రమలో వంద లేదా యాభై రోజుల పండగలు లేవు. ఎన్ని కోట్లు అనే పండగ మొదలైంది. అందులో మేం మొదటి పది రోజుల్లో 50 కోట్ల పండగ చేసుకునేటువంటి అవకాశం ఇచ్చిన డిస్ట్రిబ్యూటర్లకు, ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు” అన్నారు. కేయస్ రవికుమార్ మాట్లాడుతూ “డబ్బుల కంటే ఇందరి ఆత్మీయతే సిసలైన అవార్డు. ‘బాలకృష్ణగారికి బి, సి సెంటర్లలో ఎక్కువమంది ప్రేక్షకులున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని సినిమా చేయండి’ అని చిత్రీకరణ సమయంలో చాలా మంది చెప్పారు. ఎ సెంటర్లలో సినిమా ఎలా ఆడుతుందో... డిస్ట్రిబ్యూటర్లు ఇప్పుడే చెప్పారు. 50 కోట్లు కాదు.. 100 కోట్లు వసూలు చేస్తుందనే నమ్మకముంది. మా టీమ్ అందరికీ థ్యాంక్స్” అన్నారు. ఈ వేడుకలో నిర్మాత కమ్ డిస్ట్రిబ్యూటర్ ఎన్వీ ప్రసాద్, డిస్ట్రిబ్యూటర్లు సునీల్ నారంగ్, శివారెడ్డి, ఫణి, రమేశ్, విజయ్, మహేశ్, కృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్‌లా ఉండాలనుకున్నా!

- విక్రమ్


విక్రమ్, తమన్నా

“సురేశ్‌బాబుగారు ఎప్పట్నుంచో తెలుసు. ఆయనెప్పుడూ మంచి మాటలే చెబుతారు. తెలుగులో ఆయన సినిమా విడుదల చేస్తున్నారనగానే సంతోషంగా ఫీలయ్యా. నాకు బాగా గుర్తు... ‘బంగారు కుటుంబం’ చిత్రీకరణలో నేనో పక్కనుంటే వెంకటేశ్ పిలిచి చాలా బాగా మాట్లాడారు. అప్పుడు నేను పెద్ద హీరో అయిన తర్వాత ఆయనలా ఉండాలనుకున్నా. వెంకటేశ్ నుంచి ఎంతో స్ఫూర్తి పొందొచ్చు” అని హీరో విక్రమ్ అన్నారు. విక్రమ్, తమన్నా జంటగా విజయ్ చందర్ దర్శకత్వంలో కలైపులి ఎస్. థాను నిర్మించిన ‘స్కెచ్’ను తెలుగులో సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. సురేశ్‌బాబు విడుదల చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రచార చిత్రాల్ని ఆవిష్కరించారు. అనంతరం సురేశ్‌బాబు మాట్లాడుతూ “స్మాల్ స్టార్ టు సూపర్‌డూపర్ స్టార్‌గా విక్రమ్ ఎదగడాన్ని చూశా. 25 ఏళ్ల క్రితం ఎలా ఉన్నాడో... ఇప్పుడూ అలానే, ఇంకా ఫిట్‌గా ఉన్నాడు. తమన్నా కూడా అంతే. ‘కొంచెం ఇష్టం కొంచెం కష్టం టైమ్‌లో ఎలా ఉందో... ఇప్పుడూ అలానే ఉంది. వాళ్లను చూస్తుంటే నాకు వయసు అయిపోయిందని అనిపిస్తుంది. ‘స్కెచ్’ తెలుగులో మంచి హిట్టవుతుందని ఆశిస్తున్నా. ప్రతి వారం మంచి సినిమాలు రావాలి. ఎక్కువ సినిమాలు బాగా ఆడితే... ఎక్కువమంది ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. చిత్రపరిశ్రమ మనుగడ ఉంటుంది” అన్నారు. తమన్నా మాట్లాడుతూ “నటిగా కెరీర్ ప్రారంభించినప్పట్నుంచి విక్రమ్‌తో నటించాలనుకుంటున్నా. పదేళ్ల తర్వాత ఇప్పటికి కుదిరింది. నేను కమర్షియల్ సినిమాకి పెద్ద ఫ్యాన్‌ని. ఈ స్క్రిప్ట్ విన్నప్పుడు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనుకున్నా. ఎందుకంటే... రొమాంటిక్ ట్రాక్‌ని బాగా రాశారు. డైలాగ్స్ బాగుంటాయి” అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు విజయ్ చందర్ పాల్గొన్నారు.

ట్రైలర్ కంటే పదింతలు ఎక్కువ!

- జయం రవి


జయం రవి, నివేద

“ప్రచార చిత్రాల్లో (టీజర్, ట్రైలర్) ప్రేక్షకులు చూసినదాని కంటే చిత్రంలో పదిరెట్లు ఎక్కువుంటుంది. ఇండియాలో తొలి స్పేస్ చిత్రమిది. ఇలాంటి వైవిధ్యమైన చిత్రాలు చేయడం మీకెలా కుదురుతుందని కొందరు అడుగుతున్నారు. ఎందుకు కుదరదు? అనేది నా ప్రశ్న. అందరూ నెగిటివ్‌గా చూసిన విషయంలో నేను పాజిటివ్ తీసుకుని చిత్రాలు చేస్తున్నా” అన్నారు ‘జయం’ రవి. ఆయన హీరోగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా ‘టిక్ టిక్ టిక్’. నివేదా పెతురాజ్ హీరోయిన్. శక్తి సౌందర్‌రాజన్ దర్శకుడు. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ “అమెరికన్ ఫిల్మ్, హాలీవుడ్ స్థాయిలో తీసిన చిత్రమిది. మేం విడుదల చేసిన ‘బిచ్చగాడు’లో ఎంత మంచి ఎమోషన్, సెంటిమెంట్ ఉన్నాయో... ‘టిక్ టిక్ టిక్’లోనూ అంతే మంచి భావోద్వేగాలున్నాయి. ట్రైలర్‌లో చిన్నపిల్లాడు ‘డాడీ... డాడీ’ అనే షాట్ మనసుకు హత్తుకుంది. ఇటువంటి చిత్రాలను ఆదరిస్తే.. మరిన్ని మంచి చిత్రాలొస్తాయి” అన్నారు. చదలవాడ లక్ష్మణ్ మాటాడుతూ “మా హీరో ‘జయం’ రవిగారు చెప్పినట్టు ఇటువంటి చిత్రాలను ఫోనులు, కంప్యూటర్లలో చూస్తే కిక్ ఉండదు. లార్జర్ దేన్ లైఫ్ చిత్రమిది. హాలీవుడ్‌లో ప్రతి ఏడాది రెండుమూడు స్పేస్ చిత్రాలొస్తాయి. మన దేశంలో ఎవరూ ఇప్పటివరకూ ఈ పాయింట్ టచ్ చేయలేదు” అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు అజయ్, అల్లాణి శ్రీధర్ పాల్గొన్నారు.

‘జయమాలిని’ పాటలు వచ్చేశాయ్!



నల్రా శివనాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ‘జంక్షన్‌లో జయమాలిని’ చిత్రం ఆడియో మార్కెట్‌లోకి విడుదలైంది. కావ్యా కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రవికాంత్ హీరో. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆడియో సీడీని ఆవిష్కరించి, దర్శకనిర్మాత సాయివెంకట్‌కు, ‘కథక్ కళాక్షేత్ర’ అంజిబాబుకు అందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని నిర్మాతలు ఎం.ఈరేశ్‌బాబు, కృష్ణవర్ధన్ ఎడ్ల, జి.నాగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో కావ్యా కపూర్, మిస్ వైజాగ్ మేఘన తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణులు గర్వపడేలా...

- జి. నాగేశ్వరరెడ్డి

“బ్రాహ్మణుల నేపథ్యంలో చిత్రమనగానే నిర్మాతలతో వద్దని చెప్పేశా. ‘దేనికైనా రెడీ’ అనుభవం దృష్ట్యా ఎందుకని అనుకున్నా. కానీ, మా నిర్మాతలు ఒక్కసారి కథ వినమన్నారు. విపరీతంగా నచ్చడంతో అంగీకరించా. బ్రాహ్మణులు గొప్పగా ఫీలయ్యే చిత్రమిది. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో వాళ్ల గురించి గొప్పగా చెప్పే సన్నివేశాలు ప్రతి ఒక్కర్నీ ఆకట్టుకుంటాయి” అన్నారు జి. నాగేశ్వరరెడ్డి. మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా ఆయన దర్శకత్వంలో కీర్తిచౌదరి, కిట్టు నిర్మించిన సినిమా ‘ఆచారి అమెరికా యాత్ర’. ఎం.ఎల్. కుమార్‌చౌదరి సమర్పకులు. ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా గురించి నాగేశ్వరరెడ్డి చెప్పిన విశేషాలివీ...



- తాత-మనవరాలి సెంటిమెంట్‌తో నడిచే చిత్రమిది. ప్రమాదంలో ఉన్నవారిని బ్రాహ్మణులు ఎలా కాపాడారనేది చిత్రకథ. తాతగా కోట శ్రీనివాసరావు, మనవరాలిగా ప్రగ్యా, ఆచారులుగా విష్ణు, బ్రహ్మానందంలు నటించారు. మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు ప్రత్యేకంగా సినిమా కోసం రాసిన కథ ఇది. సినిమా ప్రారంభయ్యాక, చిత్రీకరణ టైమ్‌లోనూ కొందరు బ్రాహ్మణులు ఫోనులు చేశారు. ‘మళ్లీ ఇబ్బందులు వస్తాయేమో చూసుకోండి’ అని. అటువంటి ఇబ్బందులు వచ్చే సన్నివేశాలు ఏం లేవు. వందశాతం బ్రాహ్మణులు గర్వపడేలా ఉంటుందీ సినిమా.
- విష్ణుకి, మీకు మంచి కెమిస్ట్రీ కుదిరినట్టుందని అడుగుతున్నారు. నిజం చెప్పాలంటే... విష్ణుకీ, నాకూ కామెడీతో కెమిస్ట్రీ కుదిరింది. మాకు నవ్వడం, నవ్వించడం బాగా తెలుసు. అందుకనే, మళ్లీ మళ్లీ సినిమాలు చేస్తున్నాం. నా తదుపరి సినిమా కూడా విష్ణుతోనే చేస్తున్నా. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం. విష్ణుకి ప్రమాదం జరగడం వల్ల నిర్మాణ వ్యయం పెరిగిన మాట వాస్తవమే. అయితే... హిట్ కాంబినేషన్ కావడంతో సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. నిర్మాతకు లాభాలు వస్తాయని ఆశిస్తున్నా.
- కామెడీ చిత్రాల దర్శకుడనే ఇమేజ్ రావడం అదృష్టం. కామెడీ లేకుండా సినిమాలు తీయాలని నేను అనుకోవడం లేదు. తెలుగులో కామెడీ సినిమాలు ఎక్కువగా ఎందుకు రావడం లేదనే ప్రశ్నకు సమాధానంగా “హీరోలపై ఆధారపడిన విషయమది. నాకు తెలిసి చిరంజీవిగారి కంటే పెద్ద స్టార్ లేరు. ఆయన ఫుల్‌లెంగ్త్ కామెడీ సినిమాలు చేశారు. రాజేంద్రప్రసాద్‌గారు, ‘అల్లరి’ నరేశ్‌లు చేస్తున్నారు. హీరోలు చేయాలనుకుంటే వస్తాయి” అన్నారు.




అమెరికా పౌరసత్వంలో..

మనోళ్లే టాప్

వాషింగ్టన్: అమెరికా పౌరసత్వం.. చాలామందికి అదొక కల! ముఖ్యంగా భారతీయుల్లో ఆ కోరిక ఎక్కువ. అందుకు తగ్గట్టుగానే.. 2005-2015 మధ్య అమెరికా పౌరసత్వం పొందినవారిలో భారతీయులు, ఈక్వెడార్‌వాసులు ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'ప్రపంచ వలస నివేదిక-2018' ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా వలసదారుల్లో భారతీయులు 1.56 కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా, న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్.. ఇలా పలు రాష్ట్రాలన్నీ భారతీయులతో నిండిపోయాయి. సింగపూర్‌లో 'లిటిల్ ఇండియా' పేరుతో ఓ జిల్లానే ఉండడం గమనార్హం. ఇక మైక్రోసాఫ్ట్, అమెజాన్, బోయింగ్ వంటి సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థలకు నిలయమైన సియాటెల్ ఉద్యోగుల్లో 40% మంది విదేశాల నుంచి వచ్చిన వాళ్లే. ఆ విదేశీ ఉద్యోగుల్లోనూ 40 శాతానికి పైగా భారతీయులే కావడం విశేషం. చైనా టెకీలు 13.5%తో రెండో స్థానంలో నిలిచారు. మరోవైపు సిలికాన్ వ్యాలీలోని ఐటీ కంపెనీల్లోనూ 70 శాతానికి పైగా విదేశీ ఉద్యోగులే ఉన్నారని 'ద సియాటెల్ టైమ్స్' పత్రిక తెలిపింది.

ప్యూ రిసెర్చ్ సెంటర్ గణాంకాల ప్రకారం..

- మనకంటే అత్యధికంగా.. వియత్నాం (86%) ఇరాన్‌వాసులు (85%) 2015లో అమెరికా పౌరసత్వం పొందారు.
- అమెరికా పౌరసత్వం పొందిన మనవాళ్ల సంఖ్య పెరిగితే.. హోండురాస్, చైనా దేశాల ప్రజల సంఖ్య తగ్గడం గమనార్హం.
- 2005 నుంచి 2015 నడుమ దాదాపు 85 లక్షల పౌరసత్వ దరఖాస్తులు రాగా.. వాటిలో 10 లక్షల పౌరసత్వ దరఖాస్తులను అమెరికా ప్రభుత్వం తిరస్కరించింది.





గల్ఫ్ దేశాల్లో ఉంటున్న కార్మికులు దేశానికి అపారమైన విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి పెడుతున్నారు. వారు సగటున ఒక్కొక్కరు నెలకు రూ.10 వేలు పంపిస్తున్నారని అంచనా. 10 లక్షల మంది కార్మికుల నుంచి నెలకు రూ.1000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం భారత్‌కు చేరుతోంది. ఇక, తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు కూడా నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల ఆదాయం చేరుతోంది. కార్మిక శక్తిని ఎగుమతి చేసి, ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి.

-ఆంధ్రజ్యోతి,జగిత్యాల/రాజంపేట

గల్ఫ్ గోస!

భారత్ నుంచి 10 లక్షల మంది గల్ఫ్‌లో

వారి ద్వారా వెయ్యి కోట్ల విదేశీ మారకం.. తెలంగాణ ఖజానాకు 50-60 కోట్లు

అయినా, గల్ఫ్ కార్మికులపై శీతకన్ను.. గత 40 నెలల్లో 600కుపైగా శవపేటికలు

భార్యాపిల్లలకు కడుపునిండా బువ్వ పెట్టాలనే తపనతో దేశం కాని దేశం పోతున్న తెలంగాణ బడుగుల బతుకులు అక్కడే బుగ్గిపాలవుతున్నాయి. ఏజెంట్ల చేతిలో మోసపోయి సరైన ఉపాధి లభించక.. వాతావరణం పడక అనారోగ్యానికి గురై అక్కడే ప్రాణాలను విడుస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ రికార్డుల ప్రకారం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 40 మాసాల్లో గల్ఫ్‌లో దాదాపు 600 మందికిపైగా తెలంగాణకు చెందిన బడుగులు ప్రాణాలు విడిచారు. గల్ఫ్ దేశాల్లో ఇంటిపని, వంటపని, నర్సింగ్, ఇతర పనులు చేసేందుకు వెళ్లే మహిళల రక్షణ కోసం కేంద్రం అమలు చేస్తున్న నిబంధనలు నీరుగారిపోతున్నాయి. ఇటు ఏజెంట్లు, అటు విమానయాన సంస్థలు కలిసి భద్రతకు ఎలాంటి 'హామీ' లేకుండానే మహిళలను విమానం ఎక్కిస్తున్నారు. చివరి నిమిషంలో ఒక్కో టికెట్‌కు రూ.35 వేలు వసూలు చేసి ఖాళీ సీట్లు నింపుకొంటున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత, దేశంకాని దేశంలో వారు నరకయాతన పడుతున్నారు. దాంతో, కేంద్రం రంగంలోకి దిగింది. కువైత్, దుబాయ్, ఖతార్ తదితర దేశాల్లో మహిళలకు ఉపాధి కల్పించే షేకులు వీసాతోపాటు తమ ప్రభుత్వం ద్వారా హామీ పత్రం సమర్పించాలనే నిబంధన విధించింది. ఆ మహిళ పేరిట బ్యాంకులో కనీసం రూ.2 లక్షలు డిపాజిట్ చేయాలి. ఆ మహిళకు ఎటువంటి నష్టం జరిగినా, ప్రాణహాని జరిగినా వారే బాధ్యత వహించాలి. అయితే... ఇలాంటి హామీలు ఇచ్చేందుకు చాలా మంది షేక్‌లు నిరాకరిస్తున్నారు. "మేము వీసా పంపుతాం. మీ భద్రతకు మా పూచీ లేదు. హామీ పత్రాలు ఇవ్వం... వస్తే రండి.. రాకుంటే పోండి" అని తేల్చి చెబుతున్నారు. దీంతో...కొందరు ఏజెంట్లు విమానయాన సంస్థలతో చేతులు కలుపుతున్నారు. హామీ పత్రాలను జత చేయకుండా వచ్చిన వీసాలతోనే మహిళలను విమానం ఎక్కిస్తున్నారు. ఆరు నెలలుగా ప్రతి రోజూ కడప, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కరీంనగర్, వరంగల్, తూర్పు, పశ్చిమ గోదావరి, నల్లగొండ తదితర జిల్లాల నుంచి వందలాది మహిళలను ఇలా పంపిస్తున్నారు. చివరి నిమిషంలో గరిష్ఠ ధరతో టికెట్లు కొనిపిస్తుండడంతో విమానయాన సంస్థలు భారీ లాభాలను కళ్లజూస్తున్నాయి. పీసీసీ, ఇమిగ్రేషన్, మెడికల్ చెకప్, ఫ్లైట్ టికెట్ అంటూ ఏజెంట్లు భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు. అప్పులు చేసి, ఇంత ఖర్చు పెట్టి, హామీ లేకుండా గల్ఫ్ వెళ్తున్న మహిళలు... తమ జీవితాలను తామే అపాయంలోకి నెట్టుకుంటున్నారు.

గల్ఫ్ పాలసీ ఎక్కడ?

తాము అధికారంలోకి వస్తే, గల్ఫ్ బాధితుల సమస్యలను పరిష్కరిస్తామంటూ టీఆర్ఎస్.. తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది.అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ బాధితుల గోడును అంతగా పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. కేటీఆర్.. తెలంగాణ ప్రవాసీయుల వ్యవహారాల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నా, గల్ఫ్ పాలసీ అమలు చేయడంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి.



ఇవీ పరిష్కారమార్గాలు

గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. సచివాలయంలో ఉన్న ఎన్ఆర్ఐ సెల్ అందరికీ అందుబాటులో ఉండేలా చేయడంతోపాటు ప్రతి జిల్లా కార్యాలయంలో ఎన్ఆర్ఐ విభాగం ఏర్పాటు చేయాలని అంటున్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు రిక్రూటింగ్ వ్యవస్థపై నిరంతరం నిఘా పెట్టి ఏజెంట్లను నియంత్రించాలి. గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్నవారి విడుదలకు సహకరించాలి. హైదరాబాద్‌లోనూ సౌదీ ఎంబసీ ఏర్పాటు చేయాలి.

కేరళ తరహాలో ప్యాకేజీ కల్పించాలి



"గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేరళ తరహాలో ప్యాకేజీ ఇవ్వాలి. గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు సాయం అందించాలి."

-షేక్ చాంద్ పాషా, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

అక్కడి ఎంబసీల్లో తెలుగువారుండాలి



గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి. గల్ఫ్ దేశాల్లోని రాయబార కార్యాలయాల్లో తెలుగువారిని నియమించాలి. గల్ఫ్‌లో నివసిస్తున్న వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదు"

-కడార్ల రంజిత్ కుమార్, ప్రవాసీ మిత్ర సలహాదారు

'మోరి' సూత్రధారి సాల్మన్!

- ఆ ఊరి బిడ్డే 'గ్రిడ్'ను తెచ్చారు.. టీవీ,నెట్, ఫోన్‌తో ఫైబర్ విప్లవం
- ఏపీలో స్మార్ట్ విలేజ్‌లకు రూపకర్త.. విదేశాల్లో స్థిరపడ్డా, ఏపీకి సాయం
- 5జిల్లాలు.. 472గ్రామాల్లో శ్రీకారం

'మోరి' గుర్తుందా? ఫైబర్ గ్రిడ్‌ను అనుసంధానించిన తొలి గ్రామం ఇది! టీవీ, ఇంటర్నెట్, ల్యాండ్ ఫోన్‌లను రూ.149లకే అందుకొంటూ..ఐకాన్ విలేజ్‌గా నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ఈ గ్రామం వందశాతం నగదురహితం సాధించి.. స్మార్ట్ విలేజ్‌గానూ మెరిసింది. మారుమూల గ్రామం 'మోరి'ని రాష్ట్రపటంలో నిలిపిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదికాగా, దీనివెనుక సూత్రధారి మాత్రం సాల్మన్ డార్విన్. ఈ గ్రామం నుంచి పదహారేళ్ల ప్రాయంలో విదేశాలకు వెళ్లిన డార్విన్.. 'మోరి' విజయంలో కీలక భూమిక పోషించడం విశేషం. అయితే, ఒక్క తన ఊరునే కాదు, పల్లెలన్నింటినీ పరుగులెత్తించే ప్రణాళికలతో డార్విన్ ముందుకెళుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశంతో 'స్మార్ట్ విలేజ్' ఫార్ములాను ఐదు జిల్లాల్లోని, 472 గ్రామాలకు విస్తరించేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రతి అడుగులో స్మార్ట్..

మోరికి చెందిన నల్లి సాల్మన్, జెస్సీ దంపతుల కుమారుడు సాల్మన్ డార్విన్. తన తల్లిదండ్రులతోపాటు అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అక్కడి బర్కిలీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఒక వ్యక్తి ఒక సంస్థను స్థాపించి సుదీర్ఘకాలంపాటు రాణించడానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధంచేసి ఇవ్వడంలో డార్విన్‌ది అందవేసిన చేయి. ఇప్పటికి 20దేశాలకు పైగా ఆయనను ఆహ్వానించి, వ్యాపార మెళుకువలపై సూచనలు పొందాయి. తాను పనిచేస్తున్న యూనివర్సిటీలో ఒబామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుకు డార్విన్ నాయకత్వం వహించారు. సరిగ్గా ఇదే సమయంలో, కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు ఏర్పడ్డాయి. వారి నాయకత్వంలో అటు నగరాలు, ఇటు పల్లెల్లో సాంకేతిక చైతన్యం వెల్లివిరియడం మొదలయింది. బెంగళూరులోని ఒక యూనివర్సిటీలో ఒబామా ఫౌండేషన్ తరఫున స్మార్ట్ సిటీలపై డార్విన్ చేసిన ప్రసంగం అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం.వెంకయ్యనాయుడుని ఆలోచింపజేసింది. డార్విన్‌ను వారు ప్రత్యేకంగా పిలిపించుకొని మాట్లాడారు. ఆ భేటీ ఫలితంగా భారత్‌లో స్మార్ట్ సిటీల భావన తలెత్తింది. తన జన్మభూమి ఏపీలో స్మార్ట్ సిటీల రూపకల్పనపై డార్విన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఐదు పట్టణాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేసే పనిలో ఉన్నారు.



మలుపు తిప్పిన ఆలోచన..

స్మార్ట్ సిటీల అభివృద్ధిలో భాగంగా విశాఖ పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే బాధ్యతను డార్విన్ స్వీకరించారు. ఆ ప్రాజెక్టును కొనసాగిస్తున్న సమయంలో ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. ముఖ్యమంత్రిని కలుసుకొని తన ఆలోచనలను ఆయనతో పంచుకొన్నారు. 'గో.. ఎహెడ్' అంటూ సీఎం అందించిన ఉత్సాహంతో డార్విన్ గత అక్టోబరులో పని పెట్టారు. అందులోభాగంగా రాష్ట్రంలో తొలి సారి ఆయన స్మార్ట్ విలేజ్‌లకు శ్రీకారం చుట్టారు. దానికోసం తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గంలోని మోరి, మోరిపోడు గ్రామాలను ఎంచుకొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఈ గ్రామాలకు ఫైబర్ గ్రిడ్‌ను అనుసంధానంచేశారు. రూ.149కే టీవీ, ఇంటర్నెట్ కనెక్షన్, ల్యాండ్ ఫోన్‌తో గ్రిడ్ కనెక్షన్‌ను ఇచ్చారు. నిజానికి, గ్రిడ్ అనుసంధానానికి వేలాది కోట్ల రూపాయలు అవసరం. అలాంటిది చాలా తక్కువ ఖర్చుతో, ఎక్కువ ప్రయోజనం అందించేలా ఈ ప్రాజెక్టును డార్విన్ ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారు. స్థానికంగా ఉన్న సబ్‌స్టేషన్లు, ఇతర సౌకర్యాలను వాడుకొని, ఈ ప్రక్రియను ఆయన పూర్తిచేశారు. – అమలాపురం



చంద్రబాబుతో ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, ఆయన బృందం (ఫైల్)



ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: భారతీయ పాస్‌పోర్టులో తల్లిదండ్రులు, భార్యాభర్తల పేర్ల వివరాలు, చిరునామా కలిగిన చివరి పేజీ తొలగించాలని కేంద్రం నిర్ణయించడంతో గల్ఫ్ దేశాల్లోని ప్రవాసీయులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి కోసం ఇక్కడికి వచ్చిన కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే.. పాస్‌పోర్టులోని చివరి పేజీలో గల వివరాల ఆధారంగా వారి వారి కుటుంబ

గల్ఫ్‌లోని భారతీయులకు మరిన్ని కష్టాలు

పాస్‌పోర్ట్ చివరిపేజీ తొలగింపే కారణం

సభ్యులకు సమాచారం తెలిపేవీలుండేది. కానీ.. తాజాగా కేంద్రం తీసుకున్న నూతన విధానం ప్రకారం ఈ తరహా కేసుల్లో కాగితాలన్నీ పూర్తి చేసి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రియాద్, జెద్దా, మస్కట్ నగరాల్లోని భారతీయ ఎంబసీలకు తెలియజేయాల్సి ఉంటుంది. వారు బార్‌కోడ్ల నుంచి సమాచారాన్ని సేకరించి జిల్లా కలెక్టర్ల ద్వారా మృతుల కుటుంబాలకు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ బ్యూరోక్రసీ విధానం వల్ల మరింత జాప్యం జరిగేందుకు అవకాశం ఉంటుంది. దీనికి తోడుగా నేరుగా గల్ఫ్‌లోని ఘటనల గురించి ప్రవాసీయుల కుటుంబాలకు సమాచారం తెలియకుండా కేవలం భారతీయ అధికారవర్గాల ద్వారా అవసరమైన మేరకు ఇవ్వడానికి ఈ విధానం ఉపయోగపడి అధికారులకు తలనొప్పిలు తప్పనున్నాయి. ప్రవాసీయులు చట్టపరంగా ఆధార్ లేదా ఎలక్షన్ గుర్తింపు కార్డులకు అనర్హులు. పాస్‌పోర్టులోని చిరునామా వివరాల ఆధారంగా వారు ఇప్పటి వరకు భారతదేశంలో వివిధ చోట్ల అతి కష్టంగా నెగ్గుకొస్తున్నారు. ఇక చిరునామా లేకపోతే వారికి స్వదేశంలో సవాలక్ష సమస్యలు ఎదురుకానున్నాయి.

జర్మనీ అక్కడ... మనమెక్కడ?

- 70 ఏళ్ల క్రితం ఒకేసారి మొదలైన ప్రస్థానం.. అభివృద్ధిలో అగ్రస్థానాన జర్మనీ
- అభివృద్ధి చెందుతూనే ఉన్న భారత్.. నైపుణ్యం, క్రమశిక్షణలే ఇద్దరిలో తేడా

జర్మనీ, భారత్... దాదాపు డెబ్బయ్యేళ్ల క్రితం రెండు దేశాలు సున్నా నుంచి తమ ప్రస్థానం మొదలెట్టాయి. రెండో ప్రపంచ యుద్ధంలో సర్వనాశనమైన జర్మనీ, రెండొందలేళ్ల వలస పాలనలో సంపదలన్నీ కోల్పోయిన భారత్... కొత్త జీవితాన్ని ప్రారంభించాయి. ఈ డెబ్బయ్యేళ్లలో జర్మనీ అభివృద్ధి చెందిన దేశంగా అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. భారతదేశం మాత్రం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉంది. ఎందుకీ వ్యత్యాసం? కారణాలను పరిశీలిద్దాం.

-జర్మనీ నుంచి డా. గుంటూరు వనమాలి.

చరిత్రను అర్థం చేసుకుంటే వర్తమానం అర్థమవుతుంది. జర్మనీ సంపదకు, భారతదేశపు పేదరికానికి కారణాలున్నాయి. జర్మనీ పుట్టుకలోనే ప్రత్యేకత ఉంది. 25 చిన్న, పెద్ద రాజ్యాల ప్రజలు, రాజులు కలిసి అందరి మాతృభాష జర్మనే కనుక మనది ఒకే జాతి



అనే నిర్ణయానికి వచ్చారు. జర్మన్ మాట్లాడే అన్ని రాజ్యాల్ని, ప్రాంతాల్ని కలిపి 1871లో జర్మనీ దేశాన్ని సృష్టించుకున్నారు. అడ్డుపడ్డ శత్రు దేశాల్ని మూడు యుద్ధాల్లో ఓడించారు. ఆధునిక సమాజం అంగీకరించక పోయినా, యుద్ధంతోనే దేశంలో అభివృద్ధి వాతావరణం ఏర్పడుతుందని గ్రీకు తత్వవేత్తలు చెబుతారు. దేశం కుటుంబంగా మారి, శరవేగంతో అన్ని రంగాల్లోనూ ముందడుగు వేస్తుంది. జర్మనీ దేశంగా ఆవిర్భవించి 40 ఏళ్లు నిండకముందే ఆర్థిక, సైనిక బలిమితో అగ్రదేశాల శ్రేణిలో చేరింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల ఆధిపత్యాన్నే సవాల్ చేసింది. ఫలితంగా రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం కరువుతో వేల మంది జర్మన్లు చనిపోయారు, విద్యుత్ ఉత్పాదన సున్నకు దగ్గరగా వచ్చింది. జర్మన్ల సంకల్ప బలం, పట్టుదల, కృషి కారణంగా ఆ దేశం మళ్లీ నేలకు కొట్టిన బంతిలా పుంజుకుని అభివృద్ధి బాట పట్టింది. స్వల్పకాలంలోనే విద్యుదుత్పత్తి నాలుగు వేల రెట్లు పెరిగింది. ఇంతటి అభివృద్ధి ఎలా సాధ్యమయ్యింది? అంటే.. జర్మనులు గొప్ప శ్రమశీలురు. కాలాన్ని ప్రణాళికాబద్ధంగా విభజించుకోవడం, దాని ప్రకారం పని పూర్తి చేయడం చిన్నప్పటి నుంచి నేర్చుకుంటారు. వ్యవస్థ మొత్తం అలాంటి క్రమశిక్షణ జర్మనీలో కనపడుతుంది. బస్సులు, రైళ్లు.. ఒక్క నిమిషం కూడా తేడా లేకుండా ప్రయాణిస్తాయి. ఉద్యోగులు, కార్మికులు నిర్ణీత సమయాలకు కార్యాలయాలకు చేరుకుంటారు. ఆర్థిక వ్యవస్థ ఎలాంటి ఒడుదొడుకులూ లేకుండా పురోగమిస్తుంది.

పనిలో శిక్షణ.. పనిపై గౌరవం

జర్మనీ ప్రభుత్వం ఉద్యోగార్థులకు వారు ఎంచుకున్న వృత్తుల్లో 3 సంవత్సరాల పాటు తర్ఫీదు ఇప్పిస్తుంది. ఈ తర్ఫీదు వల్ల.. సామాన్య కార్మికుడు నిపుణుడుగా మారుతాడు. జర్మనీలో ఇలా పరీక్షాయుతమైన తర్ఫీదు లేనిదే ఏ వృత్తిలోనైనా పని చెయ్యడానికి అనుమతి దొరకదు. దర్జీ, వడ్రంగి, మెకానిక్, ఎలక్ట్రీషియన్, బేల్దారి.. ఎవరికైనా ఇదే షరతు. శిక్షణ పొందిన కార్మికులను జర్మనీ ప్రభుత్వం జాగ్రత్తగా చూసుకుంటుంది.

ఆదుకున్న అమెరికా

రష్యా కమ్యూనిజం నుంచి ప్రపంచాన్ని రక్షించే పేరుతో అమెరికా కోట్లాది డాలర్లతో జర్మనీని పునరుజ్జీవింపజేసింది. ఆ సాయంతో జర్మనీ సర్వతోముఖాభివృద్ధి సాధించింది. భారత్ పరిస్థితి భిన్నం. ప్రజాస్వామ్య దిగ్గజాలు భారత్ అభివృద్ధికి అవరోధాలు కల్పించడమేకాక, సైనిక నియంతృత్వం ఉన్న పాకిస్థాన్‌కు, కమ్యూనిస్టు నియంతృత్వం ఉన్న చైనాకు సహాయం చేశాయి. మనదేశం రక్షణ కోసమే చాలా ధనం వినియోగించాల్సి వచ్చింది. ప్లేటో చెప్పినట్లు.. 'సన్యాసుల పాలన' అంటే నిస్వార్థపరుల పాలన ఏర్పడాలి. దేశాభివృద్ధికి కంకణం కట్టుకున్న నిస్వార్థ దీక్షాపరులు శ్రమ పడితే మనం గమ్యాన్ని చేరవచ్చు.

ఎపిజివిబి శాఖల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్, రామచంద్రాపురంలోని అశోక్‌నగర్ శాఖలో తొలి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఎపిజివిబి) ప్రారంభించింది. తమకు 768 శాఖలున్నాయని, 75 శాఖల్లో ఆధార్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బ్యాంక్ చైర్మన్ వి నరసి రెడ్డి తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారి నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయడం లేదని, అయితే ఇప్పటికే ఆధార్ పొందిన వారు 30 రూపాయలు చెల్లించి ఆధార్‌లో చిరునామా, పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలను సవరించుకోవచ్చని ఆయన తెలిపారు.

భారత్ చక్రం తిప్పాలి

ఇండియా ఇంక్ సిఇఒల ఆకాంక్ష.. దావోస్‌లో అందరి చూపూ మోదీపైనే

దావోస్ (స్విట్జర్లాండ్): అమెరికా మరికొన్ని దేశాలు స్వీయ మార్కెట్ల రక్షణకు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టే విధంగా భారత్ చక్రం తిప్పాలని దేశీయ పారిశ్రామిక, వాణిజ్య రంగాల ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భారత్ రాజనీతిజ్ఞుడి (స్టేట్స్‌మ్యాన్) పాత్ర పోషించాలని భారతీయ కంపెనీల సిఇఒలు పలువురు సూచించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాల్లో ప్రధాని మోదీ పాల్గొంటున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక సంబంధాల విషయంలో ప్రపంచదేశాలతో భారత్ వైఖరి ఎలా ఉంటుందనే విషయాన్ని, ఈసారి డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ నోటి నుంచే వినాలని ప్రపంచదేశాల నాయకులతోపాటు అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మంగళవారం జరగనున్న డబ్ల్యుఇఎఫ్ ప్లీనరీ సమావేశాల్లో మోదీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సమావేశాల్లో భారత్ భవిష్యత్ విజన్‌ను అంతర్జాతీయ నాయకులకు తెలియజేస్తానని దావోస్‌కు బయలుదేరే ముందు ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న, భవిష్యత్‌లో ఎదుర్కోబోయే సవాళ్లపై దృష్టిపెట్టాలని వారిని కోరతానని ఆయన చెప్పారు.


మోదీ.. మోదీ..

డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో మోదీ ఏం చెప్తారని అందరిలోనూ ఆసక్తి పెరిగింది. ఎందుకంటే, ఈసారి సమావేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం హాజరుకాబోతున్నారు. అమెరికా కంపెనీలు ఉద్యోగాలు, లాభాలను స్వదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు చేపట్టిన చర్యలతోపాటు వారిపై కార్పొరేట్ పన్ను భారాన్ని తగ్గించిన విషయాలను ట్రంప్ ప్రస్తావించే అవకాశం ఉంది. డబ్లుఇఎఫ్ సమావేశాలకు జర్మన్ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని థెరెసా మే ఇంకా పలు దేశాల అధినేతలు పాల్గొననున్నారు.

అంబానీ నుంచి కొచ్చార్ వరకు..



ఈసారి దావోస్‌కు వెళ్లిన భారత పారిశ్రామిక రంగ ప్రముఖుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేష్ అంబానీ, బజాజ్ ఆటో చైర్మన్ రాహుల్ బజాజ్, భారతీ ఎంటర్‌ప్రైజ్ చీఫ్ సునీల్ మిట్టల్, జెఎస్‌డబ్ల్యు గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్, మహీంద్రా గ్రూపు అధినేత ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ సిఇఒ ఎన్ చంద్రశేఖరన్, ఐసిఐసిఐ బ్యాంక్ చీఫ్ చందా కొచ్చార్ ఇంకా పలువురు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లున్నారు.



సేల్స్, మార్కెటింగ్‌కు మధ్య సూక్ష్మ వ్యత్యాసాన్ని భారత్ అర్థం చేసుకోవాలి. దీనికి అనుగుణంగా భారత్ విజయగాథను ప్రపంచానికి రాజనీతివేత్త పాత్రలో ఒదుగుతూ వివరించాలి.
– ఉదయ్ కోటక్, ప్రముఖ బ్యాంకర్



భారత్ సాధించిన గొప్ప విజయాలను చాటిచెప్పేందుకు దావోస్ మంచి వేదిక. వాటిని ప్రపంచానికి తెలియజేసేందుకు మోదీని మించిన వ్యక్తెవరూ లేరు. గత సమావేశాల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరైనప్పుడు ప్రపంచ దేశాలన్నీ చైనాపై దృష్టిసారించాయి. ఈసారి మోదీ పాల్గొంటుండటంతో దృష్టి భారత్‌పై ఉండటం సహజం.
– అజయ్ సింగ్, స్పైస్‌జెట్ సిఇఒ



ఇప్పటికే పలు రంగాలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో వృద్ధి 7 శాతానికి చేరుకోవచ్చు. భారత్ గరిష్ఠ వృద్ధి బాటలో పయనిస్తున్న నేపథ్యంలో అన్ని రంగాల వారికి విస్తృతంగా అవకాశాలు పుట్టుకురావచ్చు
– చందా కొచ్చార్, ఐసిఐసిఐ బ్యాంక్ సిఇఒ

దావోస్‌లో భారత్ జపం!

- ఎక్కడ చూసినా మనోళ్ల ప్రచార బోర్డులే
- ఏ రోడ్డుకెళ్లినా ఇండియన్ లాంజ్‌ల దర్శనం
- దోశ, వడా పావ్ నుంచి పకోడీల వరకు చాలా చోట్ల దేశీయ వంటకాల విక్రయం

దావోస్: వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సమావేశాలకు వేదికైన దావోస్ నగరం పూర్తిగా భారత్‌మయమైపోయింది. ఏ భవనం పైన చూసినా, ఏ బస్సు పైన చూసినా భారత ప్రభుత్వం లేదా దేశీయ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులే దర్శనమిస్తున్నాయట. దావోస్‌లోని ఏ రోడ్డుకెళ్లినా మన దేశ ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన విశ్రాంతి గది (లాంజ్) ఒక్కటైనా కన్పిస్తోందట. భారత సర్కారుతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ అధికారుల కోసం అక్కడ ప్రత్యేకంగా లాంజ్‌లు ఏర్పాటు చేశాయి. ఇక ఆ లాంజ్‌ల్లో భారత్ వంటకాలనూ అందుబాటులోకి తెచ్చారు. చాయ్ నుంచి పకోడీల వరకు.. దోశ నుంచి వడా పావ్ వరకు విక్రయిస్తున్నారట. సోమవారం ప్రారంభమైన డబ్ల్యుఇఎఫ్ 48వ వార్షిక సమవేశాలు శుక్రవారం ముగియనున్నాయి. ఈసారి భారత్ నుంచి 130 మంది సిఇఒలు, 2000కు పైగా వ్యాపార అధినేతలు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 70 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.



ఈసారి 7.4 శాతానికి వృద్ధి

ఐఎంఎఫ్ అంచనా

వాషింగ్టన్/దావోస్: ఈ ఏడాది భారత్ ఆర్థిక వృద్ధిరేటు 7.4 శాతానికి చేరుకోగలదని, చైనా జిడిపి మాత్రం 6.8 శాతానికి పరిమితం కావచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేస్తోంది. దాంతో భారత్ ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వర్ధమాన దేశంగా అవతరించనుందని తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో గత ఏడాది వృద్ధి భారీగా తగ్గిన విషయం తెలిసిందే. జూన్ 2017తో ముగిసిన త్రైమాసికంలోనైతే వృద్ధిరేటు మూడేళ్ల కనిష్ఠ స్థాయి 5.7 శాతానికి పతనమైంది. వచ్చే ఏడాదిలో భారత్ జిడిపి వృద్ధి 7.8 శాతానికి ఎగబాకవచ్చని డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ (డబ్ల్యుఇఒ) అప్‌డేటెడ్ రిపోర్టులో ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2018, 2019లో భారత వృద్ధిరేటుకు సంబంధించి గత ఏడాది అక్టోబర్‌లో విడుదల చేసిన అంచనాలను ఐఎంఎఫ్ యథాతథంగా కొనసాగించింది.

యాక్సిస్ బ్యాంకు నికర లాభం రూ.726 కోట్లు

కలిసొచ్చిన తక్కువ కేటాయింపుల భారం

ముంబై : డిసెంబర్, 2017తో ముగిసిన మూడో త్రైమాసికం ప్రైవేట్ రంగంలోని యాక్సిస్ బ్యాంకుకు బాగానే కలిసొచ్చింది. ఈ కాలానికి బ్యాంకు రూ.14,314.6 కోట్ల ఆదాయంపై రూ.726.44 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం స్వల్పంగా తగ్గినా నికర ఆదాయం మాత్రం 25.34 శాతం పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.3,795.8 కోట్లున్న అత్యవసర ఖర్చులు, కేటాయింపుల భారం రూ.2,811.04 కోట్లకు తగ్గడం ఇందుకు బాగా కలిసొచ్చింది. దీంతో బ్యాంకుపై మొండి బకాయిల భారం తగ్గుముఖం పట్టిందని భావిస్తున్నారు. ఇదే కాలంలో కీలకమైన నికర వడ్డీ ఆదాయం తొమ్మిది శాతం పెరగడమూ ఇందుకు దోహదం చేసింది. 'గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బ్యాంకు బాలెన్స్ షీట్ 11 శాతం పెరిగి రూ.6,43,938 కోట్లకు చేరింది' అని బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. మూడో త్రైమాసికంలో కొత్తగా 105 శాఖలు ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంకు మొండి బకాయి(ఎన్‌పిఎ)లు 5.22 శాతం నుంచి 5.28 శాతానికి, నికర ఎన్‌పిఎలు 2.18 శాతం నుంచి 2.56 శాతానికి చేరాయి.

Q3 ఫలితాలు

41 శాతం పెరిగి వి-గార్డ్ లాభం

న్యూఢిల్లీ: కేరళకు చెందిన వి-గార్డ్ ఇండస్ట్రీస్ డిసెంబరు, 2017తో ముగిసిన మూడో త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అనుబంధ కంపెనీలను మినహాయిస్తే ఈ కాలానికి కంపెనీ రూ.526.08 కోట్ల ఆదాయంపై రూ.35.76 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 16.75 శాతమే పెరిగినా నికర లాభం మాత్రం 41.39 శాతం పెరిగింది. 'గత త్రైమాసికంలో అన్ని విభాగాల పనితీరు బాగుంది. ఈ త్రైమాసికంలోనూ ఈ వృద్ధి కొనసాగుతుందని ఆశిస్తున్నాం' అని కంపెనీ ఎండి మిథున్ కె.చిట్టియపిళ్లై ఒక ప్రకటనలో తెలిపారు.

హవెల్స్ ఇండియా లాభం రూ.194 కోట్లు

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి హవెల్స్ ఇండియా కూడా మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అనుబంధ కంపెనీలను మినహాయిస్తే ఈ కాలానికి కంపెనీ రూ.1,993.53 కోట్ల ఆదాయంపై రూ.194.36 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.1,650.68 కోట్ల ఆదాయంపై రూ.152.97 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది మేలో లీల్ ఎలక్ట్రికల్స్ కంపెనీ కన్జ్యుమర్ డ్యూరబుల్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేసినందున ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను గత ఏడాది ఇదే కాలానికి చెందిన ఆర్థిక ఫలితాలతో పోల్చి చూడకూడదని హవెల్స్ ఇండియా తెలిపింది. జిఎస్‌టి కష్టాలు సద్దుమణుగుతున్నందు ముందు ముందు పనితీరు మరింత బాగుంటుందని కంపెనీ సిఎండి అనిల్ రాజ్ గుప్తా చెప్పారు.

ఏషియన్ పెయింట్స్ లాభం రూ.567 కోట్లు

న్యూఢిల్లీ : విదేశీ యూనిట్ల వ్యాపారం ఆదుకోవడంతో డిసెంబరు, 2017తో ముగిసిన త్రైమాసికంలో ఏషియన్ పెయింట్స్ కంపెనీ అమ్మకాలు, నికర లాభాల్లో వృద్ధి నమోదు చేయగలిగింది. అనుబంధ కంపెనీలతో కలిపి (కన్సాలిడేటెడ్) ఈ కాలానికి కంపెనీ రూ.4,317.15 కోట్ల ఆదాయంపై రూ.567.21 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం రూ.3 కోట్లు మాత్రమే పెరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్, బ్రసాన్

హైదరాబాద్‌లో ఫ్లైట్ సిములేషన్ టెక్నిక్ సెంటర్

రూ.250 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : గురుగ్రామ్ కేంద్రంగా పైలెట్లకు శిక్షణను అందిస్తున్న ఫ్లైట్ సిములేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టిసి) హైదరాబాద్‌లోనే తన సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఎకరా విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని, ఇందుకోసం 250 కోట్ల రూపాయలు వెచ్చించనున్నట్టు ఎఫ్ఎస్‌టిసి డైరెక్టర్, సిఇఒ డిఎస్ బస్రాన్, డైరెక్టర్ సంజయ్ మందవియా తెలిపారు. జూలైనాటికి ఈ కేంద్రం తొలి దశ పూర్తవుతుందని, అప్పటి నుంచే సిములేటర్లపై శిక్షణ ప్రారంభం అవుతుందని వారు చెప్పారు. గురుగ్రామ్‌లో ఇప్పటికే ఐదు సిములేటర్లున్నాయని, హైదరాబాద్ కేంద్రంలో ఎనిమిది సిములేటర్లను ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా బోయింగ్, ఎయిర్‌బస్, ఎటిఆర్, డాష్ 8 (క్యు-400) వంటి విమానాలను నడిపేందుకు తగిన శిక్షణను ఇస్తామని తెలిపారు.

హైదరాబాద్‌లోనే ఎందుకు?

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వార్షికంగా 1.4 కోట్ల మంది ప్రయాణిస్తున్నారని, వీరి సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని బస్రాన్ చెప్పారు. ఇక్కడ నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లు అధికంగా ఉన్నారని, మెరుగైన మౌలిక సదుపాయాలున్నాయని తెలిపారు. ఇక్కడి విమానాశ్రయంలో పార్కింగ్ చేసే విమానాల సంఖ్య కూడా పెరుగుతోందని ఈ నేపథ్యంలో తాము ఇక్కడ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇక్కడ వైమానిక విద్యను అభ్యసిస్తున్న వారు శిక్షణ నిమిత్తం ఢిల్లీ లేదా విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇలాంటి వారికి తమ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్ల కాలంలో దేశీయ విమానయాన రంగంలోకి వెయ్యి విమానాలు చేరే అవకాశం ఉందని, వీటిని నడిపేందుకు 12వేల మంది పైలెట్ల అవసరం ఉంటుందని చెప్పారు. విమానయాన కంపెనీలకు అవసరమైన విధంగా కూడా తాము శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. 55 రోజుల శిక్షణకు 15 లక్షల రూపాయల వరకు ఫీజు ఉంటుందన్నారు.

స్పైస్‌జెట్ 'రిపబ్లిక్ డే సేల్' ఆఫర్



రూ.769కే విమానయానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్పైస్‌జెట్ 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్'ను ప్రకటించింది. సేల్‌లో భాగంగా దేశీయ విమాన టికెట్ ధరలు 769 రూపాయలు, అంతర్జాతీయ టికెట్ ధరలు 2,469 రూపాయల (ఒకవైపు ప్రయాణానికి) నుంచి ప్రారంభమవుతాయని స్పైస్‌జెట్ తెలిపింది. ఈ నెల 22 నుంచి 25 వరకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఈ ఏడాది డిసెంబరు 12వ తేదీ వరకు ఎప్పుడైనా ప్రయాణించవచ్చని వెల్లడించింది.

ఆఫర్‌లో భాగంగా పరిమిత సీట్లు, తొలుత వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత క్రమంలో టికెట్లను కేటాయించనున్నట్లు తెలిపింది. 769 రూపాయల ప్రారంభ ధరతో ఆఫర్‌తో చేసిన టికెట్లు జమ్ము- శ్రీనగర్, సిల్చార్, గువహటి, డెహ్రాడూన్-ఢిల్లీ, ఢిల్లీ- జైపూర్, అగర్తలా- గువహటి, కోయంబత్తూర్- బెంగళూరు, కోచి- బెంగళూరు, ఢిల్లీ- డెహ్రాడూన్ వంటి రూట్లలో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

21 రోజుల్లో భూమి కేటాయింపు

- మూడేళ్లలో 236 ప్రాజెక్టుల అమలు
- రూ.10,000 కోట్ల పెట్టుబడులు, 70 వేల మందికి ఉపాధి
- 'ఆంధ్రజ్యోతి'తో ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ వైఎస్ ప్రసాద్



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూమి కావాలని దరఖాస్తు అందిన 21 రోజుల్లోనే కేటాయింపు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇకపై పరిశ్రమలకు భూ సమస్య రాదని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఒ వైఎస్ ప్రసాద్ తెలిపారు. 'ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడి అవకాశాలు' అనే అంశంపై విశాఖపట్నంలో జరిగిన ప్రాంతీయ సదస్సుకు హాజరైన ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రాష్ట్రంలో పరిశ్రమలకు భూ కేటాయింపు ఎలా?

పరిశ్రమలకు భూమి కొరత అధికంగా ఉంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోను ఒక ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. భూమి కోసం దరఖాస్తు అందిన 21 రోజుల్లో జిల్లా కలెక్టర్, ఎపిఐఐసిలు వారికి భూమి కేటాయించాలి. ఇంతకు ముందు ఈ నిబంధన లేదు. ప్రభుత్వం తాజాగా దీనిపై ఉత్తర్వులు ఇచ్చింది.

రాష్ట్రంలో వ్యాపార సరళీకరణ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ఎలా ఉంది?

సింగిల్ విండో ద్వారా 21 రోజుల్లో అన్ని అనుమతులు ఇస్తున్నారు. అయితే అగ్నిమాపక శాఖ, పర్యావరణ శాఖల నుంచి దరఖాస్తుదారులకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇకపై ఏ శాఖకు అనుమతులు నిరాకరించే అధికారం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమస్య ఏమైనా ఉంటే ఆ దరఖాస్తును వెనక్కి ఇవ్వకుండా పరిశ్రమల శాఖ కమిషనర్‌కు పంపించాలి. అక్కడ దానిపై నిర్ణయం తీసుకుంటారు. ఇది మంచి పరిణామం.

ఇప్పటి వరకు ఎన్ని ప్రతిపాదనలు అమలుకు నోచుకున్నాయి? ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి?

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఇప్పటి వరకు 462 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రూ.12,000 కోట్ల పెట్టుబడులు, 1.2 లక్షల ఉద్యోగాలు రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.10,000 కోట్ల పెట్టుబడులతో 236 ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 70,000 మందికి ఉపాధి లభించింది. మిగిలిన 226 ప్రాజెక్టులు రెడ్ విభాగంలో వివిధ స్థాయిల్లో ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధిక ఎంఒయులు అమలుకు నోచుకుంది ఫుడ్ ప్రాసెసింగ్‌లోనే.

ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎందుకు పరిశ్రమ పెట్టాలంటే...?

దేశంలోనే అత్యుత్తమ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2015 వరకు దీనికి ప్రత్యేకమైన బడ్జెట్ లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఈ విభాగాన్ని పరిశ్రమల శాఖ నుంచి విడదీసి సొసైటీగా ఏర్పాటు చేసి రూ.300 కోట్ల బడ్జెట్ ఇచ్చింది. ఇప్పటివరకు అమలైన ప్రాజెక్టులు అన్నింటికి రాయితీలు విడుదల చేశాం.

పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి రాయితీలు ఇస్తున్నారు?

ఒక్కో ప్రాజెక్ట్‌కు పెట్టుబడిలో రూ.5 కోట్ల పరిమితికి లోబడి 25 శాతం వరకు రాయితీ ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా భారీగా రాయితీలు ఇస్తోంది. అయితే అక్కడ పోటీ ఎక్కువ. రాష్ట్రంతో సంబంధం లేకుండా ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు. దేశమంతటి నుంచి దరఖాస్తులు వెళతాయి. అక్కడి కంటే ఎపిలో దరఖాస్తు చేసుకుంటే పోటీ తక్కువ. రాయితీలు ఎక్కువ. అందుకే ఎక్కువ మంది ఇక్కడికి వస్తున్నారు. ఎపిలో ఎంఒయు చేయగానే ఒక ఎస్కార్ట్ అధికారికి ఆ ప్రాజెక్టును అప్పగిస్తాము. ఇలా ఒక అధికారి 30 ప్రాజెక్ట్‌లను రోజూ ఫాలో అప్ చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

పరిశ్రమలకు రుణాల విషయంలో ఏర్పడుతున్న ఇబ్బందుల సంగతేంటి?

రుణాలు ఇవ్వడానికి కొందరు బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. వారిని ఒప్పించడానికి బ్యాంకింగ్ రంగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారిని కన్సల్టెంట్లుగా తీసుకొని, వారికి ఆ బాధ్యత అప్పగించాము. ప్రతి ప్రాజెక్టును బ్యాంకుతో లింక్ చేస్తున్నాం. దీని వల్ల వారి పర్యవేక్షణ కూడా ఉంటుంది.

ఏ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి?

ఉత్తర కోస్తా నుంచి కాఫీ, పనస, పైనాపిల్ పండ్లను ఎగుమతి చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. అలాగే చింతపండును 'రెడీ టు కుక్' కోసం బ్లాక్‌లుగా చేసి విక్రయించే అవకాశం ఉంది. ఇవన్నీ ఆర్గానిక్ రకాలు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అలాగే చిరుధాన్యాలు ఎక్కువగా పండుతున్నాయి. అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొబ్బరి విస్తృతంగా పండుతుంది. వీటన్నింటిలోను ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టడానికి అవకాశాలు ఉన్నాయి. వాటిపైన అవగాహన కల్పించడానికే సదస్సులు నిర్వహిస్తున్నాం.

వచ్చే నెలలో జరిగే పెట్టుబడిదారుల సదస్సు ?

విశాఖపట్నంలో మళ్లీ ఫిబ్రవరి 24-26 మధ్య పెట్టుబడిదారుల సదస్సు జరగనుంది. అందులో మరిన్ని ఎంఒయులు కుదుర్చుకునేందుకు ప్రాంతాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నాము. త్వరలో తిరుపతి, విశాఖలో మరో రెండు సదస్సులు ఏర్పాటుచేసి ఇంకొన్ని ప్రాజెక్టులు వచ్చేలా ప్రయత్నిస్తాం.

రిటైల్ ఫార్మసీల కోసం టార్నియా గో- డిజిటల్ ప్రోగ్రామ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరుకు చెందిన టార్నియా టెక్నాలజీ సొల్యూషన్స్ లిమిటెడ్.. మెడికల్ షాపుల కోసం గో-డిజిటల్ ప్రోగ్రాంను ప్రకటించింది. ఇందులో భాగంగా క్లౌడ్ ఆధారిత వ్యాపార డిజిటలైజేషన్ పరిష్కారాల ప్లాట్‌ఫామ్ 'టార్నియా స్మార్ట్‌మైల్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాట్‌ఫాం ద్వారా రిటైల్ ఫార్మసీలు ఆన్‌లైన్ ప్రపంచంతో అనుసంధానం కావడంతోపాటు వినియోగదారులకు సొంత మొబైల్ యాప్ ద్వారా సేవలందించవచ్చు. ఈ ప్లాట్‌ఫాం ద్వారా కస్టమర్లతోపాటు ఔషధాల సరఫరాదారులతోనూ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఆర్థిక లావాదేవీలు జరిపేందుకు వీలుంటుందని టార్నియా వెల్లడించింది. మెడికల్ షాపు యజమానులు తమ మొబైల్ ద్వారానే వ్యాపారాన్ని నిర్వహించవచ్చని, ఎక్కడినుంచైనా రోజువారీ విక్రయాలు, ఔషధాల నిల్వలు, వాటి ఎక్స్‌పైరీ తేదీ వంటి వివరాలను తెలుసుకునే వీలుంటుందని తెలిపింది. అంతేకాదు, సంస్థ రూపొందించిన ఈగిల్ ఐ అనే డేటా అనలిటిక్స్ టూల్ ద్వారా ఫార్మసీలు కస్టమర్ల కోసం సొంతంగా ఆఫర్లు, లాయల్టీ పథకాలను నిర్వహించవచ్చని అంటోంది.

దేశవ్యాప్తంగా 8 లక్షల మెడికల్ షాపులున్నాయని, అందులో 15 శాతం స్టోర్లలో మాత్రమే టెక్నాలజీని, అది కూడా పాక్షికంగానే ఉపయోగిస్తున్నారని టార్నియా సహ వ్యవస్థాపకులు, సిఇఒ సురేష్ సత్యమూర్తి తెలిపారు. తమ సంస్థ వీరికోసం ఎండ్ టు ఎండ్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడుతో కలిపి 500 మంది రిటైల్ ఫార్మసీలకు సేవలందిస్తున్నామని అన్నారు. తొలుత దక్షిణాదిపై ఫోకస్ చేయనున్నట్లు, వచ్చే 18 నెలల్లో దేశంలోని 100 ప్రధాన నగరాలకు విస్తరించాలని అనుకుంటున్నట్లు సత్యమూర్తి వెల్లడించారు. వ్యాపార విస్తరణ కోసం నిధుల అన్వేషణలో ఉన్నామని, భవిష్యత్‌లో 5-10 మిలియన్ డాలర్ల ఫండింగ్ సేకరించాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

హింద్‌వేర్ నుంచి ప్లంబింగ్ పైపులు, ఫిట్టింగ్‌లు

రూ.160 కోట్లతో ఇస్నాపూర్‌లో ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హింద్‌వేర్ పేరుతో శానిటరీవేర్ ఉత్పత్తుల రంగంలోని హెచ్ఎస్ఐఎల్ ప్లంబింగ్ పైప్స్, ఫిట్టింగ్స్ రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం తెలంగాణలోని మెదక్ జిల్లా ఇస్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సిపివిసి, యుపివిసి పైపులు, ఫిటింగ్స్ తయారీ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించింది. 'దీంతో బాత్‌రూమ్ శానిటరీవేర్‌కు సంబంధించి అన్ని ఉత్పత్తుల కంపెనీగా హెచ్ఎస్ఐఎల్ ఆవిర్భవించింది' అని కంపెనీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (విసిఎండి) సందీప్ సోమానీ విలేకరులతో చెప్పారు. ఏటా 30,000 టన్నుల ప్లంబ్లింగ్ పైపులు, ఫిట్టింగ్స్ తయారీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ ప్లంబ్లింగ్ పైపుల తయారీకి సిపివిసి రెసిన్ ముడి పదార్థాన్ని జపాన్‌కు చెందిన సెకిసుయ్ కెమికల్ కంపెనీ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు సోమానీ చెప్పారు.

ఐదేళ్లలో రూ.800 కోట్ల వ్యాపారం

'ఈ పైపులకు హౌజింగ్ రంగంతోపాటు స్వచ్ఛ భారత్, నీటి రవాణా రంగాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో ఈ విభాగం ద్వారా వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్లు, ఐదేళ్లలో రూ.800 కోట్ల వ్యాపారాన్ని ఆశిస్తున్నాం' అని సోమానీ చెప్పారు. ఈ ఏడాది కంపెనీ మూలధన పెట్టుబడుల కింద రూ.250 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని సెక్యూరిటీ బాటిల్ క్యాప్స్ తయారీ యూనిట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 23 కోట్ల యూనిట్ల నుంచి 100 కోట్లకు విస్తరిస్తోంది. ఈ విస్తరణ వచ్చే సెప్టెంబరు నాటికి పూర్తవుతుందని సోమానీ చెప్పారు. ఇస్నాపూర్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ప్లంబింగ్ పైపులు, ఫిటింగ్స్ యూనిట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని వచ్చే రెండేళ్లలో 60,000 టన్నులకు విస్తరించే యోచన ఉందన్నారు.



పైపులను ఆవిష్కరిస్తున్న సందీప్ సోమానీ, కంపెనీ ప్రెసిడెంట్ రాజేష్

మార్కెట్లో బడ్జెట్ జోష్

కొనసాగుతున్న ర్యాలీ.. కొత్త శిఖర స్థాయిల్లో కీలక సూచీలు

సెన్సెక్స్ : 35798
నిఫ్టీ : 11966

ముంబై : బాహ్య పరిణామాలతో నిమిత్తం లేకుండా దలాల్ స్ట్రీట్ బుల్స్ కసిగా మార్కెట్‌ను దున్నేస్తున్నాయి. కీలక సూచీలు సోమవారం కూడా కొత్త గరిష్ఠ స్థాయిలను చేరాయి. ట్రేడింగ్ ప్రారంభంతోనే భారీగా లాభపడిన సెన్సెక్స్ ఆ తర్వాత పాజిటివ్ జోన్‌లోనే స్వల్ప ఆటుపోట్లతో ఇన్వెస్టర్లను కంగారు పెట్టినా ఆఖరు గంటలో అనూహ్యంగా దూసుకుపోయింది. తాజా ర్యాలీలో ఆర్ఐఎల్, టీసీఎస్ కీలక భూమిక పోషించాయి. బడ్జెట్‌పై భారీ అంచనాలు మార్కెట్ ర్యాలీకి అంతర్లీన కారణంగా చెబుతున్నారు. సెన్సెక్స్ 286 పాయింట్ల లాభంతో 35798 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 71 పాయింట్ల లాభంతో 10966 పాయింట్ల వద్ద క్లోజైంది. 36000 కీలక స్థాయికి సెన్సెక్స్ కేవలం 200 పాయింట్ల దూరంలో 11000 మైలురాయికి నిఫ్టీ కేవలం 34 పాయింట్ల దూరంలో ఉన్నాయి. ర్యాలీలో దాదాపు అన్ని విభాగాల షేర్లు భాగం పంచుకున్నాయి. నిఫ్టీ బ్యాంకింగ్ సూచీ ఆల్‌టైమ్ రికార్డు స్థాయి 27000 మార్క్‌ను దాటింది. యాక్సిస్ బ్యాంక్, యస్‌బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీ లాభాలతో ముగిశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పిఎన్‌బి మాత్రం నష్టాలతో ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంక్ కూడా నష్టంతోనే ముగిసింది. తొలిసారిగా జియో నికర లాభాలను ప్రకటించడంతో ఆర్‌ఐఎల్ షేరు దాదాపు 4.5 శాతం పెరిగింది. హెచ్‌పిసిఎల్‌ను సొంతం చేసుకుంటున్న ఒఎన్‌జిసి 4 శాతం పెరగ్గా హెచ్‌పిసిఎల్ షేరు అదే స్థాయిలో నష్టపోయింది. తృతీయ త్రైమాసికం ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేక పోవడంతో విప్రో షేరు ధర 3 శాతం పతనమైంది. సెన్సెక్స్ స్టాక్స్‌లో బెల్ 7 శాతం భారీ లాభాన్ని నమోదు చేసింది. ఎల్ అండ్ టి, ఇండియాబుల్స్ హౌజింగ్, యుబి, యునైటెడ్ స్పిరిట్స్ లాభపడ్డాయి.

ఐపిఒకు రూట్ మొబైల్ దరఖాస్తు

క్లౌడ్ కమ్యూనికేషన్ రంగంలోని కార్పొరేషన్లకు సొల్యూషన్స్ అందించే రూట్ మొబైల్ 600 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూ జారీ చేయడానికి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా సమీకరించే నిధులు డాయిష్ బ్యాంకు నుంచి తీసుకున్న రుణం తిరిగి చెల్లించి కొత్త పెట్టుబడులు, కొనుగోళ్లకు ఉపయోగించుకుంటామని కంపెనీ తెలిపింది.



సోమవారం సెన్సెక్స్ కదలికలు...
ప్రారంభం : 35613
గరిష్ఠ స్థాయి : 35827
కనిష్ఠ స్థాయి : 35544
ముగింపు : 35798

బ్యాంకు ఎన్‌పిఎలు
రూ. 9.5 లక్షల కోట్లు

» ఏడాదిలో రూ.లక్షన్నర కోట్ల భారం



న్యూఢిల్లీ : దేశీయ బ్యాంకింగ్ రంగంలో స్థూల మొండి బకాయిలు (జిఎన్‌పిఏ) ఈ మార్చి చివరినాటికి రూ.9.5 లక్షల కోట్లకు చేరుతుందని అసోచామ్-క్రిసిల్ సర్వే తేల్చింది. గత ఏడాది మార్చి చివర్లో ఉన్న రూ.8 లక్షల కోట్లతో పోల్చితే ఏడాది కాలంలో జిఎన్‌పిఏలు లక్షన్నర కోట్ల రూపాయల మేరకు పెరుగుతున్నాయి. అంటే బ్యాంకులు అందించిన మొత్తం రుణాల్లో ఎన్‌పిఏల వాటా 10.5 శాతానికి చేరుతుందన్న మాట. అలాగే బ్యాంకింగ్ రంగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆస్తుల పరిమాణం కూడా 11.5 లక్షల కోట్లకు చేరుతుందని ఆ నివేదిక అంచనా వేసింది. గత ఏడాది సెప్టెంబరు చివరినాటికి బ్యాంకుల ఉమ్మడి ఎన్‌పిఏలు 8.5 లక్షల కోట్ల రూపాయలకు చేరినట్టు ఆర్థిక శాఖ సహాయమంత్రి శివ్ ప్రతాప్ శుక్లా ఇటీవల పార్లమెంటుకు తెలిపారు. బ్యాంకులు ఎన్‌పిఏలకు కేటాయింపులు పెంచుకోవలసిరావడం వల్ల అవి ఆస్తులను తక్కువ విలువకు విక్రయించాల్సి వస్తుందని, ఫలితంగా వాటి మూలధన అవసరాలు పెరుగుతాయని కూడా అంచనావేశారు. బ్యాంకింగ్ రంగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆస్తులు భారీ పరిమాణంలో ఒత్తిడిలో ఉండడం ఎన్‌పిఏల పరిష్కార ప్రక్రియలో భాగస్వాములైన ఆస్తుల పునర్వ్యవస్థీకరణ కంపెనీలకు (ఎఆర్‌సి) చక్కని అవకాశంగా నిలుస్తుందని ఆ నివేదికలో తెలిపారు. అయితే మూలధనపరమైన అవరోధాల వల్ల ఎఆర్‌సిల వృద్ధి దీర్ఘకాలంలో కూడా పెరుగుతుంది. 2019 జూన్ నాటికి ఎఆర్‌సిల వృద్ధి 12 శాతం దిగువన నిర్వహణలోని ఆస్తుల విలువ లక్ష కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా వేసింది. ఎఆర్‌సిల సమర్థతకు గీటురాయిగా నిలిచే రికవరీ 38 శాతం నుంచి 44-48 శాతానికి పెరిగే ఆస్కారం ఉన్నట్టు నివేదిక పేర్కొంది. తీవ్ర వత్తిడిలో ఉన్న ఆస్తుల పరిమాణం 40 శాతం కాగా అందులో మెటల్ 35 శాతం, నిర్మాణం 25 శాతం, విద్యుత్ రంగాలదే 15 శాతం వాటా కలిగి ఉంటాయని తెలిపింది. దివాలా చట్టాన్ని సమర్థవంతంగా అమలు పరచడం దీర్ఘకాలిక లిటిగేషన్ల ప్రక్రియకు ఒక పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొంది.

లిస్టింగ్‌లోనూ అపోలో మైక్రో సిస్టమ్స్ జోరు

» **65 శాతం దూసుకుపోయిన షేరు**

ముంబై : రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సొల్యూషన్లు అందించే అపోలో మైక్రోసిస్టమ్స్ లిస్టింగ్ రోజునే అదరగొట్టింది. ఇష్యూ ధర 275 రూపాయలపై 74 శాతం ప్రీమియంతో 478 రూపాయల లిస్టింగ్ అయిన ఆ షేరు బిఎస్ఇలో 65.13 శాతం లాభంతో 454.10 రూపాయల వద్ద క్లోజయింది. ఇంట్రాడేలో ఆ షేరు 479.95 రూపాయల గరిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇలో 60.63 శాతం లాభంతో 441.75 రూపాయల వద్ద ముగిసింది. 156 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా ఈ నెల 10 నుంచి 12 తేదీల మధ్య మార్కెట్‌లో ఉన్న ఈ ఇష్యూ 249 శాతం ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం40.19 శాతం ఓవర్ సబ్‌స్క్రిప్షన్ సాధించింది.

టెలికాం సంస్థలపై తగ్గనున్న ఒత్తిడి : ఫిచ్



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద మొబైల్ ఆపరేటర్ భారతీ ఎయిర్‌టెల్‌తోపాటు ఇతర టెలికాం సంస్థలపై రానున్న కాలంలో ఒత్తిడి కాస్త తగ్గనుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంటోంది. జియో రంగ ప్రవేశంతో టెలికాం మార్కెట్లో మరింత తీవ్రతరమైన పోటీ ఈ ఏడాది తగ్గుముఖం పట్టనుందని తాజా నివేదికలో పేర్కొంది. 2018లో టెలికాం సేవల చార్జీలు పెరిగే అవకాశం ఉందని అంటోంది. గతవారంలో ఆర్థిక ఫలితాలను విడుదల చేసిన ఎయిర్‌టెల్.. మూడో త్రైమాసికానికి 306 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. వార్షిక ప్రాతిపదికన సంస్థ లాభం 39 శాతం క్షీణించింది. అయితే రానున్న కాలంలో ఈ పరిస్థితి మారే అవకాశం ఉందని అంటున్నారు.

11000 చేరువలో...

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలో 10900 పాయింట్ల వద్ద మైనర్ రియాక్షన్ సాధించినా నిలకడగా రికవరీ సాధిస్తూ చివరికి 70 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. కీలక మానసిక అవధి 11000 పాయింట్లకు చేరువ అయింది. ఓవర్‌బాట్ స్థితి ఉన్నందు వల్ల కరెక్షన్‌కు ఆస్కారం ఉంది.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 11000 **మద్దతు :** 10900

- మరింత పురోగమిస్తే 11000 వద్ద పరీక్ష ఎదుర్కొంటుంది. ఈ స్థాయిలో స్థిరపడే లోపు ఆటుపోట్లు ఎదుర్కొనవచ్చు. ఆ పైన కనీసం రెండు రోజులు బలంగా క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది.
- రియాక్షన్‌లో పడి మైనర్ మద్దతు స్థాయి 10900 పాయింట్ల కన్నా దిగజారితే మైనర్ బలహీనత ఏర్పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ రానున్న కొద్ది రోజుల్లో 27000 పాయింట్ల వద్ద పరీక్షకు గురికానుంది. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది.

సూచన : కరెక్షన్ పొంచి ఉన్నందు వల్ల అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ శుద్ధ షష్ఠి **నక్షత్రం :** రేవతి

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10966.20 (+71.50)

ట్రెండ్ మార్పు వేళలు : మధ్యాహ్నం 2.16 గంటలు

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 12.10 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తర్వాత రెండు గంటల వరకు నిలకడ/నిస్తేజంగా మారి చివరిలో తిరిగి మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత కూడా ఎటిపి కన్నా పైనే ఉంటే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 11005, 11040
మద్దతు స్థాయిలు : 10925, 10890

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

యస్ బ్యాంకు
30 కోట్ల డాలర్ల బాండ్ల జారీ


ప్రైవేటు రంగంలోని యస్ బ్యాంక్ 30 కోట్ల డాలర్ల (రూ.1,920 కోట్లు) విలువ గల బాండ్లను విదేశీ మార్కెట్లలో జారీ చేసింది. ప్రపంచ మార్కెట్ల నుంచి 100 కోట్ల డాలర్ల (రూ.6,400 కోట్లు) సమీకరణ ప్రయత్నాల్లో భాగంగా ఈ ఇష్యూ జారీ చేసినట్టు బ్యాంకు ప్రకటించింది. విదేశాల్లో బ్యాంకు బాండ్లు విక్రయించడం ఇదే ప్రథమం. అహ్మదాబాద్‌లోని గిఫ్ట్ సిటీలో ఉన్న ఇంటర్నేషనల్ ఫైనాన్స్ సెంటర్ ద్వారా ఈ బాండ్లల జారీ చేశారు. వీటిని లండన్, సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగ్ చేయనున్నట్టు తెలిపింది.

ఎస్ఎంఎస్ ఫార్మా
బాచుపల్లి ప్లాంట్‌కు ఎఫ్‌డిఎ ఓకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లి ప్లాంట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఎ) నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ నివేదిక (ఇఐఆర్)ను అందుకున్నట్టు ఎస్ఎంఎస్ ఫార్మాసుటికల్ వెల్లడించింది. గత ఏడాది నవంబరులో ఎఫ్‌డిఎ ఈ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించి ఫామ్ 483 కింద ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని తెలిపింది. తనిఖీల సందర్భంగా ఎలాంటి అభ్యంతరాలు తలెత్తక పోవటంతో ఇఐఆర్‌ను జారీ చేసిందని పేర్కొంది.

వాట్సన్ గ్రూప్
టెక్ పార్ట్‌నర్‌గా ఇన్ఫోసిస్


న్యూఢిల్లీ: ఆరోగ్య, సౌందర్య ఉత్పత్తుల రిటైల్ దిగ్గజం ఎఎస్ వాట్సన్ గ్రూప్ సాంకేతిక భాగస్వామిగా తమను ఎంచుకుందని ఇన్ఫోసిస్ ప్రకటించింది. వాట్సన్ గ్రూపు డిజిటల్ పరివర్తనానికి తోడ్పడేలా డేటా సైన్సెస్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సేవలందించనున్నట్టు తెలిపింది. కొనుగోళ్ల ట్రెండ్ శరవేగంగా మారుతున్న నేపథ్యంలో కస్టమర్లకు సేవలందించడంలో టెక్నాలజీ కీలకంగా మారిందని ఎఎస్ వాట్సన్ గ్రూప్ సిఇఒ మలియన్ గయ్ అన్నారు.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,130	30,750	31,130	30,670	30,220
క్రితం ముగింపు	31,110	30,740	31,080	30,650	30,280
22 క్యారెట్లు	28,830	28,500	28,630	28,410	28,780
క్రితం ముగింపు	28,810	28,500	28,590	28,410	28,840
వెండి (కిలో)	40,000	40,300	39,800	39,900	42,010
క్రితం ముగింపు	40,000	40,200	39,900	39,900	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 **నెక్ (100 గుడ్లు)**




హైదరాబాద్	402.00	చిత్తూరు	398.00
వరంగల్	404.00	చెన్నై	405.00
విజయవాడ	412.00	నమక్కల్	390.00
గోదావరి	412.00	బెంగళూరు	408.00
విశాఖపట్నం	412.00	ముంబై	447.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	77.00	విజయవాడ	82.00
కరీంనగర్	78.00	గుంటూరు	82.00
వరంగల్	77.00	ఒంగోలు	84.00
మహబూబ్‌నగర్	77.00	చిత్తూరు	73.00
కర్నూలు	77.00	నెల్లూరు	81.00
విశాఖపట్నం	76.00	అనంతపురం	77.00
గోదావరి	80.00		



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.15	67.43
పౌండ్	80.65	93.53
యూరో	71.10	82.47
ఆస్ట్రేలియా డాలర్	46.47	53.77
బహ్రెయిన్ దినార్	157.51	180.50
కువైట్ దినార్	175.87	218.94
ఒమని రియాల్	154.24	176.46
సౌదీ రియాల్	15.46	18.33
సింగపూర్ డాలర్	43.99	52.13
యుఎఇ దిరమ్	15.83	18.50

ఎన్ఎస్ఇ-500 NSE
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 715.6(698)17560
AARTIIND 1135.4(1126.35)16035
ABAN 231.25(230.05)1840596
ABB 1602.3(1585.85)79849
ABFRL 166.05(167.5)189638
ABGSHIP 12.6(12.85)9318
ACC 1827.2(1829.5)236750
ADANIENT 198.9(199.7)5740115
ADANIPORTS 438.05(433.45)7092514
ADANIPOWER 37.6(38.05)21712302
ADANITRANS 227.3(228.35)868153
AEGISCHEM 285.15(289.8)140400
AHLUCONT 362.75(372.6)34205
AIAENG 1593.3(1599.8)11442
AJANTPHARM 1588.65(1560.05)190383
AKZOINDIA 1871.55(1877.2)2085
ALBK 70.5(70.8)1715445
ALLCARGO 202.2(194.35)601514
ALOKTEXT 3.7(3.8)3657023
AMARAJABAT 824.45(825)351922
AMBUJACEM 268.45(268.6)1955296
AMTEKAUTO 26.7(26.85)141371
ANANTRAJ 71.7(71.3)1311865
ANDHRABANK 56.15(56.5)1235153
APARINDS 834.55(827.7)10564
APLLTD 550.25(547.05)30293
APOLLOHOSP 1168.8(1139.4)246204
APOLLOTYRE 259.6(264.8)1411127
ARVIND 446.15(449.45)681599
ASHIANA 178(178.7)105047
ASHOKA 231.5(227.8)703400
ASHOKLEY 121.05(121.05)7431883
ASIANPAINT 1176(1189.9)942542
ASTRAL 844.6(837.5)16203
ASTRAZEN 1156.65(1118.65)5728
ATUL 2869.3(2892.95)12069
AUROPHARMA 640.8(643.2)1236464
AVANTIFEED 2505.3(2454.9)45717
AXISBANK 611.55(590.25)21790443
BAJAJ-AUTO 3274.5(3210.4)223845
BAJAJCORP 491.8(499.7)53956
BAJAJELEC 521.7(530.75)136344
BAJAJFINSV 5051.45(4973.05)104891
BAJAJHIND 14.5(14.75)2094260
BAJAJHLDNG 2800.85(2800.5)6872
BALKRISIND 1138.8(1139.65)139591
BALLARPUR 16.15(16.3)1800564
BALMLAWRIE 249.65(251.45)77103
BALRAMCHIN 124.15(122.7)5300482
BANKBARODA 164.8(165.4)8918325
BANKINDIA 164.3(164.95)2797130
BASF 2200.6(2219.3)9050
BATAINDIA 730.35(716.25)358099
BBTC 1590.7(1601.25)109789
BEML 1515.9(1513.6)216980
BERGEPAINT 249.6(246.65)678845
BFUTILITIE 525.2(512)537537
BGRENERGY 139.75(135.65)141221
BHARATFIN 1005.05(1006.35)483285
BHARATFORG 739.7(735.75)708591
BHARTIARTL 490.7(497.9)4084647
BHEL 104.55(97.55)19820608
BHUSANSTL 65.45(64.95)2041256
BIOCON 603.85(569.35)8470009
BIRLACORPN 1169.55(1158)50152
BLISSGVS 199.9(202.85)465641
BLUEDART 4731.45(4645.5)2894
BLUESTARCO 779.45(773.85)18555
BOMDYEING 257.85(254.5)3262980

BOSCHLTD 19981.5(19976.15)6083
BPCL 469.15(477.3)2168115
BRFL 85.05(88.3)293588
BRIGADE 292.4(291.8)35965
BRITANNIA 4707.35(4684.45)80901
CADILAHC 438.75(441.55)491150
CANBK 362.95(362.7)1798119
CAPF 777.95(764.45)1231693
CARERATING 1382.75(1390.95)64027
CASTEXTECH 6.05(6.1)528229
CASTROLIND 187.9(187.75)1762408
CCL 295.7(293.6)69175
CEATLTD 1837.85(1866.85)239404
CENTRALBK 73.2(73.8)770144
CENTURYPLY 339.2(346.6)201960
CENTURYTEX 1415.8(1409.4)404414
CERA 3625.75(3627.45)2445
CESC 1111.25(1109.05)323549
CHAMBLFERT 155.65(154.4)629935
CHENNPETRO 427.7(446.5)1472935
CHOLAFIN 1309.1(1322.7)182669
CIPLA 601.15(602.75)933769
CLNINDIA 622.45(623.65)19449
COALINDIA 285.05(284)3025790
COLPAL 1172.55(1150.95)167067
CONCOR 1483.25(1473.65)562403
COROMANDEL 575.15(574.35)105514
CORPBANK 39(39.35)252105
COX&KINGS 260.7(262.25)252369
CRISIL 1995.1(1965.2)20907
CUB 174.55(175.9)383914
CUMMINSIND 913.7(903.3)364007
CYIENT 627.4(653.55)1554910
DABUR 363.1(363.8)939881
DALMIABHA 2987.2(3028.4)71214
DBCORP 347.4(352.75)44973
DBREALTY 70.2(71.7)590211
DCBBANK 187.85(189.65)981656
DCMSHRIRAM 595.25(569.1)1287453
DEEPAKFERT 407.2(389.85)360322
DELTACORP 350.15(337.3)6099582
DEN 121.1(121.5)763118
DENABANK 25.95(26.1)1468030
DHANUKA 793.45(782.1)15320
DHFL 631.05(612.5)6239147
DISHTV 71(72.65)7976597
DIVISLAB 1077.85(1098.3)690857
DLF 250.95(249.3)5026796
DREDGECORP 753.75(747)227299
DRREDDY 2496.55(2490.35)692415
DYNAMATECH 1948.05(1951.45)4525
ECLERX 1552.65(1540.2)20965
EDELWEISS 289.55(280.05)3424840
EICHERMOT 27649.8(28009.45)34466
EIDPARRY 349.5(358.75)102328
EIHOTEL 203.55(198.75)305747
ELECTCAST 35.2(35.25)429380
ELGIEQUIP 308.3(302.1)36572
EMAMILTD 1245.85(1262.25)162908
ENGINERSIN 177.1(180.55)2403641
EROSMEDIA 229.5(224.55)561466
ESCORTS 786.5(772.45)604931
ESSDEE 77.6(81.65)85751
ESSELPACK 295.25(296.25)77740
EVEREADY 451.75(443.55)40281
EXIDEIND 223.6(221.2)1354953
FCONSUMER 68.6(68.25)2168834
FDC 239.5(238.55)74348
FEDERALBNK 101.6(103.15)10433194

FINCABLES 743.7(741.75)37287
FINPIPE 655.75(665.2)20819
FLFL 385.05(372.1)153327
FORTIS 147.2(145.45)5273735
FSL 43.85(44.7)3671327
GAIL 457.4(468.75)4637380
GATI 139.3(137.65)1597674
GDL 238.2(237.8)82167
GEPIL 976.55(934.65)110566
GESHIP 457.35(450.95)83683
GET&D 420.6(425.4)42234
GILLETTE 6621.85(6682.35)4684
GLAXO 2463.05(2473.6)12715
GLENMARK 620.2(624.3)497055
GLOBOFFS 37.65(37.05)10152
GMDCLTD 150.35(149.75)338989
GMRINFRA 22.95(22.65)44668065
GODFRYPHLP 985.25(989.8)64053
GODREJCP 1092.7(1050.95)700187
GODREJIND 640(621.85)1071900
GODREJPROP 882.05(824.05)525210
GPPL 151.2(153.15)616578
GRANULES 138.8(135.6)1647941
GREAVESCOT 138.15(137.25)987680
GREENPLY 372.85(371.35)19988
GRINDWELL 556.65(547.4)19049
GRUH 588.95(687.8)3483894
GSFC 155.05(152.5)2362702
GSKCONS 6648.4(6641.4)4484
GSPL 209.7(211.1)274595
GUJFLUORO 882.35(888.85)25649
GUJGASLTD 877.25(866.75)14748
GULFOILLUB 899.15(923.25)8323
GVKPIL 23.15(22.05)2836281
HATHWAY 41.65(42.1)2813447
HAVELLS 552.65(547.6)2573233
HCC 38.05(36.9)12568318
HCL-INSYS 59.2(58.5)2372679
HCLTECH 966.35(958.3)2215659
HDFC 1872(1901.25)3649174
HDFCBANK 1963.35(1952.2)2212442
HDFCBANK 2040(1973)28765
HDIL 61.6(60.9)11823289
HEIDELBERG 161.2(162.35)146433
HEROMOTOCO 3602.95(3589.75)320126
HEXAWARE 352.2(350.4)950416
HFCL 32.1(32.5)5909885
HIMATSEIDE 390.85(391.7)43955
HIMATSEIDE 398(141.95)252000
HINDALCO 255.1(258)6230212
HINDCOPPER 90.35(86.9)4096212
HINDPETRO 401.8(416.2)9692575
HINDUNILVR 1355.1(1362.45)1014403
HINDZINC 292.45(299.35)2433313
HMT 38.55(38.8)1946
HMVL 261.3(252.65)22118
HONAUT 17690.7(17913.8)1901
HOTELEELA 22(21.55)575893
HSIL 488.75(482.05)39322
HTMEDIA 108.5(108.65)613642
IBREALEST 243.3(241.4)3233293
IBULHSGFIN 1355.15(1301.8)2123773
ICICIBANK 351.5(353.6)15269782
ICRA 3971.2(3969.05)658
IDBI 61.1(60.55)2249718
IDEA 99.5(102.3)7526353
IDFC 58.55(58)13107329
IFBIND 1416.2(1419.25)7098
IFCI 31(30.3)17628181

IGARASHI 837.95(840.6)77455
IIFL 697.15(700.35)151946
IL&FSTRANS 83.1(81.35)566348
INDHOTEL 150.65(142.45)4229498
INDIACEM 184.75(184.7)3816769
INDIANB 382.05(381.25)512874
INDOCO 287.45(274.45)730349
INDUSINDBK 1683.2(1684)820236
INEOSSTYRO 1043.35(1062.25)95039
INFRATEL 343.5(346.05)6688121
INFY 1150(1143.45)4825107
INGERRAND 820.45(819.75)8155
INOXLEISUR 280.4(284.6)184872
INOXWIND 136.5(135.9)71492
INTELLECT 173.55(174.9)394592
IOB 23(23.15)579960
IOC 382.5(385.95)1696363
IPAPPM 384.05(364.8)165977
IPCALAB 588.35(579.8)192878
IRB 239.45(236.85)774813
ITC 273.65(274.55)8339156
J&KBANK 76.85(76.15)289872
JAGRAN 178.9(176.35)35153
JAICORPLTD 191.25(187.65)2381929
JBCHEPHARM 324(326.15)47006
JBFIND 202.25(203.3)37991
JCHAC 2685(2687.85)4729
JETAIRWAYS 783.4(793.2)1349937
JINDALPOLY 386.25(381.85)97442
JINDALSTEL 263.75(264.15)6732312
JISLJALEQS 139.8(136)7703472
JKCEMENT 1153.05(1128.15)15329
JKIL 336.05(320.4)212094
JKLAKSHMI 430.7(433.65)27503
JKTYRE 177.85(179.7)957445
JMFINANCIL 163.85(166.95)3431605
JPASSOCIAT 21.95(21.7)230608204
JPINFRATEC 15(15.75)13629476
JPPOWER 7.45(7.45)3720307
JSWENERGY 88.7(91.7)6466273
JSWHL 1747.1(1792.8)2927
JUBILANT 887.45(879.95)943957
JUBLFOOD 2273.3(2093.3)6219270
JUSTDIAL 603.9(556.65)8941773
JYOTHYLAB 371.15(375.45)701101
KALPATPOWR 480.3(468.25)83497
KANSAINER 509.8(526.75)222055
KEC 357.5(359.8)205069
KESORAMIND 151.4(145.75)784311
KIRLOSENG 403.1(391.7)984643
KITEX 298.05(298.2)52948
KOLTEPATIL 378.25(372.75)245944
KOTAKBANK 1074.1(1060.55)3189930
KPIT 199.95(196.65)1776217
KRBL 630.65(629.65)76080
KSCL 522.95(510.6)539322
KSK 18.1(17.25)4373411
KTKBANK 158.35(158.85)2586359
KWALITY 102.5(100.95)642742
L&TFH 178.3(172.25)6348380
LAKSHVILAS 140.3(141.65)406579
LAOPALA 656.45(664.6)37151
LAXMIMACH 6226.15(6116.9)5641
LICHSGFIN 575.05(562)1974033
LITL 1.9(2)1691433
LT 1398.85(1371.45)3067658
LUPIN 930.05(924.1)1132432
M&M 759.6(765.4)934811
M&MFIN 488.6(468.6)1619790

MAGMA 171.6(174.7)64919
MAHINDCIE 238.45(240.85)96419
MAHLIFE 518.85(529.65)50853
MANAPPURAM 120.9(119.65)6054682
MANPASAND 406.65(427.95)159460
MARICO 316.35(314.1)468259
MARKSANS 44.05(44.4)2272024
MARUTI 9310.1(9323.95)454188
MAYURUNIQ 527.2(517.6)16031
MCDOWELL-N 3787.15(3713.95)901007
MCLEODRUSS 181.25(180.65)235840
MERCK 1457.15(1487.4)11277
MHRIL 362.65(368.5)41994
MINDACORP 208.5(208.3)161175
MINDTREE 757.35(702.4)5595004
MMTC 64.8(64.2)2612083
MOIL 245.15(239.4)432681
MONSANTO 2620.75(2594.45)5888
MOTHERSUMI 384.4(382.3)1168798
MOTILALOFS 1469.65(1419.7)285723
MPHASIS 802(789.55)166055
MRF 69677.3(69156)3327
MRPL 129.85(125.95)1899683
MTNL 26.05(25.95)1947058
MUTHOOTFIN 433.25(434.25)565922
NATCOPHARM 1013.45(1022.4)426450
NATIONALUM 77.15(77)6132877
NAUKRI 1415.05(1406.55)146417
NAVKARCORP 201.4(199.8)588245
NCC 126.9(126.7)4155141
NETWORK18 55.4(54.6)1193580
NHPC 30.05(29.85)5105065
NIITTECH 765.75(728.05)2368114
NITINFIRE 6.85(6.95)369452
NLCINDIA 106.9(104.65)420204
NMDC 144.15(146.4)2690707
NTPC 172.4(172.75)4518855
OBEROIRLTY 507.5(507)102546
OFSS 4208(4094.05)34273
OIL 371.8(374.65)686019
OMAXE 225.45(228.35)361484
ONGC 200.7(193.7)23165754
ORIENTBANK 122.45(122.8)1506301
ORIENTCEM 169.4(167.4)99364
ORISSAMINE 1914.5(1921.9)3575
PAGEIND 22019.35(22050.8)8182
PARSVNATH 25.25(25.1)58638
PCJEWELLER 583(587.35)2062018
PEL 2830.2(2793.95)166916
PERSISTENT 788.9(769.1)716817
PETRONET 237.8(237.05)1630985
PFC 120(120.2)2963447
PFIZER 2145.55(2123)24908
PFS 36.65(36.65)826834
PGHH 9276.4(9415.9)5979
PHOENIXLTD 617.5(606.8)55552
PIDILITIND 895(890.35)428801
PIIND 986.85(997.15)79030
PNB 176(176.4)11370450
POLARIS 416.2(411.75)199850
POWERGRID 195.3(196.1)5531239

PRAJIND 114.2(112.9)898746
PRESTIGE 313.5(310.8)349857
PRISMCEM 142.6(141.9)890601
PTC 114.8(115.9)1027473
PUNJLLOYD 23.6(23.55)1730485
PURVA 148.75(147.65)237953
PVR 1474.1(1469.05)83847
RADICO 389.6(365.55)6977855
RAIN 431.9(432.35)2408695
RAJESHEXPO 821.25(821.95)600859
RALLIS 270.95(266.8)510309
RAMCOCEM 781.2(785.55)84295
RAMCOSYS 510.35(511.05)27069
RATNAMANI 1070.2(1062.65)7049
RAYMOND 1102.45(1081.9)261534
RCF 98.7(101.25)4827506
RCOM 28.65(29.45)55758132
RECLTD 155.65(156.45)2400565
REDINGTON 188(189.55)178479
RELAXO 628.15(638.2)18392
RELCAPITAL 522.55(529.25)4040700
RELIANCE 971.5(931.3)20892838
RELINFRA 509.6(517.85)1637010
RENUKA 15.6(15.95)1395275
REPCOHOME 693.05(683.85)257164
RIIL 574.15(560.75)842198
RKFORGE 840.05(825.2)12028
RNAVAL 49.55(49.9)5307802
ROLTA 70.65(68.5)1725401
RPOWER 48(48.9)7822291
RTNPOWER 7.6(7.4)7874949
RUCHISOYA 18.75(19.05)1286031
SADBHAV 404.5(411.3)453887
SADBHIN 145.25(147.6)98341
SAIL 92.45(93.3)4967870
SANOFI 4712.4(4743.15)8045
SBIN 306.5(309.25)12622645
SCHAEFFLER 5843.55(5618)2850
SCHNEIDER 122(122.35)149121
SCI 90.1(88.9)711377
SHARDACROP 452.15(443.35)7591
SHILPAMED 600.5(586.9)99541
SHK 310.25(306.45)374757
SHOPERSTOP 530.1(517.65)79680
SHREECEM 18479.35(18354.6)35976
SHRIRAMCIT 2052.4(2052.65)5990
SIEMENS 1319.2(1299.35)228818
SIMPLEXINF 599.05(601.65)13339
SINTEX 23.95(24.2)2508765
SITINET 24.85(24.95)250400
SJVN 34.95(34.9)561639
SKFINDIA 1839.6(1827.8)6124
SMLISUZU 879.6(869)17179
SNOWMAN 61.15(60.25)1819374
SOBHA 599.25(535.85)1638202
SOMANYCERA 846.8(860.95)34089
SONATSOFTW 311.3(303.8)570602
SOUTHBANK 32.2(32.25)8732068
SPARC 501.7(496.85)165272
SREINFRA 100.75(100.55)1627345
SRF 1950.2(1909.8)156712
SRTRANSFIN 1476.25(1428)496793
STAR 800.2(805.75)170280
STCINDIA 164(164.1)16166
SUNDARMFIN 1968.9(2033.1)41527
SUNDRMFAST 551.8(556.15)86494
SUNPHARMA 576.15(572.1)3072409
SUNTV 1033.65(1050.2)482950
SUPREMEIND 1424.6(1462.3)26773

SUVEN 199.25(198.35)221322
SUZLON 15(15.1)20158971
SWANENERGY 225.75(229.7)507854
SYMPHONY 1992.65(1999.3)10252
SYNDIBANK 77.15(78.95)3656107
SYNGENE 628.9(615.8)202478
TAKE 167.9(165.95)176409
TATACHEM 735.8(724.65)837925
TATACOFFEE 160.75(159.9)698033
TATACOMM 644.5(633.85)696045
TATAELXSI 1078.75(1037.95)1088524
TATAGLOBAL 308.85(308.35)3278437
TATAMOTORS 421.9(418.05)4643782
TATAMTRDVR 239.05(243.7)4752143
TATAPOWER 92.1(92.2)3904900
TATASPONGE 1194.3(1174)353252
TATASTEEL 752.2(753)3605727
TBZ 136(136.65)435284
TCS 3116.4(2959.3)2183555
TECHM 569.5(552.9)4127554
TECHNO 405.9(395.1)30806
TEXRAIL 111.55(109.3)639547
THERMAX 1289.5(1293.4)70785
THOMASCOOK 250.2(249.95)481112
TIDEWATER 7174.15(7079)1097
TIMKEN 918.25(922.75)7657
TITAN 909.75(891.45)1495629
TNPL 438.95(442.55)89563
TORNTPHARM 1451.35(1430.5)170417
TORNTPOWER 305.6(302.8)1204860
TREEHOUSE 14.2(14.35)17087
TRIDENT 87.5(84.9)640553
TRITURBINE 133.35(133.6)45419
TTKPRESTIG 8668.85(8644)4908
TTML 7(7.1)500212
TV18BRDCST 61.2(59.45)6202429
TVSMOTOR 715(715.2)434972
TVSSRICHAK 3604.8(3621)2060
TVTODAY 451.65(452.7)82296
UBL 1155.55(1096.05)664035
UCOBANK 30.9(31.2)481363
UFLEX 468.3(468.4)43448
ULTRACEMCO 4330(4300)179728
UNICHEMLAB 366.35(363.5)400617
UNIONBANK 140.35(141.35)2546933
UNITECH 8.95(9.05)24736991
UPL 813.6(802.35)2396370
VAIBHAVGBL 709.35(688.15)40077
VAKRANGEE 473.65(446.6)5468061
VEDL 326.95(331.65)7508442
VIDEOIND 20.7(21.75)5064693
VIJAYABANK 67.1(66.7)1268963
VINATIORGA 942(967.85)22630
VIPIND 367(362.5)207408
VOLTAS 624.95(618.2)1377160
VRLLOG 399.7(405.15)351463
VSTIND 3101.85(3117.75)3899
VTL 1455.65(1499.7)22317
WABAG 638.1(618.9)326735
WABCOINDIA 7911.35(7849.95)3966
WELCORP 193.6(190)1470989
WELSPUNIND 72.8(73.2)1316708
WHIRLPOOL 1499.15(1481.65)19236
WIPRO 321.55(328.95)4572569
WOCKPHARMA 917.1(904.45)1227735
WONDERLA 415.35(415.35)93685
ZEEL 608.85(600.35)2713393
ZEELEARN 45.45(45.85)424420
ZENSARTECH 936.05(908.45)101256
ZYDUSWELL 1092.85(1103.4)3385

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 7.13(7.5)1
ADITYA SPIN. 9.52(9.52)650
AGRO TECH FO 686.2(688.9)651
AISHWARYA TE 9.98(10.14)32390
ALPHAGEO (I) 954.9(895.9)78264
ALU FLUORIDE 131.25(129.75)8661
AMAR RAJA BA 825.15(824.5)15110
ANDHRA BANK 56.05(56.4)155731
ANDHRA CEMEN 13.37(13.16)28896
ANDHRA PETRO 67.9(64.7)242924
ANJANI PORTL 243.15(246)1401
[illegible]

BAMBINO AGRO 305.9(306.05)5583
BARTRONICSIN 14.68(14.57)10338
BHAGIRA.CHEM 335(328.75)363
BHAGYA INL 45.2(44.3)6639
BHARATFIN 1005.7(1008.8)14653
BNR UDYOG 32.5(31.5)91
CAMBRIDGE 95.05(96.95)11907
CAT TECHN. 1.34(1.34)1000
CCHHL 17(17.1)40626
CCL PRODUCTS 295.05(294.15)4368
CELESTIAL 18.45(19.4)73465
[illegible]

DECAN CEMENT 607.6(611)223
DHAN ROTO SP 40(39)4562
DIAMONPOWER 19.55(19.4)19191
DIVI'S LAB. 1078.75(1095.5)184148
DIVYA.GRANIT 111.7(110.2)3040
DQ ENT 18(18.2)22295
[illegible]

GATI LTD. 139.5(137.4)229325
GAYATRI BIO 10.74(10.3)5475
GAYATRI PROJ 218.45(218.3)27543
GENNEX LAB 5.03(4.94)117501
GMR INFRASTR 22.9(22.65)4570162
GODAVARI DRU 40.55(38.85)3356
[illegible]

HIND.FLUROCA 14.85(15.62)15030
HINDUSTN BIO .58(.56)6018
I.C.S.A. IND 5.25(5.52)3335
INCAP LTD. 112(114.3)1281
IPAPPM 383.35(364.55)24807
IVRCL LTD 5.69(5.84)176646
KAKATIYA CEM 385.7(384.3)4837
KALLAM SPG. 23.85(22.75)29991
KARAN WOO-SN 1.51(1.44)200
KAVERI SEED 522.5(510.3)69882
KCP LTD 147.7(149.4)34226
[illegible]

MADHUCON PRJ 34.4(33.5)45411
MOLD-TEK TEC 71(71.8)9191
MOSCHIP SEMI 40.45(40.4)102205
MSR INDIA 39.4(39.65)7505
N C L IND. 289.8(282.2)39191
NACLIND 55.9(56.85)40825
NATCO PHARM 1008.05(1014.85)23082
NCC 126.75(126.3)395062
NEHA INTER. 8.43(8.27)35659
NETTLINX LTD 87.05(87.8)31806
NEULAND LAB. 896.4(878.25)1720
[illegible]

PANYAM CEMEN 60.2(61.6)16183
PENNAR STEEL 63.9(63.65)87086
PFL INFOTECH 10.59(11.14)3140
PHYTOCHEM I. 72.15(71)14021
PITTI LAMIN. 97.35(95.9)11802
POKARNA LTD 229.25(229.4)4221
PRAJAY ENGS. 17.7(17.1)23626
PREMIER EXPL 442.05(440.8)26999
PRISM CEMENT 143.15(142.1)155859
RAIN 430.8(432.45)498998
RAJ PACKAGIN 42.25(41.6)4082
[illegible]

SATVAH.ISPAT 31.1(31.35)22669
SAVEN TECHNO 23.35(22.85)363
SIBAR AUTO 15.36(14.63)10499
SMPL 1.57(1.59)16500
SMS PHARMACE 105.15(101.6)211631
SREE RAYALA 203.4(207.8)3277
STEEL EXCH 34.4(34.3)61229
SUJANA INDUS 1.06(1.11)70830
SURANATP 6.09(6.18)26478
SURYACHAKRA 1.66(1.59)205276
SURYAMBA SP 75(73.35)1775
[illegible]

TRANSCORP IN 44.1(42)6631
TRANSGENE BI 2.35(2.47)18745
TRANSPORT CO 278.2(284.7)4550
USHER AGRO 8.18(8.46)11806
VICEROY HOTE 19.4(18.95)92927
VIJAY TEXTIL 55.6(53)15116
VIMTA LABS 180.85(174.45)12078
VIRAT CRANE 48.3(46)32807
VIRINCHI 130.6(130.8)56492
VISAKA IND. 779.1(769.85)11934
VISTA PHARMA 46(47)41929
[illegible]

ఖాతాలోని 90 వేలు చోరీ

» గుండె ఆగి వృద్ధురాలి మృతి



చెన్నై, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి ఖాతా నుంచి రూ.90 వేలు తస్కరించడంతో, ఆమె గుండె ఆగి మరణించిన ఘటన చెన్నైలో జరిగింది. స్థానిక అన్నానగర్‌లో రాజేంద్రన్, జయలక్ష్మి(70) దంపతులు నివసిస్తున్నారు. గత శుక్రవారం దుండగులు జయలక్ష్మికి ఫోన్ చేసి, ఇండియన్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఏటీఎం కార్డు కాల పరిమితి ముగిసిందని, కార్డు నంబర్, పాస్‌వర్డ్ చెబితే కొత్త కార్డు జారీ చేస్తామని తెలిపారు. ఆమె వివరాలు తెలపడంతో, మరుసటి రోజు బ్యాంక్‌కు వచ్చి కొత్త కార్డు తీసుకోవాలని చెప్పారు. పావుగంటకే ఆమె ఖాతా నుంచి రూ.90 వేలు డ్రా చేసేశారు. శనివారం ఆమెబ్యాంకుకు వెళ్లగా మోసం బయటపడింది. దీంతో విజయలక్ష్మి అక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా ఆదివారం మృతి చెందింది.



బాప్‌రే.. బ్రాయిలర్ కోడి!

బ్రాయిలర్ కోడి మూడు, నాలుగు కిలోల బరువుండడం సహజం. కానీ.. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలంలోని గోరింటలో ముమ్మిడి గంగాధర్‌కు చెందిన కోళ్లఫారంలో ఏకంగా పది కిలోలు బరువు తూగి ఔరా అనిపించింది. బ్రాయిలర్ కోడి ఇంతబరువు తూగడం చాలా అరుదని, బొంత కోడి అయితేనే పదికిలోల వరకు ఎదుగుతుందని ఫారం యజమాని చెప్పారు. కాగా, వేలంపాటలో ఈ కోడిని ఓ వ్యక్తి రూ.1300కు కొనుగోలు చేయడం విశేషం.

-పెద్దాపురం రూరల్



రోజా ఇంట్లో చోరీ

» 2కిలోల వెండి, 14 తులాల బంగారం మాయం

రాయదుర్గం/హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సినీనటి, ఏపీ ఎమ్మెల్యే రోజా ఇంట్లో దొంగతనం జరిగింది. నాలుగు వెండి పళ్లేలు, సుమారు రెండు కిలోల వెండి, 14 తులాల బంగారాన్ని దొంగలు చోరీ చేసినట్లు రోజా భర్త సెల్వమణి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మణికొండ పంచవటి కాలనీలో ఉండే రోజా ఈ నెల 11న కుటుంబంతో ఊరెళ్లారు. 12న పనిమనిషి రామకుమారి ఇంటికి తాళం వేసి పక్కింటివారికిచ్చి సంక్రాంతికి ఊరెళ్లింది. 18న తిరిగి వచ్చింది. ఇల్లు శుభ్రం చేస్తుండగా కిచెన్‌లో ఉన్న 4వెండి పళ్లేలు కనిపించక పోవడంతో ఆమె సెల్వమణికి ఫోన్ చేసి చెప్పింది. సెల్వమణి సోమవారం ఉదయం వచ్చి పరిశీలించగా బెడ్‌రూంలోని కప్‌బోర్డులో ఉన్న ఆభరణాలు పోయినట్లు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నా భార్య హింసిస్తోంది!

» బెజవాడ కోర్టులో ఓ భర్త కేసు

విజయవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భర్త మోసం చేశాడని, చిత్రహింసలు పెడుతున్నాడని భార్య కోర్టు మెట్లెక్కడం సర్వసాధారణం. దీనికి భిన్నంగా భార్య తనను వేధిస్తోందంటూ ఓ భర్త ఫిర్యాదుచేశాడు. ఈ పిటిషన్‌ను విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణకు స్వీకరించింది. పిటిషనర్ కథనాన్ని అనుసరించి, విజయవాడకు చెందిన గోగు రామ్‌కుమార్‌కు నాగజ్యోతితో గత ఆగస్టు 11న వివాహమైంది. పెళ్లయిన రెండు నెలలకే వివాదాలు మొదలయ్యాయి. "నన్ను చేసుకోవడానికి ముందే ఆమెకు పెళ్లయింది. సంతానమూ ఉన్నారు. విడాకులు తీసుకున్న విషయాన్ని గానీ, పిల్లలు ఉన్నారన్న విషయాన్ని గానీ నాకు చెప్పలేదు. ఆ విషయం అడిగినందుకు.. నన్ను చిత్రహింసలు పెడుతోంది. నాపై 498(ఎ) పెట్టి, రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. నేను సాధారణ మెకానిక్‌ని. అంత డబ్బు ఇచ్చుకోలేను. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించాను" అని పిటిషన్‌లో సదరు భర్త వాపోయాడు. ఈ కేసులో తదుపరి విచారణను వచ్చేనెల 21వ తేదీన కోర్టు చేపట్టనుంది.

వక్ఫ్‌బోర్డు పాలకమండలికి..

హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీ వక్ఫ్ బోర్డు పాలకమండలి ఏర్పాటుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటగిరీని పరిగణనలోకి తీసుకోరాదని జస్టిస్ నవీన్‌రావు ఆదేశించారు. వక్ఫ్ బోర్డు ఎన్నికలకు సంబంధించి గత ఏడాది ఆగస్టు 10న ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా షేక్ దాఖలు చేసిన పిటిషన్‌పై.. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించుకోవచ్చని, పాలకమండలిని ఏర్పాటు చేయరాదని న్యాయమూర్తి గతంలో ఆదేశించారు. వక్ఫ్‌బోర్డుకు ఎన్నికలు పూర్తయ్యాయని, పాలకమండలి ఏర్పాటుకు అనుమతించాలని ప్రభుత్వ న్యాయవాదులు అభ్యర్థించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. పాలక మండలి ఏర్పాటుకు అనుమతిస్తూ.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కోటాను పరిగణనలోకి తీసుకోరాదని పేర్కొన్నారు.

ఏపీ పయనీర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో పెడతామని హామీ ఇచ్చారు. పండ్ల తోటలు, కూరగాయల సాగుపై ఎక్కువ పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. ఏపీలో వ్యవసాయాభివృద్ధిని పరిశీలించి తమ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని రియాన్ తెలిపారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీలో ఉద్యానవన పంటల సాగును ఉద్యమస్ఫూర్తితో కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యానవన పంటల కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించి, ప్రాంతానికి ఒక్కో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వివరించారు. తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడులను సాధించేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నామని తెలిపారు. ఉద్యానవన పంటల సాగును కోటి ఎకరాలకు విస్తరించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు దేశంలోనే తొలిసారిగా సెన్సర్లు, డ్రోన్లు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం తమ రాష్ట్రం ఒక్క ఉద్యానవన రంగంలోనే 30 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని సీఎం తెలిపారు. ఉద్యాన వన రంగంలో వివిధ పంటల సాగును ప్రోత్సహించేందుకు పంటల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఇది వినూత్న ప్రయోగమని వివరించారు. కుప్పంలో చిన్నవిమానాశ్రయం ఏర్పాటు చేస్తామని, దీనివల్ల పయనీర్ యాజమాన్యం, ప్రతినిధులు సాఫీగా రాకపోకలు సాగించవచ్చన్నారు. సరకు రవాణా కూడా సులభతరం అవుతుందని చెప్పారు. పయనీర్ సంస్థతో సంప్రదింపులు జరిపి పనులు వేగవంతంగా చేయాలని పరిశ్రమల శాఖ కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

జ్యూరిచ్ అధికారులతో భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జ్యూరిచ్, ఆంధ్రప్రదేశ్ నడుమ సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదిరింది.



సీఎం చంద్రబాబు సమక్షంలో జ్యూరిచ్, ఏపీ నడుమ సిస్టర్ స్టేట్ ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ మంత్రి యనమల, జ్యూరిచ్ మంత్రి కార్మెన్. చిత్రంలో మంత్రి లోకేశ్

ఈ ఒప్పందాన్ని అనుసరించి పర్యావరణ సాంకేతికత, జీవశాస్త్రాలు, పట్టణప్రాంత అభివృద్ధి రంగాల్లో జ్యూరిచ్, ఏపీ పరస్పరం సహకరించుకుంటాయి. టెక్నాలజీ వినియోగం, వినూత్న ఆవిష్కరణలతో జ్యూరిచ్ ముందుకు దూసుకుపోతోంది. ఆంధ్రప్రదేశ్ ఇదే బాటలో పయనిస్తున్నందున సరైన సమయంలో రెండు రాష్ట్రాల నడుమ ఒప్పందం కుదిరిందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందానికి ముందు చంద్రబాబుతో జ్యూరిచ్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్ వాకెర్ స్పా, ఆర్థిక వ్యవహారాల ఉప మంత్రి బ్యూన్ సాటర్, జ్యూరిచ్ ప్రభుత్వ ప్రాజెక్టు మేనేజర్ కొరిన్ వ్యేర్ భేటీ అయ్యారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లలో జ్యూరిచ్ ఎంతో ముందు ఉందని, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు తాము ప్రాధాన్యమిస్తామని వారు సీఎంకి వివరించారు.

సిస్టర్ స్టేట్ ఒప్పందంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున యనమల రామకృష్ణుడు, జ్యూరిచ్ తరఫున ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్, ఉప మంత్రి బ్యూన్ సంతకాలు చేశారు. కాగా.. జ్యూరిచ్ ఉప మంత్రి బ్యూన్ గతంలో అమరావతిలో పర్యటించారు. దావోస్ పర్యటనలో.. ఐటీ మంత్రి లోకేశ్, సీఎం ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో జాస్తి కృష్ణ కిశోర్ , పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు.

సిస్టర్ స్టేట్ ఒప్పందం అంటే..!

సిస్టర్ స్టేట్ ఒప్పందం ప్రధాన ఉద్దేశం.. వినూత్న సాంకేతికతను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడమే. ఏదైనా దేశంలోని ఓ రాష్ట్రం లేదా ప్రావిన్స్ వినూత్నమైన ఆలోచనలు.. సాంకేతికతతో ముందుకు వెళుతుంటే దాన్ని వేరే దేశంలోని రాష్ట్రం అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది. గతంలో సీఎం చంద్రబాబు బృందం.. చైనా, అమెరికా, జపాన్, సింగపూర్ దేశాల్లో పర్యటించినప్పుడు ఆయా దేశాల్లోని రాష్ట్రాలు, ప్రావిన్స్‌లతో ఇలాంటి ఒప్పందాలు చేసుకున్నారు. అమెరికా పర్యటనలో న్యూయార్క్ నగరంలో అమలు చేస్తున్న భద్రతాచర్యలు సీఎంని ఆకర్షించాయి. సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అక్కడ అసాంఘిక కార్యకలాపాలను చాలా వరకు కట్టడి చేశారు. ఇలాంటి వ్యవస్థను ఏపీలోనూ అమలు చేయాలన్న ఉద్దేశంతో న్యూయార్క్‌తో ఏపీ సిస్టర్ స్టేట్ ఒప్పందం చేసుకుంది.

ఢిల్లీలో కదలిక!

» సీఎం విజ్ఞప్తులపై మరింత సమాచారం కోరిన పీఎంవో

» 26 తర్వాత ఏపీపై దృష్టి సారించనున్న మోదీ

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర సమస్యలపై ఢిల్లీలో కదలిక వచ్చినట్టు కనిపిస్తోంది. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలపై సీఎం చంద్రబాబు ఇటీవల ప్రధాని మోదీని కలిశారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం ప్రస్తావించిన పెండింగ్ సమస్యలపై మరింత సమాచారం ఇవ్వాలని ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆ సమాచారాన్ని వేగంగా అందించేందుకు కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ మూడు రోజుల క్రితం విజయవాడ వచ్చారు. ముఖ్యమంత్రిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి చర్చలు జరిపారు. తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత శాఖల నుంచి సేకరించి, సవివరమైన నివేదిక తయారు చేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన చంద్రబాబు అక్కడే మోదీని కలవనున్నారు. ఆలోపు పీఎంవో అడిగిన సమాచారాన్ని అందజేసే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు నిమగ్నమయ్యాయి. జనవరి 26 రిపబ్లిక్ డే ఉత్సవాల తర్వాత ప్రధాని ఈ అంశాలపై దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉందని, ఫిబ్రవరి మొదటి వారంలో తాము కోరిన అంశాలపై స్పష్టత వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రధానికి ముఖ్యమంత్రి అందజేసిన వినతిపత్రంలో ప్రధానంగా 13 అంశాలను ప్రస్తావించారు. వాటిపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అంతర్గతంగా కొంత విశ్లేషణ జరిపాయి. మొత్తం అన్నింటిపైనా ఒత్తిడి తెచ్చే బదులు నాలుగు అంశాలపై ముందు దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో విదేశీ రుణ ప్రాజెక్టులు (ఈఏపీ ప్రాజెక్టులు) కింద రావాల్సిన సాయం, రెవెన్యూ లోటు భర్తీ, పోలవరానికి నిధులు, విశాఖ రైల్వే జోన్ ఉన్నాయి. ఈఏపీ సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది లోపలే వినియోగించుకోవాల్సి ఉంది. ఆ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపడం, ఆమోదం పొందడం, నిధులు రావడం వంటివి ఏడాదిలో పూర్తి కావడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. ఈఏపీ ప్రాజెక్టులకు ఎంత ఇస్తామని కేంద్రం వాగ్దానం చేసిందో అంతే మొత్తాన్ని నాబార్డ్ లేదా మరో సంస్థ నుంచి ఈ ఏడాదిలోపు ఇప్పించాలని ప్రభుత్వం కోరుతోంది. రెవెన్యూ లోటు భర్తీకి సంబంధించి మరో రూ.4వేల కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం ఇంకా రూ.3800 కోట్లు రావాల్సి ఉంది. రైల్వే జోన్‌ను విశాఖలో కాకుండా విజయవాడలో ఏర్పాటు చేసేందుకు అంగీకరిస్తే వెంటనే ఇస్తామని కేంద్రం చెబుతోంది. విశాఖ రైల్వే జోన్‌కు ఒడిశా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో విశాఖలో రైల్వే జోన్‌పై నిర్ణయం తీసుకోవడానికి కేంద్రం వెనకాడుతోంది. ఏదేమైనా ఈ అంశాలపై కొద్ది రోజుల్లో సానుకూల ఫలితం కనిపించగలదన్న ఆశాభావంతో రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఉన్నాయి.

ఇంటింటికీ కుళాయి నీరు!

» తొలివిడతగా 15,730 కోట్లతో పనులు

» తాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటింటికీ కుళాయి నీటి సరఫరా లక్ష్యంగా తొలివిడతగా రూ.15,730 కోట్లతో నీటి ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.9,400 కోట్లతో ఐదు జిల్లాల్లో యాన్యుటీ విధానంలోనూ, మరో రూ.6330 కోట్లతో 8 జిల్లాల్లో బ్యాంకు రుణం ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. అంచనాలు రూపొందించాలని పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించింది. ఇప్పటికే పంచాయతీరాజ్‌శాఖ అన్ని జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. దీనిప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 48,363 ఆవాస ప్రాంతాల్లో 3.65 కోట్ల జనాభాకు కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం సుమారు రూ.22 వేల కోట్లు ఖర్చు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వ్యక్తికీ 70 లీటర్ల నీటిని సరఫరా చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. ఇందులో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు యాన్యుటీ విధానంలో విదేశీ సంస్థల నుంచి రుణం సేకరించి నీటి వనరులు కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2,350 కోట్లు, యాన్యుటీ ఏజెన్సీలు రూ.7050 కోట్లు ఖర్చు చేయనున్నాయి. మిగిలిన 8 జిల్లాలు.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలకు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ద్వారా రూ.12600 కోట్ల రుణాలు సమీకరించాలని భావించారు.

ఏసీబీ వలలో సహాయ లేబర్ కమిషనర్

» ఫైల్ క్లియరెన్స్‌కు 10 వేలు లంచం తీసుకుంటూ దొరికిన వైనం



పెంచలయ్య

కడప క్రైం, జనవరి 22: భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ మహిళ పట్ల సానుభూతి చూపించాల్సిందిపోయి..ఆమెకు అందాల్సిన పరిహారం ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన కార్మికశాఖ సహాయ కమిషనర్ పెంచలయ్యను ఏసీబీ వలపన్ని పట్టుకుంది. కడప జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన లక్ష్మీదేవి భర్త శ్రీనివాసులు వేంపల్లెలోని యురేనియం ఫ్యాక్టరీలో డ్రైవరుగా పనిచేశాడు. గత ఏడాది అక్టోబరులో శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త మృతిపై లక్ష్మీదేవి కార్మిక శాఖ సంయుక్త కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. భర్తకు రావాల్సిన పరిహారం అందించాలని అధికారులను కోరారు. శ్రీనివాసులు మృతిపై విచారించి మృతుడి కుటుంబ వివరాలకు సంబంధించి నివేదికను పంపించాలని సంయుక్త కమిషనర్ కడప సహాయ కమిషనర్ పెంచలయ్యను ఆదేశించారు. అయితే..విచారణ నివేదికను పంపించకుండా పెంచలయ్య తాత్సారం చేశాడు. పరిహారం కింద లక్ష్మీదేవికి రూ.7.30 లక్షలు వస్తుండడంతో ఆ సొమ్ముపై కన్నేసిన పెంచలయ్య, రూ.10 వేలు ఇస్తే ఫైలు పంపుతామంటూ బేరం పెట్టాడు. విసిగిపోయిన లక్ష్మీదేవి ఏసీబీని ఆశ్రయించి, ఆఅధికారి ఆట కట్టించింది. కోర్టు ఆదేశాలమేరకు పెంచలయ్యను జైలుకు తరలించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రామాంజనేయులు ఆదేశాలిచ్చారు. కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వై.వి.డి. ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పంచాయతీ కార్యదర్శులు కమిషనర్‌ను కలిసి, పదోన్నతుల జాప్యంపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ అప్పటికప్పుడే పీఆర్ కమిషనరేట్‌లో పెండింగ్‌లో ఉన్న జోన్3, జోన్ 4 పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు, గ్రేడ్-2 నుంచి గ్రేడ్ 1కు పదోన్నతికి కల్పిస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. పలు జిల్లాల నుంచి మిగిలినవారి పదోన్నతుల ఫైల్‌ను పంపని డీపీఓ, జెడ్పీ సీఈఓలకు చార్జ్ మెమోలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాగా, పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థ 2002లో ప్రవేశపెట్టినప్పుడు ఇతర శాఖల్లో మిగులు సిబ్బందిని రీడిప్లాయ్‌మెంట్ ద్వారా తీసుకున్నారని, వారి సర్వీసు కూడా క్రమబద్ధీకరించి పదోన్నతులు కల్పించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

మీరొస్తే మా సీట్లిస్తాం

» లోకేశ్‌కు ఇద్దరు మంత్రుల ఆఫర్

» అమరనాథ్‌రెడ్డి, గంటా సంసిద్ధత



అమరావతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, ఐటీ-పంచాయతీరాజ్ శాఖల మంత్రి లోకేశ్‌కు ఇద్దరు సహచర మంత్రుల నుంచి బంపర్ ఆఫర్ వచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేయదలచుకుంటే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సీట్లు ఇస్తామని వారు చెబుతున్నారు. లోకేశ్ ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. పోటీ చేస్తే ఎక్కడ నుంచి బరిలోకి దిగుతారన్నదానిపైనా టీడీపీలో అంతర్గతంగా కొంత చర్చ జరుగుతోంది. ఆదివారమిక్కడ టీడీపీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరిగిన సందర్భంలో పరిశ్రమల మంత్రి అమరనాథ్‌రెడ్డికి, శాసనమండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్‌కు మధ్య ఇదే విషయం చర్చకు వచ్చింది. అమరనాథ్‌రెడ్డి ప్రస్తుతం చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న నాలుగు మండలాలు గతంలో కుప్పంలో ఉండేవని, 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పలమనేరులోకి వచ్చాయని ఆయన వివరించారు. లోకేశ్‌కు ఆసక్తి ఉంటే తాను పుంగనూరుకు మారతానని.. ఆయన పలమనేరు నుంచి బరిలోకి దిగవచ్చని చెప్పారు. లోకేశ్ ఎమ్మెల్సీ కావడానికి ముందు కూడా అమరనాథ్‌రెడ్డి తన సీటివ్వడానికి సిద్ధపడ్డారని, కానీ పనిగట్టుకుని రాజీనామా చేయించడం ఎందుకని లోకేశ్ ఎమ్మెల్సీగా వెళ్లిపోయారని కేశవ్ ఈ సందర్భంగా తెలిపారు. పుంగనూరులో మీరు పోటీచేయకుంటే అక్కడ టీడీపీ అభ్యర్థిగా మీ కుటుంబ సభ్యులెవరైనా బరిలోకి దిగుతారా అన్న ప్రశ్నకు.. ఇంకా అంత దూరం ఆలోచించలేదని అమరనాథ్‌రెడ్డి బదులిచ్చారు. విశాఖపట్నం జిల్లా భీమిలి ఎమ్మెల్యే అయిన మానవ వనరుల మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా లోకేశ్ కోసం తన సీటు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తంచేశారు. ఇటీవల విలేకరులతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు రాయలసీమకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున లోకేశ్ ఉత్తరాంధ్రకు ప్రాతినిధ్యం వహిస్తే బాగుంటుంది. నా నియోజకవర్గంలో కొంత నగర ప్రాంతం.. కొంత గ్రామీణ ప్రాంతం ఉంది. టీడీపీకి చాలా బలమైన సీటు. విశాఖ నగరం బాగా వేగంగా విస్తరిస్తోంది. లోకేశ్ ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తే అదింకా బాగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది. నేను మరో చోట పోటీచేయడానికి రెడీ' అని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు పార్టీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నా లోకేశ్ మాత్రం స్పందించడం లేదు. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉందని, ఆ సమయం వచ్చినప్పుడు చూసుకోవచ్చంటూ ఆయన దాటవేస్తున్నారు.

ఎమ్మెల్సీ యండపల్లిపై అనర్హత వేటు వేయండి

» శాసనమండలి కార్యదర్శికి టీడీపీ పిటిషన్

అమరావతి/నెల్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డిపై అనర్హత వేటు వేయాలని తెలుగుదేశం పార్టీ నేతలు శాసనమండలి కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, టీడీపీ నేతలు వేమూరి పట్టాభిరామిరెడ్డి, మద్దిపట్ల సూర్యప్రకాశ్ సోమవారం ఇక్కడ అసెంబ్లీ ప్రాంగణంలో మండలి కార్యదర్శి సత్యనారాయణను కలిసి తమ పిటిషన్‌ను అందచేశారు. 2011లో చిల్లకూరు మండలం అంకులపాటూరులో ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో పోలీసులపై యండపల్లి, మరో 11 మంది దాడిచేసినట్లు కేసు నమోదైంది. దీనిపై గూడూరు కోర్టు ఈ నెల 12న రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో యండపల్లిని ఎమ్మెల్సీగా అనర్హుడిగా పరిగణించాలంటూ, ఆయనపై పోటీచేసి ఓడిన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తన పిటిషన్లో సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించారు. ఇదే విషయం మండలి కార్యదర్శికి నివేదించి, యండపల్లిని అనర్హుడిగా ప్రకటించాలని కోరామని టీడీపీ నేతలు మీడియాకు వెల్లడించారు.

కార్పొరేట్ కాలేజీల్లో ఆత్మహత్యలపై...పిల్

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిపై చర్యలు చేపట్టాలంటూ వచ్చిన ఒక లేఖను హైకోర్టు పిల్‌గా విచారణకు స్వీకరించింది. ప్రకాశం జిల్లా లోక్‌సత్తా జిల్లా కోకన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ ఈ లేఖ రాశారు. ఏపీ మంత్రికి చెందిన కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆ లేఖలో ఆరోపించారు.

డిగ్రీతో రిజిస్ట్రార్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలి. దీనిలో కనీసం 8 సంవత్సరాలపాటు ప్రొఫెసర్‌గా పని చేసి ఉండాలనే నియమం ఉంది. అయితే, వీటిలో ఏ ఒక్కటీలేని వ్యక్తిని.. అదీ కేవలం డిగ్రీ అర్హత ఉన్న వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియమించేందుకు రంగం సిద్ధమైంది. సదరు వ్యక్తి ఈ సంస్థలో హెచ్‌ఆర్‌టీగా పనిచేశారు. గతంలోనే ఈ వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియమించడానికి ఉన్నతాధికారులు ప్రయత్నించినప్పుడు అప్పటి చాన్సలర్ ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డిగ్రీ అర్హత ఉన్న ఈ వ్యక్తితో తాజాగా దూర విద్య పద్ధతిలో పీజీ చేయించి నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఒత్తిడితో దీన్ని ఆమోదింపజేసినట్టు తెలుస్తోంది.

ఇతర పోస్టుల విషయంలోనూ

వర్సిటీలో ఫైనాన్స్ ఆఫీసర్, సెంట్రల్ అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ కో-ఆర్డినేటర్ పోస్టులను సైతం తమ అనుయాయులకే విశ్వవిద్యాలయ అధికారులు కట్టబెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు నూజివీడు క్యాంపస్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగినిని కాంట్రాక్ట్ ఉద్యోగుల జాబితాలోకి మార్చారు. అవుట్‌సోర్సింగ్ వారిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చడానికి ప్రభుత్వ నిబంధనలు అనుమతించవు. పైగా, ఇతని కన్నా సీనియర్లు అనేక మంది ఉన్నారు. ఇదిలావుంటే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అవుట్ సోర్సింగ్ నియామకాలు కాకుండా అత్యవసరమైతే రోజువారీ వేతనం పైనే నియామకాలు జరపాలని ప్రభుత్వం చెప్పినా.. నూజివీడు క్యాంపస్ అధికారులు పట్టించుకోలేదు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఇటీవల 13 మందిని కేర్‌టేకర్లుగా నియమించారు. మరో 24 మందిని నియమించడానికి రంగం సిద్ధం చేశారు. ఇవన్నీ రాజకీయ, విశ్వవిద్యాలయ అధికారుల అనుయాయులకే దక్కాయనే ఆరోపణలున్నాయి.

'డిజిటల్'తో దోచేశారు?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత రానివ్వడం లేదు. అయితే, ఈ సంస్థ అధికారులు కొందరు నిధుల స్వాహాకు వివిధ పద్ధతులను ఎంచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల డిజిటల్ అక్షరాస్యతా పరీక్ష పేరుతో రూ.లక్షల్లో నిధులు దుర్వినియోగం చేశారని తెలుస్తోంది. ఈ సంస్థలో బోధిస్తున్న వారంతా బీటెక్, ఎంటెక్‌లు చేసినవారే. వీరికి మెయిల్, పాస్‌వర్డ్ మార్పులు వంటి చిన్న అంశాలపై 3 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇక, వీరికి శిక్షణ ఇచ్చిన వారు, వీరి కన్నా తక్కువ విద్యార్హతలు ఉన్నవారని సమాచారం. శిక్షణ కోసం హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు చెల్లింపులు చేసినట్లు సమాచారం.

సమగ్ర విచారణ అవసరం

ట్రిపుల్ ఐటీల మెస్‌ల కాంట్రాక్ట్ వ్యవహారం, భవన నిర్మాణాలు, ఉద్యోగ నియామకాలు, ఇతర పాలన, విద్యావిషయాలపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ నిర్వహించి, వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల స్నాతకోత్సవం సందర్భంగా ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో చదివిన విద్యార్థి మంత్రి గంటా శ్రీనివాసరావుకు చేసిన ఫిర్యాదులపై విచారణకు ద్విసభ్య కమిటీని నియమించారు.

గవర్నర్‌కు ఫిర్యాదు

ఆర్‌జీయూకేటీ పరిధిలో జరుగుతున్న అక్రమ ఉద్యోగ నియామకాలు, అస్తవ్యస్థ పాలనపై వర్సిటీలో పనిచేస్తున్న ఓ అధికారి గవర్నర్ నరసింహన్‌కు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖలోని పలువురు ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మరి ఈ ఫిర్యాదుపై గవర్నర్ ఎలా స్పందిస్తారో చూడాలి.



'పురుడు' పోయని ఆస్పత్రి!

» నొప్పులు మొదలైనా పట్టని సిబ్బంది

» మంత్రసానిగా మారిన తోటి మహిళ

» మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ఘటన

మాచర్ల, జనవరి 22: పురిటి నొప్పులతో అల్లాడుతున్న నిండు గర్భిణికి సాయం చేయడానికి వైద్య సిబ్బంది ముందుకు రాలేదు. చేసేది లేక.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లిన మహిళల్లో ఒకరు మంత్రసానిగా మారి పురుడు పోశారు. సోమవారం మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ఈ ఘటన జరిగింది. గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన కుక్కమూడి లక్ష్మికి ఆదివారం అర్ధరాత్రి పురిటినొప్పులు మొదలయ్యాయి. ఆమెను కొంతమంది మహిళలు మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. సూపరింటెండెంట్ శిరీష ఆమెను పరిశీలించి, ప్రసవానికి సమయముందని చెప్పి, సిబ్బందికి సూచనలు చేసి వెళ్లారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో లక్ష్మికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఆమె వెంట ఉన్న మహిళలు కంగారుపడ్డారు. నిద్రపోతున్న నర్సులను లేపడానికి ప్రయత్నించారు. పెద్ద ప్రాణానికి గండం వచ్చిందని వేడుకొన్నా.. నర్సులు ఉలకలేదు, పలకలేదు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో.. వారిలోనే ఒక మహిళ మంత్రసాని పనికి పూనుకొంది. లక్ష్మికి కాన్పు జరిపింది. తల్లీబిడ్డలను కాపాడింది. అంతా అయ్యాక అక్కడకొచ్చిన నర్సులు, తల్లికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దీనిపై సూపరింటెండెంట్ శిరీషను వివరణ అడగ్గా, సకాలంలో స్పందించని నర్సుకు మెమో జారీ చేశామన్నారు.

వీరపునాయునిపల్లె తహశీల్దార్ అరెస్టు

» సొసైటీ రుణాల గోల్‌మాల్‌తో సంబంధం



వేంపల్లె, జనవరి 22: కడప జిల్లా వీరపునాయునిపల్లె తహశీల్దార్ కృష్ణానాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వేంపల్లె మండలం చింతమడుగుపల్లె సహకార సంఘం రుణాల గోల్‌మాల్ వ్యవహారంలో ఈయన పాత్ర ఉన్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. డీసీసీ అధికారులు, సొసైటీ సీఈవో, రైతులు కలిసి సుమారు రూ.65 లక్షల దాకా సొసైటీ రుణాలను పొందారు. నకిలీ పాసుపుస్తకాలతోనూ డబ్బును స్వాహా చేశారు. డీసీసీ బ్యాంకు రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు 18 మందిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు లో నకిలీ పాస్ పుస్తకాలు జారీ చేయడంలో తహసీల్దార్ పాత్ర వెలుగుచూసింది. ఆయన్ను అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపరిచారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తోపాటు తహసీల్దారును తప్పించే ప్రయత్నం జరుగుతోందని 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో గత వారం ఓ కథనం రావడంతో ఈ కేసులో పోలీసులు సమగ్ర విచారణ జరిపారు. తదుపరి చర్యలు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పైనే ఉంటాయని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

15


విజయవాడ • మంగళవారం 23 జనవరి 2018

పంజాబ్ రాయల్స్ గెలుపు

న్యూఢిల్లీ : ప్రొ.రెజ్లింగ్ లీగ్‌లో సోమవారం పంజాబ్ రాయల్స్ 5-2తో ముంబై మహారథిని చిత్తు చేసింది. ఈ పరాజయంతో ముంబై జట్టు నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. వీర్‌మరాఠాస్ నాలుగో జట్టుగా సెమీస్‌కు చేరింది.



జొకోవిచ్ అవుట్



యాన్ చుంగ్

• తిరగబెట్టిన గాయం..జొకో పరాజయం • అన్‌సీడెడ్ సౌత్‌కొరియన్ సంచలనం
• థీమ్ ఇంటిదారి • క్వార్టర్స్‌లో ఫెడరర్ • హలెప్, కెర్బర్, ప్లిస్కోవా కూడా

ఆరుసార్లు చాంపియన్ జొకోవిచ్ కుడి మోచేయి గాయం తిరగబెట్టింది..ఫలితంగా అతనికి ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో పరాజయం ఎదురైంది..దక్షిణ కొరియాకు చెందిన 21ఏళ్ల యాన్ చుంగ్‌తో జరిగిన పోరులో సెర్బియా వీరుడు రెండుసార్లు చికిత్స తీసుకొని మరీ హోరాహోరీగా పోరాడాడు.. కానీ, ప్రత్యర్థి దీటుగా సమాధానమివ్వడంతో నొవాక్‌కు నిష్క్రమణ తప్పలేదు.. ఇక డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ ఆడుతూ పాడుతూ ప్రీక్వార్టర్స్ పోరు ముగించాడు.. మహిళల టాప్‌సీడ్ హలెప్ సునాయాసంగా క్వార్టర్స్ చేరగా.. మాజీ చాంపియన్ కెర్బర్, ఆరోసీడ్ కరోలినా ప్లిస్కోవా మూడు సెట్లపాటు శ్రమించి గట్టెక్కారు.



ప్లిస్కోవా

ఉదయం 5.30 నుంచి సోనీ సిక్స్‌లో...

మెల్‌బోర్న్: మోచేయి గాయంతో గత ఏడాది ద్వితీయార్థం అంతా టెన్నిస్‌కు దూరంగా ఉన్న సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పునరాగమనం చేసి మూడోరౌండ్ వరకూ సునాయాసంగానే ముందంజ వేశాడు. కానీ సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో గాయం మళ్లీ చేటు చేసింది. తొలి, రెండో సెట్లో చికిత్స చేయించుకొని మ్యాచ్‌ను కొనసాగించిన నొవాక్..పట్టుదలగా ఆడాడు. కానీ చిన్ననాటినుంచి జొకోనే ఆరాధ్య దైవంగా భావించి టెన్నిస్‌లో అడుగుపెట్టిన దక్షిణకొరియా ఆటగాడు చుంగ్ అంతకంటే పట్టుదలగా పోరాడి 7-6 (4), 7-5, 7-6 (3)తో నొవాక్‌పై సంచలనం విజయం సాధించి క్వార్టర్స్ చేరాడు. 'ఈ విజయాన్ని నమ్మలేకపోతున్నా. నా కల నిజమైంది. నొవాక్‌తో ఆడడం గౌరవంగా భావిస్తా' అని మూడు గంటల 21 నిమిషాల మ్యాచ్ అనంతరం చుంగ్ వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరిన తొలి దక్షిణకొరియా ఆటగాడిగా యాన్ రికార్డు నెలకొల్పాడు. తన ఫిట్‌నెస్ గొప్పగా లేదని జొకో అంగీకరించాడు. 'దురదృష్టవశాత్తు తొలి సెట్ తర్వాత మోచేయి గాయం తిరగబెట్టింది. మ్యాచ్ ఆసాంతం దానితో సతమతమవ్వాల్సి వచ్చింది' అని చెప్పాడు. సహాయ సిబ్బందితో చర్చించాక తన పరిస్థితిపై ఓ నిర్ణయానికి వస్తానని జొకో అన్నాడు.

క్వార్టర్స్‌లో ఎవరితో ఎవరు


మహిళల సింగిల్స్

మెర్టెన్స్ x స్విటోలినా
సురెజ్ x వోజ్నియాకి
కెర్బర్x కీస్
హలెప్x ప్లిస్కోవా

పురుషుల సింగిల్స్

దిమిత్రోవ్x ఎడ్మండ్
నడాల్x సిలిచ్
ఫెడరర్x బెర్డిచ్
చుంగ్ x శాండ్‌గ్రెన్

ఫెడెక్స్ 14వసారి..



ఫెడరర్

డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించే దిశగా దూసుకుపోతున్నాడు. మార్టన్ ఫ్యుక్సోవిక్స్ (హంగరీ)తో జరిగి ప్రీక్వార్టర్‌ఫైనల్లో రోజర్ 6-4, 7-6 (3), 6-2తో అలవోకగా నెగ్గాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్ చేరడం స్విస్ మాస్టర్‌కిది 14వసారి కావడం విశేషం. అతనికిది రికార్డుస్థాయిలో 52వ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్. అంతేకాదు.. జిమ్మీ కానర్స్ తర్వాత ఓ మేజర్ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరుకున్న అతి పెద్ద వయస్సు ప్లేయర్‌గా 36 ఏళ్ల ఫెడెక్స్ మరో రికార్డు సొంతం చేసుకున్నాడు. కానర్స్ 39 ఏళ్ల వయస్సులో 1991లో యూఎస్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్ ఆడాడు. బుధవారం జరిగే క్వార్టర్స్‌లో 14వ సీడ్ థామస్ బెర్డిచ్‌తో ఫెడరర్ తలపడతాడు. బెర్డిచ్ ప్రీక్వార్టర్స్‌లో 6-1, 6-4, 6-4తో ఫాబియో ఫాగ్నిని (ఇటలీ)పై విజయం సాధించాడు..

థీమ్‌కు షాక్

ఇంకో ప్రీక్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ అమెరికా ఆటగాడు శాండ్‌గ్రెన్ ఐదోసీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రేలియా)ను షాక్‌కు గురి చేశాడు. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన ఐదుసెట్ల పోరులో శాండ్‌గ్రెన్ 6-2, 4-6, 7-6 (4), 6-7 (9), 6-3 స్కోరుతో థీమ్‌పై విజయం సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు గ్రాండ్‌స్లామ్‌లో సింగిల్ మ్యాచ్ కూడా గెలవని శాండ్‌గ్రెన్ ఇక్కడ ఏకంగా క్వార్టర్స్‌కు దూసుకుపోవడం విశేషం. అంతేకాదు గత 20 ఏళ్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొన్న తొలిసారే చివరి ఎనిమిదిమందిలోకి ప్రవేశించిన మొదటి ప్లేయర్‌గా శాండ్‌గ్రెన్ రికార్డులకెక్కాడు. సెమీస్‌లో చోటు కోసం బుధవారం జరిగే మ్యాచ్‌లో శాండ్‌గ్రెన్‌ను చుంగ్ ఢీకొంటాడు.

హలెప్ అలవోకగా..

టాప్‌సీడ్ సిమోనా హలెప్ (రుమేనియా) తొలి గ్రాండ్‌స్లామ్ దిశగా మరో అడుగేసింది. జపాన్‌కు చెందిన నవోమి ఒసాకాతో జరిగిన మ్యాచ్‌లో 6-3, 6-2 స్కోరుతో సునాయాసంగా గెలుపొందింది. అయితే ఆరోసీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)కు సహచరి బార్బరా స్ట్రికోవా నుంచి ప్రతిఘటన ఎదురైంది. తొలి సెట్ చేజార్చుకున్నా పుంజుకొన్న ప్లిస్కోవా 6-7 (5), 6-3, 6-2 స్కోరుతో, 20వ సీడ్ స్ట్రికోవాను ఓడించింది. అలాగే 2016 చాంపియన్ కెర్బర్ (జర్మనీ) కూడా 4-6, 7-5, 6-2 స్కోరుతో సూవీ (తైవాన్)పై కష్టపడి నెగ్గింది. ఎనిమిదో సీడ్ కరోలిన్ గార్సియా (ఫ్రాన్స్)కు ప్రీక్వార్టర్స్‌లో చుక్కెదురైంది. యూఎస్ ఓపెన్ ఫైనలిస్ట్, 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 6-2 స్కోరుతో గార్సియాను చిత్తు చేసింది.

బోపన్న జోడీ కూడా అవుట్

భారత్‌కు చెందిన రోహన్ బోపన్న, దివిజ్ శరణ్‌లు తమ జోడీలతో డబుల్స్ మూడోరౌండ్‌లో ఓడిపోయారు. రోజర్ వాసిలిన్ (ఫ్రాన్స్)తో జత కట్టిన బోపన్న 6-4, 6-7 (5), 3-6 స్కోరుతో అలివర్ మరాక్ (ఆస్ట్రియా), మాటె పవిక్ (క్రొయేషియా) ద్వయం చేతిలో పరాజయం పాలయ్యాడు. శరణ్, రాజీవ్ రామ్ 6-3, 6-7 (4), 4-6 స్కోరుతో లుకాస్ క్యూబోట్ (పోలండ్), మార్సిలో మెలో (బ్రెజిల్) చేతిలో ఓడిపోయారు.



మిథాలీ సేనకు సచిన్ టిప్స్

ముంబై : సౌతాఫ్రికాలో పరిస్థితులు ఎలాఉంటాయోనన్న ఆందోళన వద్దని, ఆశావహ దృక్పథంతో సాగాలని మిథాలీరాజ్ నేతృత్వంలోని మహిళా జట్టుకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సలహా ఇచ్చాడు. మూడు వన్డేలు, ఐదు టీ-20ల సిరీస్‌కోసం దక్షిణాఫ్రికా వెళ్లనున్న భారత జట్టు బాంద్రా కుర్లా స్టేడియంలో సోమవారం టెండూల్కర్‌ను కలిసింది. ఒత్తిడికి లోనుకావద్దని, చిన్న చిన్న తప్పిదాలకు తావివ్వకూడదని సూచించాడు. భారత జట్టు సచిన్‌తో గంటపాటు పలు అంశాలను చర్చించింది.

ఐపీఎల్ టైమింగ్స్ మారాయ్!

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీని ఏప్రిల్ 7 నుంచి మే 27వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సోమవారం వివరాలను వెల్లడించింది. ప్రారంభోత్సవం ఒక రోజు ముందుగా 6వ తేదీన నిర్వహించనున్నట్టు ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా తెలిపాడు. ఆరంభపోటీ, ఫైనల్ ముంబైలోనే నిర్వహించనున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ అభ్యర్థన మేరకు మ్యాచ్‌ల వేళల్లో మార్పులు చేశారు. రాత్రి 8కి ఆరంభమయ్యే మ్యాచ్‌లను ఓ గంట ముందుగా....అంటే 7 గంటలకు, సాయంత్రం 4 గంటల మ్యాచ్‌లు సాయంత్రం 5.30కు మొదలవుతాయి. వారాంతంలో రెండు మ్యాచ్‌లు ఉన్నరోజుల్లో రెండు మ్యాచ్‌లను వేర్వేరు చానళ్లలో ప్రసారం చేయనున్నట్టు స్టార్‌స్పోర్ట్స్ తెలిపింది. కాగా జనవరి 27, 28 తేదీలలో 360మంది భారత ఆటగాళ్లతోపాటు మొత్తం 578 ఆటగాళ్లను వేలం వేయనున్నట్టు ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. కాగా కింగ్స్ పంజాబ్ జట్టు తమ ఏడు హోం మ్యాచ్‌ల్లో నాలుగు మొహాలీలో, మూడు ఇండోర్‌లో ఆడుతుంది. రాజస్థాన్ ఆడాల్సిన ఏడు హోం మ్యాచ్‌ల వేదికను ఈనెల 24న జరిగే కోర్టు విచారణ తర్వాత నిర్ణయిస్తారు.

కోహ్లి గ్రేట్ కాదు



హోల్డింగ్

జొహాన్నెస్‌బర్గ్: ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లలో విరాట్ కోహ్లి పేరు కూడా ఉంటుందనడంలో సందేహం లేదని.. కానీ అతడు ఇంగ్లండ్‌లో సత్తా నిరూపించుకుంటేనే గ్రేట్ క్రికెటర్ అవుతాడని వెస్టిండీస్ మాజీ పేసర్ మైకేల్ హోల్డింగ్ అన్నాడు. 'కోహ్లి అద్భుత ఆటగాడనడంలో సందేహం లేదు. టాప్-3 క్రికెట్ ఆటగాళ్ల పేర్లను చెప్పమంటే అందులో అతడి పేరును కూడా చేరుస్తాను. కానీ ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తేనే కోహ్లిని గొప్ప ఆటగాడని అంగీకరిస్తా. ఎందుకంటే ఎక్కడైనా రాణించే సత్తా ఉన్న ఆటగాళ్లను నేను ఇష్టపడతా' అని హోల్డింగ్ అన్నాడు. జూన్‌లో భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. 2014 పర్యటనలో జట్టులో ఉన్న కోహ్లి అక్కడ దారుణంగా విఫలమై తీవ్ర విమర్శలెదుర్కొన్నాడు. అయితే కోహ్లి కెప్టెన్సీపై ఇప్పుడే ఓ అంచనాకు రావడం సరికాదన్నాడు.

49 బంతుల్లో శతకం

కోల్‌కతా: ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న సురేశ్ రైనా ఎట్టకేలకు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో చెలరేగాడు. సోమవారం బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో రైనా 49బంతుల్లోనే శతకం బాదాడు. మొత్తం 56 బంతులాడిన రైనా 7 సిక్సర్లు, 13 ఫోర్లతో 126 పరుగులతో అజేయంగా నిలిచాడు. టీ-20 కెరీర్‌లో రైనా చేసిన 4సెంచరీల్లో ఇదే అత్యుత్తమ స్కోరు. ఈ ఫార్మాట్‌లో భారత్ తరపున ఇది రెండో అత్యధికస్కోరు. విజయ్ (127)



టాప్‌లో ఉన్నాడు. రైనా ఇన్నింగ్స్‌తో ఉత్తరప్రదేశ్ 20 ఓవర్లలో 3వికెట్లకు 235 రన్స్ చేసింది. బెంగాల్ 160 రన్స్‌కే ఆలౌటైంది.

వినయ్...రోడ్స్‌ను మరిపించాడు..

1992 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆటగాడు జాంటీ రోడ్స్ గాల్లో సమాంతరంగా డైవ్ చేస్తూ వికెట్లను గిరాటేసిన దృశ్యం అప్పట్లో సంచలనం రేపింది. అచ్చం అదే తరహాలో ముస్తాక్ అలీ టోర్నీలో కర్ణాటక కెప్టెన్ వినయ్ కుమార్ ఫీల్డింగ్ చేసి అబ్బురపరిచాడు. ఆదివారం పంజాబ్‌తో జరిగిన ఈ మ్యాచ్ 30వ ఓవర్‌లో గుర్‌కీరత్ స్క్వేర్‌లెగ్ వైపు షాట్ ఆడి నిదానంగా పరిగెత్తాడు. అక్కడి నుంచి వచ్చిన త్రో వికెట్లను తాకకుండా మిడాఫ్‌వైపు వెళ్లింది. అక్కడే ఉన్న వినయ్ మెరుపులా బంతిని పట్టుకుని రోడ్స్ తరహాలో గాల్లోకి ఎగిరి.. నేరుగా వికెట్లను నేలకూల్చాడు.

కొత్త సీజన్‌లో తొలి సవాల్

• బరిలో సింధు, సైనా • ఇండోనేసియా మాస్టర్స్ నేటినుంచే

జకర్తా: భారత బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఈ సీజన్‌లో తొలి సవాల్‌కు సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభం కానున్న ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో వీరిద్దరూ ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. గతేడాది చివర్లో జరిగిన వరల్డ్ సూపర్‌సిరీస్ ఫైనల్స్ తర్వాత వీళ్లు ఆడుతున్న మొదటి అంతర్జాతీయ టోర్నమెంట్ ఇదే. బుధవారం జరిగే తొలి రౌండ్లో రెండోసీడ్ సింధు.. స్థానిక క్రీడాకారిణి హన్నా రమాదినితో తలపడనుంది. మూడు టైటిళ్లు, మూడు రన్నరప్‌లతో గతేడాదిని విజయవంతంగా ముగించిన సింధు.. ఇక్కడ భారీ అంచనాలతో బరిలోకి దిగుతోంది. సింధుతో పాటు మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ కూడా పోటీలో ఉంది. సైనా ఆరంభరౌండ్లో ఏడోసీడ్ చెన్ యుఫీ (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో నాలుగు టైటిళ్లు, ఓ రన్నరప్‌తో గత సీజన్‌ను అద్భుతంగా ముగించిన శ్రీకాంత్.. ఇండోనేసియా ఈవెంట్‌లో ఆడడం లేదు. మరో భారత ఆటగాడు సమీర్ వర్మ తొలిరౌండ్లో జపాన్‌కు చెందిన కజుమసా సకాయితో తలపడతాడు. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్‌డ్రాకు చేరిన పారుపల్లి కశ్యప్.. వీ ఫెంగ్ చోంగ్ (మలేసియా)తో టోర్నీని ప్రారంభించనున్నాడు. పురుషుల డబుల్స్‌లో సుమిత్ రెడ్డి-మను అత్రి జోడీ, సాత్విక్‌రాజ్ రాంకీరెడ్డి-చిరాగ్ శెట్టి జంట భారత్ నుంచి బరిలో ఉన్నారు.



సింధు

సైనా

రొనాల్డోకు గాయం



మాడ్రిడ్: రియల్ మాడ్రిడ్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో మైదానంలో గాయపడ్డాడు. ఆదివారం డిపోర్టివో లా కొరునాతో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో హెడర్‌తో గోల్ చేసే సమయంలో ప్రత్యర్థి ఆటగాడి బూటు ఎడమ కంటి పక్కన తాకడంతో రక్తస్రావమైంది. అనంతరం తమ జట్టు ఫిజియోకు చెందిన స్మార్ట్ ఫోన్ సెల్ఫీ కెమెరాలో రక్తమోడుతున్న గాయాన్ని చూసుకుంటూ మైదానం వీడాడు.



స్వగ్రామంలో పెదనాన్న జస్టిస్ లక్ష్మణరావుతో రాయుడు

మళ్లీ జాతీయ జట్టులోకొస్తా: రాయుడు

పొన్నూరు టౌన్, ఆంధ్రజ్యోతి: దేశానికి ప్రాతినిధ్యం వహించటం గర్వకారణమని, తిరిగి భారత జట్టులో చోటు సాధించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు క్రికెటర్ అంబటి తిరుపతిరాయుడు చెప్పాడు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని స్వగ్రామం వెల్లలూరుకు సోమవారం రాయుడు వచ్చాడు. గ్రామంలో నివసిస్తున్న పెదనాన్న, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావును కలిశాడు. ఈ సందర్భంగా రాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. జింబాబ్వే పర్యటనలో గాయం కావడం వల్ల ఏడాదిన్నరగా క్రికెట్‌కు దూరం కావాల్సి వచ్చిందన్నాడు. గాయంనుంచి కోలుకున్నానని, తిరిగి జట్టులో చోటు సాధించేలా నిరంతర సాధన చేస్తున్నట్టు తెలిపాడు. ఐపీఎల్‌లో ఎనిమిదేళ్లుగా ముంబైకి ప్రాతినిధ్యం వహిస్తున్న తాను.. వచ్చే ఐపీఎల్‌లో రాణిస్తానన్న నమ్మకముందన్నాడు.

హర్మన్‌ప్రీత్ కొత్త చరిత్ర

ముంబై: మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టును ఫైనల్‌కు చేర్చిన స్టార్ క్రీడాకారిణి హర్మన్‌ప్రీత్ కౌర్ ఇప్పుడు మరో సంచలనం సృష్టించింది. ఇప్పటిదాకా పురుష క్రికెటర్ల బ్యాట్లకు మాత్రమే స్పాన్సర్లు కనిపించగా వారి సరసన హర్మన్‌ప్రీత్ కూడా చేరబోతోంది. భారత మహిళల క్రికెట్‌లోనే తొలిసారిగా ఆమె 'సియట్' కంపెనీతో బ్యాట్ ఎండార్స్‌మెంట్ కుదుర్చుకుంది. రోహిత్, రహానె, ఇషాన్ కిషన్‌లు ఇంతకుముందే వీరితో ఒప్పందం చేసుకున్నారు.



తొలి టీ-20 కివీస్‌దే

వెల్లింగ్టన్: వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఉత్సాహంలో ఉన్న న్యూజిలాండ్ తాజాగా తొలి టీ-20లోనూ పాకిస్థాన్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో మూడు టీ-20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.4 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. బాబర్ ఆజమ్ (41) ఒక్కడే రాణించాడు. రాన్స్. సౌతీలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన కివీస్ 15.5 ఓవర్లలో మూడు వికెట్లకు 106 పరుగులు చేసి నెగ్గింది. మున్రో (49 నాటౌట్) టాప్ స్కోరర్.

'మరో 10 రోజుల ముందే రావాల్సింది'

జొహాన్నెస్‌బర్గ్: కఠినమైన దక్షిణాఫ్రికా పర్యటన కోసం మరో పది రోజుల ముందే వస్తే బాగుండేదని భారత జట్టు కోచ్ రవిశాస్త్రి అంటున్నాడు. 'స్వదేశంతో పోలిస్తే ఇక్కడి పరిస్థితులు విభిన్నంగా ఉంటాయి. అందుకే వాతావరణానికి అలవాటు పడేందుకు మరో పది రోజుల ముందుగానే వస్తే బావుండేది' అన్నాడు. కాగా రోహిత్ శర్మ ఫామ్‌లో ఉండడంవల్లే తొలి రెండు టెస్టుల్లో రహానెను ఆడించలేదని తెలిపాడు. అయితే రోహిత్ రెండు మ్యాచ్‌ల్లోనూ విఫలం కావడంతో ఇప్పుడు అంతా రహానెను ఆడించాల్సిందేనంటున్నారు. 'రోహిత్ విఫలమయ్యాడు కాబట్టి రహానెను రెండు మ్యాచ్‌ల్లో ఎందుకు ఆడించలేదు? అని అడుగుతున్నారు. మరి రహానె కూడా ఆ రెండు టెస్టులు ఆడి విఫలమై ఉంటే.. ఫామ్‌లో ఉన్న రోహిత్‌ను ఎందుకు తీసుకోలేదని అడిగేవారా?' అని శాస్త్రి ఎదురు ప్రశ్నించాడు.

సైనా, సింధు తర్వాత మాళవికే!



నాగ్‌పూర్: భారత బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో సైనా, సింధు బాటలో సత్తాచాటేందుకు మరో అమ్మాయి వచ్చేసింది. నాగ్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల మాళవిక బన్సోద్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్లో మాళవిక 21-14, 21-17తో నాగ్‌పూర్‌కే చెందిన వైష్ణవి భాలేపై గెలిచి టైటిల్ అందుకుంది. దీంతో సైనా, సింధు తర్వాత పిన్నవయసులో ఈ టైటిల్ నెగ్గిన క్రీడాకారిణిగా మాళవిక అరుదైన ఘనత సాధించింది. మహిళల డబుల్స్ టైటిల్‌ను మేఘన జక్కంపూడి-పూర్వీశా రామ్ జోడీ గెలుచుకుంది.






వైభవంగా నటి భావన వివాహం

మలయాళ నటి భావన.. కన్నడ సినీ నిర్మాత నవీన్ వివాహం సోమవారం వైభవంగా జరిగింది. త్రిసూర్‌లోని తిరువంబడి శ్రీ కృష్ణాలయంలో కుటుంబసభ్యులు, అతి కొద్దిమంది సన్నిహితుల మధ్య హిందూ సంప్రదాయం ప్రకారం వీరిద్దరూ ఒక్కటయ్యారు.

సూర్యుడికి వృద్ధాప్యం?



- ద్రవ్యరాశి, గురుత్వాకర్షణ శక్తిని కోల్పోతున్నాడు!
- సౌర వ్యవస్థపై సడలుతున్న పట్టు
- బుధగ్రహం చెబుతున్న రహస్యాలు

వాషింగ్టన్, జనవరి 22: 'ప్రతీ జీవికి వృద్ధాప్య ఛాయలు వస్తాయి. మరి సూర్యుడికి, చంద్రుడికి నక్షత్రాలకు వృద్ధాప్యం రాదా?'.. ఏదో ఒక సందర్భంలో ఎప్పుడో ఒకప్పుడు మన మెదడును తొలిచిన ప్రశ్న. జవాబు మాత్రం లేదు. అయితే, దాదాపు 460 కోట్ల ఏళ్ల క్రితం పుట్టిన మన సూర్యుడికి వృద్ధాప్య ఛాయలు వచ్చాయని చెబుతున్నారు ఖగోళ శాస్త్రవేత్తలు. రోజురోజుకు సూర్యుడి ద్రవ్యరాశి తగ్గిపోతోందని, మన సౌర వ్యవస్థపై పట్టు కోల్పోతున్నాడని అంటున్నారు. బుధ గ్రహం కక్ష్యలో వస్తున్న మార్పులే వీటికి సాక్ష్యాలని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. భానుడు గురుత్వాకర్షణ శక్తి కోల్పోతుండడం వల్ల గ్రహాలు సూర్యుడి నుంచి దూరంగా వెళ్లిపోతున్నాయని వెల్లడించారు. నాసా పంపిన మెసేంజర్ అంతరిక్ష నౌక ఈ విషయాలు చెప్పిందని వివరించారు. (ఈ అంతరిక్ష నౌక మార్చి 2011 నుంచి ఏప్రిల్ 2015 మధ్య బుధగ్రహం చుట్టూ తిరుగుతూ పలు కీలక సందేశాలను భూమిపైకి పంపింది.) ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన 'సాపేక్ష సిద్ధాంతాన్ని' వాడి మేసేంజర్ సందేశాలను పరిశీలించగా ఈ రహస్యం తెలిసిందని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే, సూర్యుడి గురుత్వాకర్షణ శక్తిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని వెల్లడించారు.



ఆస్కార్ నామినేషన్లు ప్రకటించనున్న ప్రియాంక

లాస్ ఏంజెలిస్, జనవరి 22: బాలీవుడ్ నుంచి వెళ్లి హాలీవుడ్‌లో సత్తా చాటుతున్న నటి ప్రియాంక చోప్రా అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఇప్పటివరకూ ఆస్కార్ అవార్డు వేడుకల్లో రెడ్ కార్పెట్‌పై అలరిస్తున్న ఈ నటి.. ఈ సారి ఆస్కార్ కోసం నామినేషన్లు ప్రకటించే అవకాశాన్ని దక్కించుకుంది. హాలీవుడ్ నటులు రొసారియో డాసన్, రెబల్ విల్సన్, మిచెల్ రోడిగ్రెజ్, మిచెల్ ఇయోతో కలిసి ప్రియాంకచోప్రా మంగళవారం ఈ నామినేషన్లను ప్రకటించనుంది. ఈ విషయాన్ని ఆస్కార్ అకాడమీ ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించింది.

గుజరాత్ పేలుళ్ల సూత్రధారి అరెస్టు

- నేపాల్‌లో ఉంటున్న ఖురేషి
- ఢిల్లీ రావడంతో పట్టుకున్న పోలీసులు
- విచారించనున్న తెలంగాణ పోలీసులు



అబ్దుల్ సుభాన్ ఖురేషి

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ వరుస పేలుళ్ల ప్రధాన సూత్రధారి, ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. నకిలీ గుర్తింపు పత్రాలతో నేపాల్‌లో ఉంటున్నట్లు భావిస్తున్న ఖురేషి... భారత్‌కు వస్తున్నట్లు తెలియడంతో ఢిల్లీ పోలీసులు శనివారం మాటువేసి పట్టుకున్నట్లు డీసీపీ(సిట్) పి.ఎస్.కుష్వాహ తెలిపారు. 2008 జూలై 26న అహ్మదాబాద్‌లో జరిగిన 20 వరుస పేలుళ్లలో 50 మందికిపైగా మరణించారు. ఈ కేసులో ఖురేషి ప్రధాన నిందితుడని డీసీపీ తెలిపారు. ఐఎం సహ వ్యవస్థాపకుడైన ఖురేషికి నిషేధిత సిమితోనూ సంబంధాలు ఉన్నాయి. సిమి మేగజైన్‌కు ఎడిటర్‌గా కూడా పని చేశాడు. పేలుళ్ల అనంతరం.. నకిలీ గుర్తింపుకార్డుతో నేపాల్‌లో నివసిస్తున్న ఇతను.. 2015-17 మధ్య సౌదీ కూడా వెళ్లొచ్చాడని కుష్వాహ తెలిపారు. ముంబై, బెంగళూరు వరుస పేలుళ్లలోనూ అతడి ప్రమేయం ఉన్నట్టు దర్యాప్తులోనూ తేలిందన్నారు. ఇండియా ఒసామా బిన్ లాడెన్‌గా పిలిచే సుభాన్ ఖురేషి గుజరాత్ పేలుళ్లకు ముందు, తర్వాత హైదరాబాద్‌లో షెల్టర్ తీసుకున్నాడు. దీంతో.. తెలంగాణ పోలీసులు అతడిని విచారించనున్నారు. గుజరాత్ పేలుళ్ల కేసులో కీలకనిందితుల్లో ఒకడైన అబూ బషర్‌ను విచారించిన సమయంలో ఖురేషి అలియాస్ తాకీర్ వివరాలను వెల్లడించాడు. ఐఎం ఉగ్రవాద సంస్థ ఖురేషిని 'టెక్కీ-బాంబర్'గా పిలిచేదని పోలీస్ దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. పోలీస్ నిఘా నుంచి తప్పించుకునేందుకు బెంగళూరు, హైదరాబాద్‌లోని పలు సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఇతను ఉద్యోగిగా పనిచేశాడు. ఖురేషికి దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కో.. అంటే కోటీశ్వరావా!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి చేరారు. దీంతో దేశంలో బిలియనీర్ల సంఖ్య 101కి పెరిగింది. వీరి మొత్తం సంపద 20.7 లక్షల కోట్లు. ఇది 2016 కంటే 4.89 లక్షల కోట్లు ఎక్కువ. ఈ సొమ్ము దేశంలోని 29 రాష్ట్రాలూ విద్య, వైద్యాలకు ఖర్చు చేసే బడ్జెట్‌తో సమానం. బిలియనీర్లలో 37 శాతం మందికి వారసత్వంగా ఆదాయం సమకూరింది. బిలియనీర్ల మొత్తం సంపదలో సగం వీరిదే. బిలియనీర్లలో నలుగురే మహిళలు.. వీరికి కూడా తమ సంపద వారసత్వంగా వచ్చినదే. ఇదే కాలంలో దేశంలోని 67 కోట్ల మంది ప్రజల సంపద కేవలం ఒక శాతం మాత్రమే పెరిగిందని సర్వే స్పష్టం చేసింది. వీరంతా పేద, నిమ్న వర్గాల వారు. భారత్‌లోని ఓ వస్త్ర సముదాయ సంస్థలోని అత్యున్నత స్థాయి వ్యక్తి ఏడాది సంపాదనను అందుకోవాలంటే రోజువారీ కార్మికుడు 941 ఏళ్లు కష్టపడాలి.. అని సర్వే వెల్లడించింది. ఈ సర్వే నివేదిక పేరు "రివార్డ్ వర్క్ అండ్ నాట్ వెల్త్". ప్రతీ ఏటా ఈ నివేదిక కోసం ప్రపంచదేశాలు ఎదురు చూస్తుంటాయి. ఈ సర్వేపై దావోస్ సదస్సులో చర్చ జరుగుతుంది. మొత్తం 10 దేశాల్లో 1,20,000 మందిని సర్వే చేసి ఆక్స్‌ఫామ్ ఈ వివరాలు వెల్లడించింది. అంతర్జాతీయంగానూ ఆదాయ అసమానతలు భారీ స్థాయిలోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది జరిగిన సంపద సృష్టిలో 82% కేవలం ఒక శాతం మంది చేతిలోనే ఉన్నట్టు సర్వే పేర్కొంది. ఇదే సమయంలో 370 కోట్ల మంది పేద ప్రజల సంపదలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. 2017లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య కూడా ఊహించని రీతిలో పెరిగింది. 2రోజులకో బిలియనీర్ తయారవుతుండడం విశేషం. దావోస్ సదస్సు ప్రారంభానికి ముందు ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) కూడా భారత్‌కు షాకిచ్చింది. సమ్మిళిత వృద్ధి సూచీలో (ఇన్‌క్లూజివ్ గ్రోత్ ఇండెక్స్)లో భారత్ స్థానం 62 అని ప్రకటించింది. కిందటేడాది మన స్థానం 60.. ఇపుడు మరో రెండు స్థానాలు పెరిగాం. చైనా 26వస్థానంలో ఉండగా, పాకిస్థాన్ 47వ స్థానంలో ఉంది. నేపాల్(22), బంగ్లాదేశ్(34), శ్రీలంక (40) కూడా మన కంటే బెటరే. నార్వే అగ్రస్థానంలో ఉండగా ఐర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సమ్మిళిత వృద్ధిలో వెనుకబడి ఉన్నా భారత్ ఆర్థికంగా ఎదుగుతున్న దేశమని డబ్ల్యూఈఎఫ్ ప్రకటించడం విశేషం. ప్రపంచంలోని పది ఎదుగుతున్న దేశాల్లో భారత్ ఒకటని పేర్కొంది. పోటీతత్వంలో, నైపుణ్యంలో భారత్‌ది 81వ స్థానం. నిరుటి కంటే 11 పాయింట్లు ఎగబాకింది.



దావోస్ చేరుకున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న అధికారులు



హిమ దిగ్బంధంలో దావోస్

నిరంతరాయంగా మంచు కురవడంతో దావోస్ ఇలా మంచు దుప్పటి కప్పుకుంది

ఈ ఏడాది చివర్లో జమిలీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఈ మూడు రాష్ట్రాల ఎన్నికలనూ సెమీ ఫైనల్స్ అని తేల్చాయి. ఈ దృష్ట్యా జమిలీకి వెళితే- చాలా వరకూ ఈ వ్యతిరేకతను తట్టుకోవచ్చన్నది కమలనాథుల ఊహ. అయితే విపక్షాలు జమిలీ ఎన్నికలకు ససేమిరా అంటున్నాయి. కాలావధి పూర్తికాకుండా ఎన్నికలు నిర్వహించడం తమకు సమ్మతం కాదని-కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం స్పష్టం చేశాయి. "ఎన్నికల వ్యయం తగ్గించడానికి జమిలీ బెటరని మోదీ బయటకు అంటున్నప్పటికీ ఆయనదంతా రాజకీయ ఎత్తుగడే. ప్రభుత్వ వ్యతిరేకత వెల్లువలా ఉన్నపుడు ఇలాంటి ఆలోచనలే వస్తాయి. అదీ కాక- వేసవిలో నిర్వహిస్తే తమ ప్రభుత్వ వైఫల్యాలు మరింతగా బయటపడతాయన్నది ఆయన భయం" అని సోమవారం నాడు సిబ్బంది, వ్యవహారాలు, న్యాయ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం విపక్ష నేతలు వ్యాఖ్యానించారు. నిజానికి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ, లోక్ సభకూ కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన కేంద్రం చాలాకాలంగా చేస్తోంది కొన్ని రాష్ట్రాలు ఈ విషయంపై కేంద్రంతో ఏకీభవించినట్లు కూడా సమాచారం. కనీసం పాక్షికంగా నైనా ఈ ఆలోచనను అమలు చేస్తే క్రమంగా 2024 నాటికి అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించేందుకు రంగం సిద్ధం చేయవచ్చని బిజెపి భావిస్తోంది.

1951-52లో లోక్ సభకూ, దేశంలోని అన్ని అసెంబ్లీలకూ ఒకేసారి ఎన్నికలు జరిగాయి. 1957, 1962, 1967 ఎన్నికల్లోనూ ఇదే ప్రక్రియను అనుసరించారు. 1970లో లోక్ సభ రద్దు కావడం, తర్వాత 1977లో లోక్ సభ పదవీకాలాన్ని పొడిగించడంతో అంతా తారుమారయ్యింది. జమిలీ ఎన్నికల నిర్వహణ మంచిదేగానీ- పాక్షికంగానైనా సరే.. డిసెంబరులో జరపడం అసాధ్యమని, 2024 వరకూ కూడా జరపలేమని అంటున్నారు మాజీ సీఈసీ టీఎస్ కృష్ణమూర్తి. "మనం బ్రిటిష్ (వెస్ట్ మినిస్టర్) తరహా వ్యవస్థను రూపొందించుకున్నాం. అమెరికన్ తరహా వ్యవస్థ అయితే నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. ఎవ్వరినైనా దించేసినా మరొకర్ని ఎన్నుకునే పరిస్థితి అది. ఏ రాష్ట్రంలోనైనా ఏ ప్రభుత్వమైనా కూలిపోతే (విశ్వాస పరీక్షలో ఓడిపోతే) నిర్దిష్ట కాలావధిలోగా ఎన్నికలు జరుపుతూంటాం.. లోక్‌సభకూ అంతే. జమిలీ తెస్తే ఇలా కుదురుతుందా? ఇలా కుదరాలంటే రాజ్యాంగాన్ని సవరించాలి. 2024లో కానీ అది వీలుపడదు" అని ఆయన హైదరాబాద్‌లో అన్నారు.

ఢిల్లీలో మధ్యంతర ఎన్నికలు?

- ఎమ్మెల్యేల బహుమూసు (?) కున్న దారులు
- అనర్హత వేటు నుంచి కోర్టే కాపాడాలి
- అంటే 20 సీట్లకు మళ్లీ ఎన్నిక తప్పవు
- శాసనసభ రద్దు కేజ్రీవాల్ మొగ్గు



న్యూఢిల్లీ, జనవరి 22: ఢిల్లీ రాష్ట్ర అధికార పక్షం ఆమ్‌ఆద్మీ పార్టీ శాసనసభలో మధ్యంతర ఎన్నికలకు వెళుతుందా? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. ఆ పార్టీకి చెందిన ఇరవైమంది ఎమ్మెల్యేలపై లాభదాయక పదవుల కారణంతో ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఈ అంశంపై హైకోర్టుకు వెళ్లినా తక్షణ ఉపశమనం(స్టే) లభించలేదు. దాంతో ఆప్ సోమవారం పిటిషన్‌ను ఉపసంహరించుకొంది. తాజాగా వేరే పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ఎన్నికల సంఘం నిర్ణయం నేపథ్యంలో కోర్టు నుంచి ఉపశమనం లభిస్తే తప్ప ఆప్ ఎమ్మెల్యేలకు మరో మార్గం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కోర్టు అనుకూల తీర్పు ఇవ్వకపోతే 20 సీట్లకు మళ్లీ ఎన్నిక తప్పదు. మెజారిటీ సీట్లు గెలవకపోతే కేజ్రీవాల్ రాజీనామాకు డిమాండ్ పెరుగుతుంది. రైట్ టు రీకాల్ హక్కును ప్రవేశపెడతానన్న కేజ్రీవాల్ ప్రజల్లో అభిమానం లేదని తెలిసి గద్దెను పట్టుకొని వేలాడటం కష్టమే. ఈ నేపథ్యంలో కోర్టులో అనుకూల ఉత్తర్వు రాకపోతే 20 సీట్లకు ఎన్నిక బదులు మొత్తం శాసన సభ రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లాలని ఆప్ భావిస్తోంది. ఈసీ నిర్ణయం నేపథ్యంలో సానుభూతి పవనాలు వీస్తున్నాయని, వీటిని వినియోగించుకోవాలని యోచిస్తోంది. మరోపక్క ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మానిష్ సిసోడియా ఢిల్లీ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఇరవై మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు బీజేపీ మురికి రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఢిల్లీ అభివృద్ధి చక్రంలో బీజేపీ అడ్డుపుల్ల వేసిందని విమర్శించారు. పార్లమెంటరీ సెక్రెటరీలో హోదాలో ఎమ్మెల్యేలు మంత్రులకు సహాయంగా వ్యవహరించారని, వారికి అదనపు జీత భత్యాలేవీ ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యేకు పాఠశాలలు, మరో ఎమ్మెల్యేకు ఆస్పత్రులను అప్పగించామని తెలిపారు. బీజేపీ ఎవరూ కోరుకోని ఎన్నికలను ప్రజల మీద రుద్దుతోందని సిసోడియా మండిపడ్డారు. శాసనసభలో ఆప్‌కు 66 మంది ఎమ్మెల్యేలుండగా, 20 మందిని ఈసీ అనర్హులుగా ప్రకటించింది. దాంతో 46 మంది ఎమ్మెల్యేలు మిగిలారు. సాధారణ మెజారిటీకి అవసరమైన 36 కన్నా 10 మంది అదనంగానే ఉన్నారు. "ఇలాంటి కుట్ర ఏదో బీజేపీ పన్నుతోందని దేవుడికి ముందే తెలిసినట్లు ఉంది. అందుకే, ప్రభుత్వం ఏర్పాటుకు 36 సీట్లు అవసరమైతే 67 సీట్లు ఇచ్చాడు" అని ఆప్ అధినేత కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

రాజీనామాకు సిద్ధపడ్డ ఏచూరి

- కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలన్న ఆయన ప్రతిపాదనకు సీపీఎం కేంద్ర కమిటీ తిరస్కరణ



న్యూఢిల్లీ, జనవరి 22: సీపీఎంలో విభేదాలు తారాస్థాయికి చేరాయా? పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాజీనామాకు సిద్ధపడ్డారా? కాంగ్రెస్‌తో పొత్తు విషయం నాయకుల మధ్య విభేదాల కుంపటి రాజేసిందా? అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. ఆదివారం జరిగిన సీపీఎం కేంద్ర కమిటీ సమావేశం వాడివేడిగా సాగింది. ఈ భేటీలో తన ప్రతిపాదన తిరస్కారానికి గురవడంతో పార్టీకి రాజీనామా చేస్తానని ఏచూరి ప్రకటించారు. 2019 ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. అయితే దీన్ని వ్యతిరేకించిన పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారట్ మాట నెగ్గింది. దీనిని ఓటమిగా భావించిన ఏచూరి... పార్టీకి రాజీనామా చేస్తానని అక్కడే ప్రకటించారు. అయితే కేంద్ర కమిటీ అందుకు అంగీకరించలేదు. పదవిలో కొనసాగాల్సిందిగా ఆయనను కోరింది. "పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ నన్ను ప్రధాన కార్యదర్శిగా ఉండాలన్నాయి కాబట్టే ఉన్నాను. మీ ప్రశ్నకు ఇదే సమాధానం" అని సమావేశం అనంతరం ఏచూరి విలేకరులతో వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికలలో బీజేపీని ఎదుర్కోవడానికి 'కాంగ్రెస్ సహా అన్ని సెక్యులర్ వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు' ఒక అవగాహనకు రావాలని ఏచూరి డ్రాఫ్ట్ రూపొందించారు.

'లోయా' కేసులో ఎవరిపైనా

నిందలేయొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 22: సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక జడ్జి ఏబీ లోయా మృతిపై దాఖలైన పిటిషన్లలో లేవనెత్తిన అంశాల్లో తీవ్రత ఉందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే దీనికి సంబంధించి ఎవరిపైనా నిందలు వేయొద్దని హితవు పలికింది. ఈ కేసులను ఏ హైకోర్టూ విచారించొద్దని, బాంబే హైకోర్టు నాగపూర్, ముంబై బెంచ్‌ల ముందు విచారణలో ఉన్న రెండు పిటిషన్లను తనకే బదలాయించాలని ప్రధానన్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం సోమవారం నిర్దేశించింది.

ఆమె ఏఎస్పీ... ఆయన సీఐ

- కుటుంబాల్ని వదిలి దూరం.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త
- సీఐకి ఏఎస్పీ తల్లి, అత్త దేహశుద్ధి

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆమె అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ.. ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్! బాధ్యతాయుత పదవుల్లో కొనసాగుతున్న వారిద్దరూ పోలీస్ శాఖకు తలవంపులు తెచ్చే విధంగా వ్యవహరించారు. వివాహేతర సంబంధం పెట్టుకుని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పోలీస్ ఉన్నతాధికారులకు ఆగ్రహం తెప్పించిన ఈ వ్యవహారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డీనియా అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి జరిగింది. మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అవినీతి నిరోధక శాఖలో అదనపు ఎస్పీ సునీతారెడ్డికి కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డికి అయిదేళ్లుగా పరిచయం ఉంది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఏఎస్పీ సునీతారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా.. ఆమె ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ అపార్ట్‌మెంట్ 13వ ఫ్లోర్ నివసిస్తున్నారు. వివాహేతర సంబంధం గురించి రెండేళ్ల క్రితం సురేందర్‌రెడ్డికి తెలిసింది. కుటుంబ పెద్దల సమక్షంలో భార్యను నిలదీశారు. కల్వకుర్తి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రెడ్డిని కూడా తీవ్రంగా మందలించారు. దీంతో వారిద్దరూ ఇకమీదట అలా చేయబోమని అంగీకరించారు. రెండు నెలల నుంచి వీరిద్దరూ మళ్లీ సఖ్యతగా ఉంటున్నారని సురేందర్‌రెడ్డికి అనుమానం వచ్చింది. భార్య సునీతారెడ్డి మల్లికార్జున్‌రెడ్డితో చాటింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని మల్లికార్జున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, ఏఎస్పీ సునీతారెడ్డి అమ్మకు, తన అమ్మకు సురేందర్‌రెడ్డి చెప్పారు. వారంతా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని మల్లికార్జున్‌రెడ్డికి దేహశుద్ధి చేయాలని భావించారు. ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గేటెడ్ కమ్యూనిటీ హౌజ్‌లో సునీతారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి వారంతా అక్కడికి వెళ్లి, వారిద్దరినీ పట్టుకున్నారు. సునీతారెడ్డి అమ్మ, అత్త సీఐ మల్లికార్జున్‌రెడ్డిని రోడ్డు మీద పరిగెత్తించి, చెప్పులతో తరిమికొట్టారు. మర్నాడు సోమవారం సునీతారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్‌ను కలిశారు. సీఐ మల్లికార్జున్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

నో కామెంట్.. 'సుప్రీం' సంక్షోభంపై చలమేశ్వర్

న్యూఢిల్లీ, జనవరి 22: సుప్రీం కోర్టు సంక్షోభంపై వ్యాఖ్యానించడానికి సర్వోన్నత న్యాయస్థానంలో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నిరాకరించారు. పది రోజులుగా నెలకొన్న సంక్షోభం పరిష్కారమైందా లేదా అని విలేకరులు అడగగా... 'నో కామెంట్స్' అంటూ చేతులు జోడించి నమస్కరిస్తూ వెళ్లిపోయారు. శుక్రవారం నుంచి ఢిల్లీలో లేని జస్టిస్ చలమేశ్వర్ సోమవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. కాగా, సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఎం జోసెఫ్‌లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని వారి పేర్లను కేంద్రానికి పంపింది. ఇంతకుముందే ప్రధాన న్యాయమూర్తి, ఈ నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫారసు చేసినా.. సోమవారం లాంఛనంగా పంపడం గమనార్హం.

ట్రాక్టర్‌తో తొక్కించి.. రైతును చంపేశారు

సీతాపూర్(యూపీ), జనవరి 22: రుణం కిస్తు చెల్లించలేదని లోన్ రికవరీ ఏజెంట్లు ట్రాక్టర్‌తో తొక్కించి ఓ రైతు ఉసురుతీసిన ఉదంతమిది. ఈ సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపూర్ రైతు జ్ఞాన్‌చంద్(45) ట్రాక్టర్ కొనుగోలుకు ఎల్ అండ్ టీ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5 లక్షల రుణం తీసుకున్నాడు. కిస్తులు చెల్లిస్తూ వచ్చిన ఆయన ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. రూ.1.15 లక్షల బకాయి ఉన్నందున ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్ కింద రైతు పడ్డా అతడి పైనుంచే తీసుకెళ్లారు.

ఎర్రకోట వద్ద బీజేపీ ఎంపీ యజ్ఞం

న్యూఢిల్లీ, జనవరి 22: విద్రోహశక్తుల కుట్రలను తిప్పికొట్టేందుకు ఢిల్లీలోని ప్రసిద్ధ ఎర్రకోట వద్ద మార్చి 18 నుంచి 25వ తేదీ వరకు 'వైదికయజ్ఞం' నిర్వహిస్తానని బీజేపీ ఎంపీ మహేశ్ గిరి తెలిపారు. ఈ యజ్ఞానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. డోక్లామ్, ఎల్‌వోసీ నుంచి తెప్పించిన మట్టితో 108 హోమగుండాలు ఏర్పాటు చేసి 1100 మంది పూజారులతో యజ్ఞం నిర్వహిస్తానన్నారు.

సరిహద్దుల్లో ఆగని మోత!

- బంకర్లు నిర్మించి ఇవ్వాలన్న సరిహద్దు గ్రామాల ప్రజలు

జమ్ము, జనవరి 22: సరిహద్దు గ్రామాలపై పాకిస్థాన్ బలగాలు 5 రోజులుగా మోర్టార్‌షెల్స్‌తో నిరంతరాయంగా దాడి చేస్తున్నాయి. ఆదివారం రాత్రి పాక్ బలగాల దాడిలో మరో పౌరుడు మృతి చెందారు. దీంతో 5 రోజుల్లో మృతుల సంఖ్య 12కి చేరింది. తమకు సురక్షిత ప్రాంతంలో స్థలాలిచ్చి, బంకర్లను నిర్మించి ఇవ్వాలని సరిహద్దు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. సరిహద్దు గ్రామాల ప్రజల భద్రత కోసం 14,460 బంకర్లను రూ.415.73 కోట్ల వ్యయంతో నిర్మించాలని కేంద్రం గతంలోనే నిర్ణయించింది.



ఆకాశమార్గాన ధ్వంసరచన

- ఎస్-400 తరహా క్షిపణి రక్షణ వ్యవస్థల కొనుగోలు డీల్‌పై రష్యాతో తుదిచర్చలు

న్యూఢిల్లీ, జనవరి 22: చైనాకు దీటుగా, పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించేదిగా భావిస్తున్న ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి రక్షణ వ్యవస్థ కొనుగోలుకు సంబంధించిన తుదిచర్చలను త్వరలోనే రష్యాతో సాగించనుంది భారత్. 30 కిలోమీటర్ల ఎత్తులో 400 కిలోమీటర్ల రేంజ్‌లో శత్రు దేశాల యుద్ధ విమానాలను, గూఢచారి విమానాలను, బాంబర్లను, మిసైళ్లను, డ్రోన్లను గుర్తించి వేటాడి విధ్వంసం సృష్టించగలవీ ట్రయంఫ్ క్షిపణులు. రష్యా నుంచి ఐదు క్షిపణులను కొనుగోలు చేయడానికి 2016లో పుతిన్ భారత పర్యటన సందర్భంలో గోవాలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఒప్పందం కుదిరింది. ఈ డీల్ వ్యయం 39,000 కోట్ల రూపాయలు. దేశ రక్షణ రంగ చరిత్రలో విదేశంతో కుదుర్చుకుంటున్న అతి పెద్ద ఒప్పందం ఇది. 54 నెలల్లో రష్యా వీటిని అందజేస్తుంది. ఇప్పటికే వీటికి సంబంధించిన క్షేత్ర పరీక్షలు పూర్తయ్యాయి. ఈ ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు గనక భారత అమ్ముల పొదిలో చేరితే ఉపఖండంలో, దక్షిణాసియాలో గగనతల రక్షణ వ్యవస్థ ముఖచిత్రం మొత్తం మారిపోతుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే భారత్ ఈ డీల్‌ను ఖరారు చేయాలని భావిస్తోంది. మొదటి క్షిపణిని, దానికి సంబంధించిన- 8 అనుబంధ వ్యవస్థలు- అంటే కమాండ్ పోస్ట్‌ను, లాంచర్లను, రాడార్ వ్యవస్థలను, ఎలాంటి ఉపరితలంపైనైనా మోసుకుపోగల వాహనాలను రెండేళ్లలోనే సమకూర్చుకోవాలన్నది భారత్ ఆలోచన. ఈ ట్రయంఫ్ మిసైళ్ళు మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను, క్రూయిజ్ మిసైళ్ళను సైతం ధ్వంసం చేయగలవు. రష్యాతో ఈ మిసైల్ రక్షణ వ్యవస్థనే కాకుండా నాలుగు గ్రిగరోవిచ్ యుద్ధనౌకల్ని, 200 కామోవ్ తేలికపాటి హెలికాప్టర్ల కొనుగోలు, మరో అణు యుద్ధనౌక లీజుకు సంబంధించిన ఒప్పందం కూడా పుతిన్‌తో కుదుర్చుకున్నారు నరేంద్ర మోదీ. ఇప్పటికే రష్యా నుంచి 272 సుఖోయ్ ఎంకే-30 యుద్ధ విమానాలను, 45 మిగ్ -29లను కొనుగోలుకు సంబంధించిన వేరే ఒప్పందం అమలవుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.